

# సుమతి

అంతర్జాల సమగ్ర కుటుంబ మాసపత్రిక

01-04-2026 సంపుటి -4 ఏప్రిల్ సంచిక-1 రూ 50/-







## సుమతి పాఠకులకు

## తెలుగు సాహితీ ప్రియులకు

## నూతన సంవత్సర శుభాకాంక్షలు

## గత 3 సంవత్సరాలుగా

# సుమతి

## (సమగ్ర సకుటుంబ మాసపత్రికను)

మీ ప్రేమానురాగాలతో ఆదరాభిమానాలతో ఆదరిస్తున్నందుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుకుంటూ

- ఎడిటోరియల్ బోర్డ్

## రచనలకు ఆహ్వానం

యువ రచయితలను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో కథలు, కవితలు, కార్టూన్లను, సమకాలీన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాము. రచనలు తమ సొంతమేనని మరెక్కడా ప్రచురితం కాలేదని హామీ పత్రం తప్పని సరిగా జత చేయాలి.

రచనలన్నీ యునికోడ్ లో టైపు చేసి ఈ క్రింది ఇ మెయిల్ కు పంపగలరు

sumathi.kathalu2023@gmail.com

sumathi.kavitalu2023@gmail.com

## సుమతి పరివారం

**సుమతి**

మాసపత్రిక

సంపుటి :　　　సంచిక:1

ఏప్రిల్ 2026



**సంపాదకురాలు**

అవుతు శ్రీవిద్య

**సహ సంపాదకులు**

శ్రీనివాస్ ఈదర

**ముఖచిత్రం**

మోక్ష

**గ్రాఫిక్స్**

జ్ఞానిక

చందా వివరాలు

సంవత్సర చందా రూ 500

ఐదేళ్ళ చందా రూ 2500

ప్రకటనలు , చందాలకు మరియు

అభిప్రాయాలు

పంపవలసిన చిరునామా

sumathi.salahaalu@gmail.com

ప్రచురణ

సుమతి పబ్లికేషన్స్

(RC NO.:538/2006)

హౌస్ నం :26 -46 -79

వేణుగోపాల నగర్ ,

గుంటూరు ,ఆంధ్రప్రదేశ్


# సంపాదకీయం

ఏప్రిల్ నెల అంటే బహుజనులకు ఎంతో ప్రీతి పాత్రమైనది . కేవలం బహుజనులకే కాదు , మనందరికీ కుడా ఈ నెల అత్యంత పుజనీయమైనది .ఎందుకంటే మహానుభావులైన అంబేద్కర్ , పులే , జగజీవన్ రాం తదితరులు పుట్టింది ఈ నెల లోనే . తాడిత పీడిత వర్గాలకు నాదగా నిలబడిన వీరందరూ ఒకే నెలలో పుట్టటం యాదృచ్ఛికమైనా , బహుజనులందరికి మాత్రం పండగ వంటిదే . కేవలం వారి జయంతులు వర్ధంతులు జరుపుకున్నంత మాత్రాన ఏమి ఉపయోగం ఉండదు . వారి ఆలోచనలను ఆచరణలో పెట్టాలి .వారి భావాలకు అనుగుణంగా నడుచుకోవాలి .

మీ

**సుమతి**

## సుమతి – సుభాషితాలు

మనిషిని పూర్తిగా అర్థం చేసుకున్న
మనిషి ఇంతవరకు లేడు



# ఈ నెల కుసుమాలు...

## అందరి కోసం


| | |
|---|---|
| 05 | ముఖచిత్ర కథ |
| 07 | ఈ నెల కవిత |
| 08 | నడుస్తున్న చరిత్ర |
| 12 | అంతర్నేత్రం |
| 28 | అవగాహన |
| 34 | సెటైర్ |
| 37 | చూడాల్సిన ప్రదేశం |
| 50 | నాలుగో కోతి |
| 56 | రేపటి కోసం |
| 60 | కరెంటు అఫైర్స్ |
| 66 | చదవాల్సిన పుస్తకం |
| 68 | చూడాల్సిన సినిమా |
| 77 | జీవన చిత్రాలు |
| 82 | వ్యక్తి నుంచి వ్యవస్థ |
| 85 | యువత మేలుకో |
| 87 | కార్టూన్ పేజి |
| 88 | వార్తల్లో వ్యక్తి |
| 105 | కబుర్లు |
| 108 | మన పురాణాలు |
| 108 | వాల్ పోస్టర్ |
| 114 | వెబ్ పోస్టర్ |
| 125 | చిత్ర కథ–చిత్రకవిత |
| 126 | ఆధ్యాత్మికం |
| 127 | సైన్స్ కథలు |
| 129 | పిల్లల కథ |
| 131 | సృజన |
| 132 | పిల్లలు పిడుగులు |
| 133 | వార ఫలాలు |


## సీరియల్స్


| | |
|---|---|
| 26 | పంచవటి |
| 35 | రక్షకుడు |
| 46 | ఓడిన గెలుపు |
| 78 | ఏజెంట్ ఏకలింగం |
| 95 | గడప దీపం |
| 115 | పడిలేచిన కెరటం |


## కథలు


| | |
|---|---|
| 15 | అందమైన ఆల్చిప్పలు |
| 19 | చందనగంధి |
| 43 | టార్గెట్ |
| 51 | నాకు డాక్టర్ చెప్పాడు |
| 62 | అపోహ |
| 70 | కార్యేషు |
| 95 | వినరావీరకుమార |
| 102 | నాన్న మనసు |
| 121 | పుకార్ |


## కవితలు


| | |
|---|---|
| 30 | చేతబడి |
| 31 | సిగ్గు చేటు |
| 33 | పచ్చ బొట్లు |
| 59 | గెలుపు |



# ముఖచిత్ర కథ



## ఆస్కార్ అవార్డులు

ఒక్క షాట్తో క్రికెటర్ సిక్సర్ కొట్టినట్లు 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ఆ స్కార్ వేదికపై సిక్సర్ కొట్టింది. ఆరు అవార్డులు సాధించి, హాట్టాపిక్ గా నిలిచింది. అమెరికాలోని లాస్ ఏంజెల్స్లో డాల్బీ థియేటర్స్ వేదికగా మార్చి 15న హాలీవుడ్ హాస్య నటుడు కోనన్ ఓబ్రియన్ వ్యాఖ్యాతగా 98వ ఆస్కార్అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. మొత్తం 24 విభాగాల్లో అవార్డులను ప్రదానం చేశారు.

పాల్ థామస్ అండర్సన్ దర్శకత్వం వహించిన అమెరికన్ బ్లాక్ కామెడీ యాక్షన్ థ్రిల్లర్ 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్' సినిమా ఆరు విభాగాల్లో (ఉత్తమ చిత్రం, దర్శకుడు, సహాయ నటుడు, అడాప్టెడ్స్క్రీన్ప్లే, ఎడిటింగ్, క్యాస్టింగ్) సిక్సర్ కొట్టింది. ఆస్కార్ చరిత్రలోనే అత్యధికంగా 16 నామినేషన్స్ను దక్కించుకుని, అందరి దృష్టినీ ఆకర్షించిన అమెరికన్ హారర్ ఫిల్మ్ 'సిన్నర్స్' నాలుగు విభాగాల్లో (ఉత్తమ నటుడు, ఒరిజినల్ స్క్రీన్ప్లే, సినిమాటోగ్రఫీ, ఒరిజినల్స్కోర్) మాత్రమే అవార్డులు సాధించింది. సైన్స్ ఫిక్షన్ యాక్షన్ డ్రామా 'ఫ్రాంకెన్స్టీన్'కు మూడు అవార్డులు లభించాయి. 'కే పాప్ డిమాన్ హంటర్స్'చిత్రాన్ని రెండు అవార్డులు వరించాయి. 'వెపన్స్, అవతార్: ఫైర్ అండ్యాష్, ఎఫ్1, సెంటిమెంటల్ వేల్యూ' చిత్రాలు ఒక్కో అవార్డునుగెలుచుకున్నాయి.

ఉత్తమ నటుడిగా మైఖేల్. బి. జోర్డాన్, నటిగా జెస్సీబక్లీ, సహాయ నటి విభాగంలో ఎమీ మాడిసన్ తొలిసారి ఆస్కార్అవార్డులు అందుకోగా, ఉత్తమ సహాయ నటుడు విభాగంలో సీన్ పెన్కుమూడో ఆస్కార్ అవార్డు వచ్చింది. ఉత్తమ దర్శకుడిగా పాల్ థామస్ఆండర్సన్ అవార్డును అందుకున్నారు. 98 ఏళ్ల ఆస్కార్ చరిత్రలోసినిమాటోగ్రఫీ విభాగంలో ఆవార్డు సాధించిన తొలి మహిళగా చరిత్రసృష్టించారు ఆటం డ్యూరాల్డ్ అర్కాపా. అలాగే ఈ ఏడాది తొలిసారిప్రవేశ పెట్టిన బెస్ట్ క్యాస్టింగ్ విభాగంలో కాసాండ్రా కులుకుండిస్ అవార్డుఅందుకుని, ఈ విభాగంలో అవార్డు అందుకున్న తొలి వ్యక్తిగా, తొలిమహిళగా నిలిచారు.

ఉత్తమ సినిమాటోగ్రఫీకి అకాడమీ అవా గెల్చుకున్న తొలి మహిళగా, శ్వేతజాతి యేతర తొలి మహిళగా చరిత్ర సృష్టించారు అమెరికన్ సినిమాటో గ్రాఫర్ ఆటం ద్యూరాల్డ్ అర్కాపావ్. 'సిన్నర్స్' సినిమాకు ఆస్కార్ అందు కున్నారు. కాలేజీ చదువు పూర్తయిన తరువాత ఆటం కొంతకాలం ప్రకట నల రంగంలో పని చేశారు. ఆ తరువాత సినిమా రంగంలోకి అడుగు పెట్టి, కెమెరా అసిస్టెంట్గా పని చేశారు అమెరికన్ సొసైటీ ఆఫ్ సినిమాటో గ్రాఫర్స్ సభ్యురాలిగా చేరారు.

2025 చిత్రం సిన్నర్స్' సినిమాను ఐమాక్స్ 15- పెర్ఫ్ అండ్ అల్ట్రా పానా విజన్ 70 కెమెరాలను ఉపయో గించి 65 ఎంఎం ఫిల్మ్ పై చిత్రీ కరించారు.

నా జీవితంలో అత్యంత ముఖ్యమైన వ్యక్తి. నా బాల్యం, కుటుంబంపై ప్రభావం చూపిన వ్యక్తి' అని పోరాట యోధుడైన తన తాత పాగన్ బటిస్టా గురించి చెబు తుంటారు ఆటం.

'నేను ఇక్కడ నిలబడడాన్ని గౌరవంగా భావిస్తున్నాను.ఇంకా ఎంతోమంది మహిళలు ఇక్కడ నిలబడాలని కోరు కుంటున్నాను. ఎందు కంటే మీరు లేకుండా నేను ఇక్కడకి రాలేను అని నాకు తెలుసు' అంటూ చిత్ర పరిశ్రమలో పని చేస్తున్న మహిళలకు ఆస్కార్ వేడుకలో కృతజ్ఞతలు తెలియ జేశారు ఆటం.

ఆస్కార్ విజేతలు

ఉత్తమ చిత్రం: వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్

దర్శకుడు: పాల్ థామస్

ఆండర్సన్ (వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్)

నటుడు: మైఖేల్ బి. జోర్డాన్

(సిన్నర్స్)

నటి: జెస్సీ బక్లీ (హామ్నెట్)

* సహాయ నటుడు: సీన్ పెన్ (వన్

బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్)

* సహాయ నటి ఎమీ మాడిగన్ (వెపన్స్) * సిని

మాటోగ్రఫీ: ఆటం దురాల్డ్ అర్కపా (సిన్నర్స్)

* ఎడిటింగ్: యాండీ జుర్గెన్

సన్ (వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్)* ఒరిజినల్ స్కోర్: లుడ్విగో గోరాన్సన్

(సిన్నర్స్)

* ఒరిజినల్ సాంగ్: గోల్డెన్ సాంగ్ (కె-పాప్ డిమాన్ హంటర్స్)

అంతర్జాతీయ చిత్రం సెంటిమెంటల్ వేల్యూ (నార్వే) * సౌండ్: గరేత్

జాన్, ఏఐ నెల్సన్, గ్వ్యాన్డాలిన్ యేట్స్ విర్టల్, గేరీ ఎ. రిజో, జాన్ పెరల్ట

(ఎఫ్ 1)

* డాక్యుమెంటరీ ఫీచర్ ఫిలిం: మిస్టర్ నోబడీ ఎగైన్స్ట్ పుతిన్

డాక్యుమెంటరీ షార్ట్ ఫిలిం: ఆల్ ద ఎమీ రూమ్స్

* విజువల్ ఎఫెక్ట్స్: జో

లెటరి, రిచర్డ్ బనెహం, ఎరిక్ సైండన్, డేనియల్ బారెట్ (అవతార్: ఫైర్ అండ్ యాష్)

* ప్రొడక్షన్ డిజైన్: టమరా దేవెరల్, షేన్ వ్యూ (ఫ్రాంకైన్ స్టైన్)

ఒరిజినల్ స్క్రీన్ప్లే; ర్యాన్ కూగ్లర్ (సిన్నర్స్) * అడాప్టెడ్ స్క్రీన్ప్లే; పాల్ థామస్ ఆండర్సన్ (వన్ బాటిల్ ఆఫ్టర్ అనదర్)

* మేకప్ అండ్ హెయిర్ స్టైలింగ్: మైక్ హిల్, జోర్డాన్ సామ్యూల్, క్లియోనా ఫ్యూరే (ఫ్రాంకెన్స్)* కాస్ట్యూమ్

డిజైన్: కేట్ హాలే (ఫ్రాంకెన్స్టీన్) * క్యాస్టింగ్: కాసాండ్రా కులుకుండిస్ (వన్ బ్యాటిల్ ఆఫ్టర్

అనదర్) * యానిమేటెడ్ షార్ట్ ఫిలిం: ద గర్ల్ హు క్రైడ్ పాల్స్ * యానిమేటెడ్ ఫీచర్

ఫిలిం: కె-పాప్ డిమాన్ హంటర్స్ * లైవ్ యాక్షన్ షార్ట్ ఫిలిం: ద సింగర్స్, టూ పీపుల్ ఎక్స్చేంజింగ్ సలైవా.

★★★

# పానశాల నుండి కొన్ని

జలజల మంజులార్భటులు జాల్కొను ఈసెలఏటికొవలన్
మొలచిన లేతపచ్చికల మొటుగ కాలిడ బొకు
దెవదూతల రుచిరాధర ప్రకృతి దాల్చెనొ సుందరమందగామి
ఎ లలిత శరిర ప్రుత్కాణాల జిగురించనొ ఎమొ కొమలి పరమొ

గిరమ్మొ దానితలపై దొచెడు మన్నుచల్లి
సుందరి మెరుంగు కపొలముల దాచిన ముద్దులు దొంగిలించి
సంబరముగ శీధువానుము నమాజులు పూజలు చెయనేల
ఎవ్వరైనా వచ్చినారె ప్రుతివాటిక కేగిన పూర్వయాత్రికుల్

మరణయంబు నాకు అణుమాత్రము లేదు
మదీయ జీవ సంబరన భయంబె మిక్కుటము ప్రాణము దెవము వద్ద వడ్డి
బేహారముకు అప్పుగొం టి ఋణమంతయు ఇమ్మని తల్పు తట్టి న
సరసర హేమనిష్కముల సంచులు ముందర విప్పిపొసెదన్

మునుపు మసీదు వాకిటను ముచ్చెలు దొంగిలిపొతి
పాతవై చినెగెను నెడున్ మరల చెప్పుల కొసము వచ్చినాడన్
నెమ్మనము సెడంగ నియ్యెడ నమాజొనరింపగరాను
నీవు చచ్చినయెడ వీడిపొయెదవు చెప్పులవొలె నమాజుసైతమున్

తారాశుక్తులు రాల్చినట్టి జిగిముత్యాలట్లు పూరేకులన్
జారెన్ సన్నని మంచుతుంపురులు వాసం తొదయశ్రీ కి
కాం తారత్నం అనువెన నెచ్చెలిగ ఉద్యానంబునం దొచె
మిత్రా రారమ్ము సుఖింపుము ఈఅదను వ్యర్ధంబై న రాదెన్నడున్

ఆదిమధ్యాంత రహితమై యలరచుండు
కాలయవనిక భేధింప గలమె మనము
ఇటకు ఎందుండి వచ్చె ఇకెటకు బొవు
ప్రాణియను ప్రశ్నకు ఎవ్వాండుబదులుచెప్పు
మొదలు చివర లెని ఈ కాలతెర ను కనుగొనలెము

**దువ్వురి రామిరెడ్డి**



# నడుస్తున్న చరిత్ర



## హోర్ముజ్ నుంచి పనామా వరకు

అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇరాన్ హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై ఆంక్షలు విధించింది.

ఇరాన్ తీసుకున్న ఈ చర్య కారణంగా ఆ ప్రాంతంలో రవాణా దాదాపుగా నిలిచిపోయింది. దీనిపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాలు, ఆర్థిక రంగాలు, ఇంధన రంగాల నుంచి భారీ స్థాయిలో ప్రతిస్పందన లభించింది.

ఈ పరిణామాల నేపథ్యంలో, ఆ వ్యూహాత్మక జలసంధి మీదుగా ప్రయాణించే నౌకలపై 'టోల్' వసూలు చేసే ప్రణాళికను ఇరాన్ ప్రకటించింది.దీనిపై తొలుత అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు.

అయితే, తాము ఈ ప్రణాళికను చాలా సీరియస్‌గా ముందుకు తీసుకెళ్తున్నామని, దీన్ని చట్టబద్ధం చేయడానికి కసరత్తు చేస్తున్నామని ఇరాన్ అధికారులు నొక్కి చెప్పారు.

ఈ నేపథ్యంలో, ఏప్రిల్ 17 నుంచి "హోర్ముజ్ జలసంధిలో ఇస్లామిక్ రిపబ్లిక్ సార్వభౌమ అధికారాల వినియోగం" అనే పేరుతో రూపొందించిన ప్రణాళికకు ఇరాన్ పార్లమెంటుకు చెందిన ఇస్లామిక్ అడ్వైజరీ కౌన్సిల్ పరిధిలోని నేషనల్ సెక్యూరిటీ అండ్ ఫారిన్ పాలసీ కమిషన్ ఆమోదం తెలిపింది.

ఈ ప్రణాళికలో రియాల్ (ఇరాన్ కరెన్సీ), భద్రత, సముద్ర రవాణా, పర్యావరణ కాలుష్యానికి సంబంధించిన వివిధ రుసుములను వసూలు చేసే నిబంధనలు ఉన్నాయి.

హోర్ముజ్ జలసంధి మీదుగా నౌకల 'సురక్షిత ప్రయాణాన్ని' నిర్ధరించడానికి, కొన్ని రకాల నౌకలపై 20 లక్షల డాలర్ల (సుమారు రూ.18.62 కోట్లు) వరకు రుసుము విధించవచ్చని కొంతమంది ఇరాన్ అధికారులు

# నడుస్తున్న చరిత్ర

ప్రకటించారు. దీనిపై చమురు, గ్యాస్, పెట్రోకెమికల్ ఎగుమతిదారుల సంఘం ప్రతినిధి హమీద్ హుస్సేనీ మాట్లాడుతూ, ''నౌకల సురక్షిత ప్రయాణం కోసం రుసుము వసూలు చేసే ప్రోటోకాల్‌ను అమలు చేయడానికి ఇరాన్



నిశ్చయించుకుంది. కాల్పుల విరమణ వంటి రాజకీయ పరిణామాల వల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ విధానం మారదు'' అని చెప్పారు.

ఈ పరిణామాలు ఇటువంటి ప్రణాళిక చట్టబద్ధత, దీన్ని అమలు చేసే విధానంపై అనేక ప్రశ్నలను లేవనెత్తాయి.ప్రపంచవ్యాప్తంగా టోల్ లేదా ఇతర రుసుములను వసూలు చేసే ఇతర జలమార్గాల గురించి తెలుసుకుందాం. అంతర్జాతీయ జలమార్గాలలో టోల్ వసూలు చేయడం అనేది కొత్తగా వచ్చిన ఆలోచనేమీ కాదు.

ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో దీనికి సంబంధించి సుదీర్ఘ చరిత్ర కలిగిన అనేక ఉదాహరణలు ఉన్నాయి.

సూయజ్ కాలువ ఎర్ర సముద్రాన్ని మధ్యధరా సముద్రంతో అనుసంధానిస్తుంది. దీనివల్ల ఆసియా, యూరప్ మధ్య ప్రయాణ సమయం కనీసం పది రోజులు తగ్గుతుంది.ప్రపంచ సముద్ర వాణిజ్యంలో దాదాపు 10 శాతం వాటా ఈ జలమార్గం ద్వారానే జరుగుతుంది. ఇందులో కంటైనర్ రవాణాలో 22 శాతం, వాహన రవాణాలో 20 శాతం, ముడి చమురు రవాణాలో 10 శాతం భాగం ఉంటుంది.

సూయజ్ కాలువలో టోల్ రుసుమును ఈజిప్టుకు చెందిన 'సూయజ్ కెనాల్ అథారిటీ' వసూలు చేస్తుంది. నౌక పరిమాణం, రకం, లోడ్ ఆధారంగా ఈ రుసుము నిర్ణయిస్తారు. ఇది ఒక్కోసారి కొన్న లక్షల డాలర్ల వరకూ ఉంటుంది. ఈజిప్టు నియంత్రణలో ఉన్న ఈ కాలువకు ప్రత్యక్షంగా ఎటువంటి ముప్పు లేకపోయినప్పటికీ, ప్రమాదాలకు ఇది అతీతం కాదు.

2021లో ఒక భారీ నౌక ఇక్కడ చిక్కుకుపోయింది. ఆ ప్రమాదం కారణంగా కాలువను ఆరు రోజుల పాటు మూసివేశారు. దీనివల్ల దాదాపు 10 బిలియన్ డాలర్ల మేర వాణిజ్య నష్టం వాటిల్లింది.ఈ వ్యూహాత్మక మార్గంలో అత్యంత సున్నితమైన ప్రాంతం ఎర్ర సముద్రం దక్షిణపు చివరన ఉన్న 'బాబ్ అల్ మండేబ్' జలసంధి.

2023 నుంచి 2025 మధ్య కాలంలో, గాజాలోని హమాస్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధానికి ప్రతిస్పందనగా, యెమెన్‌లోని ఇరాన్ మద్దతు గల హౌతీ తిరుగుబాటుదారులు వాణిజ్య నౌకలపై దాడి చేశారు.

# నడుస్తున్న చరిత్ర

దీనివల్ల అనేక నౌకలు తమ మార్గాన్ని మార్చుకుని ఆఫ్రికా మీదుగా ప్రయాణించాల్సి వచ్చింది.

దీని ఫలితంగా, 2023లో సూయజ్ కాలువ ద్వారా ప్రయాణించిన నౌకల సంఖ్య సుమారు 26 వేలు ఉండగా, అది 2024 నాటికి దాదాపు 13 వేలకు తగ్గిపోయింది. పసిఫిక్, అట్లాంటిక్ మహాసముద్రాలను కలిపే పనామా కాలువ, ప్రపంచ సముద్ర వాణిజ్యంలో సుమారు 2.5 శాతం వాటాను కలిగి ఉంది. ఇది సాపేక్షంగా చిన్న వాటాగా అనిపించినప్పటికీ, దీని ద్వారా కంటెయినర్ కార్గో, కార్లు, ఆహార ధాన్యాలు వంటి వ్యూహాత్మకమైన, అత్యంత విలువైన వస్తువుల రవాణా జరుగుతుంది.

అమెరికాకు వచ్చే కంటైనర్ కార్గోలో దాదాపు 40 శాతం ఈ కాలువ ద్వారానే వెళుతుంది. దీని వార్షిక విలువ సుమారు 270 బిలియన్ డాలర్లు (సుమారు రూ.25.13 లక్షల కోట్లు). పనామా కాలువ మీదుగా ప్రయాణించడానికి నౌకలు టోల్ చెల్లించాల్సి ఉంటుంది. నౌకల రకం, పరిమాణం ఆధారంగా ఈ రుసుము మారుతూ ఉంటుంది, ఇది లక్షల డాలర్ల వరకు ఉండవచ్చు.

పనామా కాలువ వద్ద టోల్ వసూలును 'పనామా కెనాల్ అథారిటీ' నిర్వహిస్తోంది.

ఈ కాలువ మనుగడ వాతావరణ పరిస్థితులు, రాజకీయ అంశాలపై ఆధారపడి ఉంటుంది.
2023 నుంచి వరుసగా రెండేళ్ల పాటు ఏర్పడిన తీవ్రమైన కరువు కారణంగా, కాలువకు నీటిని అందించే మంచినీటి జలాశయాలలో నీటిమట్టం గణనీయంగా పడిపోయింది. దీనివల్ల నౌకల సంఖ్యను, వాటి పరిమాణాన్ని పరిమితం చేయవలసి వచ్చింది.
ప్రపంచంలోని అత్యంత రద్దీగా ఉండే సముద్ర మార్గాలలో మలక్కా జలసంధి ఒకటి. ప్రపంచ సముద్ర వాణిజ్యంలో సుమారు 24 శాతం వాటా దీని ద్వారానే జరుగుతుంది. ఇందులో సముద్ర మార్గం ద్వారా రవాణా అయ్యే ముడి చమురు, వాహనాలలో చెరో 26 శాతం వాటా ఉంది. ఇదే మార్గంలో సింగపూర్ ఉంది. అక్కడ ప్రపంచంలోనే రెండవ అత్యంత రద్దీగా ఉండే కంటైనర్ ఓడరేవు ఉంది.



# నడుస్తున్న చరిత్ర

మలక్కా ఒక సహజ సిద్ధమైన అంతర్జాతీయ జలమార్గం. ఇక్కడ నౌకల రాకపోకలపై నేరుగా ఎటువంటి రుసుము వసూలు చేయరు.
చైనా, జపాన్, దక్షిణ కొరియాలకు ఇంధన సరఫరాలో మలక్కా జలసంధి ప్రధాన ద్వారం వంటిది. చైనా దిగుమతి చేసుకునే చమురులో దాదాపు 80 శాతం ఈ మార్గం మీదుగానే వస్తుంది. ఈ ఆధారపడటాన్నే బీజింగ్ 'మలక్కా డైలమా' అని పిలుస్తుంది.

ఈ ప్రాంతంలో సముద్ర దొంగతనాల బెడద ఇప్పటికీ ఒక ప్రధాన ఆందోళనగా ఉంది. 2025లో ఈ జలసంధిలో 130 కంటే ఎక్కువగానే దొంగతనాల సంఘటనలు నమోదయ్యాయి. అయినప్పటికీ, రాజకీయ, భౌగోళిక రాజకీయ అంశాలే ఇక్కడ పెద్ద ముప్పుగా పరిణమించాయి. చైనా, అమెరికా లేదా భారత్ మధ్య సముద్ర ఆధిపత్యం విషయంలో ఏవైనా ఉద్రిక్తతలు తలెత్తితే, ఈ మార్గంలో రవాణాకు తీవ్ర అంతరాయం కలగవచ్చు. ప్రపంచంలోని అత్యంత పురాతనమైన కాలువల్లో జర్మనీలోని కీల్ కెనాల్ ఒకటి. ఇది తరచుగా అత్యంత రద్దీగా ఉండే కాలువ. ఏటా 25 వేలకు పైగా నౌకలు దీని మీదుగా ప్రయాణిస్తాయి.

ఈ కాలువ ఉత్తర సముద్రాన్ని బాల్టిక్ సముద్రంతో అనుసంధానిస్తుంది. నౌకలు డెన్మార్క్ మీదుగా చుట్టి వెళ్లాల్సిన అవసరం లేకుండా తక్కువ దూరంలోనే గమ్యస్థానానికి చేరుకోవడానికి ఉపయోగపడుతుంది.
ఈ కృత్రిమ కాలువలో ప్రయాణించే నౌక బరువు, పరిమాణం ఆధారంగా జర్మనీకి చెందిన 'ఫెడరల్ వాటర్‌వేస్ అథారిటీ' టోల్ వసూలు చేస్తుంది. ఈ ఆదాయం కాలువ నిర్వహణ ఖర్చులో కొంత భాగాన్ని భర్తీ చేస్తుంది.
సూయజ్, పనామా కాలువలతో పోలిస్తే ఈ కాలువ టోల్ సాపేక్షంగా తక్కువగానే ఉంటుంది.

సూయజ్, పనామా ఈ రెండు కాలువలు కలిపి ప్రపంచ వాణిజ్యంలో సుమారు 10 నుంచి 15 శాతాన్ని నిర్వహిస్తాయి. వీటి టోల్ ద్వారా కొన్ని బిలియన్ల డాలర్ల ఆదాయం సమకూరుతుంది.
సముద్ర రవాణాలో తుర్కియే జలమార్గాలకూ అత్యంత ప్రాముఖ్యం ఉంది. బోస్పరస్, డార్డనెల్స్ ఈ రెండూ తుర్కియేలో కీలకమైన జలసంధులు. నల్ల సముద్రం, మధ్యధరా సముద్రం మధ్య ఉన్న సముద్ర మార్గాలు ఇవి.

ప్రపంచ సముద్ర వాణిజ్యంలో సుమారు 3 శాతం వీటి ద్వారానే జరుగుతుంది. ఇది తక్కువగా అనిపించినప్పటికీ యుక్రెయిన్, రష్యా, రొమేనియాల నుంచి జరిగే ప్రపంచ గోధుమ ఎగుమతుల్లో దాదాపు 20 శాతం ఈ మార్గం ద్వారానే వెళుతుంది.
మాంట్రియక్స్ కన్వెన్షన్ ప్రకారం బోస్పరస్, డార్డనెల్స్ జలసంధులలో రాకపోకలు సాగించే నౌకల నుంచి ఎటువంటి రుసుమూ వసూలు చేయరు. అయితే, నావిగేషన్ లేదా భద్రత వంటి సేవల కోసం కొంత మేర చెల్లించాల్సి ఉంటుంది.
ఈ మార్గం అత్యంత ఇరుకైన చోట కేవలం 700 మీటర్ల వెడల్పు మాత్రమే ఉంటుంది. ఇది తుర్కియేలోని ఇస్తాంబుల్ నగరం మధ్య నుంచి ఉంటుంది. ఈ కారణంగా ఇక్కడ రవాణా చాలా సంక్లిష్టంగా మారుతుంది. చిన్నపాటి ప్రమాదాలు తరచుగా జరుగుతుంటాయి.

మాంట్రియక్స్ ఒప్పందం ప్రకారం, ఈ జలసంధులపై సైనిక నియంత్రణ అధికారం తుర్కియేకి ఉంది. 2022లో యుక్రెయిన్‌పై రష్యా దాడి చేసిన తర్వాత, వాణిజ్య రవాణాను కొనసాగిస్తూనే యుద్ధనౌకల రాకపోకలను పరిమితం చేయడానికి తుర్కియే ప్రభుత్వం ఈ అధికారాన్ని ఉపయోగించింది.
నల్ల సముద్ర ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగితే ఇక్కడ సమతుల్యత దెబ్బతినవచ్చు, ప్రపంచ ఆహారధాన్యపు మార్కెట్లు అస్థిరపడవచ్చు.★★★

# అంతర్నేత్రం



## " నేను పోతే " మోక్షం ..

"నేను అనే అహం పోతే..."
"నేను ఎవరు?" అనే ప్రశ్న.
ఉదయిస్తుంది

ఈ ప్రశ్నకు సమాధానం
తెలుసుకున్నవాడే నిజమైన జీవితం
అర్థం చేసుకున్నవాడు.

ఈ సందర్భంలో భోజ మహారాజు
మరియు కాళిదాసు మధ్య జరిగిన
సంఘటన ఒక గొప్ప సత్యాన్ని మన
ముందుంచుతుంది.

భోజ మహారాజు
తన ఆస్థానంలో ఉన్న పండితులను
అడిగాడు:

"మోక్షానికి పోగలిగేది ఎవరు?"
అని

ప్రతి పండితుడు తన తన జ్ఞానం
ప్రకారం సమాధానమిచ్చాడు:
యజ్ఞాలు చేస్తే మోక్షం లభిస్తుంది
జ్ఞానం సంపాదిస్తే మోక్షం
లభిస్తుంది
భక్తి చేస్తే మోక్షం లభిస్తుంది
సత్సంగం చేస్తే మోక్షం లభిస్తుంది
అని

కానీ కాళిదాసు మాత్రం లేచి ఇలా
అన్నాడు:

"నేను పోతే మోక్షం వస్తుంది" అని

ఈ మాట మొదట అందరికీ
అహంకారంగా అనిపించింది.
కానీ తరువాత ఆయన వివరణ
ఇచ్చాడు:

"నేను అనే అహంకారం పోతే
ఎవడైనా మోక్షానికి పోవచ్చు"

"నేను" అనే అహంకారం అంటే
ఏమిటి?

మనమందరం రోజూ "నేను" అనే
పదం ఉపయోగిస్తుంటాం.

కానీ ఆ "నేను" అంటే ఏమిటి?

నేను ఈ శరీరం
నేను ఈ స్థాయి ఉన్నవాడు
నేను ఈ స్థానం కలవాడు
నేను చేసాను, నాకు వచ్చింది
ఈ భావాలన్నీ కలిపితే అదే
అహంకారం (Ego)
ఇది ఒక అజ్ఞానం
ఇది ఒక భ్రమ
ఇది ఒక అవరోధం
అహంకారం వల్ల కలిగే సమస్యలు
అహంకారం మనిషిని
నశింపజేస్తుంది:

ఇతరులను చిన్నచూపు చూడటం
కోపం పెరగడం
అసూయ, ద్వేషం పెరగడం
మనశ్శాంతి పోవడం

అహంకారం ఉన్న చోట
ప్రేమ ఉండదు
శాంతి ఉండదు
దైవం ఉండదు
అహంకారం పోతే కలిగే మార్పు
అహంకారం పోయినప్పుడు
మనిషిలో అద్భుతమైన మార్పులు
వస్తాయి:

వినయం పెరుగుతుంది
ప్రేమ పెరుగుతుంది
సహనం పెరుగుతుంది
కరుణ ఉద్భవిస్తుంది

"నేను" అనే భావం పోయి
"అందరూ ఒకటే" అనే భావం
వస్తుంది ఇది నిజమైన జ్ఞానం

మోక్షం అంటే ఏమిటి?

చాలామంది మోక్షం అంటే
మరణం తర్వాత దొరికేది
అనుకుంటారు.
కానీ నిజానికి:

మోక్షం అంటే మనసుకు విముక్తి



బాధల నుండి విముక్తి
జనన మరణ చక్రం నుండి విముక్తి
అది బయట కాదు...
మన లోపలే ఉంది

ఆచరణలో ఎలా సాధ్యం?
"నేను" అనే అహంకారం పోవాలంటే:

1. ధ్యానం
మనసును గమనించడం
"నేను ఎవరు?" అని ప్రశ్నించుకోవడం
2. సేవ
ఎలాంటి స్వార్థం లేకుండా ఇతరులకు
సహాయం చేయడం
3. వినయం
తనకు తెలిసింది తక్కువ అని
అంగీకరించడం
4. సత్సంగం
మంచి ఆలోచనలు ఉన్న వారితో
ఉండడం
5. భక్తి
దైవంపై సంపూర్ణ విశ్వాసం పెట్టడం

ఒక అందమైన ఉదాహరణ

ఒక నది సముద్రంలో కలిసినప్పుడు
దానికి తన పేరూ ఉండదు, రూపం
ఉండదు
అది సముద్రమే అవుతుంది

అలాగే

మనిషి అహంకారం పోతే
అతడు పరమాత్మతో ఏకమవుతాడు

కాళిదాసు చెప్పిన చిన్న మాటలోనే గొప్ప
సత్యం ఉంది:

"నేను పోతే మోక్షం వస్తుంది"

అంటే:

శరీరం పోవడం కాదు
అహంకారం పోవడం

అహంకారం లేని మనసే
శాంతి పొందుతుంది
ఆనందం పొందుతుంది
మోక్షం పొందుతుంది

"నీ లోపల ఉన్న 'నేను' అనే
అహంగోడ కూలితే
నీకు ఆత్మ దర్శనం అవుతుంది.

★★★

# అవి-ఇవి

ఎన్నికల ప్రచారంలో టెక్నాలజీ ఎంత పని చేసిందిరా అయ్యా..
కుంభకోణం నియోజకవర్గంలో టీవీకే అదినేత విజయ్ ఎన్నికల
ప్రచార సభలో వీడియో చూడండి. విజయ్ తన ప్రసంగాన్ని
కొనసాగిస్తుండగా, అభ్యర్థి దండం పెడుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నాడు.
అయితే ఇక్కడ విజయ్ లేడు. ఆయన వీడియో హోలోగ్రామ్ లో
గాలిలో ప్లే అవుతోంది. వాహనం లో నుంచి ఆయన
మాట్లాడుతున్నట్లే భ్రమ కలిగిస్తుంది.. అదీ టెక్నాలజీ..



శృంగార
కథ



బహుమతి పొందిన శృంగార కథ

# *. అందమైన ఆల్చిప్పలు*

దండు ఆంజనేయ రాజు

స్వప్న, చైతన్యలు.. సాయంత్రం నాలుగు గంటలకు.. విశాఖపట్నం గాజువాక నుండి..బుల్లెట్ బండి పై.. యవ్వన వయసులో ఉన్న ఇద్దరూ.. ఒకరికి ఒకరు

గాలి దూరే సందు లే నట్టు.. ఆ బుల్లెట్ బండి

పై.. గాలి వేగంతో పాటు.. పెనవేసుకుపోయినట్లు

అంటుకుపోయి కూర్చున్నారు.

ఊరికి దూరంగా జనసంచారం.. తక్కువగా ఉంటుందని

ముత్యాలమ్మ పాలెం బీచ్..కి బయలుదేరారు.

ముత్యాలమ్మ పాలెం బీచ్ కి వచ్చే యువకులంతా.. అచ్చి క.. బుచ్చికలకు.. స్వేచ్ఛగా ఉంటుందని ఊరి కి

దూరంగా ఉన్న గాని

ముత్యాలమ్మ పాలెం బీచ్కే.. ఎక్కువగా వస్తూ ఉంటారు.

ముత్యాలమ్మ పాలెం బీచ్ లో.. చేపలు పట్టే జాలర్లు గంగపుత్రులు సాయంత్రం వేళ చేపలు పట్టుకున్నాక.. సముద్రం నుండి ఒడ్డుకు చేర్చే

పడవలతో..జాలర్లు ఎవరి పనిలో వాళ్ళు ఉన్నారు.

ముత్యాలమ్మ పాలెం.. సిమెంట్ రోడ్డుపై చివరకు.. బుల్లెట్ బండి



# కథ

స్టాండ్ వేసి స్వప్న, చైతన్య లు.. ఆ బీచ్ లో.. బిడియపడుతూ.. ఆ ఇసుక తెన్ను లపై ఒక మూలగా.. చైతన్య ఒ డిలో.. స్వప్న తల ఆన్చి.. చైతన్య ప్రేమ ఒడిలో తెలియాడుతూ

ఒక చేత్తో చైతన్య షర్టు

గుండీలు సవరిస్తూ..

మరో చేత్తో.. ఆ మెత్తని ఇసుకలో " ఐ లవ్ యు చైతూ.. " అని రాసింది స్వప్న.

ఆ ఇసుకలో స్వప్న "ఐ లవ్ యు చైతూ.." రాయిగానే.. ఇసుక అంటిన స్వప్న వేలును

తుడవ కుండానే.. చైతన్య ఆ వేలును పాల పీకలా ప్రేమ మైకంలో చప్పరించాడు..

కొంచెం సేపు కూర్చుని సేద తీరిన తర్వాత తెల్లటి నురుగులు కక్కే.. వచ్చే పోయే కెరటాలను.. ఒకరి చేయి ఒకరు పట్టుకుని సముద్రపు అలలను తాగుతూ.. సరదాగా ఆడుతూ పాడుతూ..

నడక ప్రారంభించారు..

ప్రేమకులు ఇద్దరు.

ఆ సముద్రపు తీరంలో.. అలల తుంపురులతో.. చల్లని చిరుగాలులు.. ఆ ఇద్దరికి సగం సగం.. తడిసిన..

తనువులకు తాగుతుంటే.. స్వప్న ఎదలోతుల్లో.. లక్ష కోరికలు కవ్విస్తుంటే..

చైతన్య హృదయవీణ

కోటి రాగాలు.. పలికిస్తోంది.

ఆకాశంలో మేఘాలు.. వర్షం వచ్చే సూచనలతో.. చిన్న చిన్నగా చిటపట చినుకులు కూడా

పడటం మొదలుపెట్టాయి.

చిటపట చినుకులు కాస్త.. చిలికి చిలికి పెద్దపెద్ద ఉరుములు మెరుపులతో.. క్షణాల్లోనే గాలి వానగా

మారింది.

పెద్ద వర్షం.. గాలి దు మారానికి.. స్వప్న చైతన్య ఇద్దరి కళ్ళలోను.. సన్నని ఇసుక దూరి ఇద్దరు కళ్ళు తెరవలేకపోతున్నారు..

భయంకరమైన ఉరుములు మెరుపులతో ఉన్న ఆకాశం.. ఒక పక్క సముద్రపు కెరటాల హోరు .. ఆ భీకర పరిస్థితికి.. స్వప్న కళ్ళలో పడిన ఇసుక తో.. కళ్ళు తెరవని స్వప్న భయంగా పెద్ద కేకతో.. చైతన్యను.. గట్టిగా వాటేసుకున్నది

స్వప్న.

పైనుండి కుండ పోత వర్షం

కురుస్తూనే ఉన్నది..

చైతన్యను ఎంత గట్టిగా పట్టుకున్నా..

వెన్నులోంచి వచ్చే వణుకుతో.. బెంబేలెత్తిపోతుంది సప్న.

ఇంతలో పెద్ద కెరటం వచ్చి.. సముద్రపు ఒడ్డున ఉన్న స్వప్న చైతన్య లను.. వారికి తెలియకుండానే సముద్రపు లోపలకి.. పెద్ద కెరటం ఇద్దరిని తీసుకుపోయింది.

స్వప్న చైతన్య లను

పెద్ద కెరటం లాక్కుపోవటం.. చేపలు పడవలో ఉన్న

చిన్న జాలరి కుర్రవాడు చూశాడు.

స్వప్న చైతన్యలను..

చేపలు పడవలో ఆడుకుంటున్న.. చిన్న కుర్రవాడైనా.. క్షణాల్లో అక్కడ ఉన్న పెద్దవాళ్లయిన జాలర్లకు

చెప్పాడు.

సముద్రంలో చేపలు పట్టే.. జాలర్లు లందరూ.. గజ ఈత గాల్లే.. ఆ చిన్న కుర్రవాడి మాటకు.. చేపలు పట్టి వడ్డుకి వచ్చిన జాలర్లు..

వెంటనే కార్యరూపం దాల్చారు.

జాలర్లు ప్రయత్నం చేస్తూ ఉండగానే..

# కథ

సముద్ర కెరటం ఎంత స్పీడ్ గా స్వప్న చైతన్య లను లోపలికి తీసుకెళ్లిందో.. మళ్లీ అంతే స్పీడుగా.. దూరం దూరంగా.. స్వప్న చైతన్య లను

సముద్రపు ఒడ్డుకు.. ఒక పెద్ద కెరటం.. ఇద్దరినీ చేర్చింది. కరుణతో కనుకరించిన కడలితల్లి .

సాగర్ తీరంలో.. సముద్ర గర్భంలో కెళ్ళి

సప్న, చైతన్యలు.. ఒడ్డుకు వచ్చిన స్పృహ తప్పిపోయి ఉన్నారు.

జాలర్లు కనికరించి..

ప్రథమ చికిత్సతో.. స్పృహ తప్పిపోయిన

స్వప్న, చైతన్యలకు..

కొంచెం సేపటికి ఇద్దరికీ

తెలువి వచ్చింది.

స్వప్న,చైతన్యలు.. చచ్చి బతికి.. మరో జన్మ ఎత్తినట్లు అయినది.

" మమ్మల్ని బతికించిన మీకు

కోటి దండా"లంటూ..

స్వప్న చైతన్యలు జా లర్లకు.. హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

అప్పటికే సమయం..

రాత్రి ఎనిమిది గంటలు

కావస్తోంది.

" ఇంక ఇళ్లకు బయలుదేరదాం చైతూ.. " అని స్వప్న చెప్పగానే..

" అలాగే.. "అంటూ స్వప్నని తీసుకుని చైతన్య బయలుదేరి పోతుంటే..

"చచ్చి బతికి మరో జన్మ ఎత్తిన మీరు ఈ రాత్రికి మా దగ్గర ఉండవలసిందే.." అని జాలి గొలుపే జాలర్లు మాట వినక తప్పలేదు స్వప్న,చైతన్య లకు..ఇక ఆరోజు రాత్రి కి .. ముత్యాలమ్మ పాలెం లో.. మళ్లీ జన్మనిచ్చిన జాలర్ల ఆహ్వానాన్ని మన్నించారు స్వప్న చైతన్య లు.

ఒకప్పుడు పూరి గుడిసెలుగా వున్న ముత్యాలమ్మ పాలెం..

జాలర్లు ఇల్లు సైతం..

ఎంత అందమైన భవనాలుగా తయారై నాయి.

నిద్రాహారాలు మాని పగలనకా రేయనక.. చేపల వేటకై..

సముద్రంలో దూర తీరాలికి.. వెళ్ళిన ఈ జాలర్ల ఇల్లు చూసి.. స్వప్న చైతన్యలు.. "ఎంతెంత గొప్పగా ఉన్నాయి.. చేపలు పట్టే జాలర్లు ఇల్లు కూడా.." అని ఇద్దరూ ఆశ్చర్య చకుతులయ్యారు..!!

తడి బట్టలతో.. వణికిపోతున్న స్వప్న చైతన్య లను.. జాలర్లు ఒక అందమైన భవంతి పైకి తీసుకెళ్లి.. ఎవరూ లేని ఆ మేడ పైన సింగల్ బెడ్ రూమ్ గా ఉన్న గది తాళాలు తీసి.. ఆ రూములోనే వున్న ట్రంకు పెట్టి లోని

కొత్త రామరాజు పంచ చైతన్యకు.. స్వప్నకు సరిపోయే.. కొత్త పువ్వుల జాకెట్టు.. కొత్తకోక" మీ తడి బట్టలు తీసి ఇవి కట్టుకోండి బాబు" అంటూ అందించారు.

వారు రూమ్ కి వచ్చిన పది నిమిషాలకి.. గుమగుమలాడే చేపల పులుసు తో.. భోజనం క్యారేజీ పట్టుకుని జాలర్ల కుర్రోడు అందించడం జరిగింది.

మంచి ఆకలి మీద ఉన్నారేమో.. సప్న చైతన్యలు.. ఇద్దరు

ఆ తడి బట్టలు విప్పకుండానే.. ముందు కడుపులు నింపుకున్నారు.

జాలర్లు చేసే మర్యాదకు.. స్వప్న, చైతన్యలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

సమయం.. రాత్రి పది గంటలు కావడంతో..

కడుపునిండాజాలర్ల భోజనం తిన్నారు.. ఏమో.. గది తలుపులు గట్టిగా బిగించి.. జాలర్లు



కథ

ఇచ్చిన కొత్త బట్టలు కూడా
కట్టుకోకుండా.. తనువులకు
అంటుకు..పోయిన తడి బట్టలను
విప్పి.. నూలి పోగు లేని నునుపైన
స్వప్న చైతన్యల.. యవ్వనపు
శరీరాలు రెండూ.. వెచ్చని
ఉచ్చాశ.. నిచ్వాసలతో.. యవ్వన
గిరులతో.. వున్న.. ఆ గదిలో
ఉన్న పందిరి పట్టి మంచం..
ఆహ్వానిస్తోంది.

సందు దొరకకాలే.. గ ని
వచ్చిన మధురాతి మధురమైన
అవకాశాన్ని ఎవరు
వదులుకుంటారు.

చైతన్య బలమైన చా తికి.. రవికె
లేని స్వప్న గుండ్రని ఉరోజాలు..
బలంగా ఒత్తుకుపోయి..
అందమైన అల్చిపప్పలా..
ఇద్దరు ఒక్కటై.. ప్రేమ మైకంలో
హత్తుకుపోయారు..!!

తెల్లవారులు..ఒక్కటై..
అలసిపోయిన రెండు తనువులు..
తెల తెలవారకముందే..
తలుపులు దగ్గరేసి.. తడి పొడిగా
ఉన్న

ఇద్దరి బట్టలు ధరించి..

బుల్లెట్ బండి పై.. ముత్యాలమ్మ
పాలెం నుండి స్వప్న, చైతన్యలు.
ఇద్దరూ  ఇళ్లకు తుర్రుమన్నారు.

( కథ సమాప్తం )



చారిత్రక
కథ

బహుమతి పొందిన చారిత్రక కథ

# చందనగంధి.!

సుజాత ప్రసాద్ రాయప్రోలు

వజ్జి గణ రాజ్యం లో వసంతోత్సవాలు ఆరంభమయాయి. ఈ రాజ్యానికి రాజధాని వైశాలి. యువతీ యువకులు కలిసి మెలిసి బృందాలుగా విడిపోయి కాసారపు తీరాలలోనూ, ఉపవనాలలోను చేరి ఆనందం గ్రోలుతున్నారు. సంగీత, నృత్య, సాహిత్య సమ్మేళనాలతో వసంతాగమనాన్ని ఆస్వాదిస్తున్నారు. సదానిరా నదీ ప్రాంతంలో ఆరాజ్యంలోనే ప్రధానులైన ఆరుగురు కులీన వంశ కుమారులు తమ తమ రథాలపై వచ్చి చందన, మద్ది వంటి పెద్దవృక్షాల నీడలలో తమ గోష్ఠిని ఆరంభించారు. ఆరాకుమారులకు సేవకబృందం అన్ని సౌకర్యాలను అక్కడ కల్పించింది. వారు వజ్జి గణరాజ్య పాలకవర్గంలో ముఖ్యులు. వజ్జి గణ సంఘంలో పాలనకోసమై రాజు, ఉపరాజు, మంత్రి, పాలకవర్గం అందరూ ఎన్నుకోబడతారు. ఏ ఒక్కరి చేతిలోనూ శాసనాధికారముండదు. బహుమతం ఏదయితే దానినే అమలు చేస్తారు. లిచ్ఛవులచే, మహావిదేహనుండి వచ్చిన కొందరిచే ఈ వజ్జి గణరాజ్యం ఏర్పడి చాలా బలమైనదిగా ఎదిగింది. ఉన్నత రాజవంశస్థుల కుమారులందరూ రాకుమారులగానే పిలవబడతారు. పక్కనే ఉన్న మగధ రాచరికానికి పెద్దపీటవేస్తే, వజ్జిలో మాత్రం ప్రజాతంత్రమే నడుస్తోంది.

ఆరుగురి యువరాకుమారుల షట్కంలో ప్రమోద్ కవితలు చదివాడు. అనిరుద్ధ్ హాస్యోక్తులు చెప్పాడు. ఆనంద్ తన వీణావాదనంతో వారిని మురిపిస్తున్నాడు. ఇలా వీరి వినోదం సాగుతుండగా బలమైన సింధు దేశపు అశ్వాలను అధిరోహించి ఇద్దరు వీరులు వీరి సమీపానికి వచ్చారు. వారిలో ఒకరు ఉపరాజయిన నిర్భయ్. నిర్భయ్ యువరాకుమారుల అభినందనలు స్వీకరిస్తూనే "వీరు మగధ మహామంత్రి. వైశాలి వసంతోత్సవాన్ని చూడడానికై వచ్చారు" అని ఆ రెండవ వ్యక్తిని పరిచయం చేసాడు. యువరాకుమారులు వీరిని తమ సంగీత సభలోకి ఆహ్వానించారు. మగధ మహామంత్రి "మీసభలో స్త్రీల చతురోక్తులు, సరససల్లాపాలు లేకుండానే మీరు ఆనందాన్ని పొందగలరా?" అన్నాడు ఆశ్చర్యంగా.

వారిలో ప్రసన్న కుమార్ "మహామంత్రీ! మేము వైశాలీ రాజ్యంలో స్వతంత్ర భావాలతో జీవించగలము, ఆనందించగలము. మేము వేరువేరు తీర్థంకరుల అంతేవాసులము. వేరువేరు ఆధ్యాత్మిక వాదులము. అయినా పరస్పరం గౌరవాభిమానాలు కలిగిన వారం" అన్నాడు.

"మేమంతా మా నైపుణ్యాలతో



ఆనందం అనుభవించగలం. మా సమూహంలో మహిళల అవసరం మాకు లేదు."అన్నాడు ప్రశాంత్.

మగధ మహామంత్రి మర్మంగా నవ్వుతూ "అయితే గురువులు, ఆధ్యాత్మిక వాదాలు వేరయిన మీ అందరికీ ఏ విషయంలోనూ ఏకాభిప్రాయం లేదన్నమాట." అన్నాడు. అతని మాటలలో వ్యంగ్యం నిండి ఉంది. ఆమాటకు ఒక్కనిమిషం నిశ్శబ్దం రాజ్యమేలింది.

" ఎందుకు లేదూ? మేమంతా వజ్జి సంఘ సభ్యులము. మాది ప్రజాతంత్రం. జనాభిప్రాయము సంఘానికి, సంఘ నిర్ణయం మాకు శిరోధార్యం. దాని ముందు మా మాన ప్రాణాలు మేము లెక్కచేయము. అందులో మాది ఏకాభిప్రాయం." అన్న కోమలమైన గొంతు ఆ చెట్ల మధ్య నుండి వినపడింది. సదానిరా నుండి నీరు తెచ్చుకునేందుకు వెళ్తున్న ఒక సుందరి ఇచ్చిన ఆ సమాధానానికి వారు ఆశ్చర్యపోయారు. ఆమె రూపలావణ్యాలు వారి కనులకు మిరుమిట్లు గొలిపాయి. ఆమె రూపము సౌందర్యమే రాశిపోసుకుని ఉన్నట్లుంది. ఆమెది అతి సాధారణమైన వస్త్రధారణ! ఆమె నిరాభరణ! కనులు తేటగా, నిర్మలంగా ఆవుకనుల వలె కాటుక దిద్దినట్లు నల్లగా ఉన్నాయి. ఆమె మెల్లగా సదానిరా వైపు సాగిపోయింది. ఆ కుండ బరువును ఆ సన్నటి నడుము మోయగలదా అనుకున్నాడు నిర్భయ్!

వజ్జి గణరాజ్యాన్ని తక్కువ చేయాలనుకున్న మగధ మంత్రికి చెంపపెట్టులాంటి సమాధానం లభించింది. "నిజంగా అద్భుతం! మా మాగధులకు ఆమ్రపాలి సౌందర్యంపై చాలా గర్వం. కానీ ఈ సుందరి కాలిగోటికి కూడా ఆమె చాలదు. ఆపైన ఇంత గొప్ప వాక్చాతుర్యం!" అన్నాడు మగధ మహామంత్రి.

" నేను ఆమ్రపాలి వేశ్య అని విన్నాను. కానీ ఈమె....!" అని ఆగిపోయాడు నిర్భయ్.

"అయితే ఈమె కులాంగనా? ఆమ్రపాలితో పోల్చినందుకు నన్ను మన్నించండి." అన్నాడు మహామంత్రి.

నీరు నింపుకుని వస్తున్న ఆ సుకుమారిని ఆపి వసంత్ "కల్యాణీ! మీ పరిచయభాగ్యం మాకు కలిగించండి." అన్నాడు.

"నేను కులీన వంశస్థుడయిన శ్వేత కీర్తి కుమార్తె చందనగంధిని. ఇటీవలే ఆయన పరమపదించారు" అంది ఆమె.

"సమస్త వజ్జి సంఘానికి ప్రతినిధిగా మీరు చెప్పిన సమాధానం మమ్ములను అమితానందపరచింది. మా అభినందనలందుకోండి." అన్నాడు ఆనంద్.

"సదానిరా తీరానికి, ఈ చందన వృక్ష ఛాయలకు మిమ్ములను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నాను. మీఅందరికి గొప్పగా ఆతిధ్యమిచ్చేంత సంపన్నురాలను కాను, అలాగని ఫల, పుష్ప, జలాలకు దరిద్రురాలనూ కాను. చెప్పండి. నేను మీకు ఏ సేవ చేయగలను?" ఎంతో మధురంగా అడిగింది చందనగంధి.

"సుభద్రే! మాకు మీ పరిచయమే గొప్ప భాగ్యం. మీరు మరేమీ ఇవ్వనవసరం లేదు."

అనిరుద్ధ్ చెప్పాడు.

"మీరు మన్నిస్తే నాదొక విన్నపం. ఆనంద్ గారి వీణతో మీరు గొంతు కలిపితే వినాలని ఉంది." మగధ మహామంత్రి అడిగాడు.

"నేను ప్రత్యేకించి సంగీత సాధన ఏమీ చేయలేదు. మా నాన్నగారి దగ్గర నేర్చుకున్న పాటలు మాత్రమే పాడగలను. ఇప్పుడే వస్తాను." చందనగంధి తమ కుటీరంలో నీటి కుండను దించి ఒక వెదురు బుట్టలో కొన్ని ఫలాలను తీసుకుని వచ్చింది. అందరూ ఆ ఫలాలను రుచి చూసి ఆమె ఆతిధ్యాన్ని గౌరవించారు.

ఆమె ఆనంద్ వీణ వాయిస్తున్న తివాచీ మీదే కూచుని ఆ శృతిలో గొంతు కలిపి సదానిరా అందాలను వర్ణించే గీతమొకటి ఆలపించింది. అందరూ ఆ పాటలోని సంగీత,సాహిత్య సమ్మేళనానికి ముగ్ధులయారు. ఆ గానమాధుర్యం ఆప్రదేశమంతా ఆవరించింది. నిర్భయ్ కనులు, మనసు కూడా చందనగంధిని



# కథ

వదిలి రానంటున్నాయి. ఆమె రూపం, వ్యక్తిత్వం,గానం అతని ఇంద్రియాల ద్వారా హృదయంలోకి వెళ్ళి పీఠం వేసుకుని కూచున్నాయి. తన సంతోషాన్ని ప్రకటిస్తూ అతను తన మెడలోని ముత్యాలహారం తీసి ఆమెకు బహుమతిగా ఇచ్చాడు. ఆమె గంభీరంగా "మన్నించండి. ఎవరి అనుగ్రహాన్ని నేను స్వీకరించలేను." అని నెమ్మదిగా అక్కడనుంచి వెళ్ళిపోయింది. అందరూ ఆశ్చర్యంగా ఒకరిమొహాలొకరు చూసుకున్నారు.

చందనగంధిలోని వ్యక్తిత్వపు కోణాలు దర్శించినకొద్దీ మగధమహామంత్రికి వజ్జి సంఘపు ఘనతకు కారణాలు అర్థమయాయి. నిర్భయ్ తన మానసిక ప్రణయం దీర్ఘాయుష్షు పొందాలని మనసారా అనుకున్నాడు.

. ★★★

ఆరోజే వసంతోత్సవం ఆఖరిరోజు. ఆసంవత్సరం అనంగపూజకు వజ్జిసంఘపు యువతులలో ఒక సుందరిని ఎంచి ఆమెను "వజ్జిరాజ్య సుందరి"గా గుర్తించాలన్న కొత్త నిర్ణయం తీసుకున్నారు.

యువ షట్కం హృదయాలలో చందన గంధి మెదిలింది. వారు రాజ్యానికి కాస్త దూరంగా వనంలో ఉంటున్న ఆమె వద్దకు వెళ్ళి విషయం వివరించారు.

"శుభే! ఆసభకు వచ్చి, "వజ్జి సంఘసుందరి" గా మీరే గుర్తింప బడాలనే మాకోరికను మీరు మన్నించాలి." అన్నారు. "ఇన్నేళ్ళు ఈ వనంలోనే సదానిరా ఒడ్డునే గడిపాను. ఇప్పుడీ ప్రహసనం అంతా అనవసరమేమో అనిపిస్తోంది." అంది చందనగంధి.

"వజ్జి సంఘపు యువతులకు శిరోమణి మీరు. మీ నాన్నగారు వైశాలిలో ప్రసిద్ధులు. ఆయన తనంత తనుగా వైశాలి నుంచి ఈ వనానికి వచ్చి నిరాడంబర జీవితాన్ని స్వీకరించారు. వైశాలి సభలో మీరు గౌరవం పొందితే మాకు చాలా సంతోషం. నా రథంపై నేనే మిమ్ములను తీసుకువెళ్తాను" ఆనంద్ అన్నాడు.

"సరే! నేను పదినిమిషాలలో వస్తాను." కాసేపు ఆలోచించి చందనగంధి చెప్పింది. ఆమె శుభ్ర వస్త్రాలను, తలలో పూలమాలను ధరించి ఆనంద్ రథముపై అధిరోహించింది. ఆమెను నగరంలో చూసినవారు కనురెప్ప వేయలేకపోయారు. అప్పటివరకూ తమ సౌందర్యంపై గర్వించిన యువతుల శిరస్సులు అవనతమైపోయాయి.

అనుకున్నట్లుగానే ఆమెనే వజ్జిసంఘపు శ్రేష్ఠ సుందరిగా గుర్తించారు. రాజు ఆమె వివరాలు అడుగుతుండగా నిర్భయ్ లేచి

" రాజా! ఈమె కులీన వంశజుడైన శ్వేతకీర్తి తనయ. ఈమెకు తండ్రి లేనందున ఈమెను వివాహం చేసుకునేందుకు వజ్జి సంఘపు అనుమతి కోరుకుంటున్నాను." అన్నాడు. చందనగంధి ఆశ్చర్యపోయింది. ఈలోగా మగధమహామంత్రి వజ్జి సంఘ సేనాపతి ని తన కూటనీతిలో దించాడు.

సేనాపతి రణసింహుడు లేచి "మన మందరం సమత్వపు స్వప్నాలు చూస్తాం. అలాంటప్పుడు ఇంత సౌందర్యరాశి ఒకరికే స్వంతం కావడం స్వార్థం కాదా? ఈమె అనంగపూజారిణిగా స్వతంత్రంగా ఉంటుంది. ఈమె సౌందర్యాన్ని ఒక రాత్రికి నూరు సువర్ణముద్రలనిచ్చి ఎవరైనా ఆరాధించగలిగే సంప్రదాయం వైశాలిలో కావాలని నేను అంటున్నాను." అన్నాడు.

చందనగంధి అందానికి దాసోహమనే వారు ఆ క్షణం అక్కడ ఎక్కువే ఉన్నారు. వారిలో ఉన్న కామ వాంఛ సహజంగానే గెలిచి చందనగంధి మన్మథ పూజారిణిగా ప్రకటించబడింది. నిర్భయ్ కి తన పంచప్రాణాలు దేహాన్ని వదిలి పోతున్నట్లనిపించింది. ఆ నిర్మల కాసారం మలినం కాబోతోందా? అతని హృదయం వేదనాభరితమైంది. యువ షట్కం చందనగంధికి కలిగిన ఈ దురవస్థకు తమని తామే నిందించుకోసాగారు.

చందనగంధి పరిస్థితి వర్ణనాతీతం. ఆ సభాస్థలిని వదిలి పారిపోవాలని నరనరంలోనూ తీవ్రంగా ఉంది, కానీ తనను వెంటాడుతున్న మగధమహామంత్రి చూపులు ఆమెను కదలనీయకుండా చేసాయి. ముందురోజు "సంఘనిర్ణయం కోసం మానప్రాణాలర్పిస్తాం" అన్న తన మాటలోని నిజాయితీని అవి పరీక్షిస్తున్నట్లుగా ఉన్నాయి. చందనగంధి కర్తవ్య విమూఢురాలైంది. ఆమెకు జలతారు వస్త్రాలు, ఆభూషణాలు ఇవ్వబడ్డాయి. నగర శివార్లలో ఆమెకు కేటాయించిన భవనంలోకి చందనగంధి దాసదాసీజనంతో సహా ప్రవేశపెట్టబడింది.

నిర్భయ్ మగధ మంత్రితో "మహామాత్యా! అతిథులుగా వచ్చి, కుటిలనీతిని ఉపయోగించి మా సమాజాన్ని బలహీనం చెయ్యడంలో మీరు సఫలులైనారు" అన్నాడు ఆక్రోశంతో.

"సంఘనిర్ణయం శిరోధార్యం కదా! ఏమీ చేయలేరు." మగధ మహామంత్రి విజయహాసంతో వెడలిపోయాడు.

ఆ తరువాత చందనగంధి యౌవనాన్ని వజ్జి సంఘ ప్రముఖులు అరగదీయసాగారు. వేశ్యగా మారిన ఆమె సౌందర్య గంధాన్ని ఎందరో ఆఘ్రాణించారు.

ప్రకృతి నియమానుసారం చందనగంధి గర్భవతి అయింది. ఆమె తన ఇష్టసఖి నీలను, ఆమె తల్లిని తప్ప మిగతా దాసదాసీ జనాన్ని మానిపించేసింది. తనను తాను ఆ ఇంట్లో బందీ చేసుకుంది. ఒకదాని తరువాత ఒకటిగా తనమీద పడుతున్న విపత్తులను ఎలా ఎదుర్కోవాలో తెలియని నిస్సహాయురాలైంది. నడి సంద్రంలో తుఫానుకి గురిఅయిన నావలా ఉన్న తన జీవితమంటే విరక్తి కలగ సాగింది. ఆసమయంలోనే సరిహద్దు ప్రాంతాల వారితో వజ్జి సంఘానికి యుద్ధం వచ్చింది. ఆ యుద్ధంలో సేనాని రణసింహుడు మరణించాక నిర్భయ్ ముఖ్య సేనానిగా ఎంపిక కాబడ్డాడు. అతనికి యువ రాకుమార షట్కం కుడిభుజంగా నిలిచింది. ఈ యుద్ధవార్తలన్నీ చందనగంధి నీల ద్వారా వినేది. బిడ్డను ప్రసవించాక కుమారునకు తండ్రి ఎవరో చెప్పలేని దురవస్థకు, సమాజంలో తల్లిగా వాడికి సముచిత స్థానమివ్వలేని తన అసహాయతకు కుమిలిపోయింది. ఆ బాధలోనే ఆమె ఒక తీవ్రమైన నిర్ణయాన్ని తీసుకుని అమలు చేసింది.

ఆరోజే వజ్జి సేన యుద్ధంలో విజయం సాధించింది. సేనానాయకుడు నిర్భయ్ పేరున జయజయధ్వానాలు ప్రతిధ్వనిస్తున్నాయి. సేనకు వెనక సింధు దేశపు ఉత్తమాశ్వంపై వస్తున్న నిర్భయ్ రహదారి పక్కనే ఉన్న ఉపవనపు మార్గం లోంచి రాసాగాడు. అనుకోకుండా అతనికి దారిలో ఊహించనిది కనిపించింది. ఎదురుగా అగ్ని గుండం ఉన్నట్లు కళ్ళెం పట్టి గుర్రాన్ని ఆపాడు.

★★★★

కాలగతిలో ఆరుసంవత్సరాలు వెళ్ళిపోయాయి. ఆతరువాత ఈ ఆరేళ్ళలో చందనగంధిని పురవీధులలో ఎవరూ చూడలేదు. ఆమె ఒంటరిగా, నీల సహాయంతో ఏకాంతవాసం చేస్తోంది.

నిర్భయ్ తన ఉపవనంలో వీణావాదనలో నిమగ్నమై ఉన్నాడు. ఈలోగా రాజభవనము నుంచి భేరీనాదాలు అతని చెవుల పడ్డాయి. సరిహద్దు యుద్ధం తరువాత అతను ఏటువంటి రాజకీయ పదవులనూ అలంకరించలేదు, సరికదా రాజ్యపాలనలో భాగమూ తీసుకోలేదు. అతను చాలా ఉదాసీనంగా ఉండిపోయాడు. ఆ యుద్ధంలో అతనికి బాసటగా నిలిచిన ఆ కులీన వర్గపు కుమారషట్కం సంఘాన్ని నడపడంలో తమవంతు పాత్ర పోషిస్తున్నప్పటికీ, నిర్భయ్ స్నేహాన్ని విడనాడలేదు. వారు కూడా అవివాహితులుగానే

ఉన్నారు. ఎటువంటి స్త్రీ సంపర్కమూ లేకుండానే వారి గోష్ఠి గొప్పగా సాగేది. అందరి బలమైన దేహాలు ఆ యుద్ధం ఇచ్చిన బహుమతులకు చిహ్నాలుగా మిగిలిఉన్నాయి.

ఆరోజు నిర్భయ్ వద్దకు వారు వచ్చారు. వసంత్ "ఈ రోజు మీరు మీ తటస్థ స్వభావానికి స్వస్తి చెప్పి వైశాలి రాజ్యసభకు వచ్చి తీరాలి. ఎందుకంటే ఈరోజు దారిలో నేను చందన గంధిని రథంపై వస్తుండగా చూసాను. ఆరు సంవత్సరాల తరువాత ఆమె సౌందర్యపు పోటీలో పాల్గొనడానికి వస్తోందని విన్నాను. కానీ చాలామంది గృహిణులు ఆమెను చూసి కోపంతో మండిపడ్డారు. "ఈ దౌర్భాగ్యురాలి కారణంగా వైశాలిలో చాలామంది స్త్రీలు తమ పుత్రులకు, భర్తలకు. అన్నదమ్ములకు దూరమయారు. ఓ రాక్షసి చందనా! నీవల్లనే ఈ రాజ్యంలో వేశ్యా వృత్తి ఆరంభమైంది. ఆ ఆరుగురు పాలకవర్గ కుమారులు ఈ రాజ్యానికి అంటించిన తొలి నిప్పు కణికవు నువ్వే! నీ మొహం చూడడమే మహాపాపం! నువ్వు నాశనమయిపో!" అంటూ చాలా రకాలుగా ఆమెను నిందించి ఛీత్కరించారు..

"చందనగంధి ప్రతి స్పందన ఏమిటి?" ఎంతో సంయమనం నిండిన స్వరంతో నిర్భయ్ అడిగాడు.

"ఆమె రథముపైనే కూలబడి చాలా ఏడ్చింది. తరువాత వారికి నమస్కరించి "అమ్మలారా! నన్ను క్షమించండి. అలాగే నన్ను నమ్మండి.ఈ సమస్యను నేనే పరిష్కరిస్తాను." అని రథముపై ముందుకు సాగిపోయింది." ముగించాడు వసంత్.

"మనకు తెలియకుండానే మనవల్ల రాజ్యానికి మహాపకారం జరిగిపోయింది. ఏడు సంవత్సరాలుగా రగులుతున్న ఈ అగ్నిని మనము ఆర్పలేమా? ఈ సామాజిక దహనకాండకు మనం ప్రేక్షకులుగానే మిగలిపోవాలా?" " ఆవేదన, ఆవేశం, ఆగ్రహం నిండిన స్వరంతో అడిగాడు ప్రశాంత్.

"అంతేకాదు, సరైన నిర్ణయమో, పరిష్కారమో ఈ రోజు తేలాల్సిందే! నిర్భయ్! నువ్వు కూడా రావాలి." ప్రమోద్ చెప్పాడు.

అసలు చందన గంధి చెప్పబోయే పరిష్కారమేమిటో? అని మనసులో అనుకుంటూ "అదే నాకు కూడా కావాలి. ఇలాంటి రోజు కోసమే నేనూ ఎదురు చూస్తున్నాను. నేను తప్పకుండా వస్తాను." నిర్భయ్ చెప్పాడు.

★★★★

ఆరోజు సభ కిక్కిరిసి ఉంది. సభా ప్రాంగణమంతా జనంతో నిండిపోయిఉంది. స్త్రీల అందాల పోటీయే దానికి కారణం. ఆరుగురు వేశ్యలు వరుసగా తమ స్థానాల్లో కూచున్నారు. ఇంతలో సభాస్థలిలో చందనగంధి ప్రవేశమే ఆకాశంలో మెరుపులాగ మెరిసింది. ఏడేళ్ళ తరువాత కూడా చందన గంధి సౌందర్యాధిదేవత లాగే ఉంది. ఆమెకు పోటీలో ఎదురు నిలిచే వారుండరని అందరికీ అర్థమయింది. ఈలోగా నిర్భయ్ అతని ఆరుగురు స్నేహితులు కలిసి సభాస్థలికి వచ్చి ఉచిత ఆసనాలను అలంకరించారు. నిర్భయ్ ఒళ్ళో ఒక అందమైన బాలుడున్నాడు. నిర్భయ్ ని చూసి చందనగంధి హృదయము కంపించింది. అయినా మనసును చిక్కబెట్టుకుని అందరితో కలిసి స్వాగతించింది.

సభ ప్రారంభంలోనే చందనగంధి లేచి "గౌరవనీయులైన సంఘసభ్యులు అనుమతిస్తే, నా ప్రార్థనను వినిపించాలనుకుంటున్నాను." అంది చేతులు మోడ్చి ఎంతో వినయంగా. ఆక్షణం చందనగంధి మాటలను వినాలన్నట్లు సభను నిశ్శబ్దమే పాలించింది.

అదే అనుమతిగా ఆమె "ఈరోజు ఈ వజ్జి సంఘమంతా కలిసి ఒక ప్రతిజ్ఞ తీసుకోవాలి. ఇకపై ఈ రాజ్యంలో వేశ్యా సంప్రదాయం ఉండకూడదు." అంది దృఢంగా.

"ఇకనేం? నువ్వు నీ స్థానంలో చిరస్థాయిగా ఉండి మా కుటుంబాలను నాశనం చేసెయ్!"

మహిళలందరూ పెద్దగా చందనగంధిపై అరిచారు.

"మీరంతా ధైర్యం వహించండి. ఒక పరదేశి రాజకీయానికి, మరొక కాముకుని కోరికకు, వజ్జి సంఘపు పురుషుల సమర్ధనకు పుట్టిన ఈ కుసంప్రదాయాన్ని ఆరోజే మహిళలంతా కలిసి వ్యతిరేకిస్తే, మేము ఏడుగురం ఈరోజు ఇలా దోషులుగా నిలబడేవారం కాము. అయినా

నాతోనే ఈ దుష్టాచారం ఆరంభమైంది కాబట్టి నన్ను దేశం నుండి బహిష్కరించినా, కారాగారంలో బంధించినా,లేదా ప్రాణదండన వహించినా నేను శిరసావహిస్తాను. కానీ వజ్జి సంఘం ఇటీవల పెంచి పోషించిన ఈ భయంకర సంప్రదాయం మాత్రంమళ్ళీ పునరావృత్తం కాకూడదు. ఇది సమూలంగా నశించిపోవాలి.." చందనగంధి మాటలలో ఆవేదన, ఆక్రోశం కలగలిసిపోయాయి. మహిళల, పురుషుల, పాలకవర్గ సభ్యుల, దోషాన్ని అద్దంలో చూపింది చందనగంధి. వారంతా లజ్జితులయారు.

"సాటి మహిళల ఉసురు పోసుకుంటున్నామని తెలిసినా, సమాజంపై మచ్చలుగా మిగులుతామని తెలిసినా సౌందర్యపు పోటీలో ఈ సంఘ నిర్ణయానికి తల ఒగ్గి చరిత్రహీనులుగా, శీలహీనులుగా మిగిలిపోయిన మాకు ఎటువంటి దండనైనా ఉచితమే." చందనగంధి ప్రతీమాటలోను తొణికిసలాడుతున్న నగ్నసత్యం సంఘాన్ని వణికించింది.

రాకుమార షట్కం లోంచి అనిరుద్ధ్ లేచి "ఈ చందన గంధి మొదటిసారి కేవలం అనంగపూజ కోసమై మా ప్రార్థన మన్నించి వచ్చినది. కొందరి స్వార్థపరుల రాజకీయానికి, సంఘనిర్ణయానికి బలి అయిపోయింది. తరువాత వీరంతా కూడా ఈ సంఘ నిర్ణయాలకు తమ సర్వస్వాన్ని అర్పించిన వారు, ఆహుతయిన వారే. వీరికి దండన విధించడం ఎంతవరకు న్యాయం?" అతని ప్రశ్నకు సభ ఆలోచనలో పడింది. .

కాసేపు తరువాత "అది అన్యాయం! అలా జరగకూడదు." అన్న అరుపులు సభలోంచి వినపడ్డాయి.

"మరి వీరి భవిష్యత్తును ఎలా నిర్ణయించాలి? వీరి శీలము, కన్యాత్వము, సదాచారము అన్నీ ముక్కలయిపోయాయి కదా" గంభీర స్వరంతో రాజు సంఘాన్ని ప్రశ్నించాడు. ఆరుగురు రాచపుత్రులు తమలో తాము మాట్లాడుకున్నారు.

"సంఘము అనుమతిస్తే నేను ఒక విషయం ప్రస్తావిస్తాను. సరిహద్దు యుద్ధంలో శరీరాంగాలు కోల్పోయిన మా ఆరుగురమూ, ఈ శీలం కోల్పోయిన ఈ ఆరుగురు వేశ్యలను భార్యలుగా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాము." ప్రశాంత్ ప్రసన్నంగా చెప్పాడు.

సంఘమంతా ఈ నిర్ణయానికి ఆశ్చర్యపోయింది. నిర్భయ్ కుమార్ తన స్నేహితుల సంస్కారయుత నిర్ణయంపై ఎంతో గర్వించాడు. ఈ వేశ్యా సంప్రదాయం నశిస్తున్నందుకు చందనగంధి ఆనందానికి హద్దు లేకపోయింది. రాజు, యువరాజు, మంత్రి, సేనాని ఈవిషయమై చర్చించారు. మంత్రి మళ్ళీ రెట్టించి అడిగిన మీదట ఆరుగురు కుమారులు లేచి తమ అంగీకారాన్ని తెలిపారు.

తమ వంటి వారి జీవితాలలో వెలుగునింపేందుకు నిలిచిన ఆ యువకుల వద్దకి ఆరుగురు వేశ్యలు సంభ్రమంతో వెళ్ళి నించున్నారు.

'చందనగంధి' 'చందనగంధి' అన్న అరుపులు జనంలోంచి వెలువడ్డాయి. తన పట్ల సంఘనిర్ణయం ఎలా ఉంటుందో తెలియక చందనగంధి ప్రతిమ లాగ, జీవరహితంగా నిలబడిపోయింది.

హఠాత్తుగా నిర్భయ్ లేచి తన ఒడిలో ఉన్న బాలుని సంఘానికి చూపుతూ, "నాకు భార్య అవసరంలేదు. కానీ ఈ బిడ్డ తల్లిని నేను ఆరేళ్ళనుంచి వెదుకుతున్నాను. ఇతనిని తల్లి



దయలేకో, లేక తన సౌందర్య రక్షణ కొరకో పసిగుడ్డుగానే వదిలివేసింది. కానీ వీడి భుజం మీద వైశాలి రాజముద్రను ఆ వైద్యుడు ఆసరికే వేసాడు. ఆ తల్లి ఈ సమూహంలో ఉంటే వీడిని తీసుకోవచ్చు." అన్నాడు.

చందనగంధి పిచ్చిదానిలా నిర్భయ్ దగ్గరకు వెళ్ళి ఆ బిడ్డను చూసింది. వెంటనే ఆమె నిర్భయ్ పాదాల మీద కన్నీళ్ళతో వాలి "ప్రభూ! వీడు నా వాడు. సౌందర్య రక్షణ కోసం కాదు స్వామీ! వీడికి తండ్రిని చూపలేని నిస్సహాయస్థితిలో వదిలివేసాను. ముందుగా మీరు వాడికి తండ్రయారు. నన్ను కూడా మీదానిగా చేసుకుని నన్ను ధన్యను చేస్తారా?" అంది.

నిర్భయ్ ఆప్యాయంగా చందనగంధి చేయందుకుని లేపాడు. ఒక్కసారిగా రాజసభ అంతా జయజయధ్వానాలతో నిండిపోయింది.

ప్రకృతి తను చేసిన గాయాన్ని తనే మాన్పినట్లుగా, కొందరి పురుషుల స్వార్థానికి ఆహుతయిన వారి జీవితాలను అదే జాతిలోని మరికొందరి సంస్కారం చక్కబరచింది. ఎంత ముదావహం!

★★★★

శుభం

# పంచవటి

## ఓ పదిళ్ళ లోగిలి

కామెడి సీరియల్



అలేఖ్య

గుడి లోపల పెద్దగా భక్తులెవరూ లేరు. నేరుగా వర్లుగారు గర్భ గుడి దగ్గరకు వెళ్ళారు ., బహుశా పూజారి భోజనానికి వెళ్ళాడేమోగర్భగుడి తలుపులు దగ్గరకు వేసి ఉన్నాయి ఓనిమిషం ఎవ్వరూ చూడట్లేదని నిర్ధారించుకుని తనతో తెచ్చిన స్వామీజీ తాలుకు కాగితాలన్నిటిని గర్భ గుడి ఎదురుగా వున్న హుండీ లో వేసారు

.

వెనకాలే ఆయాస పడుతూ వచ్చిన తాతారావు, ఆ పరిణామాన్ని చూసి ఆశ్చర్య పోతూ 'ఏమిటా ) నువ్వ చేస్తోంది.. " అన్నాడు తాతారావు

" గట్టిగొ అరవకు.... చెప్తాను పద" అంటూ ఓ సారి చుట్టా చూసారు వారలు గారు, తమని ఎవ్వరూ గమనించటం లేదని నిర్ధారించుకుని ,తాతారావు చెయ్యి పట్టుకుని "వెళ్దాం పద అంటూ గుడి లోనుంచి బయటకు నడిచారు

# పంచవటి ఓ పదిళ్ళ లోగిలి

**జరిగిన కథ**
ఉమా ,శంకరం భార్య భర్తలు. ఉమా ఉళ్ళోని పోలీస్ స్టేషన్ లొ ఎస్ ఐ గా పనిచేస్తూ ఉంటె , శంకరం చెట్టు కింద ప్లీడరు గా పేరుపడి వాదించటానికి కేసులు లేక ఇంటిదగ్గరే ఉండి ఇంటిపనులు చుసు కుంటూ ఉంటాడు . కోబ్రా పేరుతో కోసి నది పరివాహక ప్రాంతంలో కట్టిన ఇళ్ళను కులగాడతారు మాహనగర్ మునిసిపాలిటి వాళ్ళు .పేదవాళ్ళు శంకరం దగ్గరకొస్తారు కేసు వాదించమని . సి .ఎం స్వామిజి గురించి ఆరా తీస్తాడు .స్వామిజి సిటిలో పెద్ద సభకు ప్లాన్ చేస్తాడు .స్వామిజి హోమం జరిగే ప్రదేశం లోకి దొంగ చాటుగా ప్రవేశిస్తారు వర్లు ,తాతారావు లు .శంకరం కుడా వెనక నుంచి ప్రవేశిస్తాడు .
**ఇక చదవండి**

బేరాలు లేవేమో ఇందాక వర్లుగారిని గుడికి తీసుకొచ్చిన ఆటో అతను అక్కడే నిలబడి వున్నాడు వారలు గారిని చూడగానే, "రండి సార్ వెళ్దాం' అంటూ ఆటో తీయబోయండు

వారలు గారు "ఆటో ఎక్కు దామా లేదా అని ఆలోచించే లోపే , తాతరావు ఆటో ఎక్కేసి "రారా తొందరగా ' అంటూ వర్లు గారిని పిలుస్తు న్నాడు

సరే ఎద్దైతే అది అవుతుందని వారలు గారు కూడా ఆటో ఎక్కి, 'పోలీస్టేషనుకు పోనీ అన్నారు"

" ఇప్పుడు స్టేషను కెందుకు రా " అంటు భయంతో గొణగ సాగాడు తతాతారావు

'నీకు తెలియదులే.. స్టేషనుకి పోని అన్నారు"వర్లు గారు వీళ్ళ వాలకం అర్థంకాక "ఏం సార్ గుళ్ళో ఏమన్నా గడ బిద జరిగిందా ." ఆటో అతను అడిగాడు

'అలాంటి దేమిలేదు.. స్టేషన్లొ చిన్న పని వుంది. "అన్నారు వర్లు గారు , తడుముకోకుండా
ఆటో నేరుగా పోలీస్పేషన్ వైపుకు పరుగు తీసింది

★★

ఆశ్రమంలో గొడవ జరుగుతుందని తెలిసి బయట కాపలాగా వున్న పోలీసులు లోపలికి వెళ్ళ టానికి ప్రయత్నించారు. బయట వేచివున్న ఉమ, అవకాశం దొరికిందని, మిగిలిన వాళ్ళతో తనూ లోపలికి వెళ్ళటానికి ప్రయత్నించింది .

లోపల అంత గందర గోళంగా వుంది. ఎవరు, ఎటు వెళుతున్నారు అర్థం కాకుండా , ఎందుకు వెళుతున్నారో కూడా అర్థం కాకుండా పరిగెడుతున్నారు .

వాళ్ళందరిని చూసిన పోలీసులకు ఏమి

చెయ్యిలోపాలు పోలేదు

ఉత్తప్పుడైతే ఏ లాటీ ఛార్జ్ చేసి పరిస్థితిని చక్క దిద్దే వాళ్ళు. కాని అక్కడున్న వాళ్లందరూ భక్తులు కావటంతో ఏమి చెయ్యిలో పాలు పోక, వాళ్ళను చూస్తూ మిన్నకుండి పోయారు

ఉమ మాత్రం మెల్లగా ఎవ్వరూ చూడకుండా స్వామిజి వున్న మందిర దగ్గరకు వెళ్ళింది. స్వామిజీ వున్న మందిరం తలుపులు వేసి వున్నాయి.. బయట ఓ నలుగురు స్వామిజీ అనునాయులు కాపలా కాస్తున్నారు.

ఉమను చూడగానే, "మేడమ్ ఇటురా కూడదు "అన్నారు వాళ్ళలో ఒకడు

"బయట గోడవగా వుంది. ఏం జరుగుతుందో తెలుసుకుందామని వచ్చాను" అంటూ సమాధానం ఇచ్చింది.

వాళ్ళుతిరిగి సమాధానం చెప్పేలోపు స్వామిజీ పి. ఏ శరత్ బయటకు వచ్చి "అసలు మిమ్మల్ని ఎవరు లోపలికి రమ్మన్నారు. అంటూ గట్టిగా అరవసాగాడు,

ఆ అరువులు విన్న డి. ఎస్ .పి అటుగా రావటం చూసిన ఉమ మారు మాట్లాడకుండా అక్కడనుంచి తప్పకుంది

డిఎస్పి, శరత్ దగ్గరకు వచ్చి "ఏం జరిగింది సార్" అంటు అడిగాడు.

"మీ పోలీసులను లోపలికి ఎవరు రమ్మన్నారు". అంటూ ప్రశ్నించాడు.

""లోపల అంత గందరగోళంగావుంటే, ఏమైందా " అంటూ నసిగాడు డి.ఎస్.పై

" ఏం జరగలేదు, ఎవరో భక్తుడి కాలికి పాము తగిలిందట, అది పామో లేక తాడో కూడా తెలియదు, భయంతో పరిగెడుతున్నారు. కొద్ది దెప్[ఉ ఆగితే అంతా సద్దు మనుగుతుంది మీరికి వెల్లవచ్చు అన్నాడు " శరత్

అతను చెపుతోంది అబద్దం అని డిఎస్ పి కి తెలుసు కాని ఏమి చెయ్య లేని పరిస్థితి.ఇంకోసారి ఇంకోసారి అయితే నాలుగు తగిలించి స్టేషన్ కి లాక్కు పోయేవాడు

డి ఎస్ పి మాధానం కోసం

చూడకుండా లోపలికి
వెళ్ళిపోయాడు.
శరత్

ఇక అక్కడ ఉంది
ప్రయోజనం లేదని ఉమా
పోలిస్టేషన్ దారి పట్టింది
★★

ఉమా పోలిస్టేషన్ లోకి
వెళ్ళగానే ఎదురుగా
వర్లుగారు ,తాతారావుగారు
కనపడ్డారు

" మావయ్య ..మీరేమిటి
ఇలా ..''అంటూ
ఆశ్చర్యంగా అడిగింది ఉమా

"ఒక్క నిమిషం బయట
మాట్లాడుకుందాం ..."
అంటూ వారలు గారు
ఉమను బయటకు
తీసుకువెళ్ళారు

(ఇంకా ఉంది )

# “చేత బడి “



ఈ శ్రీనివాస రెడ్డి

నా లోపలకు నేను తొంగి చూస్తే
నాకే భయం భయంగా అనిపిస్తోంది
లోపలేదో నరబలి జరిగిన
ఆనవాళ్ళు అగుపిస్తున్నాయి

కోరికల రాబందులు
మనసును ముక్కలు ముక్కలుగా
కొరికి పీక్కుతింటున్నాయి
గుండె గోడల నిండా కారుతున్న
రక్తపు ధారలను
మెదడు పొరలు పట్టుకుని వేలాడుతున్న
జ్ఞాపకాల గబ్బిలాలు చప్పరిస్తున్నాయి

కటిక చీకట్లో కమురువాసనల మధ్య
ఏవో మాటలు వినపడుతున్నాయి
రూపం లేని ఓ ప్రేతాత్మ ఎదురుగా కుర్చుని
నా అంతరాత్మ ఏవో మంత్రాలు వల్లె వేస్తోంది
అప్పటికి కాని అర్థం కాలేదు
నాకు నేనే చేతబడి చేసుకుంటూ
నన్ను నేనే అవహిస్తున్నానని

కోరికలు తీరని ప్రేతాత్మ నేనే
దాన్ని అదుపుచేసే అంతరాత్మ నేనే
అని అర్థం అయ్యే సరికి
నాలోని ఆత్మా
పరమాత్మా లో కలసిపోయింది

# " సిగ్గుచేటు అవ్వ సిగ్గుచేటు "

నల్లబాటి రాఘవేంద్రరావు

**బహుమతి పొందిన కవిత**

సిగ్గుచేటు అవ్వ సిగ్గుచేటు
చిన్నారిబాలికల బ్రతుకుల
కిప్పుడు చెడు గ్రహపాటు

బుల్లిపిల్లలపై లైంగిక వేధింపు
తల్లి కడుపున పుట్టారో లేదో
ఈ నా రొచ్చుకంపు పిచ్చోళ్ళు

వింటుంటేనే శరీరం  గగుర్పాటు
చదివితేనే మనసు కలవరపెట్టు
నరజాతి వాళ్లు అవునో కాదు
ఈనా అనాగరిక ఆంబోతులు

బుల్లిపిల్లల్ని కిడ్నాప్ చేసి అత్యాచారం
హత మార్చడం అలవాటై  పోయింది..

ఇదో నిన్నటి ఫ్యాషనైపోయింది
ఇది నిత్య కామెడీషోగా మారింది

మొదటిపేజీ వార్త చివరి పేజీ అయ్యింది
ఇదో నవ్వులాట ప్రహసనంగా మిగిలింది
పాత చింతకాయ పచ్చడి కథ అయింది

ఏమిటో బుసకొట్టే ఈ కామరక్తం
ఎలా మరిచారో గాంధీనామం?

గబ్బు కంపు అనాకారి ఆలోచనపరులు
చీడపట్టిన  చిత్తకార్తి చిడుంపొక్కుగాళ్లు
పిచ్చెక్కిన దుష్టకాసురులు  దుర్మార్గులు
తల్లినిచెల్లిని  ఆక్రమించే గజ్జికాళ్లుగాళ్లు

దగుల్బాజీలు సోంబేరులు కాముకులు
బ్రష్టులు మూర్ఖులు ముండకాసురులు

ఈ నా కొడుకులను కొరడాలతో కాకుండా
కొరడాపిడితో కాళ్లు ఇరగొట్టి చితక్కొట్టాలి

ఈనా కిరాతకులను తుపాకీ గుళ్ళతో కాక
తుపాకీ మడమలతో  చావకొట్టి చంపాలి

ఈ దుష్ట పిరికి నాయాళ్లను ముక్కలుగా
కోసి
కారంలో దొర్లించి కాకులకుగద్దెలకు
వెయ్యాలి

ఈ  ఏబ్రాసి మురికిగొట్టంగాళ్లను
ఉరి తీసి కసిగా చంపకుండా
మొండెం వరకు  కప్పెట్టాలి
భూమి ఉప్పుపొరలలో

వీళ్ళ కామ కోరికలకు బలైపోతున్న
నా చిట్టిపొట్టి బుల్లి చిన్నారులు
ఏమిటో బుసకొట్టే ఈ కామరక్తం
ఎలా మరిచిపోయారో గాంధీతత్వం!



# అవగాహన





## వెల్లుల్లి తింటే ఆడవాళ్లను ఆకర్షించే వాసన వస్తుందా?

పాఠకులు తమ సందేహాలు ,ప్రశ్నలును sumathi.doctorsalahalu@gmail.com కు పంపవచ్చు.

డా.. మణికంఠ రెడ్డి

వెల్లుల్లి, మద్యం, మాంసం. ఈ ఆహారాలను తినడం వల్ల మీ శరీరం నుంచి వెలువడే వాసన మారిపోతుందని మీకు తెలుసా?

వేలిముద్రలాగే మనందరికి భిన్నమైన శరీరపు వాసన ఉంటుంది. దీనినే శరీర గంధం అని కూడా అంటారు. మన స్వభావం నుంచి కలివిడితనం, ఉత్సాహం, ఆరోగ్యం ఇలా అనేక అంశాలు మన శరీరం నుంచి వెలువడే వాసనపై ప్రభావాన్ని చూపుతాయి.

ఆడ, మగ, చిన్నా పెద్దా, ఆధిపత్య స్వభావం, సున్నిత మనస్తత్వం, ఆరోగ్యవంతులు, అనారోగ్యపీడితులు, సంతోషంతో ఉండేవారు, దు:ఖ బాధితులు... ఇలా ఎవరికైనా ఇవే అంశాలు వర్తిస్తాయి.

ఇందులో చాలా అంశాలు మన నియంత్రణలో ఉండకపోవచ్చు. కానీ మన శరీరం నుంచి వెలువడే వాసనపై ప్రధానంగా ప్రభావం చూపే అంశాల్లో మనం తీసుకునే ఆహారం ఒకటి.

ఒక పరిశోధన ప్రకారం ఇది మొత్తంగా శరీర వాసనపైనే కాకుండా ఇతరులు మనల్ని ఎలా చూస్తారో, మనం ఇతరులకు ఎంత ఆకర్షణీయంగా కనిపిస్తామో కూడా మనం తినే ఆహారం నిర్ణయిస్తుంది. మొదటిది – పేగులు: ఒక బయాలాజికల్ స్థాయిలో చూసుకుంటే, మనం తినే ఆహారం శరీర వాసనను ప్రధానంగా రెండు మార్గాల్లో ప్రభావితం చేస్తుందని న్యూయార్క్ స్టేట్ యూనివర్సిటీ (బింగ్హామ్టన్)లో హెల్త్ అండ్ వెల్‌నెస్ అధ్యయనాల అసిస్టెంట్ ప్రొఫెసర్ లీనా బెగ్డాచె చెబుతున్నారు – ఒకటి పేగులు, రెండోది చర్మం.

మన శరీరంలో ఆహారం జీర్ణమవుతున్నప్పుడు, పేగుల్లోని బ్యాక్టీరియా ఆ ఆహారాన్ని మెటాబలైజ్ చేస్తుంది. ఆహారంలోని రసాయనాలు బ్యాక్టీరియా మధ్య జరిగే ఈ చర్యల్లో కొన్ని వాయువులు విడుదల అవుతాయి.

ఇవి సులభంగా గాలిలో కలిసే వాసన గల అణువులు. ఇవి శరీరం బయటకు అదే మార్గంలో వస్తాయి – అంటే నోటిమార్గం ద్వారా. దీంతో నోటి దుర్వాసన ఏర్పడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా మూడోవంతు జనాభాకు ఈ సమస్య ఉంటుందని అంచనాలు చెబుతున్నాయి. అయితే దీనికి జీర్ణక్రియ కాకుండా ఇతర కారణాలూ ఉన్నాయి. రెండోది–చర్మం. జీర్ణక్రియ తర్వాత ఆహారంలోని రసాయనాలు, రక్తప్రసరణ ద్వారా శరీరంలోని వివిధ కణజాలాలకు చేరుతాయి.

వాటిలో కొన్ని చర్మం ద్వారా చెమట రూపంలో బయటకు వస్తాయి. అక్కడ చర్మంపై ఉండే బ్యాక్టీరియాతో కలిసి ప్రత్యేక వాసనను సృష్టిస్తాయి. చెమట స్వతహాగా వాసనలేనిది. చెమటలో పెరిగే బ్యాక్టీరియానే దానికి వాసనను ఇస్తుంది.

వివిధ రకాల ఆహారాల్లో భిన్నమైన రసాయన పదార్థాలు ఉంటాయి. ఇవి వేర్వేరు దశల్లో పని చేసి వాసన తీవ్రతను మార్చుతాయి. అయితే బలమైన దుర్వాసనకు కారణమయ్యే ఆహారాల్లో సాధారణంగా కనిపించే రసాయనం సల్ఫర్. చిత్రం ఏంటంటే ఇలాంటి వాసన గల ఆహారాలు కొన్నిసార్లు మనల్ని మరింత ఆకర్షణీయంగా చూపించేంత ప్రభావాన్ని కూడా కలిగిస్తాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. బ్రోకోలీ, క్యాబేజీ, బ్రస్సెల్స్ స్ప్రౌట్స్, కాలీఫ్లవర్ వంటి కూరగాయలు ఆరోగ్యానికి మేలు చేసినా వీటిలో సల్ఫర్‌కు సంబంధించిన రసాయనాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి పాడైపోయిన గుడ్ల వాసనను గుర్తు చేసేలా ఉండవచ్చు. ఇవి రక్తప్రసరణ ద్వారా చర్మానికి చేరి బ్యాక్టీరియాతో కలిసినప్పుడు చెమటకు ఘాటైన వాసనను ఇవచ్చు

వెల్లుల్లి, ఉల్లిపాయలు వంటి అలియం క్యాటగిరీకి చెందిన ఆహారాలు కూడా ఇలాంటి ప్రభావం చూపుతాయి. ఇవి జీర్ణక్రియలో విచ్ఛిన్నమైనప్పుడు డైలిల్ డైసల్ఫైడ్, అలిల్ మెథైల్ సల్ఫైడ్ వంటి వాసన గల కెమికల్ కాంపౌండ్లుగా మారతాయి. ఇవి తిన్న వెంటనే, లేదా గరిష్ఠంగా 30 నిమిషాల తర్వాత శరీరం నుంచి వాసన రూపంలో బయటకు వెలువడతాయి.

అయితే వెల్లుల్లి విషయంలో ఆసక్తికరమైన ఫలితాలు కనిపించాయి. ఒక ప్రయోగంలో 42 మంది పురుషులు 12 గంటల పాటు చెమట ప్యాడ్లు ధరించారు. కొందరు తక్కువ వెల్లుల్లి, కొందరు ఎక్కువ వెల్లుల్లి, మరికొందరు వెల్లుల్లి సప్లిమెంట్లు తీసుకున్నారు.

ఆ చెమట వాసనకు 82 మంది మహిళలు రేటింగ్ ఇచ్చారు. ఎక్కువ వెల్లుల్లి తీసుకున్న పురుషుల చెమటను మహిళలు ఎక్కువ ఆకర్షణీయంగా భావించారు. వెల్లుల్లి ఆరోగ్యాన్ని మెరుగుపరచే యాంటీఆక్సిడెంట్, యాంటీమైక్రోబియల్ గుణాలు కలిగి ఉండటంతో ఈ ప్రభావం ఉండొచ్చని శాస్త్రవేత్త యాన్ హవ్లిచెక్ భావిస్తున్నారు. చెక్ రిపబ్లిక్‌లోని చార్లెస్ యూనివర్సిటీలో హ్యూమన్ ఎథాలజీ అండ్ కెమికల్ కమ్యూనికేషన్ పై హవ్లిచెక్ అధ్యయనం చేస్తున్నారు.★★

## సాధారణ ప్రచురణకు ఎన్నికైన కవిత

# పచ్చబొట్లు

అమ్మ ఒడిని జారి పాకేటి పసికందు
మోరయెత్తి చంక చేర మారాము చేసిన
మనోహర దృశ్యమింకా మనసు దాటలేదు

గరుకు వెంట్రుక గుచ్చుకుంటుందని
మెత్తని దిండును ఎదపై వేసుకుని ఆడించే వేళ
కదలిన కాలి మువ్వల సవ్వడులు మది వీడనే లేదు

తన మాట కాదని తల్లి మాట విన్నానని
బుంగ మూతి పెట్టి పిలిచినా పలుకక అలిగితే
చెంపలేసుకునే వరకు చేరువకాని స్మృతిని
మరువనేలేదు

కాలమెంత వేగమాయెనో తెలియలేదు గాని
నా చేతులు మోసిన పసితనం చీరకట్టి
చేయెత్తు ఎదిగి పెళ్ళికూతురై ఎదురొచ్చింది

కాలాన్ని తిట్టనూలేక, కంటిపాప దూరాన్ని
భరించనూ లేక
ఉబికి వస్తున్న కన్నీటి సంద్రాన్ని రెప్పమాటున
బంధించాను
పాదాల వాలిన జంటను దీవించి హత్తుకున్నాను

"నా కంటిపాపను నీ ఇంటిదీపంగా
పంపుతున్నాను
ప్రేమ చమురు పోసి అఖండజ్యోతిగా వెలిగించుకో..
ఏడు వారాల నగలతో వేడుక చేయనక్కర లేదు
ఏడుపు కనిపించని మోమును వరమివ్వు చాలు"
మనసులోని భావాలు పెదవుల జాలువారాయి

నేనిపుడు పంటను తరలించి దిగాలుపడిన
రైతునయ్యాను
ఎగిరిపోయిన పక్షిని చూసి దిగులుపడ్డ
గూడునయ్యాను

గతాలు స్వప్నాలు కావు..కాలం చెక్కిన శిల్పాలు
కన్నబిడ్డలు వదిలిన జ్ఞాపకాలు
పిడికెడు గుండె మీద వేయబడిన పచ్చబొట్లు.


శింగిరాజు శ్రీనివాసరావు

★★★★★★★★★

# నెట్టింటి రామాయణం


**సెటైర్**

## నోరు మంచిదైతే






-ఈ. సాయి అలేఖ్య




“అడుసు తొక్కనేల.. కాలు కడగనేల..’ అంటారు పెద్దలు. అడుసు తొక్కడం మాత్రమే కాదు.. కాలు జారితే కూడా, బురదలో పడితే లేచి కడుక్కోవచ్చు. కానీ నోరు జారితే మాత్రం చాలా కష్టం. నోరు జారి మాట్లాడితే.. ఎలాంటి వివాదాల ఊబిలో చిక్కుకుపోతారంటే.. అందులోంచి బయటకు రావడం ఒకపట్టాన సాధ్యం కాదు వర్తమాన రాజకీయాలను మాత్రమే కాదు.. సినిమా తదితర చాలా రంగాల్లో మనకు ఇందుకు పుష్కలమైన ఉదాహరణలు కనిపిస్తున్నాయి. కేవలం నోరు జారిన వ్యవహారాలే రకరకాల మలుపులు తిరిగి చాలా పెద్ద సమస్యలుగా మారుతున్నాయి. ఏ రంగంలోనైనా ప్రముఖులుగా చెలామణీ అయ్యేవారు.. ఏదైనా మాట బయటకు అనే ముందు.. ఓసారి తరచి చూసుకోవాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు తెలియజెబుతున్నాయి

‘ప్రైవేట్ బతుకులు మీమీ సొంతం.. పబ్లిక్ లోకి వస్తే ఏమైనా అంటాం..’ అంటాడు కవి. ఇప్పుడు పబ్లిక్ ఫిగర్లుగా చెలామణీ అవుతున్న సెలబ్రిటీలు దీనిని రివర్స్ గేరులో పలుకుతున్నారు. ‘పబ్లిక్ లోకి వచ్చాక ఏమైనా అంటాం’ అంటున్నారు. నలుగురూ వారి గురించి మాట్లాడి వివాదాలు రేకెత్తించడం అనేది పాతబడి పోయింది. ఇప్పుడు.. నలుగురూ చర్చించుకునేలా సెలెబ్రిటీలు తామే వివాదాలకు కేంద్ర బిందువులు అవుతున్నారు. అసలే సెలెబ్రిటీలు. పబ్లిక్ అటెన్షన్ తమవైపు రాబట్టుకోవాలనే ఆరాటం జాస్తిగా ఉంటుంది. కొందరు తమ ఆహార్యం, వేషంలో వెర్రిమొర్రి పోకడలు చూపిస్తే.. మరికొందరు తాము వాడే భాషలో అదే కొనసాగిస్తున్నారు. నోరు జారుతున్న వారిలో ఇది ఉద్దేశపూర్వకంగా మాట్లాడే వారిది ఒక కేటగిరీ అయితే.. తమ వాచాలత్వం కారణంగా.. అనుకోకుండా వివాదాల్లో చిక్కుకుంటున్న వారు మరికొందరు.....

‘సత్యం బ్రూయాత్.. ప్రియం బ్రూయాత్.. న బ్రూయాత్ సత్య మప్రియం.. ప్రియం చ న అనృతం బ్రూయాత్..’ అనేది ఆర్యోక్తి. “నిజం చెప్పాలి.. ఎదుటివారు ఇష్టపడే విధంగా చెప్పాలి.. నిజమే అయినంత మాత్రాన ఎదుటివారు నొచ్చుకునేలా చెప్పకూడదు. ఎదుటివారు ఇష్టపడాలి కదా అని

# సెటైర్

అబద్దాలు చెప్పకూడదు' అనేది ఈ శ్లోకభావం. తమ మాటల తీరువల్ల వివాదాల్లో చిక్కుకునే సెలబ్రిటీలు అందరికీ ఈ శ్లోకం గానీ, అది నేర్పే నీతిగానీ తెలియాలనే రూలేం లేదు. కానీ.. సెలబ్రిటీలుగా ఎదిగే క్రమంలో వారు ఈ వ్యవహార సరళిని మాత్రం అలవరచుకోవాలి. అది చాలా ముఖ్యం.

ఆ మధ్య ఒక తెలుగు వెటరన్ హీరో ఆడవాళ్ల వస్త్రధారణ గురించి మాట్లాడి వివాదంలో చిక్కుకున్నారు. ఆ తర్వాత ఆ వ్యాఖ్యలకు నొచ్చుకున్నాడు. క్షమాపణ కూడా చెప్పాడు. తాను చెప్పిన విషయానికి కట్టుబడి ఉన్నానని, వాడిన భాషకు మాత్రమే సారీ చెబుతున్నానని వివరణ ఇచ్చుకున్నాడు. నిజానికి ఆ హీరో మాటల మీద.. సమాజం రెండు వర్గాలుగా చీలిపోయి వాదప్రతివాదాలు సాగించడంతో కొన్ని రోజులు ప్రజలకు మసాలా అందింది. తర్వాత అంతా చల్లారింది. నిజానికి మనం చెప్పుకుంటున్నది కూడా అదే. ఏ విషయమైనా చెప్పవచ్చు. కానీ.. చెప్పే పద్ధతిలోనే నోటి మీద, మాట మీద అదుపు ఉండాలి. అది లేనప్పుడు వివాదమే మిగులుతుంది.

వేదికలు ఎక్కితే చాలు.. ఆ మైమరపులో అదుపు తప్పిపోవడం మన సినిమా సెలబ్రిటీలకు కొత్తేం కాదు. మోహన్ బాబు, బ్రహ్మానందం లాంటి వాళ్లెందరో గతంలో రకరకాల మాటల వివాదాల్లో చిక్కుకున్నారు. ఆ క్రమంలో కొన్నాళ్ల కిందట నటుడు రాజేంద్రప్రసాద్ కూడా పెద్ద వివాదంలో చిక్కుకున్నారు. ఆ సమయంలో తాను ఆ విధంగా ఎందుకు నోరుజారవలసి వచ్చిందో ఆయన సంజాయిషీ చెప్పుకోవడం కూడా నిజానికి ఆయనను బజార్న పడేసింది. ఒకసారి వివాదం రేగిన తర్వాత కూడా రాజేంద్రప్రసాద్ లో మార్పు వచ్చినట్టు మాత్రం కనిపించడం లేదు. ఎందుకంటే.. తాజాగా ఆయన మరో వివాదంలో చిక్కుకున్నారు. ఈసారి మాత్రం మనం పైన చెప్పుకున్న ఆర్యోక్తి సిద్ధాంతమే కరెక్టు. ఆయన చెప్పదలచుకున్న పాయింట్ ఆయన ఇష్టం.. కానీ, అందుకోసం ఆయన వాడిన భాషే అత్యంత అసహ్యకరంగా తయారైంది.

రాజేంద్రప్రసాద్ కు ఇటీవల 'కళాప్రపూర్ణ కత్తి కాంతారావు జాతీయ పురస్కారం 2025' లభించింది. ఇలాంటి సందర్భాల్లో ప్రధానంగా నటులకు ఏ రోటికాడ ఆ పాట పాడే అలవాటు ఉండనే ఉంటుంది. ఆ సభలో రాజేంద్రప్రసాద్ కత్తి కాంతారావును ఆకాశానికెత్తేయాలని అనుకున్నారు. మంచిదే. ఎవ్వరికీ ఏమీ అభ్యంతరం లేదు. కానీ.. ఆ ప్రయత్నంలో ఆయన.. కాంతారావును చూస్తే తమిళ సూపర్ స్టార్ ఎంజీఆర్ భయపడేవారని చెప్పాలనుకున్నారు. ఇలా పోల్చి చెప్పడమే నోటి మీద అదుపులేకుండా వివాదాలను రాజేయడం అవుతుంది. పైగా ఆ సంగతి చెప్పడానికి ఆయన వాడిన భాష అత్యంత అసహ్యకరమైనది. వేదికమీద నుంచే రాజేంద్రప్రసాద్ ఆ మాటలు అన్నారు. సహజంగానే తమిళులకు ఆగ్రహం వచ్చింది. క్షమాపణలు డిమాండ్ చేశారు. హీరో విశాల్ మాత్రమే కాదు, దక్షిణభారత సినీ నటుల సంఘం అధ్యక్షుడు అయిన నాజర్ కూడా రాజేంద్రప్రసాద్ సారీ చెప్పాల్సిందే అని డిమాండ్ చేశారు. 'నోరు జారనేల..' అన్నట్టుగా తయారైంది రాజేంద్రప్రసాద్ పరిస్థితి.

తమిళ రాజకీయ నాయకుల వాచాలత్వం ఏ రేంజిలో ముదురుతోందో తెలుసుకోవడానికి.. అన్నా డీఎంకు చెందిన మాజీ మంత్రి సివి షణ్ముగం మాటలను గమనించి తీరాల్సిందే. ఎన్నికల ముందు ప్రజల్ని మరింతగా ఆకట్టుకునే ప్రయత్నాల్లో భాగంగా.. డీఎంకే ప్రభుత్వం ఇటీవల 'మీ కలలను చెప్పండి' అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. మీ కలలను మేం నిజం చేస్తాం.. అంటూ ప్రజలను ఆకర్షించడం ఈ కార్యక్రమ లక్ష్యం. అన్నా డీఎంకే మాజీ మంత్రి సివి షణ్ముగం విల్లుపురంలో ఒక బహిరంగసభలో ప్రసంగిస్తూ.. ఈ పథకాన్ని ఎద్దేవా చేశారు. పథకాన్ని



# సెటైర్

ఎగతాళి చేయడం ఓకే. కానీ అందుకోసం ఆయన ఏమన్నారో తెలుసా? 'ఒకవేళ నా కలలోకి నయనతార వచ్చి, నాకు ఆమె కావాలని అడిగితే.. స్టాలిన్ వచ్చి నా కలను నెరవేరుస్తారా?" అని అన్నారు. 'ఎవరైనా నయనతారతో పెళ్లి చేయమని అడిగితే ఆయన చేస్తారా' అని కూడా పొడిగించారు. ఈ మాటలు అత్యంత అసహ్యమూ, జుగుప్సాకరమైనవి. అంత విచక్షణ లేకుండా ఆయన ఏ రకంగా వాచాలత్వం ప్రదర్శించారో ఊహకు కూడా అందదు.

సినీ, పొలిటికల్ సెలబ్రిటీలు.. వార్తల్లో ఉండదలచుకుని చేసే వ్యాఖ్యలు మాత్రమే కాదు. ఇలా నోరుజారి అనవసరంగా వివాదాలను కొని తెచ్చుకుంటున్నారు. కొన్ని వ్యాఖ్యలు రాజకీయంగా ప్రత్యర్థులకు అస్త్రాలుగా మారే ప్రమాదం కూడా ఉత్పన్నం అవుతూ ఉంటుంది. ఆయన వైష్ణవుడు. వైష్ణవంలో కూడా తన అనుయాయులనే ఒక కల్ట్ గా తయారుచేసే విధంగా ఆయన ప్రత్యేక మార్గాన్ని ప్రబోధిస్తుంటారు. అంతవరకు పరిమితం అయినా కూడా పర్లేదు. కొత్తగా శైవ వైష్ణవ వ్యత్యాసాల్ని ఆయన తెరపైకి తెస్తున్నారు. హిందువులు.. అందరూ ఒక్క యూనిట్ గా కాకుండా.. ఆ రెండు మతాలుగా తమను తాము ఐడెంటిఫై చేసుకునే వాతావరణాన్ని ఆయన ఎంకరేజ్ చేస్తున్నారు. ఆయన వైష్ణవుడు గనుక.. శైవాన్ని తక్కువ చేసే.. శైవాన్ని ఆచరించే వారికి అసంతృప్తి కలిగించేలా మాట్లాడడం ఆయనకు అలవాటు అయిపోయింది.

ఆదిశంకరాచార్యుడు అసలు శైవుడే కాదని, ఆయన పరమ వైష్ణవుడని నుడివిన చినజీయర్.. దేశంలోని నాలుగు శంకర మఠాలను కూడా ఆదిశంకరాచార్యుని ఖాతాలోంచి లాగేసుకోవడానికి తన మాటలతో ప్రయత్నించడం చిత్రమైన సంగతి. అలాగే విఘ్నాలను, సంకటాలను తొలగించే దేవుడిగా హిందువులందరికీ గణేశుడు మాత్రమే పూజలందుకునే సంగతి మనందరికీ తెలుసు. గణేశుడు శైవానికి చెందిన వాడు గనుక.. వైష్ణవం నుంచి కొత్తగా సంకటహర హనుమంతుడిని కూడా సృష్టించి పోటీ వాతావరణానికి చినజీయర్ పునాది వేస్తున్నారు. ఇదంతా ఆయన తన స్వార్థంతో, హిందువులనే చీల్చడానికి చేస్తున్న ప్రయత్నాలే అని అనాలి.

ధార్మిక ప్రవచనాలు చెప్పే గరికపాటికి బడి పిల్లలకు ప్రభుత్వం పెట్టే అన్నం మీద కన్ను పడింది. ఎవరి భోజనం వాళ్లే తెచ్చుకోవాలి.. ఎవరి బట్టలు వాళ్లే కుట్టించుకోవాలి అంటూ తన అవగాహనరాహిత్యాన్ని బయట పెట్టుకున్నారు ఆయన. స్కూలు పిల్లలకు మధ్యాహ్న భోజనం ఉచితంగా పెట్టడం దండగ అనేది ఆయన అమూల్య అభిప్రాయం. పురాణాల మీద పట్టు ఉన్నదేమో గాని సమాజం గురించి పేదల గురించి ఆయనకు ఎరుకలేనట్లుగా మనకు అర్థమవుతుంది. బహుశా ఆయనను పిలిచి ప్రవచనాలు చెప్పించుకునే బృందాలను చూసి ప్రపంచంలో అందరూ సంపన్నులే అనే భ్రమలో ఆయన ఉన్నారేమో తెలియదు. బడి పిల్లలకు మధ్యాహ్న భోజనం అక్షరాస్యతకు దూరమవుతున్న బాలల సంఖ్యను తగ్గించిందని వాస్తవం కూడా ఆయనకు తెలియకపోవచ్చు. తనది కాని రంగంలో వేలు పెట్టి, తనకు లోతైన పరిజ్ఞానం లేని అంశాల మీద అభిప్రాయాలు వెల్లడించి ప్రజల్లో చులకన అయ్యారు గరికపాటి.

ఇంతా చెప్పి నేను కుడా ఎక్కువగా వాగుతున్నానేమో అనిపిస్తోంది ఉంటా మరి

★★★★

# ధర్మస్థల



## యాత్ర



కర్ణాటక రాష్ట్రంలోని నేత్రావతి నదీ తీరం ధర్మస్థలలో కొలువై ఉన్న శ్రీ మంజునాథ స్వామి దేవాలయం 800 ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన ఆలయం. జైనులు నిర్మించిన ఈ ఆలయంలో శివుడు మంజునాథుడి రూపంలో దర్శనమిస్తారు. వైష్ణవులు అర్చకులుగా వ్యవహరించడం శైవక్షేత్రం ప్రత్యేకత. ఈ శైవక్షేత్రంలో శివలింగం, నంది విగ్రహాలే కాకుండా నలుగురు ధర్మ దేవతలు, అలాగే జైనులు భక్తి శ్రద్ధలతో ఆరాధించే బాహుబలి విగ్రహాన్ని ఇక్కడ దర్శించుకోవచ్చు. ముఖ్యంగా ఇక్కడ కార్తికమాసంలో నిర్వహించే లక్ష దీపోత్సవం చూడటానికి రెండు కళ్లు చాలవు. దక్షిణ కర్ణాటకలోని మల్లార్మడి అనే గ్రామంలో ఉన్న ఈ ప్రాంతాన్ని మన పురాణాల ప్రకారం కుడుమ అని పిలిచేవారు. ఇక్కడ జైన అధిపతి అయిన బీర్మన్న పెర్గడే, అతని భార్య అమ్ము బల్లాల్తీ కుటుంబం నివసించేవారు. వీళ్లు చాలా ధర్మబద్ధంగా నడుచుకుంటూ అనేక సేవాకార్యక్రమాలు నిర్వహించేవారు. ఓరోజు వీళ్ల ఇంటికి ధర్మ దేవతలుగా పిలిచే కాళ రాహు, కలర్కాయ్, కుమారస్వామి, కన్యాకుమారి వీళ్లు మారువేషంలో రావడంతో ఈ దంపతులు ఎప్పటిలానే వాళ్లని ఆదరించారు. అయితే ఆరోజు రాత్రి బీర్మన్నకు ఇంటికి వచ్చిన ధర్మదేవతలు కలలో కనిపించి తమ గురించి తెలియజేశారు. అంతేకాకుండా బీర్మన్న కుటుంబం ఉంటున్న ఇంటిని ధర్మస్థాపనకు ఉపయోగించుకోవాలి అనుకున్నట్లుగా చెప్పడంతో ఆ మరుసటి రోజే బీర్మన్న కుటుంబం ఆ ఇల్లు వదిలి వెళ్లిపోయారట. అలాగే మరికొన్ని రోజులకు ఆ దేవతలే బీర్మన్నకు కలలో కనిపించి తమ విగ్రహాలు ప్రతిష్ఠించనమని చెప్పారట.

వాళ్లు చెప్పిన ప్రకారం బీర్మన్న ఆ దేవతల విగ్రహాలు ఏర్పాటు చేశారట. ఆ సమయంలో అక్కడ పూజాది కార్యక్రమాలు నిర్వహించేందుకు విచ్చేసిన బ్రాహ్మణులు ఇక్కడ శివలింగం కూడా ఉంటే శుభప్రదంగా ఉంటుందని చెప్పడంతో అన్నప్ప అనే మరో భక్తుడు వెంటనే శివలింగాన్ని తీసుకొచ్చి ప్రతిష్ఠించాడట. ఇలా జరుగుతున్న క్రమంలో కొన్ని రోజులకు భీర్మన్న వంశస్థుడైన దేవరాజ హెగ్గడే అనే మరో భక్తుడు ఉడిపికి చెందిన వరదరాజస్వామి అనే పీఠాధిపతిని ఈ ఆలయాన్ని సందర్శించాల్సిందిగా ఆహ్వానించాడట. ఆ వరదరాజస్వామి స్వామీజీ



ఈ ఆలయానికి విచ్చేసి ఇక్కడి శివలింగానికి విశేషమైన పూజలు నిర్వహించి అక్కడ జరుగుతున్న మంచి కార్యక్రమాలను పరిశీలించి.. ఈ క్షేత్రానికి ధర్మస్థల అని పేరు పెట్టారని.. అప్పటి నుంచి ఈ క్షేత్రం ధర్మస్థలగా పేరుగాంచిందని ప్రశస్తి.

ఆలయ దర్శన సమయాలు

ఆలయ దర్శన సమయాలు

ధర్మస్థలిలోని శ్రీమంజునాథ స్వామి వారి దేవాలయం వేకువజామున 4 గంటలకు తెరుచుకుంటుంది. శుద్ధి కార్యక్రమాల తర్వాత ఉదయం 6.30 గంటల నుంచి 11 గంటల వరకూ భక్తులను దర్శనానికి అనుమతి ఉంటుంది. అనంతరం ఉదయం 11.30 గంటలకు మంజునాథుడికి నైవేద్యం సమర్పించిన తర్వాత అన్నదానం ప్రారంభమవుతుంది. ఆ తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు గుడిలో మాహాపూజ జరుగుతుంది. ఈ సమయంలో పూజారులు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. ఈ ప్రదక్షిణ సమయంలో దర్శనాలు నిలిపివేస్తారు. అనంతరం ఈ ప్రదక్షిణలు పూర్తయ్యాక 12.15 నుంచి మధ్యాహ్నం 2.30 నిమిషాల వరకు భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. ఆ తర్వాత సాయంత్రం 5.00 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు స్వామి వారి దర్శనం కొనసాగుతుంది. ఆ తర్వాత 8.30 గంటలకు మహాపూజ నిర్వహిస్తారు.

ఎలా చేరుకోవాలంటే?

ఎలా చేరుకోవాలంటే?

# యాత్ర

ఈ మంజునాథ ఆలయం బెంగళూరు నుంచి 300 కిలోమీటర్లు, మంగళూరు నుంచి అయితే 65 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. రైల్లో వెళ్లాలనుకునే భక్తులు మంగళూరు రైల్వేస్టేషన్‌లో దిగి అక్కడి నుంచి బస్సులు, ప్రైవేటు వాహనాల సాయంతో మంజునాథ ఆలయానికి చేరుకోవచ్చు. విమానంలో రావాలనుకునే భక్తులు మంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో దిగితే సౌకర్యంగా ఉంటుంది. అలాగే ఇక్కడ వసతి గదులను కేవలం ఆన్‌లైన్ విధానంలో వెబ్‌సైట్ ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాల్సి ఉంటుంది





క్రైం సీరియల్





# రక్షకుడు

డా.సి.ఎస్.జి .కృష్ణమాచార్యులు

గత పది హేను రోజుల కాలంలో నీహారిక విషాదాన్ని, వినోదాన్ని, వివాదాన్ని చూసింది. ఈ అనుభవాలు ఆమె మానసికవికాసానికి దోహదం చేసాయి. సమస్య యెదురైతే, ఎప్పుడూ పారిపోవడమే గాని ఎదుర్కోవడం యెరుగని , నీహారిక, ఇప్పుడు వాటి ప్రభావాన్ని అనుభవిస్తూనే, మనసును స్థిరంగా వుంచుకోగలిగింది. దానికి అమె తన స్నేహితుల మద్దతు, మాధవ్ ప్రేరణ ప్రధాన కారణాలని భావించింది. ఆలోచనలతో వున్న ఆమెకు," ఒక్క సారి తలుపు తీస్తావా?" అని మాధవ్ అనడం వినిపించి, గబుక్కున లేచింది.

ఆమె తలుపు దగ్గరకు పోబోతూ ఆగిపోయింది. దుస్తులు మార్చాలి. ఇలా పొట్టి, పొట్టి నిక్కరుతో, వదులుగా వున్న టాప్ తో తలుపు తీస్తే, బాగుండదు. టీవి ఇంటర్వ్యూకి వచ్చిన సినిమా తారలా వుంటుంది. విరబోసిన జుత్తు, మూడొంతులు బయటకి కనబడే వక్షోజాలు, అతి పొట్టి నిక్కరుతో కటినుంచి పాదాల వరకు చూపిస్తూ, కాలి మీద కాలు వేసుకుని ఇబ్బందిగా కదిలే హీరోయిన్ లా. కనిపిస్తే బాగుండదు అని అనుకుంటూ దుస్తులు మార్చుకుని తలుపు తీసింది.

" బయటికి రా! కొన్ని విషయాలు చెప్పాలి" అన్నాడు మాధవ్

అతను లోపలికి వచ్చి ఆ మాట ఈ మాట అంటూ, చేయి పట్టుకుని ముద్దు పెట్టుకుంటాడేమోనని ఆమె కోతి మనసు అనుకుంది. ఆమె ఆ కోతిని అదుపు చేసి, వెళ్ళి సోఫాలో కూర్చుంది.

అతడు కాస్త సీరియస్ గా కనిపిస్తున్నాడు. అతని గాంభీర్యం వెనకాల బహుశా కావ్య చెప్పిన విషయాలే వుంటాయని అనుకున్న ఆమెకు నవ్వు వచ్చింది. కానీ నవ్వితే బాగుండదని అతడినే చూస్తూ కూర్చుంది.

"ఇదిగో, ఈ ఫోటోలు చూడు" అని అతను ఆమెకు మూడు ఫోటోలు యిచ్చాడు. ఒకటి తోటలో మాధవ్ ను కిరణ్మయి హగ్ చేసుకున్నది, రెండోది పార్కులో శశికళ మాధవ్ భుజం మీద తలపెట్టి కూర్చున్నది, మూడోది ముచ్చటగా, రాత్రి వేళ ఇందిర, మాధవ్ ఒళ్ళో పడుకుని వున్నది.

వాటిని చూసి,"బాగున్నాయి" అంది.

మాధవ్ ఆమెకేసి వింతగా చూసాడు. ఇందిర వున్న ఫోటో, ఆమెలో అసహనం కలిగిస్తుందనుకున్నాడు.

"నువ్వు తిరుగుబోతువని, నీహారికకు చెప్పకుండా వుండాలంటే... అని బెదిరిస్తూ పంపారు."



# క్రైం సీరియల్

**జరిగిన కథ:**
నీహారిక , మాధవ్ ను తన స్నేహితురాళ్ళకు పరిచయం చేస్తుంది .మాధవ్ తన గురువు గారి మాట కాదనలేక నిహారిక మెడలో తాళి కడతాడు . కాని నీహారికకకు ఆ పెళ్లి ఇష్టం ఉండదు,అక్షయ్ ని ప్రేమిస్తుంది .నీహారిక ఆస్తికి మాధవ్ రక్షుడిగా నియమిస్తాడు అతని మాస్టారు .నిహారిక తాను ప్రేమించిన అక్షయ్ స్వార్ధపరుడని తెలిసి అతన్ని వదిలేస్తుంది . నిహారిక మాధవ్ ణి పెళ్లి చేసుకోటానికి ఒప్పుకుంటుంది.

**ఇక చదవండి**

"అల్లరి పెట్టడం. ఇదీ ఒక రకం యుద్ధం. దీని కోసం నన్ను లేపి కూర్చోబెట్టావా?"
"నీహా! ఇందులో నాది కాదు. ముగ్గురు ఆడపిల్లల గౌరవాలు వున్నాయి. నువ్వు తొందరపడి ఇందిరని , కిరణ్మయిని ఒక మాట అనకుండా, ముందు జాగ్రత్త నాది."
"అంటే, నాది ఆలోచనలేని బుర్ర అనే కదా నీ విశ్వాసం."
" నీది నిర్మలమైన మనస్సే. దానిని ఒకప్పుడు, నీ మేనత్త కలుషితం చేసింది. అలా ఇప్పుడు జరగకూడదని"
"అప్పుడు చిన్న పిల్లని కాబట్టి ఆవిడని నమ్మాను. ఇప్పుడెందుకు నమ్ముతాను?"
"అలా అయితే, ముందు నువ్వు మీ నాన్న, అమ్మ ప్రేమ మూర్తులని తెలుసుకో. కిరణ్మయిని, సారధిని కలిసి వాళ్ళ జీవితాలను వారెలా వెలిగించారో కనుక్కో. నువ్వు ఒక పరిశోధకురాలివి. ఒకరు చెప్పినది, ఆధారాలు లేకుండా నమ్మని జ్ఞానివని నిరూపించుకో"
"అలాగే. ఇంక నిద్రపోనా?" ఆమె నవ్వుతూ, ఒళ్ళు విరుచుకుంది.
"నువ్వు మారిపోయావు. నీకు నవ్వెలా వస్తోంది?"
"మన శత్రువు బలహీనంగా వున్నప్పుడు భయం బదులు నవ్వు వస్తుంది. ఈ ఫోటోల్లో ఇందిర వున్న ఫోటో, ఎంతో ముచ్చటగా వుంది. ఇందిర కిస్తే, ఎంతో సంతోషిస్తుంది. ఆ మాటే రేపు బాబాయికి చెబుతాను."
"ఇది ఆయన పని నీకెలా తెలుసు? ఆయన నిన్ను రేపు కలుస్తానని చెప్పాడా?"
"ఈ ఫోటోలు మహేష్ అన్నవాడు పంపినట్లు వుంది. కానీ అది ఆయన పనే. పాతకాలం విలన్. ఈ ఫోటోలు ఆయనకు వచ్చాయని చెప్పి, నా విడాకులకు, అక్షయ్ తో పెళ్ళికి సహాయం చేస్తానని చెప్తాడు. నువ్వు ఆస్తి నాకివ్వగానే ఒక వాటా తీసుకుంటాడు.అంతే కదా. "
"అందం, సౌకుమార్యం తో బాటు తెలివి వున్న యువరాణీ వని నాకిప్పుడే తెలిసింది" అని లేచి నిలబడి సలాం చేసాడు మాధవ్.
"స్వస్తి. నీకు గాఢ నిద్ర ప్రాప్తించుగాక" అని నీహారిక లేచి ఫోటోలు తీసుకుని తన గదిలోకి వెళ్ళింది.
మాధవ్ ఆమెను చూస్తూ వుండిపోయాడు. నీహా మారుతోంది. బాధ్యతలకు సిద్ధమవుతోంది.

@@@@

నీహారిక తన స్నేహితులతో కలిసి తిరుచిరాపల్లిలోని సారధి యింటికి వెళ్ళింది. అతను చక్రాల కుర్చీలో వచ్చి తలుపు తీసాడు.
నీహారిక," నేను అరుంధతి కూతురిని. లోనికి రానా అంకుల్" అంది.
ఆ మాటలకు ఆయన ప్రతి స్పందన వారికి అద్భుతమనిపించింది. వణికే చేతులు పైకెత్తి, "ఓ దేముడా! నాకెంత అదృష్టానిచ్చావు. నా బంగారు తల్లి, నామీద దయతో, నన్ను వెదుక్కుంటూ వచ్చింది, ఎంత కరుణ నీది" అని అతను కన్నీరు మున్నీరు అయ్యాడు.
నీహారిక ఆయన చేతులను పట్టుకుని, "మిమ్మల్ని కలవడం నాకెంతో సంతోషంగా వుంది. ఎప్పటి నుంచో మిమ్మల్ని కలవాలనుకున్నాను. ఇప్పటికి కుదిరింది. వీరు నా స్నేహితులు" అని తన స్నేహితులని పరిచయం చేసింది.
" రండమ్మా!" అని సారధి వారిని ఆహ్వానించాడు. పని మనిషిని పిలిచి, "వీరు నా స్నేహితురాలి పిల్లలు. నన్ను చూడడానికి వచ్చారు" అని గర్వంగా చెప్పాడు.
ఆమె వారికి మంచి నీళ్ళు తీసుకుని వస్తానని చెప్పి లోనికి వెళ్ళింది. వారు సోఫాల్లో కూర్చున్నాక అతనిలా

# క్రైం సీరియల్

చెప్పాడు.
" ఒక నాడు, కాళ్ళు విరిగి, పూర్తిగా మానని గాయాల బాధతో, విలవిలాడుతున్న పరిస్థితిలో, నా భార్య నన్నువదిలి వెళ్ళిపోయింది. నేను ధనికుడిని కాదు కదమ్మా! ఆమె నా అంగవైకల్యం, నా పేదరికం, నా నిరుద్యోగం చూసి భయపడిపోయింది.
నా ఇరుగూ పొరుగు జాలితో భోజనం పెట్టే వారు. నాకు విరక్తి తో ఆత్మహత్య చేసుకోవాలన్న బలమైన కోరిక కలిగింది. అప్పుడు, ఆ దేవత వచ్చింది. నేను ప్రేమించి, పెళ్ళి చేసుకోలేకపోయిన ఆ సౌజన్య మూర్తి, నా మీద జాలితో, వచ్చింది. ఆమెతో ఆమె భర్త, వెంకట రమణ వచ్చాడు. అతడొక దేవుడు. ఇలా రండి, " అంటూ అతను కుర్చీని ఒక గదిలోకి పోనిచ్చాడు. వాళ్ళు అతనిని అనుసరించారు. ఆ గది విశాలంగా వుంది. ఒక ప్రక్క, చందనం సువాసన చెక్కతో చేసిన మాలతో ఒక నిలువెత్తు ఫోటో ఫ్రేం. అందులో అరుంధతి, వెంకట రమణ. నవ్వుతూ, ప్రసన్న వదనాలతో వున్నారు. వారి పాదాల దగ్గర ఒక పుష్ప గుచ్ఛం.
"ఇది నా ప్రార్ధనా మందిరం. వారి కన్న వేరే దేవతలుంటారా? త్యాగం, దానం, స్నేహం అన్నీ సుగుణాలే వారివి. భూమి మీద తిరుగాడిన సీతారాములు వారు. నాలుగేళ్ల కాలంలో, నన్ను మనిషిని చేసారు. నేను నివసించడానికి యిల్లు, జీవించడానికి బాంకులో డిపాజిట్లు, నడవడానికి కృత్రిమ కాళ్ళు, ఇలా అన్నీనాకిచ్చిన వారిద్దరూ మళ్ళీ కలిసి జీవించలేదు. చిన్న వయసులోనే, మొదట నీ తల్లిని, ఆ తర్వాత నీ తండ్రిని భగవంతుడు, తన దగ్గరకు తీసుకుని వెళ్ళిపోయాడు. నువ్వే కాదమ్మా, నేను కూడా వారి ప్రేమకు దూరమైన వాడినయ్యాను. నా మానసిక రోగం వల్ల, వారు నాలుగేళ్ళు, ఒకరిని విడిచి ఒకరు, వుండాల్సివచ్చింది."
ఆయన, ఆ ఫోటోల ముందుకు వెళ్ళి, రెండు చేతులు జోడించి నమస్కరించాడు. వారి జ్ఞాపకాలతో ఆయన కన్నులు మూసుకుని యోగిలా వుండిపోయాడు.
పనిమనిషి వచ్చిమంచి నీళ్ళ గ్లాసులిచ్చి, "ఆయన అలా ఒక పావు గంట వుండిపోతాడు. మీరు రండి. టిఫిన్ చేసి, కాఫీ త్రాగుదురుగాని. మీకు కాఫీ ఓకేనా? టీ కూడా వుంది. ఏది కావాలంటే అదే పెడతాను" అంది.
నీహారికకు, ఆమె స్నేహితులకు ఎంతో సంభ్రమంగా వుంది. వారి మనసులు ఆర్ద్రమైనాయి. వారు పనిమనిషి బలవంతం మీద టిఫిన్ చేసారు. టీ త్రాగుతూండగా సారధి వచ్చాడు.
" అరుంధతి ఇక్కడ వున్నప్పుడు, ఒక స్కూల్లో టీచర్ వుద్యోగంచేసింది. ఒక మహిళా సమాజంలో వలంటీరుగా సేవలందించింది. ఆమె బహుముఖ ప్రజ్ఞాశాలి. చితికిపోయిన నా మనస్సుకి జీవం పోసింది. కేవలం సైక్రియాట్రిస్టు వల్ల మానసిక రోగాలు నయం కావు. కుటుంబం అండదండలు ఎంతో అవసరం. తానొక్కతే నా కుటుంబమైంది. ఈ రోజు నేను స్కూల్ పిల్లలకు ఆన్ లైన్లో, ఇంట్లో, ట్యూషన్లు చెప్పి డబ్బు సంపాదిస్తున్నాను. అలా నేను నిలదొక్కుకోవడానికి ఒక సంవత్సరం పట్టింది. ఆమె నా గురువై, నన్ను ఒక గురువుని చేసింది."
నీహారికకు అర్ధమైంది. సారధి అలా చెబుతూనే వుంటాడని. ఇంక మెల్లగా సెలవు తీసుకుని బయట పడాలనుకుంది. అంతలో డోర్ బెల్ మ్రోగింది. సారధి మాటలు ఆపి, తలుపు తెరవడానికి వెళ్ళాడు.
ట్యూషన్ విద్యార్థులు వచ్చి, ఆయనను రమ్మని పిలిచారు.
సారధి అక్కడ నుండే," నీహారికా, మీరు భోజనం చెయ్యకుండా వెడితే నాకు బాధగా వుంటుంది. నిన్ను చూస్తూంటే అరుంధతిని చూసినట్లు వుంది" అని వెళ్ళిపోయాడు.
పనిమనిషి వచ్చి," ఆయన అంతే. చిన్న పిల్లవాడి తత్వం. మీ అమ్మగారిని పట్టుకుని వలవలా యేడ్చేవాడు. ఆ యమ్మకెంతో ఓపిక. ఇప్పుడిప్పుడు, నాలుగు రాళ్ళు చేరాయని, బంధువులు వస్తున్నారు. ఒకప్పుడు మీ అమ్మగారు ప్రయత్నించినా రాని సంబంధాలు ఇప్పుడొస్తున్నాయి. లోకం బహు చెడ్డది. స్వార్ధమే గాని పరమార్ధం లేదు దానికి." అని చెప్పి నిట్టూర్చింది.
మైత్రేయి," మాధవ్ అనే ఆయన వస్తూంటాడా?" అని అడిగింది.

# క్రైం సీరియల్

" ఆ ప్రతి నెలా వస్తారమ్మా! మీ లాగే ఉదయమే వచ్చి భోజనం చేసి వెళ్ళిపోతారు. బహు దొడ్డమనిషి. ఏప్రిల్ మాసంలో పెళ్ళిచేసుకున్నారుట. భార్యతో వస్తారని యెదురు చూస్తున్నా."
పనిమనిషి వంట చేయడానికి వెళ్ళిపోయింది. సారధి పట్ల సానుభూతి, అరుంధతి పట్ల ఒక ఆరాధనా భావన, వెంకట రమణ పట్ల ఒక పూజ్య భావం వారి మనసులో చోటు చేసుకున్నాయి. మాట్లాడ బుద్ధి గాక, టీవి చూస్తూ కూర్చున్నారు. దాదాపు ఒక గంటన్నర తర్వాత, సారధి వచ్చాడు. పని మనిషి భోజనాలకు పిలిచింది.
భోజనం చేస్తూ, అతను నీహారిక గురించి, ఆమె స్నేహితుల గురించి అడిగి తెలుసుకున్నాడు. మాధవ్ వచ్చి వుంటే దంపతులను ఆశీర్వదించే వాడినని అన్నాడు. నీహారికకు యేం జవాబివ్వాలో తెలియక మౌనం వహించింది. భోజనాలయ్యాక, " ఒక్క పది నిమిషాలు కూర్చొని వెళ్ళండి" అన్నాడు. అప్పుడతను విషాద వదనంతో, " మీ అమ్మని కాముకురాలని ప్రచారం చేసిన వారున్నారు. వారికి నా శాపం తగులుతుంది. అలాంటి వారికి దూరంగా వుండమ్మా! మీ అమ్మ నాన్నలది సత్యమైన, స్వచ్ఛమైన అలాంటి ప్రేమ నీకూ మాధవ్ కి వుండాలని ఆశీర్వదిస్తున్నాను" అన్నాడు.
నీహారిక, ఇంక వెళ్ళి వస్తాం, అని చెబుదామనుకునే లోపు ఒక అమ్మాయి ఒక సంచీతో వచ్చింది. ఆమె ఒక్కొక్కరికి కుంకుమ బొట్టు పెట్టి, తాంబూలంతో పాటు దుస్తులు యిచ్చింది.
వాళ్ళు మొగమాట పడిపోయారు. "ఇప్పుడివన్నీ ఎందుకు అంకుల్" అన్నారు.
"నా బిడ్డల్లాంటి వారు. ఇంటికి వచ్చారు. అదే సంతోషం. అప్పుడప్పుడూ వస్తూండండి" అన్నాడాయన ఆప్యాయంగా. వారు ఆయన పాదాలంటి నమస్కరించి సెలవు తీసుకున్నారు.
తిరుగు ప్రయాణంలో నీహారిక భారమైన మనసుతో కనులు మూసుకుని కూర్చుంది. ఆమె మనసులో అపరాధ భావం. పదహారేళ్ళ వయసులో తల్లిదండ్రుల అవసరం అంతగా వుండదు. అయినా తను పసిపాపలా రోదించింది. ధైర్యం చెప్పాల్సిన మేనత్త, తన మనసు విరిచేసింది. సారధి శాపం తనక్కూడా తగులుతుందని ఆమె వేదన చెందింది.
నీహారిక మానసిక స్థితిని అర్ధం చేసుకున్న మైత్రేయి," ఎంత అదృష్టవంతురాలివే. ఆదర్శ దంపతులను తల్లిదండ్రులుగా పొందావు" అంది.
"మనసున్న మనిషికి సుఖములేదంతే, అని ఆత్రేయ అన్న మాట కరక్టనిపిస్తుంది కదా! " అని కల్యాణి అంది.
"బహుశా కిరణ్మయి ఇంట్లో ఇదే చిత్రం ప్రత్యక్షం అవుతుంది. వచ్చే ఆదివారం తోటకు వెడదామా?" అని వుత్సాహంగా అడిగింది ఇందిర.
స్నేహితుల మాటలతో తేరుకున్న నీహారిక, " తప్పకుండా వెడదాం" అంది ఉత్సాహం తెచ్చుకుంటూ.
(ఇంకా ఉంది )



కథ

# " టార్గెట్ "



శింగిరాజు శ్రీనివాసరావు

"లంబోదరి..లంబోదరి.. పర్సులో డబ్బులేమైనా తీశావటే"

"ఎందుకా గావుకేకలు.. కాస్త చిన్నగా అడగవచ్చుగా. తీశాను.. అయితే ఏంటట"

"ఏంటి అంటావేంటి.. అవి అద్దె డబ్బులు. ఇంకొక అరగంటలో మన ఓనరు పింజారి వెధవ పీతాంబరం వచ్చి కూర్చుంటాడు. నేనెక్కడతేనే డబ్బులు మళ్ళీ"

"దానికంత టెన్షను దేనికి పెనిమిటి..ఫోనుపేలో కొడితే పాయె"

"సీరియళ్ళు చూసి అడ్డమైన వరసలు పెట్టి పిలవకు. 'ఏమండీ' అని తగలడు చాలు. అయినా చెప్పకుండా డబ్బులు తీయడం తప్పని తెలియదా?"

"నేనేమన్నా పరాయిదాన్నా.. మీ పర్మిషను అడగడానికి. మీలో సగభాగాన్ని. అన్నీ సగం, సగం అన్నారు కదా. అందుకే తీసుకున్నాను. మీరిస్తానన్న సగం వాటా మీ జీతం రాగానే ఇస్తే ఈ దోపిడీలు, అరుపులు ఉండేవి కాదుగదా"

"తప్పు నీదికాదే నాది. లాయరు కూతురురా.. తట్టుకోలేవని మా పండుగాడు పనిగట్టుకుని పరాయి రాష్ట్రం నుంచి వచ్చి మరీ చెప్పాడు. విన్నానా.. శని పెద్దమ్మ..."

"నా నెత్తికెక్కి మీ చేత పలుపుతాడు.. అదే పసుపుతాడు కట్టించుకున్నాను ఏకాంబరం గారు. ఎన్నిసార్లు చెప్తారు ఈ వెధవ సోది. నా వాటా నాకు ఇవ్వకపోతే నేను డబ్బులు తీసేది..తీసేదే" ఏకాంబరం

మాట పూర్తవకుండానే దాడి చేసింది లంబోదరి.
ఇక లంబోదరితో వాదించి లాభంలేదని "ఇంతకూ ఎందుకు తీశావో..అదయినా చెప్పు" కాస్త తగ్గి అన్నాడు ఏకాంబరం.
"అలా పద్ధతిగా అడగాలి శ్రీవారు.. పెళ్ళయి ఇప్పటికి ముప్పై సంవత్సరాలు అయింది. రెండేళ్ళలో రిటైరు కాబోతున్నారు. పిల్లలకు పెళ్ళిళ్ళు కూడ అయిపోయాయి కనుక ఇక నాదే రాజ్యం. ఏలినంతకాలం ఏలారు..చాలు. గుర్రాన్ని కట్టేసి చెప్పినట్టు వినండి. మొన్న సునీల్ దగ్గర చీరలు కొన్నాను. ఆ బాకీ చెల్లించడానికి తీసుకున్నాను. సరేనా.." అరిచీ అరవనట్టుగా చెప్పింది లంబోదరి.
"పోయిన నెలే కదే ఇరవై వేలు పెట్టి నాలుగు చీరలు కొన్నావు. మళ్ళీ చీరెలా..." జుత్తు పీక్కుంటూ అడిగాడు ఏకాంబరం.
"అవి చిన్న చిన్న ఫంక్షనులకు కట్టే చీరలు. ఇప్పుడు కొన్నవి కాటన్ చీరెలు. డైలీ యూజ్ కు" చాలా క్యాజువల్ గా మాట్లాడుతున్నది లంబోదరి.
అక్కడ నూటపది డిగ్రీల వేడితో వళ్ళు కాలిపోతున్నది ఏకాంబరానికి. రక్తపోటు ఒక రేంజికి పోయింది.
"ఇలా జీతమంతా చీరెలకు తగలబెడితే మనం అడుక్కుతినాలి" కస్సుమన్నాడు.
"అనవసరంగా ఆవేశపడకండి. నేను చీరెలు కొనేది నా సగం వాటాలోనే. పిల్లల చదువులని, పెళ్ళిళ్ళని ఇప్పటిదాక సంవత్సరానికి ఓ పాతిక చీరెల లెక్కన మాత్రమే కొన్నాను. ఇప్పుడు టార్గెట్ మారింది. మన అపార్టుమెంటులో ఉండే మీ కొలీగ్ బహదూర్ బాబు భార్య మాణిక్యానికి నాలుగు వందల చీరెలు ఉన్నాయిట. నేను కూడ ఆ టార్గెట్ చేరుకోవాలి. అంతవరకు ఈ ఉప్పెన ఆగదు. మీరు మనసు కుదుటపరచుకుని సగం జీతం ఇచ్చి, ఇప్పుడే రిటైరయిపోయాను అనే భావనతో బ్రతకండి. అనవసరంగా ఆవేశపడి గుండెపోటు గుమ్మడి కాకండి"
చీరెలు మడత పెట్టుకుంటూ ఎంతో తేలికగా మాట్లాడుతున్న లంబోదరిని చూస్తుంటే తిక్కరేగుతున్నా, అదంతా అనవసర ప్రయాస అనుకుని చేతిలో ఫైలును సోఫాలో విసరికొట్టి స్నానాలగది లోకి వెళ్ళిపోయాడు ఏకాంబరం.
ఇదంతా ఏకాంబరం స్వయంకృతమే. పిల్లలకు పెళ్ళిళ్ళు అయిన తరువాత బాధ్యత తీరిపోయిందన్న ఆనందంలో కైకను, దశరథుడు కోరుకొమ్మనట్లు లంబోదరిని ఏదైనా కోరుకోమన్నాడు. వచ్చిన అవకాశాన్ని దొరకబుచ్చుకున్నది లంబోదరి. భర్తకు వచ్చిన జీతంలో సగం జీతం ఆమెకు ఇవ్వాలని తొలి కోరిక, తాను ఎన్ని చీరలు కొన్నా అడ్డు చెప్పకూడదని రెండవ కోరిక. ఆ క్షణంలో అవి చాలా చిన్న కోరికలుగా అనిపించాయి ఏకాంబరానికి. అసలే నోటిదూల కలవాడు కావడంతో, జీతంలోనే కాదు.. రిటైరైన తరువాత వచ్చే పెన్షనులోను సగం ఇస్తానని కమిటయి ఇరుక్కుపోయాడు.

★★★★★★

కాలక్రమంలో ఉద్యోగం నుంచి రిటైరు అయ్యాడు ఏకాంబరం. ఆదాయం సగానికి పడిపోయింది. విధిలేక మాట ఇచ్చిన నేరానికి పెన్షనులో కూడ సగం లంబోదరికి ఇస్తూనే ఉన్నాడు. లంబోదరి చీరెల మేళా కొనసాగుతూనే ఉన్నది.
"ఏమండీ..టార్గెట్ రీచ్..హే" అంటూ వచ్చి ఏకాంబరాన్ని గుద్దింది లంబోదరి. అసలే రమణారెడ్డి పర్సనాలిటి కావడంతో తట్టుకోలేక దభీమని కిందపడి, మరల స్ప్రింగులా లేచి "ఏమిటే నువ్వనేది?" అర్థంగాక అడిగాడు ఏకాంబరం.
"అదేనండి..ఇప్పుడు నాకు మాణిక్యం కంటే రెండు చీరలు ఎక్కువ ఉన్నాయి. సో..రిలాక్స్" అన్నది ఆనందంతో.
"అయితే ఇక సగం జీతం నీకు ఇవ్వక్కరలేదా" ఏకాంబరంలో ఎక్కడలేని హుషారు.
"అంత లేదబ్బా..అది అదే..ఇది ఇదే"
"చీరలు కాకుంటే ఇంకేం కొంటావే"
"ఇంకా ఆలోచించలేదు. ప్రస్తుతానికి బ్రేక్"
"అంటే నేను ఈ సగం పెన్షనుతోనే బండిలాగాలా"

"కదా మరి" అని వెళుతున్న లంబోదరి వెనుక నడుస్తూ పటపట పండ్లు కొరికాడు.
"అరవై ఏళ్ళు దాటాయి. ఇప్పుడు ఊడితే మళ్ళీ రావు" అని కిసుక్కున నవ్వింది లంబోదరి.
తన వీపు తనే కొట్టుకుని ఆమె వెంట నడిచాడు ఏకాంబరం.

★★★★★★

కొత్తగా వచ్చి పక్క ఫ్లాటులో చేరిన రిటైర్డు మేజర్ పరమేశం భార్య నవనీతంతో కలసి బజారుకు వెళ్ళింది లంబోదరి. వాళ్ళు వచ్చి నెలరోజులు కాకముందే ఇట్టే కలిసిపోయి ఆమెతో తిరగడం మొదలుపెట్టింది. అలా బయటకు వెళ్ళిన భార్యకోసం ఎదురు చూస్తున్నాడు ఏకాంబరం.
అంతలోకి రానే వచ్చింది లంబోదరి. ఆమె చేతిలో సుమారు అయిదు పాకెట్ల చీరెలు ఉన్నాయి. ఉలిక్కిపడ్డాడు ఏకాంబరం.
"ఏమిటే చేతిలో ఆ చీరల మూటలు. టార్గెట్ చేరానన్నావు కదా" ఆగలేక అడిగాడు.
"టార్గెట్ మారిందండి" చీరెల ప్యాకెట్లు సోఫాలో పెట్టి శాంతంగా చెప్పింది.
"టార్గెట్ మారడమేంటి? ఇదేమన్నా బ్యాంకు బడ్జెటా ప్రతి సంవత్సరం మారడానికి" సీరియస్ గా అడిగాడు.
"కూల్ హబ్బీ..మన పక్కింటి పరమేశం అన్నయ్యగారి భార్య నవనీతానికి అయిదు వందల చీరలు ఉన్నాయట. మరి నేను మాత్రం తగ్గితే ఎలా! అందుకే మరల షాపింగు మొదలెట్టా" ఎంతో సౌమ్యత ఆమె మాటల్లో.
చిర్రెత్తుకొచ్చింది ఏకాంబరానికి.
"మొన్న ఏంచెప్పావు. నా చీరల టార్గెట్ అయిపోయింది. ఇక షాపింగుకు వెళ్ళి చీరలు కొనాల్సిన అవసరం లేదన్నావా. ఇలా మాట తప్పడానికి సిగ్గులేదు" ఎగిరాడు.
"చూడండి పతిశ్రీగారు..'వెయ్యి అబద్ధాలు ఆడయినా ఒక పెళ్ళి చేయమన్నారు' పెద్దలు. అలాగే 'వంద అబద్ధాలు ఆడయినా ఒక పట్టుచీర పట్టేయమన్నారు' నేటి మహిళలు. అదే నేను చేశాను. అయినా మీ సంపాదన ఎవరికండి.. నాకేకదా. కావాలంటే మీరు కూడ కొనుక్కోండి. అంతేతప్ప నా షాపింగ్ విహారాన్ని ఆపకండి. షాపింగ్ అనే అద్భుతమైన కళకు పేటెంటు హక్కు మాదే.. తెలుసా. అందుకే నా టార్గెట్ చేరే ప్రయత్నంలో నన్ను వెనకడుగు వేయనీయకండి. అనవసరమైన టెన్షన్ లకు లోనుకాకుండా ప్రశాంతంగా ఉండడి శ్రీవారు..." అని లోనికి వెళ్ళబోయింది లంబోదరి.
"ఇలా ఎవరు కొత్తగా వస్తే వాళ్ళతో పోటి పెట్టుకుని టార్గెట్లు మార్చుకుంటూ పోతావా" కస్సుమన్నాడు ఏకాంబరం.
"చూడు హబ్బీ..జీవితం బుద్బుదం. ఎప్పుడు బాల్చీ తన్నేస్తామో మనకే తెలియదు. పోయేలోపుగ మన కనీస కోర్కెలను తీర్చుకోవడం మన కర్తవ్యం. డబ్బును రొటేషనులో పెట్టాలి. లేకపోతే దేశసంపద పెరగదు. మేము ఇలా కనపడిన చీరనల్లా కొనబట్టేకదా..ఇన్ని బట్టల దుకాణాలు. వాటిలో పనిచేస్తూ ఎన్ని కుటుంబాలు జీవితాలు వెళ్ళదీస్తున్నాయి. కొనుగోళ్ళు ఎంత ఎక్కువగా జరిగితే అంత దేశసంపద పెరుగుతుంది. తెరుచుకున్న నోరు కట్టేసి లోపలికి రండి మాంచి స్ట్రాంగ్ కాఫీ వేడిగా ఇస్తాను" అంటూ తన భారీకాయాన్ని తిప్పుకుంటూ పోతున్న భార్యను ఏమీ అనలేక అక్కడే కూలబడిపోయాడు ఏకులాంటి ఏకాంబరం.

★★★★★★★★★★★





# ఓడిన గెలుపు





**వాడపల్లి పూర్ణ కామేశ్వరి**

“హిమా, అమ్మ ఆయాస పడుతోంది చూడు. అమ్మకు మందు వెయ్యాలి. కాస్త వెయ్యవూ, నువ్వు వేసినట్టు నాకు వెయ్యడం చేతకావట్లేదు. అవును లే, నువ్వు పిల్లల తల్లివి. కన్నావూ పెంచావూ. వాళ్ళకి మందులూ మాకులూ వేసిన అలవాటు ఉంది. నాకు పిల్లలు లేరు కనుక అవేవి చేత కాలేదు. నువ్వే వెయ్యవూ”, అమాయకంగా అంటున్న మనస్విని మాటల్లోని బాధ స్పష్టంగా కనిపించింది హేమకు. ఆమెని చూసి జాలే వేసింది.
ఎంతటి హోదా. ఎంతటి దర్పమూ. అన్నిటినీ మరచి నాతో, ఒక మామూలు పని మనిషితో ఈ రోజు ఇలా చిన్నపిల్లలా మాట్లాడుతున్నారూ అంటే, ఎప్పుడో అప్పుడు మనిషి యధార్ధ సత్యాన్ని తెలుసుకోక తప్పదు అనేగా అర్ధం.

తన ఉనికి తన పదవిలో కాదు పరపతిలో కాదు, నన్ను నన్నుగా ప్రేమించే నలుగురుని సంపాదించుకున్న నాడే నాది నిజమైన గెలుపు అని తెలుసుకున్నప్పుడే మనిషికి అసలైన గెలుపు వస్తుంది.
“ఎంతటి వారికీ అట్టి వాస్తవాన్ని తెలుసుకోక తప్పదు కదా?” మనసులోనే అనుకుంటూ, అమ్మాచీని లేపి రెండు చేతులతోనూ తన వడిలోకి తీసుకుని ఏటవాలుగా పడుకో పెట్టుకుని నోరు తెరిచి, మందు పక్కకు కారిపోకుండా, అలాగనీ ఉమ్మి వెయ్యకుండా గుటక పడేటట్టు వేయాలంటే మరో వేలితో నోరు మూసేయకుండా అడ్డు పెట్టాలి. ఆ తరువాత మందును చెంచాతో వేసి, ఒక్క క్షణం పాటు ముక్కు మూస్తే, గబుక్కున గుటక వేసేసింది అమ్మాచీ. అంతకు ముందు మూడు సార్లు ఉమ్మేసిన మందు ఇప్పుడు ఒక్కసారిగా మింగేసింది.

ఆ మందు వేసే నేర్పును చూసి ఆశ్చర్యం వేసింది మినీకి. ”హిమా, నిన్ను చూస్తున్నప్పుడు అమ్మ కళ్ళు ఎంతగానో మాట్లాడతాయి. అమ్మ ఒక్క మాటా పలక కుండానే నీతో ఎన్నెన్నో చెపుతుంది. నేను అమ్మ కడుపున పుట్టిన కూతురినైతే నువ్వు అమ్మను కడుపులో పెట్టుకుని చూసుకుంటున్న దానివి. కూతురు అన్న బంధం కంటే ఎక్కువే. అందుకే కాబోలు, నీ చేతుల్లో వున్నప్పుడు అమ్మ కళ్ళలో అనిర్వచనీయమైన ఆనందం కనిపిస్తుంది. తృప్తి

# సీరియల్

**జరిగిన కథ:**
హరిత బ్రిగేడియర్ జనరల్ మనస్విని దగ్గర పి ఏ గా పనిచేస్తూ ఉంటుంది.హిమ మనస్విని ఇంట్లో అన్ని పనులు చుసుకోటానికి హిమ చేరుతుంది .మనస్విని తల్లి డా అమృత మరణిస్తుంది . పలకరించటానికి హరిత వెళుతుంది .

**ఇక చదవండి**

కనిపిస్తుంది" మినీ అటుండగానే అప్రయత్నంగా ఆమె రెండు కళ్ళూ వర్షించాయి.

"ముఖ్యంగా రెండేళ్ళ క్రితం అమ్మ పడిపోయి రెండు కాళ్ళూ విరిగినప్పుడు, అంతటి మనోబలం వున్న అమ్మే మానసికంగా కృంగిపోయినపుడు ఆమే ఆమెను మళ్ళీ నడిపించడం చూసి పులకించిపోయాను. నా మనసు అంతటి ఆనందం పొందినది నాకు గురుతు లేదు. కొత్తగా పనిలో చేరినప్పుడు తమ వద్దకు వచ్చిన కొత్తల్లోని హిమకూ ఇప్పటి హిమకూ ఎంత మార్పు. అమ్మ హిమకు నూరి పోసిన మనో ధైర్యాన్ని ఆమె ఎన్నడూ విడువలేదు. అదీ కాక, అమ్మ చెప్పిన ప్రతీ కథ నుంచీ ఒక కొత్త స్ఫూర్తిని పొందుతూ, సకారాత్మకంగా మలచుకుంటూ, తన జీవితాన్ని అలాంటి పరిస్థితులకు అన్వయించుకుంటూ హిమ ఇలా చేస్తుంది అని తనదైన దోవను ప్రతి పరిస్థితికీ నిర్ధారించేది. అలా హిమ ఎదిగిన తీరు అపూర్వమైనదని అమ్మ అన్నప్పుడు కూడా అంతగా నాకది స్ఫురించలేదు. కానీ, ఇక నడవగలదో లేదో అని డాక్టర్లే చేతులెత్తేసిన సమయంలో అమ్మాచీని నిడిపించే పూచీ నాదని హిమ అంటుంటే, ఏదో భావోద్వేగంలో అంటోంది. అమ్మ వయసును దృష్టిలో పెట్టుకుని డాక్టర్లే చేతులెత్తేసారు. అలాంటిది హిమ వల్ల ఎక్కడ సాధ్యమవవుతుంది, అనుకున్నాను.

అప్పుడు చూసాను హిమాలయాలంత ఎత్తైన హిమ వ్యక్తిత్వం. నా చిన్న తనంలో అమ్మ నాకు గోరు ముద్దలు పెట్టినట్టు అమ్మకు పెట్టింది. రెండడుగుల దూరంలో నిలబడి, రావాలి రావాలి అంటూ చంటిపిల్లలు అడుగులేస్తున్నప్పుడు చేయి అందించినట్టే అందించి మరో అడుగు వెనక్కి వేసి మరో అడుగు అమ్మతో వేయిస్తున్నప్పుడు, ఆమె ఆప్యాయత చూసాను. ఆ ఆప్యాయతలోని పట్టుదలతో అమ్మను మళ్ళీ నడిపించింది.

మంచానికే పరిమితమైన అమ్మకు ప్రతీ రెండు గంటలకూ డైపర్లు మారుస్తూ, అతి శుభ్రంగా అమ్మను వడిలోని పసిపాపలా చూసుకుంది" నీకు ఎప్పుడూ బాధ కలగదా హిమా, అని నేనడిగిననాడు.

"కలిగేది మేడమ్. నేను చేయగలిగి ఆ పనిని నేను చేయకపోతే, అది నాకూ చాలా బాధాకరమైన విషయం. మా అత్తయ్య దగ్గరనుంచి ఈ విషయం నేర్చుకున్నాను. ఎప్పుడూ నా చుట్టూ వున్న వారి ముఖంలో సంతోషం తేగలిగే పనులు నేను చేయగలిగినా, అది చేయని నాడు నాకు బాధ. అది నేను మా వారి దగ్గర నుంచి నేర్చుకున్నాను" చిరునవ్వు చిందిస్తూ అంది.

అలా హిమను చూస్తూంటే ఆనాటి రోజులోకు వెళ్ళిపోయింది మినీ. వారి పెళ్ళైన కొత్తల్లో. పోస్టింగ్లై ఇద్దరూ ఒకే చోట పని చేస్తున్న రోజులు.

ఆ సంఘటన తరువాత బహుశా అమ్మ మాటలు విని వుంటే నేనూ హిమలా గెలిచేదాన్నేమో.....
"అసలు కొంచం కూడా ఓర్పు లేక పోతే చాలా కష్టం మినీ..... ప్రకాష్ ఏమంటున్నాడో కూడా వినకుండా నువ్వు అతడి మీద విరుచుకు పడడం న్యాయం కాదు. శెలు నిద్ర మాత్రలు మింగిన మాట వాస్తవమే. వారిదరి

మధ్యా అభిప్రాయ భేదాలు ఉండడం

# సీరియల్

కూడా కాదనను. కానీ, ప్రకాష్ వైపు కథ ఏమిటో వినకుండా అతడి మీద అభాండాలు వేసి అన్నేసి మాటలనడం తప్పు కదూ" బుజ్జగిస్తూ చెప్పే ప్రయత్నం చేసాడు శ్రేయాస్.
అంది. "చూడు శ్రేయన్, నువ్వు కూడా సరాసరి మగవాడిని అనిపించుకుంటున్నావు" రుసరుసలాడి పోతూ
"అది కాదు మినీ. ఇద్దరూ పెరిగిన వాతావరణాలు వేరు. కుటుంబ పరిస్థితులూ వేరు. ఒకరి పై ఒకరికి అవగాహన రావడానికి కొన్నాళ్ళు పడుతుంది. ప్రేమించుకున్నంత సులువు కాదు కదా కలిసి జీవిస్తున్నప్పుడు వచ్చే సమస్యలను ఎదుర్కోవడమంటే. కలిసి జీవించడంలో ఎన్నో తేడాలు ఉంటాయి సద్దుబాట్లు అవసరం. అన్నీ అనుకూలంగా వుండవు. అలాంటప్పుడే ఒకరికొకరు కొంత స్పేస్ ఇవ్వాలి. అవతలి వ్యక్తి ఆలోచనలను గౌరవించాలి. అది ఎంత చిన్న విషయమైనా సరే. నేనన్నదే చివరి మాట అవ్వాలీ అని అనుకుంటే, ఆ బంధం బీటలు వారక తప్పదు. అలాంటి పరిస్థితిలో ఇప్పుడు వారున్నప్పుడు మూడో వ్యక్తులుగా మనం జోక్యం చేసుకోకూడదు. ఒకరిని తప్పు పట్టి దాన్ని పెద్దది చేసి బయట వ్యక్తులకు చూపినప్పుడు వారు తమ అభిప్రాయం చెపితే, తప్పు చేసి తగ్గని వారికి మరింత బలం చేకూరి తప్పును ఒప్పుకోరు. వారి మధ్య మరింత దూరం పెరుగుతుంది. అందుకే చెపుతున్నాను ప్రకాష్ సమీరలు వారి సమస్య వారే తేల్చుకుంటారు. నువ్వు ఆవేశంగా మాట్లాడడం తగదు" అన్నాడు శ్రేయస్.

ఆరోజు ఆ మాటలతో మొదలైన శ్రేయస్ మినీల మధ్య విభేదాలు కొద్దికొద్దిగా పెరుగుతూనే వచ్చాయి. వివాహమయ్యి, అతికొద్ది కాలమే సాగిన ఆ కాపురంలో అర్థంలేని అహంకారపు వాదనలూ తలెత్తుతూనే వచ్చాయి. అలాంటప్పుడు శాతంగా వుండడమే సరైన సమాధానం. కాని ఏనాటిదో ఐన ప్రకాశ్ సమీరల కలహాలను లేవనెత్తి మరిన్ని వాగ్వివాదాలకు దారితీసేలా ప్రతీరోజూ నిప్పు రాజుకునేలా మాటలు విసిరాను.

శ్రేయస్ అన్న మాటల్లో కొంత అర్థం లేకపోలేదు అన్నది మరిచి, పురుషాహంకారమనీ, చావినిజమనీ దానికి పేర్లు వెతికాను. అది అప్పుడు నాకెందుకర్థమవ్వలేదో?" అమ్మను చూస్తూ శ్రేయస్ ను తలచుకుంది మనస్విని.

శ్రేయస్ ప్రేమానురాగాలతో సంతోషంగానే ఆగక పారుతున్న నదీ ప్రవాహంలా సాగిపోతున్న మా కాపురంలో అనేక కలతలు వచ్చినా, ఆ నాడు పెద్ద గండే పడింది. మమ్మల్ని శాశ్వతంగా విడదీసిన ఆ రోజు నేనింకా మర్చి పోలేను.

"ఇన్చార్జిగా కోవిడ్ విశ్లేషణకై క్యాంపస్ హెల్త్ సెంటర్ కి వెళ్లాడు శ్రేయస్. నా ఆఫీసులో ఉండవలసిన నేను అక్కడ కనిపించే సరికి నన్ను చూసి ఆశ్చర్యం పోయాడు. అంతకంటే ఎక్కువ ఆందోళన పడ్డాడు.

అడిగాడు. "మినీ, ఏమైంది. ఇక్కడున్నావేంటి?? ఆర్ యూ ఓకే." దగ్గరకొచ్చి నుదుటి మీద చేయి పెట్టి కంగారుగా

"కమాన్, శ్రేయస్. రిలాక్స్. నేను బాగానే వున్నాను. డాక్టర్ జయను చూద్దామని వచ్చాను" చాలా తేలికగా అన్నాను.

"ఐ థింక్ ఐ అమ్ ప్రెగ్నెంట్. మిగిలినవి ఇంట్లో మాట్లాడుకుందాము" నిర్లిప్తంగా అన్నాను.

చూసింది. "వాట్ ఎ ఫెంటాస్టిక్ న్యూస్...." ఇంచు మించు ఎగిరి గెంతెయ్యబోతున్న శ్రేయస్ ను మందలింపుగా

"ఓకే ఒకే........ ఇక్కడ కాదు. బట్, వీ విల్ సెలబ్రేట్..." అంటూ వెళ్ళిపోయాడు.

"మొదటి సంతానాన్ని ఎవరైనా కాదనుకుంటారా. శతవిధాల నేను మాట్లాడిన దానికి ఏ మాత్రమూ గౌరవం లేకుండా, కనీసం నాతో చెప్పా పెట్టకుండా వెళ్లి అబోర్షన్

# సీరియల్

చేయించుకుంటావా. నువ్వు అసలు ఆడదానివేనా" ఆగ్రహంతో ఊగిపోతూ అన్నాడు శ్రేయస్. అంతలోనే తనను తాను నిగ్రహించుకుని, "నాణానికి రెండో పక్క చూసే అలవాటు నీకు ఎప్పుడూ లేదు. నీవనుకున్నదే ఆఖరి మాట అవ్వాలి. అది జీవితంలో మంచి దారులు చూపదు. ఇప్పుడు ఆవేశంగా వున్నాము. పిచ్చి ఆలోచనలు మాని, మంచి నిర్ణయం తీసుకుందాము" నిదానంగా చెప్పడానికి ప్రయత్నించాడు.

కానీ శ్రేయస్ అన్న ఆ మాటలు నన్ను శూలాల్లా పొడిచినట్టనిపించాయి. నిలువెల్లా దహించేసాయి. నేను చేస్తున్నది తప్పు అని కూడా తెలుసుకోలేక పోయేంత ఆవేశం నన్ను చుట్టేసింది.

మన మధ్య సమస్య అప్పుడే సంతానం కావాలా వద్దా అన్నది కానే కాదు. అసలు ఆ డిబేట్ కే అవకాశమివ్వక పోవడం. అదే. అదే నన్ను ఎంతగానో బాధిస్తోంది అన్నాడు.

అతని మనసు అంతగా బాధ పడింది.

కానీ అప్పటికే నా మనసు విరిగి పోయింది. ఆరోజి ఆ మాటలతో విడి పోయిన మేము ఎన్నడూ కలుసుకోలేదు.
కోర్ట్ ద్వారా వివాహ రద్దు పత్రాలు మాత్రం లాంఛనం గా తీసుకున్నాము. ఆనందంగా పెనవేసుకున్న బంధం అలా ముక్కలయ్యింది.

"ఇలా ఉంటే మేము ఇంతమంది పిల్లల్ని పెంచేవాళ్లమా. తొందర పాటు వద్దు మినీ. జీవితంలో పంతాలూ పట్టుదలలూ కొన్నింటికే పనికొస్తాయి. పట్టూ విడుపూ వుండాలి. మాట తేడాలు వచ్చినా మరుపూ వుండాలి. క్షమ ఉండాలి. అన్నిటీ మించి, ఎదుటి వ్యక్తిని అర్థం చేసుకోవాలన్న తపన ఉండాలి" అని అమ్మ ఎంతగానో చెప్పింది. నాకు ఎవ్వరి మాటలోని మంచీ వినిపించలేదు. నా పంతమే నాకు అన్నిటి కన్నా పెద్దగా కనిపించింది.

(ఇంకా ఉంది )



## నాలుగో కోతి



# బీటలు వారుతున్న బంధాలు ...

ప్రస్తుతం ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా వేదికలు సమాచారాన్ని పంచుకోవడానికంటే సంబంధ బాంధవ్యాల విచ్ఛేదనకు కారణమవుతున్నాయనే విషయం జగమెరిగిన సత్యం. మంచి కోసం, జీవన ఉన్నతి కోసం ఉపయోగించాల్సిన సోషల్ మీడియాను అనవసరమైన విషయాలకే ఎక్కువ ఉపయోగిస్తున్నారనే విషయం కూడా విధితమే. సాంకేతికత అభివృద్ధి చెందడం మంచిదే అయినా దానిని సరైన మార్గంలో వినియోగించుకోకపోతే ఎలాంటి ప్రభావం చూపుతుందో చూస్తూనే ఉన్నాం. చివరికి మన బెడ్‌రూమ్‌లోకి కూడా అడుగుపెట్టి విశిష్టమైన భార్యభర్తల బంధాన్ని కూడా హరించివేసే స్థాయికి చేరుకుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు నేటి ఆధునిక యుగంలో మానవ సంబంధాల్లో మునుపెన్నడూ లేనంతగా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మనుషుల మధ్య సంభాషణలు, మనసు విప్పి మాట్లాడుకోవడం వంటివి నేటి డిజిటల్ యుగంలో కనుమరుగై పోతున్నాయి. పూర్వం సరాదాగా మాట్లాడుకోవడం, కళ్లలోకి కళ్లుపెట్టి చూస్తూ మాట్లాడుకోవడం వంటివి ఉండేవి.. ఇప్పుడు ఆ స్థానాన్ని స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా ఆక్రమించేశాయి.

సోషల్ మీడియా ప్రపంచాన్ని చిన్న కుగ్రామంలా మార్చేసిందని సంతోషపడాలో.. మానవ సంబంధాలను దూరం చేస్తుందని బాధ పడాలో అర్థం కాని అయోమయ పరిస్థితుల్లో ఉన్నాం. ఫోన్‌లో, సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడపడం వల్ల భార్యభర్తల మధ్య ప్రత్యక్ష సంభాషణలు తగ్గిపోతున్నాయి. ఒకప్పుడు రోజువారీ విషయాలు, సమస్యల గురించి మాట్లాడుకోవడం, ఖాళీ సమయం దొరికితే సరదాగా మాట్లాడుకునే సమయం ఉండేది. కానీ ఇప్పుడు భార్యభర్తలు ఒకే ఇంట్లో, ఒకే గదిలో ఉంటున్నప్పటికీ మానసిన సాన్నిహిత్యం నెమ్మదిగా దూరమవుతోంది.

ఖాళీ సమయాన్ని సోషల్ మీడియా, లైక్లు, కామెంట్లు, షేర్‌లు ఆక్రమించేశాయి. తాత్కాలిక ఆనందాల కోసం ఆరాటపడుతూ భాగస్వామి భావాలను అర్థం చేసుకోవడంలో విఫలమవుతున్నారు. దీనివల్ల



## నాలుగో కోతి

ఏర్పడే భావోద్వేగ శూన్యత కాలక్రమేణ అసంతృప్తికి, బంధం విచ్ఛిన్నమవడానికి దారితీస్తుంది. నేటి డిజిటల్ యుగంలో భార్యభర్తల మధ్య క్వాలిటీ టైమ్ కరువవుతోంది. ఇది నెమ్మదిగా బంధాలను బలహీనపరుస్తోంది. సోషల్ మీడియా, ఫోన్ పుణ్యమా



అని భార్యభర్తలు పక్కపక్కనే కూర్చున్నా ఒకరితో ఒకరు ప్రేమగా మాట్లాడుకునే టైమ్, తీరిక, ఓపిక లేకుండా పోయింది. ఆఫీస్ నుంచి వచ్చిన తర్వాత కూడా భాగస్వామితో గడపాల్సిన అమూల్యమైన సమయంలో కూడా రీల్స్, చాటింగ్ అంటూ సోషల్‌మీడియాలో మునిగిపోతున్నారు. ఈ విధమైన నిర్లక్ష్యం వల్ల భాగస్వామిలో అభద్రతా భావం, ఒంటరితనం మొదలవుతాయి. దీంతో నెమ్మదిగా బంధం బీటలు వారుతుంది. సోషల్ మీడియా వల్ల భార్యభర్తల మధ్య వచ్చే అతిపెద్ద సమస్య పోలికలు. సోషల్ మీడియాలో వచ్చే రీల్స్, ఫోటోల వెనుక ఉన్న విషయాలు తెలుసుకోకుండా భాగస్వాముల్లో పోలిక మొదలవుతుంది. ఈ పోలికలు వస్తువుల వరకే పరిమితం కాకుండా కాలక్రమేణా అందం, ఫిట్‌నెస్, ప్రవర్తన వంటి విషయాల వరకు వెళ్తాయి. దీంతో భార్యభర్తల మధ్య ఉండే సహజమైన అనుబంధం దెబ్బతిని ఈర్ష్య, అసూయ, అభద్రతా భావం మొదలవుతాయి. నెమ్మదిగా దంపతుల మధ్య చిన్న చిన్న విషయాలు గొడవలు ప్రారంభమవుతాయి. సోషల్ మీడియా వేదికల ద్వారా పాత స్నేహితులు మళ్లీ టచ్‌లోకి రావడం లేదా అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవడం, వాళ్లతో నిరంతరం చాటింగ్ చేయడం, ఒకరికొకరు వ్యక్తిగత ఫోటోలు, రహస్యాలు షేర్ చేసుకోవడం వంటివి డిజిటల్ ఇన్ఫిడిలిటీ కోవలోకి వస్తాయి. మొదట్లో టైమ్‌పాస్, స్నేహం అని సర్దిచెప్పుకున్నప్పటికీ భాగస్వామికి తెలిసిన రోజు నమ్మకం సన్నగిల్లుతుంది. అలాగే సొంత భాగస్వామిపై ఆసక్తి తగ్గిపోయేలా చేస్తాయి. దీంతో పవిత్రమైన బంధం బీటలువారుతుంది.

★★★





హాస్య
కథ



# నాకు (నా) డాక్టరు చెప్పాడు.

బొందల నాగేశ్వరరావు

బహుమతి పొందిన హాస్య కథ

గదిలో కూర్చొని ఫీజ్జాను రెండు చేతులతో పట్టుకొని పళ్ళతో పీక్కు తింటోంది అరవై అయిదేళ్ళ అనంతమ్మ.అలా ఇతరులకు జుగుప్స కలిగించే విధంగా తింటున్న నాన్నమ్మ వేపు చూస్తూ వున్నారు మనవరాలు మహంతి, మనవడు రోహిత్. వాళ్ళు చూస్తుండగానే ఫీజ్జా తినటం పూర్తి చేసి ప్రక్కనే వున్న గ్లాసుడు పాలను ఒక్కసారే గట గట తాగేసి ‘హిఁ...హిఁ...హి ‘ అని నవ్వింది అనంతమ్మ.

“ఏమిటే నాన్నమ్మా పిచ్చిదానిలా నవ్వుతున్నావ్ !మాట వరసకైనా తమ్ముడ్ని తినమని అడగలేదేం?” అడిగింది మనవరాలు.

“వుత్తినే అడగటం నాకు చేతకాదే మనవరాలా! కావాలంటే ఆఫీసుకు వెళ్ళిన నా కొడుక్కి ఫోన్ చేసి మీరూ ఫీజ్జాలను తెప్పించుకొని తినండి.ఆఁ !” అంది అనంతమ్మ.

అంతలో కోడలు కౌసల్య లోనికొచ్చి ”దాని మాటలకేం లెండి అత్తయ్యగారూ!మీకు ఇంకేమైనా కావాలా చెప్పండి?” అడిగింది. అలా రోజు తల్లిని అడగాలని ఆమెకు భర్త వేసిన ఆర్డరు అది.

“ఇప్పుటికింకేం వద్దులేమ్మా!కాకపోతే పదకొండు, పదకొండున్నర గంటల సమయాన ఒక ఆపిలు, రెండు చెక్కర కేళీలను పంపి, ఈవెనింగు ‘టీ’ టైంకి ఆ ఎదరే వున్న తోపుడు బండోడి వద్ద రెండు ఉల్లిపాయ బజ్జీలు తెప్పించు. చాలు!”అంది అనంతమ్మ.

అందాకా నాన్నమ్మ చేష్టల్నుచూస్తూ,ఓర్పుతో ఆమె మాటల్ను వింటూ వున్న మనవరాలు “ఏయ్ నాన్నమ్మా!ఎన్నిసార్లు చెప్పాలి అరటి పళ్ళను తిన కూడదని. నీకు చెక్కర కేళీలు కావాలా?నీదేం పొట్టా లేక చాకిరేవు బానా?అయినా నియంత్రణ లేకుండా పద్ధతి లేని పుద్దు ను తింటే ఆ బి.పి.,షుగర్లు ఎక్కువై టపీమని చస్తావే!” వెటకారంగా అంది మనవరాలు.

“ఏం చావను.నావద్ద

కథ

ముందులున్నెగా!"అంటూ చాలా కూల్గా డబ్బాలో వున్న షుగరు,బి.పి బిళ్ళలను చూపింది అనంతమ్మ.

"అయ్యో రామ!నిన్ను మార్చలేమే!" చేత్తో నొసటిమీద కొట్టుకొంటూ అంది మనవరాలు.

"నన్ను మీరు మార్చాల్సిన పని లేదే! నేను హాయిగా వందేళ్ళు బ్రతుకుతానని నాకు నా డాక్టరు చెప్పాడు" అంది గర్వం ఫీలవుతూ అనంతమ్మ.

"వాళ్ళ మాటల్ను చుకోకండత్తయ్యగారూ!అమ్మాయ్ మీరు క్రిందకు పదండి" అంటూ పిల్లల్ని తీసుకొని క్రిందికి దిగుతుంటే...

"కోడలా!ఉదయం మా వాడు ఆఫీసుకెళ్ళేప్పుడు వాడితో పాలకోవా, స్వీటు మిక్చర్న్ని తెమ్మని చెప్పాను. మరిచి పోతాడేమో!ఫోన్ చేసి గుర్తు చెయ్యమ్మా!"కేకేసినట్టు చెప్పింది.

"అలాగేనండి అత్తయ్యగారూ!"అంది కోడలు. నవ్వుకొంటూ క్రిందకు దిగారు ముగ్గురు. సాయంత్రం ఆరైంది.కొడుకు కోసం కిటికీలోంచి బయటికి చూస్తోంది అనంతమ్మ. అంతలో బైకు మీదొచ్చిన కొడుకు వెచ్చాల సంచిని టేబులు మీద వుంచి స్వీటు బ్యాగుతో చకచక పైకెళ్ళాడు.

బ్యాగును తల్లి చేతికిచ్చి"అందులో నువ్వడిగిన పాలకోవా,స్వీటు మిక్చరు వుందమ్మా. తీసుకొని తిను" అన్నాడు కొడుకు వేణు.

"నాలుగు గంటలకే కోడలు పిల్ల వేడివేడి బజ్జీలతో పాటు అల్లం'టీ'ఇచ్చిందిరా! తరువాత తింటానులే!" అంది అనంతమ్మ.

"సరేలే"అని అటు టేబుల్ మీదికి చూసి "అమ్మా!ఆ టేబుల్ మీదున్నవేమిటే?"

"అవా... మొన్న తెప్పించుకున్న శెనగ ముద్దలా!రెండో మూడో వుంటాయి.కావాలంటే మళ్ళీ తెప్పించుకొంటానులే!"అని పాలకోవా పొట్లం విప్పి కాస్త విరిచి నోట్లో వేసుకొంది.

"కాదే అమ్మా!నువ్వు బి.పి షుగరులున్న మనిషివి. తిండి విషయంలో కఠినంగా వుండ మంటున్నారు డాక్టర్లు. షుగరుతో చేసిన తిండి ఏదైనా సరే నిన్ను తాకొద్దన్నారు. కాని నువ్వేమో నోటికి తాళం వేసుకోకుండా ఉదయం నుంచి పడుకో బోయే వరకు తీపి తిను బండారాలనే తెగ తింటుంటావు. వద్దమ్మా... స్వీటు వున్న తిండిని ముట్టుకో మాకు' అనంటే మూల కూర్చొని ఎడుస్తావు. అంతేనా...మీ ఆయన వుండి వుంటే నిన్నో మహారాణిలా చూసుకొంటాడని చెప్పి నన్ను దెప్పేస్తూ భయపెడతావు.అందుకే నువ్వు కోరుకున్నవన్నీ తెచ్చి పెడుతున్నాను. రేపు నీకేమైనా అయితే అందుకు బాధ్యుడ్ని నేనేనని చెప్పకు...ఏం?"

"అదేం కాదులేరా!ఎంత తిన్నా, ఎట్లా తిన్నా మందులు క్రమంగా వేసుకోమన్నాడు నా డాక్టరు. ఆ పని చక్కగా చేస్తున్నానుగా!నువ్వేం భయపడమాకు.ఇదిగో...నేను ఖచ్చితంగా వందేళ్ళు బ్రతుకుతాన్రా. ఆс...!"అంది అనంతమ్మ ధీమాతో.

"ఎవడే అమ్మా ఆ డాక్టరు...నిన్ను ఇష్టం వచ్చినట్టు కంట్రోల్ లేకుండా స్వీట్లు తినమని చెప్పింది?నాకేమో నువ్వు తప్పుచేస్తూ ఆ నెపం డాక్టరు మీదకు నెట్టేస్తున్నావనిపిస్తుంది." అంటూ క్రిందకు దిగి వెళ్ళిపోయాడు కొడుకు వేణు.

'డాక్టరు చెప్పలేదురా కొడకా!స్వీటంటే నాకిష్టం కనుక నేనే తెప్పించుకొని తింటున్నాను. అందుకు తగ్గా మందులు వేసుకొంటున్నాను. మధ్యలో మీకేంట్రా!' మనసులో అనుకొని తనకు తానే పిచ్చిగా నవ్వుకొంది అనంతమ్మ.

ఒకరోజు తన గదిలో చీర కట్టుకొంటున్న అనంతమ్మ వున్నట్టుండి ధభీలుమని క్రింద పడిపోయి 'ఒరేయ్ వేణూ' అని ఇల్లు దద్దరిల్లేలా కేకేసింది.

ఆ కేక వినబడ్డంతో తల్లికేమైందోనని వేణు,అతని భార్య పిల్లలు పరిగెత్తి నట్టు పైకి వచ్చారు.

అనంతమ్మ వులుకు పలుకు లేకుండా అందర్నీ అలా చూస్తూ చూస్తూనే స్పృహ కోల్పోయింది భయంతో షాక్కు గురైయ్యారు నలుగురూ.

"అమ్మా...అమ్మా" అంటూ కదిపాడు కొడుకు.

"అత్తయ్యగారూ"అంటూ కోడలు "నాన్నమ్మా"అంటూ పిల్లలు ఏడ్వడం మొదలు పెట్టారు. నిముషాలమీద అంబులెన్సును పిలిపించాడు వేణు. అందులో తల్లిని పడుకోబెట్టుకొని దగ్గరే వున్న కార్పోరేటు ఆసుపత్రికి తీసుకు వెళ్ళారు. అనంతమ్మకు యమర్జన్సీ వార్డులో పరీక్షలన్నీ జరిపిన డాక్టరు ఇంజక్షను చేసి అక్కడే డ్రిప్పు ఎక్కించాడు.అర్ధగంట వరకూ ఎవ్వరినీ లోనికి రానివ్వలేదు ఆయన. అర్ధగంట తరువాత అనంతమ్మ మెల్లగా స్పృహలోకి వచ్చింది. కళ్ళు తెరచి అలా చూసింది.

"ఏమిటమ్మా!మీ అబ్బాయిని చూడాలా?"అడిగాడు డాక్టరు. అవునన్నట్టు తలూపింది అనంతమ్మ. నర్సుతో చెప్పి అందర్నీ లోనికి పిలిపించాడు డాక్టరు.

నలుగురూ లోనికొచ్చారు.అందర్నీ అలా ఒకసారి చూసి "నాకేం కాలేదర్రా!బాగానే వున్నాను. కావాలంటే డాక్టరుగారినడగండి!" అంది అనంతమ్మ.

"ఆc..ఆc ఇంకాస్సేపు మిమ్మల్నిఆసుపత్రికి తీసుకు రాకపోయుంటే ఈ పాటికి శుభ్రంగా చెల్లుకునేవారే!మీకు షుగరు అయిదు వందల వరకూ పెరిగి బి.పి. డౌవునై య్యింది. తెలుసా?" అన్నాడు డాక్టరు. బిత్తరపోయింది అనంతమ్మ.

"సరేనండి డాక్టరుగారండీ!ఇప్పుడు నేను బాగానే వున్నానుగా!ఇంటికి పంపించేయండి. వెళ్ళిపోతాను" లేచి కూర్చొని అమాయకంగా అడిగింది అనంతమ్మ.

"ఆహాc...అప్పుడే!కుదరదు. మిమ్మల్ని రేపటి వరకూ అబ్జర్వేషన్లో వుంచాలి. రేపు వెళుదురులెండి. మీకు కొన్ని విషయాలు చెప్పాలి" అన్నాడు డాక్టరు. 'కరక్టు. మేము చెపితే రకరకాల మాటలతో, సాకులతో మమ్మల్ని వుదరగొట్టి తనిష్టాను సారంగా వుంటుంది.ఇప్పుడు డాక్టరుగారు పీకే క్లాసుగ్గాని మా అమ్మకు తెలిసి రాదు' అనుకొని మెల్లగా మనసులోనే నవ్వుకున్నాడు కొడుకు వేణు.

"ఏమిటండీ డాక్టరుగారండీ!నాకేం చెపుతారూ?"మెల్లగా అడిగింది అనంతమ్మ.

"సార్!మేము నలుగురం వుండడం మా అమ్మకు ఇబ్బందిగా వుందేమో...వెళ్ళి రిషెప్షన్లో కూర్చొంటాము" అని కదలబోయాడు వేణు.

"నో...నో... మీరూ వుండాలి.మీ సమక్షంలోనే నేను అనంతమ్మతో మాట్లాడాలి" అంటూనే అక్కడే వున్న బెంచీ మీద కూర్చొన్నారు నలుగురు.

"చూడండి అనంతమ్మగారూ!బి. పి. షుగర్లకు ట్రీట్ మెంటు చేసే ఏ డాక్టరైనా లేక నీ డాక్టరైనా సరే మీ ఇష్టమొచ్చినట్టు అన్నీ తినమని చెప్పరు. మీరే అలా చెప్పుకొని దబాయింపులతో, బెదిరింపులతో కోరుకున్నవి తెప్పించుకొని తింటున్నారు. పోనీ... గతం గతహః! ఇప్పుడు నేను చెప్పేది సావధానంగా వినండి.ఈ షుగరు,బి.పీలన్నవి చాప క్రింద నీరులాంటివి.మనిషిలో వున్న ఆర్గన్సును అంటే ముఖ్యమైన శరీర భాగాలను కొద్దికొద్దిగా క్షీణింపజేసి కొన్ని సంవత్సరాల పాటు మందులతో బ్రతికించి తరువాత చంపేస్తుంది.ముఖ్యంగా ఈ షుగరు వ్యాధి కిడ్నీ,గుండె,ఊపిరి తిత్తులు , కళ్ళు, పళ్ళనే ముఖ్యమైన అవయవాల మీద దాని ప్రభావం చూపి వాటిని పని చేయనివ్వకుండా చేస్తుంది. మనమేం చేస్తున్నామంటే డాక్టరు రాసి ఇచ్చిన బోలెడు

కథ

బిళ్ళలను చక్కగా మింగుతున్నాం కనుక మనకేం కాదు అనుకొని అస్సలు కంట్రోల్ లేని తిండిని తింటూ వుంటాం. దానివల్ల నష్టపోయేది మనమే! చూడండీ! మీ విషయంలో నేను గుర్తించింది అదే. తిండి విషయంలో మీకు అస్సలు కంట్రోల్లేదు. ఉదయం టిఫన్ , మధ్యాహ్నం భోజనం, రాత్రికి మళ్ళీ టఫనో లేక మరే జంకు పుడ్డో తింటుంటారు. ఇక టిఫన్కి,భోజనానికి వున్న గ్యాపులో స్వీట్లు, పళ్ళు, పాలు, బజ్జీలు,బోండాలు,జిలేబి, పాలకోవాలని అరుగుదలకు మించి బోలేడు చిరు తిళ్ళు తింటున్నారు. కొడుకు, కోడలు, పిల్లలు అది గమనించి నీ మేలు కోరి ఆరోగ్య రీత్యా మందలిస్తే నెపం డాక్టర్ల మీదికి నెట్టేస్తున్నారు. అది తప్పు. చూడండీ! ఒకవేళ మీకు ఏమైనా తినాలనిపిస్తే ఔషధ గుణాలు కలిగిన దానిమ్మ, జామ, బొప్పాయి,ద్రాక్ష లాంటి పళ్ళ ను తెప్పించుకొని తినండి. అప్పుడే ఇంకొంతకాలం ఆరోగ్యంగా వుంటారు"అంటూ సుదీర్ఘ మైన ఉపన్యాసాన్ని ఇచ్చాడు డాక్టరు.

డాక్టరుగారు చెప్పిన మాటల్ని విన్న అనంతమ్మ అందరి ముఖ భావాలను ఒక సారి చదివింది.అందరూ ఆమె ఆరోగ్యం కోసం ఆందోళన చెందుతున్నారన్నది గ్రహించి ఆమె "మీ మాటల్ని అర్థం చేసుకున్నానండీ డాక్టరుగారండీ! ఇకపై మీరు చెపుతున్నట్టు నా తిండి విషయంలో జాగ్రత్తగా వుంటాను. నన్నుఇంటికి పంపించండి. ప్లీజ్!"అంది.

"ఆగండాగండి!తిండి విషయంలో మీరు కట్టడిగా వుండటం కాదు. నేను మెను ఇస్తాను. దాన్ని ఫాలో అవ్వండి. ఉదయాన బ్రేక్ ఫాస్టుకు రెండు ఇడ్లీ సాంబారు లేక చట్నీతో తీసుకోవాలి. మధ్యాహ్నం కప్పు అన్నం సాంబారు,రసంతో తీసుకొండి. ఇక ఆకుకూరలు,బీట్రూట్, క్యారెట్టు, ముల్లంగి,క్యాబేజి,బెండ,బీర,సొర,కాకర, కీరదోస లాంటి కూరలను ఎక్కువగానే తీసుకొండి పర్వాలేదు.ఇక రాత్రి డిన్నరుకు ఒకటి లేక రెండు పుల్కాలతోముగించుకోవాలి.అప్పుడే మీకు బి.పి,షుగర్లు కంట్రోల్లో వుంటాయి. తెలిసిందా!" ఆర్డరేస్తున్నట్టు చెప్పాడు డాక్టరు.

"తెలిసిందండీ...మరి మధ్యాహ్నం నాలుగ్గంటలకు బజ్జీలు,బోండాలు తిని కాఫీ తాగుతానే దాని సంగతేంటండి డాక్టరుగారండీ?"అమాయకంగా అడిగింది.

"అస్సలు ముట్టుకోకూడదు.బదులుగా పెసర,సెనగ,అలసంద,బఠాణి గుగ్గిళ్ళను తీసుకోండి.అలాగే రోజు మీ గదిలోనే ఓ అర్థ గంట సేపు నడవండి. నడవటం చాలా ముఖ్యం.వీలైతే ప్రాణాయామం కూడా చేయండి" అన్నాడు డాక్టరు."అలాగేనండీ డాక్టరుగారండీ!నన్ను ఇంటికి పంపించేయండి.ప్లీజ్ !"మళ్ళీ అడిగింది.

"ఓకే!వేణుగారు...మీ అమ్మను ఇంటికి తీసుకు వెళ్ళండి. డైట్ నేను చెప్పినట్టు అమలు పర్చండి. రెండు నెలలకోసారి బ్లడ్ టెస్టు చేయించుకొని చెక్కప్పుకు రండి. ఇప్పుడు కౌంటరు లో బిల్లు కట్టి బయలుదేరండి" అంటూ ఐ.సి. యూలో వున్న పేషంటును చూడ్డానికి వెళ్ళిపోయాడు డాక్టరు . అంతలో ఓ స్టాపు పదివేలకు కంప్యూటరు బిల్లును తెచ్చి వేణు చేతికిచ్చింది.

"పదివేలా...ఓకే!" అనుకొంటూ పేమెంటు చేసి తల్లివద్దకొచ్చాడు వేణు.

"ఎంతైయ్యిందిరా వేణూ!" అడిగింది అనంతమ్మ.

"పదివేలమ్మా!" చెప్పాడు కొడుకు.

"అమ్మో...పదివేలే...! పోనీలేరా... నా ఆరోగ్యానికన్నా డబ్బు ముఖ్యం కాదు. ఇకపై నా వల్ల నీకు ఖర్చు వుండదులే! తిండి,వ్యాయామం విషయంలో డాక్టరుగారు చెప్పిన నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకొంటాను" అంటూ లేచి వెళ్ళి టాక్సీలో కూర్చొంది అనంతమ్మ.©©©

# రేపటి కోసం-మేలుకొలుపు

## నమ్మకాలు- నిజాలు



## జ్యోతిష్యం పేరుతో దోపిడీ ?

నాశిక్ జ్యోతిష్యుడు అశోక్ ఖరత్ అనే వీడు జ్యోతిష్యం పేరుతో తన దగ్గరికి వచ్చే మహిళలకు జాతకంలో దోషాలు, శని ప్రభావం, దోష నివారణ అంటూ భయపెట్టి పూజలు, శాంతి అంటూ నమ్మించి దాదాపు 58 మంది మహిళలతో లైం★★గికంగా తన కోరికలను తీర్చుకోవడమే కాకుండా వాటిని వీడియో రికార్డు చేసి పెట్టుకున్నాడు ....

విచిత్రం ఏంటంటే, వీడి మాయ మాటలకు మోసపోయిన మహిళల్లో చాలావరకు పెద్ద చదువులు చదివిన మహిళలు కావడం చింతించాల్సిన విషయం, అలాగే ఆ మహిళల్లో చాలామంది పేరున్న బిజినెస్ మ్యాన్ భార్యలు, IAS, IPS, ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ నాయకుల భార్యలు కావడం విస్మయానికి గురి చేస్తుంది... అశోక్ ఖరత్ ప్రజల భవిష్యవాణిని చెప్పేందుకు న్యూమరాలజీని ఉపయోగించేవారు. తమ గతం గురించి ఆయన చెప్పినవన్నీ నిజమేనని చాలామంది ప్రజలు నమ్మారు. తమకు భవిష్యత్‌లో రాబోయే సమస్యలను ఆయనే తీరుస్తారని కూడా చాలామంది విశ్వసించారు.

అశోక్ ఖరత్ తన భక్తులతో పూజలు చేయించేవారు. ఆయన ఒక్కో చించోకాను (పూజల కోసం ఉపయోగించే వస్తువును) రూ.10 వేల నుంచి రూ.లక్ష మధ్యలో విక్రయించేవారని పోలీసుల వద్ద దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఒక ఫిర్యాదుదారు పేర్కొన్నారు.

రంగు రాళ్లనైతే లక్షల రూపాయల్లో అమ్మేవారని, మీర్‌గావ్ ఆలయంలో నకిలీ పాములను, పులులను పెట్టి ప్రజలను భయపెట్టేవారని కూడా ఎఫ్ఐఆర్‌లో ఆరోపించారు.

# రేపటి కోసం-మేలుకొలుపు

మీర్‌గావ్ నుంచి సుమారు కిలోమీటరున్నర దూరంలో అశోక్ ఖరత్ ఫామ్‌హౌస్ ఉంది. ఈ ఫామ్‌హౌస్ పూర్తిగా రాతితోనే నిర్మించారు. మొదట్లో అది ఒక చిన్న షెడ్డు లాంటి రూమ్. ఇప్పుడది మూడు నుంచి నాలుగు అంతస్తుల ఫామ్‌హౌస్‌గా మారింది.

16 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ఫామ్‌హౌస్‌ను నిర్మించేందుకు సుమారు రూ.18 కోట్లు ఖర్చు అయి ఉంటుందని స్థానికులు తెలిపారు. అశోక్ ఖరత్ అనుచరులలో క్లాస్ 1 అధికారులు, రాజకీయ నేతలు, వ్యాపారవేత్తలు, వైద్యులు వంటి ఉన్నత స్థాయి వ్యక్తులే ఉండేవారని స్థానిక కార్యకర్తలు చెబుతున్నారు. అశోక్ ఖరత్ అపాయింట్‌మెంట్‌కు రూ.10 వేలు ఉంటుందని తెలిసింది. అంతేకాక ఆయన్ను కలిసేందుకు రెండు నెలలు వేచి ఉండాల్సిందే.

అశోక్ ఖరత్ కార్యాలయం నాసిక్‌లోని కెనడా కార్నర్ ఏరియాలో ఉంది. షట్టర్‌పై 'ఒక ప్రాపర్టీ డీలర్స్ అండ్ డెవలపర్స్' అని పెద్ద అక్షరాలతో రాసి ఉంది.

ప్రస్తుతం ఈ కార్యాలయానికి తాళం వేయడంతో అక్కడంతా నిర్మానుష్యంగా ఉంది. అక్కడున్న కొంతమంది వ్యక్తులతో మేం మాట్లాడినప్పుడు, మహిళలపై లైంగిక దాడి గురించి లేదా అలాంటి ఘటనలకు సంబంధించి తమకెలాంటి అవగాహన లేదని వారు చెప్పారు.

అశోక్ ఖరత్‌పై మొదట ఫిర్యాదు దాఖలు చేసిన మహిళ మాట్లాడుతూ.. '' నన్ను పదేపదే కార్యాలయానికి పిలిపించారు. మొదట పెళ్లి సంబంధం కుదిర్చే పేరుతో, ఆ తర్వాత వైవాహిక జీవితంలో అడ్డంకులు తొలగించే పేరుతో, ఆ తర్వాత పూజా కార్యక్రమాల పేరుతో.. ఇలా నన్ను పదేపదే తీవ్రంగా హింసించారు'' అని చెప్పారు.

ఈ విషయం గురించి బయట ఎక్కడా మాట్లాడవద్దని తమను అశోక్ ఖరత్ బెదిరించినట్లు ఆయనపై ఫిర్యాదు చేసిన మహిళలు చెబుతున్నారు. 2020లో మహారాష్ట్ర ప్రభుత్వం అశోక్ ఖరత్ స్థాపించిన శివనికా సంస్థాన్‌కు 48 కి.మీల దూరంలో ఉన్న దర్నా డ్యామ్ నుంచి 39 లక్షల లీటర్ల మంచినీటిని అందించాలని నిర్ణయించింది.

ప్రస్తుతం ఈ మంచినీటి సరఫరాను ఆపివేయాలని ఆదేశాలు జారీ చేసింది ప్రభుత్వం. అశోక్ ఖరత్ ఈ నీటిని వ్యవసాయానికి ఉపయోగించారని స్థానికులు చెప్పారు.

గతంలో అశోక్ ఖరత్ స్థాపించిన ఇషాన్యేశ్వర్ ఆలయ అభివృద్ధి కోసం కోటిన్నర రూపాయల నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. 2017–18లో కూడా ఈ పని కోసం మరో 25 లక్షల రూపాయలను కూడా ఆమోదించారు.

అశోక్ ఖరత్ భూలావాదేవీలు కూడా





చేసేవారు. మీర్‌గావ్ గ్రామంలోనే 50 నుంచి 55 ఎకరాల భూమిని అశోక్ ఖరత్ కొనుగోలు చేశారని గ్రామస్థులు చెబుతున్నారు.

ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తులో అశోక్ ఖరత్ ఆస్తులు రూ.40.78 కోట్ల వరకు ఉంటాయని వెల్లడైంది.
ఇప్పుడు చెప్పండి జన విజ్ఞాన వేదికలాంటి వాళ్ళు జ్యోతిష్యం మూఢ నమ్మకం, పంచాంగం అనేది కేవలం క్యాలెండరు మాత్రమే అని ఎన్నిసార్లు మొత్తుకున్నా కేవలం మీ స్వార్థం కోసం, ఇతర మతాల ముందు మీ Ego satisfy చేసుకోవడం కోసం, జోతిష్యాన్ని, జ్యోతిష్య పండితులం అని చెప్పుకునే వాళ్ళను సమర్తించుకుంటూ వస్తున్నారు...

ఎంత చదివితే ఏం లాభం, కనీస విషయ పరిజ్ఞానం లేకుండా చిన్నప్పటి నుండి మతం పేరుతో, ఆచారాల పేరుతో ఇలాంటి మూఢ విశ్వాసాలను ప్రోత్సాహిస్తున్నంత కాలం అమాయకులు భయంతో నమ్మి బలై పోతుంటారు....

మనదాకా వస్తే గాని ఇలాంటి వాటిని మనం వ్యతిరేకించలేం.. ఏక్కడో జరిగింది కదా అని ఇప్పటికీ ఇలాంటి వాటిని సమర్థించే వాళ్ళను చూస్తే జాలి వేస్తుంది

చర్చిల్లో పాస్టర్లు చేసినప్పుడు ఎందుకు అనలేదురా, మదర్సాలలో వాళ్ళు చేసినప్పుడు ఎందుకు అడగలేదు అని అనొచ్చు కాని మన ఆడవాళ్ళు కుటుంబం బాగుండాలని వెళ్ళేది ఇలాంటి జ్యోష్యుల దగ్గరికే, రేపు ఇలాంటి పరిస్థితి మనవాళ్లకు జరిగితే ఊహించుకోవడానికి ఎంత దారుణంగా ఉందనే కనీస ఆలోచన చేయరు.. కాబట్టి మూర్ఖులను మార్చలేం... దయచేసి మీ ఇంట్లో వాళ్ళకి మీరే ఏది నిజం, ఏది అబద్ధం, జ్యోతిష్యం లాంటివి నిజంగా ఉంటే వాటితో ఆ పండితులే వాళ్ళ భవిష్యత్ తెలుసుకుని దేశాన్ని ఏలేవారు కదా అని అర్థం అయ్యేలా చెప్పే ప్రయత్నం చేయండి....

మూఢ నమ్మకాలకు దూరం చేయండి★★★

బహుమతి పొందిన కవిత

# గెలుపు

కాలం కంటే వేగంగా కదులుతున్నది మనసు
అంతకంటే చురుకుగా పరుగులు తీసి
శిఖరాగ్రానికి శిరసును తాకించాలనే ప్రయత్నం
రేపటి యుద్ధానికి అన్నీ సిద్ధం చేసుకున్నాడు
తెల్లవారితే జరిగే రణరంగపు ఆలోచనల మధ్య
మూతపడని కళ్ళు తెల్లవార్చుకున్నాయి
ఆశల రెక్కలతో ద్విచక్ర వాహనం మీద
గగనాన విహరించే పక్షిలా దూసుకు పోతున్నాడు
విజయం మీద దృష్టి తప్ప వేరేది కనిపించడం లేదు
ప్రయత్నాన్ని పరిహసిస్తూ విధి వెక్కిరించింది
తప్పుదారిలో దూసుకు వచ్చిన మరో వాహనం
అతని రెండు కాళ్ళను శరీరానికి వేరు చేసింది
పోటీ పడవలసిన కాళ్ళు పెళుసు ముక్కలైనాయి
సిరలలో రక్తం చింది నేలన కళ్ళాపి చల్లింది
గెలుపు ముంగిలి దారిమారి మరణశయ్యను చేరింది
"గెలుపంటే తోటివారిపై ఆధిపత్యం సాధించడం కాదు
సాటివారికి సాయపడి వారి మనసులలో నిలిచిపోవడం"
అనుకున్న అతని పెదవులపై చిరునవ్వు మెరిసింది
అవయవదాన పత్రంమీద అంగీకారముద్రను వేశాడు
రేపటి వెలుగులు చూస్తాడో లేదో తెలియకున్నా
వంచించిన విధిపై విజయం సాధించాడు....
మానవత్వమే అసలైన గెలుపని నిరూపించాడు

**శింగి రాజు శ్రీనివాసరావు**

★★★★★★★

# కరెంట్ అఫైర్స్







ఇప్పటి వరకూ చంద్రుడి ఆవలివైపునకు మానవుడు వెళ్లలేదు. అక్కడ ఎలా ఉంటుందో మనకు తెలియదు. కానీ, ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది నాసా ఆర్టెమిస్-2. ఈ మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములు ఏప్రిల్ 1న చేపట్టిన యాత్ర.. దిగ్విజయంగా పూర్తయ్యింది. పది రోజుల అనంతరం వీరు తిరిగి క్షేమంగా భూమికి చేరారు. చందమామకు అత్యంత సమీపంగా వెళ్లి, దాని కక్ష్యను చుట్టి వచ్చారు. అంతేకాదు, భూమి నుంచి అత్యంత దూరం వెళ్లిన వ్యోమగాములు కూడా వీరే. 50 ఏళ్ల తర్వాత మానవసహిత చంద్రుడి మిషన్ విజయవంతమైంది. జాబిల్లిని చుట్టేసిన ఆర్టెమిస్-2 బృందం తిరిగి భూమికి క్షేమంగా చేరుకుంది. భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం 5.38 గంటలకు పసిఫిక్ మహాసముద్రం శాన్‌డియాగో తీరంలో ఒరాయన్ క్యాప్సుల్ ల్యాండ్ అయింది. అందులోని నలుగురు వ్యోమగాములు సురక్షితంగా భూమికి చేరుకున్నారు. దీంతో పది రోజుల మిషన్ విజయవంతంగా పూర్తయింది. భూమి నుంచి ఎక్కువ దూరం ప్రయాణించిన వ్యోమగాములుగా ఆర్టెమిస్-2 బృందం చరిత్ర సృష్టించింది. ఆర్టెమిస్ II యాత్రలో ముగ్గురు అమెరికన్లు, ఓ కెనడియన్ సహా వ్యోమగాములు ఇప్పటి వరకూ మానవులు చూడని చంద్రుడి ఆవలివైపునకు వెళ్లొచ్చారు. భూమి



# కరెంట్ అఫైర్స్

నుంచి 4.06 లక్షల కిలోమీటర్ల ప్రయాణించారు. అక్కడ సంపూర్ణ సూర్యగ్రహణాన్ని వ్యోమగాములు వీక్షించడం మరో విశేషం. ఆర్టెమిస్ II మిషన్‌కు చెందిన ఓరియన్ వ్యోమనౌక మనుషులు చేరుకున్న దూరంలో కొత్త రికార్డ్ సాధించింది. సోమవారం సుమారు 13:56 ఈడీటీ (ఈస్టర్న్ డేలైట్ టైమ్ – భారత కాలమానం ప్రకారం రాత్రి 11.26 గంటల) సమయానికి ఇది 248,655 మైళ్లు (400,000 కిలోమీటర్లు) దాటి మానవ రికార్డులను బద్దలుకొట్టింది. 1970 లో అపోలో 13 మిషన్ నెలకొల్పిన రికార్డును ఇది అధిగమించింది.

ఈ అంతరిక్ష నౌక చంద్రుడిపై ల్యాండ్ అయ్యేందుకు కాకుండా, భూమి నుంచి ఎన్నడూ కనిపించని చంద్రుడి అవతలి వైపు చుట్టి రావడమే దీని లక్ష్యం. ఉపగ్రహాలు ఇదివరకే ఆ అవతలి వైపును ఛాయాచిత్రాలు తీశాయి, కానీ అవతలి వైపు ఉపరితలంపై ఉన్న కొన్ని భాగాలను, దాని విశాలమైన బిలాలను, లావా మైదానాలను మొట్టమొదట చూసినవారు వ్యోమగాములే.

భూవాతావరణంలోకి వ్యోమనౌక ధ్వనికంటే 33 రెట్లు వేగంతో ప్రవేశించింది. 1960,70 దశకంలో నాసా చేపట్టిన అపోలో మిషన్ల తర్వాత వ్యోమనౌక ఇంతటి వేగంతో రావడం ఇదే మొదటిసారి. క్రమంగా ఓరియన్ క్యాప్సూల్ స్వీయనియంత్రణ పైలట్ సాయంతో వేగాన్ని తగ్గించుకుని.. భూమికి చేరుకుంది. భూవాతావరణంలోకి ప్రవేశించే సమయంలో ఘర్షణ వల్ల ఏర్పడిన వేడికి దాని చుట్టూ ఎర్రటి ప్లాస్మా ఆవరించి, కాసేపు కమ్యూనికేషన్ పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఒక్కసారిగా తీవ్ర ఉత్కంఠ, ఆందోళన వ్యక్తమైంది. అయితే, వేల డిగ్రీలో ఉష్ణోగ్రతలను తట్టుకునేలా రూపొందించిన హీట్ షీల్డ్ ఆశలను ఒమ్ముచేయలేదు అపోలో 13 సృష్టించిన రికార్డును అధిగమించి, అంతరిక్షంలో అత్యంత దూర ప్రయాణం చేసిన మానవులుగా చరిత్ర సృష్టించారు. వ్యోమనౌకలో తాగునీరు, ప్రొపెల్లెంట్ వ్యవస్థ వాల్వ్ సమస్యలు, టాయిలెట్ సరిగా పనిచేయకపోవడం వంటి ఇబ్బందులను వ్యోమగాములు ఎదురైనప్పటికీ, వాటిని లెక్కచేయకుండా తమ లక్ష్యాన్ని పూర్తి చేశారు. ఏప్రిల్ 1న ఒరాయన్ వ్యోమనౌకలో భూమి నుంచి బయలుదేరిన వ్యోమగాములు 24 గంటల భూకక్ష్యలో గడిపారు. ఆ సయంలో లైఫ్ సేవింగ్ వ్యవస్థలు, ఇతర సాంకేతిక పరికరాలను పరీక్షించారు.

అనంతరం నాసా ట్రాన్స్‌లూనార్ ఇగ్నిషన్‌ను చేపట్టింది. వ్యోమనౌక ప్రధాన ఇంజిన్‌ను 6 నిమిషాలు ప్రజ్వలంపజేయడంతో 2,721 కిలోల థ్రస్టును ఉత్పత్తి చేసింది. దీంతో గంటకు 38 వేల కి.మీ. వేగంతో నౌక భూకక్ష్యను దాటి, చంద్రుడి దిశగా పయనించింది. సిబ్బంది చివరగా, ఒక తుది పరీక్షను ఎదుర్కోనున్నారు. అదేంటంటే.. గంటకు దాదాపు 25,000 మైళ్ల వేగంతో వాతావరణంలోకి దూసుకొచ్చి, పారాచూట్ సహాయంతో పసిఫిక్ మహాసముద్రంలో దిగడం.

.★★★

## కథ

# అపోహ



**బహుమతి పొందిన కథ**

## అసురి ఉషా రాణి

సూర్యుడు పశ్చిమాన అస్తమించే సమయం. చిమ్మ చీకట్లు అప్పుడప్పుడు ముసురుకుంటున్నా అందరి ఇండ్లలో లైట్లు వేస్తూ చీకటిని తరిమికొడుతూ రాత్రికి ఆహ్వానం పలుకుతున్నారు. ఆ కాలనీలో వాసులు.

నిషిత హోంవర్క్ రాసుకుంటూ వుంది. శారద రాత్రికి వంటగదిలో టిఫిన్ రెడీ చేస్తోంది. ఆఫీసు నుండి అప్పుడే రంగనాథ్ ఇంటి లోపలికి అడుగు పెట్టాడు.

"డాడీ" అంటూ తండ్రిని వాటేసుకుంది నిషిత.

"హోంవర్క్ రాస్తున్నావా? నా చిట్టి తల్లి" అంటూ ముద్దాడాడు రంగనాథ్.

అవునంటూ తల ఊపి పుస్తకాలు ముందర వేసుకుంది.

అప్పుడు రంగనాధ్ "ఇదిగో నా ఫ్రెండ్ మురళి" అంటూ పరిచయం చేశాడు భార్యకు. బైక్ పార్క్ చేయడానికి ఇంత సేపయ్యిందా?" అని మురళిని అడిగాడు. రంగనాద్.

" ఓ అలాగా రండి కూర్చోండి: అంది శారద. ప్లేట్లో స్నాక్స్. మంచినీళ్లు పట్టుకొచ్చింది. తర్వాత కాఫీ రెడీ చేసి రంగనాథకి మురళికి ఇచ్చింది శారద.

"మురళి మా పాప నిషిత. సెకండ్ స్టాండర్డ్ చదువుతోం ది" అంటూ పాపని పరిచయం చేశాడు రంగనాథ్. పాప తలవంచుకొని రాసుకుంటోంది. మురళి పాప దగ్గరికి వెళ్లి తల నిమిరి "హోంవర్క్ రాసుకుంటున్నావా పాప? అంటూ బుగ్గనిమిరాడు. శారద మురళి చేస్తున్న చేష్ట లను గమనిస్తోంది. ఈ లోపల ముగ్గురు పిచ్చాపాటి మాట్లాడుకున్నారు.

నిషిత "హోంవర్క్ అయిపోయింది మమ్మీ? అంటూ శారద దగ్గర కూర్చుంది.

"పాప ఇలా రా" అంటూ మురళి నిషితని తన ఒళ్ళో కూర్చోబెట్టుకున్నాడు. చేతులు తడుముతున్నాడు. భుజాలు పట్టుకున్నాడు. ఇవన్నీ గమనిస్తున్న శారదకు ఒళ్ళు మండిపోతోం ది. వెంటనే పాపతో

"నిషి లోపలికి వెళ్లి ఆడుకో. మేము

# కథ

ముగ్గురం కాసేపు మాట్లాడుకుని వస్తాము” అని అనగానే నిషిత లోపలికి వెళ్ళింది. మనసు మనసులో లేదు పాపను ఒళ్ళో కూర్చోబెట్టుకొని భుజాలు నొక్కడం ఏంటి? శారద ఆలోచిస్తోంది. పాపకు రేపటి నుంచి పాపకు “బ్యాడ్ టచ్ గుడ్ టచ్ తప్పకుండా నేర్పించాలి” అనుకుంది. ఈ మగాళ్ళంతా ఇంతే మంచి తనం ముసుగులో చేసే చేష్టలు ఎవరికి తెలుసు అనుకుంది కసిగా. మురళి వెళ్లిపోయాడు.

ఆ రాత్రి రంగనాథ్తో శారద “చూడండి మీరు స్నేహితులను ఇంటిదాకా దయచేసి తీసుకుని రావద్దు. ఆఫీసులో మాట్లాడి ఆఫీసు వరకే పరిమితం చేయండి. పాప ఎదుగుతుంది అది గుర్తుపెట్టుకోండి. అంది. శారద. అంతే రంగనాథ్ బిత్తర పోయాడు.

“చిన్న పాప దానికి అంత భయపడుతున్నావా? నీ ఆలోచనలు నాకేం అర్థం కావట్లేదు” అన్నాడు నింపాదిగా.

“నేను ఎందుకు చెప్తున్నాను మీకే నిదానంగా అర్థం అవుతుంది లెండి. ఇకమీద ఎవరిని తీసుకొని దయచేసి రావద్దు అంటూ పాపతో పాటు పడుకుంది. ఓ వారం రోజులు గడిచాయి. మురళి సరాసరి ఇంటికి వచ్చాడు. అప్పటికి రంగనాథ్ ఇంటికి రాలేదు.

“ వస్తే ఇద్దరూ కలిసే రావాలి కదా? ఎందుకు ఒంటరిగా వచ్చాడు”. అనుకుంది శారద.

“ ఏంటి మురళి గారు ఆయన మీతో పాటు రాలేదా? మీరు ఒక్కరే వచ్చారేంటి? అని అడిగింది.

“లేదు మేడం నాకు దారిలో కాస్త పనుండి పాపకి బిస్కెట్స్ చాక్లెట్స్ సూపర్ మార్కెట్లో కొనుక్కొని సరాసరి ఇటే వస్తున్నాను అన్నాడు.

“అలాగా కూర్చోండి” అంటూ నిశీతను లోపలికెళ్ళి రాసుకోమని సైగ చేసి పంపించేసింది. “అదేంటి మేడం పాప కోసం తెచ్చాను” అన్నాడు మురళి.

“పాపా ఇలా రావా” అని పిలిచాడు. శారద గమనిస్తోంది ఆ రోజే శారద పాపని హెచ్చరించింది. ఈ అంకుల్ వస్తే పిలిస్తే పోవద్దని అందుకే నిషిత తల్లి వైపే చూస్తోంది అనుమతి కోసం. శారద ఏ అనుమతి ఇవ్వనందువలన మురళీ దగ్గరికి వెళ్లక, లోపలికి తిరిగి వెళ్ళిపోయింది. ఓ అయిదు నిమిషాల్లో రంగనాథ్ లోపలికి వచ్చాడు.

“మురళి నాతో ఒక మాట అయినా చెప్పలేదు మా ఇంటికి వస్తున్నట్టు.” అని అడిగాడు. “పాపని చూడాలనిపించింది. అందుకే బిస్కెట్స్ చాక్లెట్స్ తీసుకొని వచ్చాను సార్.

“అలాగా పాపను పలకరించావా? అని అడిగాడు. రంగనాథ్. మౌనం వహించాడు.

“నిషీ ఇలా రామ్మా అంకుల్ని చూసావా? పలుకరించావా? అని అడిగాడు రంగనాద్.

నిషిత తల అడ్డంగా ఊపి తల్లిని చూసి భయంతో లోపలికి వెళ్ళిపోయింది. ఇవన్నీ గమనించకపోలేదు రంగనాథ్ మురళికి అర్థం అయింది. తన దగ్గరికి పాపను పంపడానికి శారదా ఆలోచిస్తోందని అట్టే ఎక్కువ సేపు ఉండక ఐదు నిమిషాల్లో వెళ్ళిపోయాడు మురళి.

‘శారద నువ్వు చేసే పని ఏమన్నా బాగుందా ? అతను ఎంతో ప్రేమతో వచ్చాడు. పాపను కనీసం అతనితో పలకరించలేదే నువ్వు” అని అడిగాడు రంగనాథ్.

“ఏం అవసరం లేదు. వచ్చాడు పాపని చూశాడు వెళ్ళాడుగా. ఒళ్ళో కూర్చోబెట్టమంటారా? నాకు ఇష్టం లేదు ఇవన్నీ. అంటూ భర్తకు కాఫీ తేవడానికి వంట గదిలోకి వెళ్ళిపోయింది శారద.

ఓ మూడు నెలలు గడిచాయి. మురళి “సార్ పాపకు సెలవులేగా? అలా పార్కు దాకా వెళ్ళదామా? అని అడిగాడు రంగనాథ్ ని. ఏమీ మాట్లాడక ఊరుకుండిపోయాడు. “మేడంను నేను అడుగుతాను సార్ పోదాము అన్నాడు. మురళి



కథ

ఇంటికి వచ్చి "మేడం పాపం తీసుకుని అలా సరదాగా పార్కు వెళ్లొద్దామా?" అని అడిగాడు. ఎందుకు ఏమని అడక్కుండా "సరే" అంటూ తల ఊపి పాపను తీసుకుని ఆ సాయంత్రం నలుగురు పార్క్కి వెళ్లారు. ఏమాత్రం మురళిని పాపని తాకనీయకుండా శారద తనే పాపను అట్టే పెట్టుకుంటూ పాపతోనే ఆడుకుంది. మురళి ఇవన్నీ కూడా గమనించాడు. రంగనాథ్ గమనించినా ఏమీ చెప్పలేకపోయాడు.

ఓ రోజు అలా సరదాగా బీచ్ కు నలుగురు వెళ్లారు. నీళ్లల్లో ఆడుకుంటూ గడిపారు అమాంతం వచ్చే అల పైకి రావడంతో నలుగురు పరుగులు తీశారు. పాప నీటిలో పడిపోయింది.

శారద రంగనాథ్లు " పాపా పాపా" అంటూ ఒకటే అరుపులు. మురళి ఏమాత్రం భయపడక నీళ్లలో ఈదుకుంటూ వెళ్లే పాపను తీసుకొచ్చాడు.

"థాంక్స్" అంటూ పాపను పట్టుకుని వలవల ఏడ్చేసింది శారద.

"అందుకే నేను ఎన్నోసార్లు చెప్పాను. ఇలా షికారులని, పార్కులకని వెళ్ళద్దు అని వింటేగా. మీరు పోదాం పోదాం అంటూ లాక్కొచ్చారు." అంటూ విసుక్కుంది. ఆ రాత్రి రంగనాద్ తో కూడా శారద మాట్లాడలేదు.

మురళికి అర్థమైంది ఈ కుటుంబం పాపని తన దగ్గర కూడా రానివ్వడం లేదని. అంటే అందరి మగవాళ్ళలాగా తనను బేరీజు వేసుకున్నారా? అంటూ బాధపడ్డాడు. ఏమి చెప్పుకోలేని స్థితి చెప్పినా, నమ్మలేని పరిస్థితి. రంగనాథ ప్రమేయం ఏమీ లేదని, పాప విషయంలో శారదదే పైచేయని అర్థమైపోయింది. కానీ మురళి మనసు లోతుల్లో గూడు కట్టుకున్న బాధ ఎవరు తీర్చగలరు.?

అలా ఓ ఆరు నెలలు గడిచాయి.

పాపను చూడలేక ఉండలేకపోతున్నాడు. అసలు ఏంటి సంబంధం? ఏమిటి బంధం ? ఎందుకు కలిపాడో ఆ భగవంతుడు. ఎందుకు పదేపదే పాపని చూడాలి అని అనుకోవడం అనుకుంటూ బాధగా మూలిగాడు మురళి. ఎవరితో చెప్పుకోగలడు తన బాధను తన గతం తాలూకు ఆవేదనను ఎవరితో పంచుకోవాలని అనుకున్నా చెప్పినా వినే వాళ్ళు ఎవ్వరూ లేరని అర్థమైంది.

మురళికి ఓ రోజు సరాసరి ఉదయం తొమ్మిది గంటలకి రంగనాథ్ ఇంటికి వచ్చాడు.

మురళి "మేడం మీరు ఏమనుకున్నా ఎన్ననుకొన్నా ఈరోజు సాయంకాలం అయిదు గంటలకు దయచేసి నేను చెప్పే అడ్రసు కు పాపను తీసుకుని రండి. మీ కాళ్లు మొక్కుతాను" అని ప్రాదేయ పడ్డాడు. శారదకు ఏమీ పాలు పోలేదు.

"ఎందుకు రావాలి? ఎక్కడికి రావాలి? ఎందుకు పాపం తీసుకొని రావాలి? మీరు చెప్పిన చోటికి మేము రాము. పాపను నేను తీసుకుని రాలేను." అంది గట్టిగా శారద.

"అరే సార్. మీరన్నా చెప్పండి సార్. ఈరోజు దయచేసి సాయంత్రం ఐదు గంటలకి పాపని మేడంని తీసుకొని రండి" అన్నాడు.

"అరే అదే ఎందుకు అని అడుగుతున్నాను? కారణం చెప్పొచ్చుగా."అన్నాడు రంగనాద్.

"ప్లీజ్ మేడం మీకు కారణం చెప్పలేను. చెప్పినా మీరు వినరు నమ్మరు. అర్థం చేసుకోలేరు కూడా. దయచేసి సాయంత్రం రండి" అని చేతులు జోడించి ప్రాధేయపడ్డాడు మురళి.

ఇంకేమీ పాలు పోక శారద రంగనాథవైపు చూసి "సరే వస్తాను? అంది

"థాంక్యూ మేడం " అంటూ

కథ

వెళ్లిపోయాడు మురళి.

"ఇదేంటండి గోల. అర్థమే కావటం లేదు. ఎన్నిసార్లు చెప్పినా, ఈ మురళికి మెంటలా? పాపా పాపా అంటూ పీకులాడుతున్నాడు. పైగా ఈరోజు సాయంత్రం ఒక చోటికి రావాలట సరే మీరు అడ్రస్ ఏదో కనుక్కోండి. పోదాం" అంది. శారద విసుగ్గా.

ఆరోజు సాయంత్రం పాపా, శారద, రంగనాథ్ ముగ్గురు మురళి చెప్పిన అడ్రస్ కి వెళ్లారు. అక్కడ చూస్తే సమాధులు ఉన్నాయి. షాక్ అయ్యారు. ముగ్గురు." ఇదేంటి? ఇక్కడికి రమ్మన్నాడేంటి?" అంటూ ఇద్దరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

"ఏమీ పాలుపోలేదు ఇరువురకు.

"ఫోన్ చేయండి. ఎక్కడికి వెళ్లాడు మహాత్ముడు" అంటూ విసుగ్గా శారద అనేసరికి ఫోన్ చేశాడు రంగనాద్.

"ఎక్కడి నుంచో దూరంగా పరిగెత్తుకుంటూ వచ్చాడు మురళి.

" రండి మేడం. రండి సార్. మీరిద్దరు వచ్చినందులకు చాలా సంతోషం. అంటూ కొద్ది దూరం తీసుకెళ్లి ఒక సమాధి దగ్గర ఆగాడు. అందులో రమ్య పుట్టిన తేదీ. మరణించిన తేదీ. అని రాసి ఉంది.

శారదకు ఏమీ అర్థం కాలేదు. ఏంటని చేతితో సైగ చేసి అడిగింది మురళిని. మురళి మేడం ఈ సమాధి మా చెల్లిది. అల్లారు ముద్దుగా పెంచుకున్న చెల్లి నా ప్రాణం. ఇరవై రెండేళ్ల క్రితం ఇదే రోజు జ్వరం మహమ్మారి మా చెల్లిని తనలో కలుపుకుంది. నా చెల్లి లేనిదే నాకు లోకం లేదు. అలాంటిది. భగవంతుడు దూరం చేశాడు. ఇంకో మాట చెప్పనా? చెబితే మీరు నమ్మరు. మీ పాప రూపంలో నా చెల్లిని చూసుకుంటున్నాను. చూడండి ఫోటో అచ్చు మీ పాప లాగే లేదు. అందుకే పాపని చూసినప్పుడల్లా నా చెల్లి జ్ఞాపకాలతో సంతోషపడుతుంటాను. ఎవరికి చెప్పినా అర్థం కాదు. నా గతం. ఈరోజు నా చెల్లి పుట్టినరోజు. మీరు అనుకున్నట్టు నేను అందరిలా మృగాడిని కాదు. మగవాడిని. ప్రేమను పంచుతున్న అన్నని. నాకూ మనసుంది. నా మనసు నిండా నా చెల్లి ఉంది.

పాపని పిలిచి "పాప" అంటూ ఒక కొత్త డ్రస్సు స్వీట్స్ కేకు, పండ్లు అంతా పట్టుకొచ్చి నిషిత చేతిలో పెట్టాడు. నిశిత అలాగే శారద వైపే చూసింది భయంతో తీసుకోకుండా.

శారద కంటిలో నీరు దారాపాతంగా ప్రవహిస్తోంది. తీసుకోమన్నట్టు కళ్ళతో సైగ చేసింది కూతురికి. పాప తీసుకుంది. మురళి కంటి నుంచి జాలువారిన కంటి చుక్కలు నేలను తడుపుతూ, శారద కంటి రెప్పల నుంచి కారుతున్న కన్నీటి చుక్కలు భూమిలో ఇంకిపోతోంది.

"ఎంత అపోహ పడ్డాను. మురళి గురించి ఎంత చెడుగా ఆలోచించాను. ఎందుకిలా నెగటివ్ థాట్స్ నాకే. అందరి మగాళ్ళలాగా మురళిని జమ కట్టేశాను. లోకంలో మంచి వారు చెడ్డ వారు ఉంటారు. నేను ఎందుకిలా ప్రవర్తించాను? భగవాన్ నాకైతే అర్థం కావట్లేదు అనుకుంటూ.

"మురళి సారి. పాపను ఒక్కసారి నువ్వు తాకేసరికి అందరూ మగాళ్ళల్లో ఉన్న కామ చూపులే అనుకున్నానే కానీ నీ మనసులో ఇంతటి వేదన గూడు కట్టుకొని, అల్లుకుందని నాకు తెలియదు. ఇక నీవు ఎప్పుడు మా ఇంటికి వస్తూ మీ చెల్లి తో ఆడుకోవచ్చు. మాట్లాడుకోవచ్చు. మీ చెల్లికి ఓ చక్కటి అన్నయ్య దొరికాడు. అన్న శారదవైపు రంగనాథ్ చూసి నవ్వుకున్నాడు.


నిశిత సునిషిత మైన చూపులతో తల్లి వైపు చూసి, మురళి దగ్గరకు వెళ్ళింది.

★★

**చదవాల్సిన పుస్తకం**

# “పాన శాల ”






ఉమర్ ఖయ్యాం ‘రుబాయిత్’ను తెలుగులోకి అనేకమంది అనువదించినప్పటికీ, దువ్వూరి ‘పానశాల’ అత్యంత ఆదరణ పొందింది. ‘పానశాల’ కావ్యం తెలుగు సాహిత్య లోకంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఇందులోని భావాలు, వర్ణనలు పాఠకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి.

ఉమర్ ఖయ్యాం పన్నెండవ శతాబ్దంలో రాసిన ‘రుబాయత్’ (నాలుగు లైన్ల పద్యాలు) ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందాయి. ఎడ్వర్డ్ ఫిట్జ్‌గెరాల్డ్ వాటిని ఇంగ్లీష్‌లోకి అనువదించాక ఇవి ప్రపంచవ్యాప్తమయ్యాయి. తెలుగులో కూడా చాలామంది వీటిని అనువదించారు. అయితే, రామిరెడ్డి కేవలం అనువాదంగా కాకుండా, తెలుగుదనంతో కూడిన ఒక స్వతంత్ర కావ్యంగా దీనిని తీర్చిదిద్దాలనుకున్నారు. చాలామంది ఇంగ్లీష్ అనువాదాల ఆధారంగా పానశాలను రాస్తే, రామిరెడ్డి మాత్రం మూలాన్ని అర్థం చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. ఇందుకోసం ఆయన పడ్డ శ్రమ సామాన్యమైనది కాదు: మూలంలోని భావాన్ని పట్టుకోవడం కోసం ఆయన ప్రత్యేకంగా పారశీక భాషను నేర్చుకున్నారు. ఫిట్జ్‌గెరాల్డ్ అనువాదాన్ని, ఉమర్ ఖయ్యాం మూల ప్రతుల్ని దగ్గర పెట్టుకుని ఏళ్ళ తరబడి అధ్యయనం చేశారు. ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా శ్రమించారు. దువ్వూరి రామిరెడ్డి జీవితంలో 1925, 1926 సంవత్సరాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. 1925లో ఆయన భార్య శేషమ్మ మరణించింది. 1926లో ఏడాది బిడ్డ కుమ్ముదమ్మ మరణించింది. ఈ విషాద స్మృతుల నుంచి మరో మలుపుగా ఆయన 1926లో పర్షియన్ కవి ఉమర్ ఖయ్యాం ‘రుబాయి’లను ‘పానశాల’గా అనువదించారు. ఈ ‘పానశాల’ కావ్యాన్ని అనేకమంది పండితులు రాతప్రతి గానే చదివి ప్రశంసించారు. తర్వాత 1928లో ఈ రచన ప్రథమంగా ‘భారతి’లో ప్రచురితమైంది. వేనాడు రామచంద్రారెడ్డి నెల్లూరు జిల్లాకు



## చదవాల్సిన పుస్తకం

చెందిన ప్రముఖ భూస్వామి, గొప్ప సాహిత్య పోషకులు. దువ్వూరి రామిరెడ్డి గారితో వారికి ఉన్న అనుబంధం తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. వేనాడు రామచంద్రారెడ్డి సాహిత్యం పట్ల ఎంతో మక్కువ కలిగిన వారు. ఆ రోజుల్లో నెల్లూరులో కవులకు, పండితులకు ఆయన ఇల్లు ఒక వేదికగా ఉండేది. కేవలం ఆర్థిక సహాయమే కాకుండా, కవులకు ప్రశాంతంగా రాసుకోవడానికి తగిన వసతులను కల్పించేవారు. దువ్వూరి రామిరెడ్డి పర్షియన్ కవి ఉమర్ ఖయ్యాం 'రుబాయిల'ను తెలుగులోకి అనువదించాలని సంకల్పించినప్పుడు, రామచంద్రారెడ్డి ఆయనను ఆహ్వానించి తన తోటలో అన్ని వసతులు కల్పించారు. నెల్లూరు శివార్లలో ఉన్న ఆ తోటలోని ప్రశాంత వాతావరణంలో కూర్చునే దువ్వూరి 'పానశాల' కావ్యాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. వేనాడు రామచంద్రారెడ్డి దువ్వూరి రామిరెడ్డికి కేవలం ఆశ్రయదాత మాత్రమే కాదు, వారిరువురూ అత్యంత సన్నిహిత మిత్రులు కూడా. దువ్వూరి ప్రతిభను గుర్తించి, రామచంద్రారెడ్డి ఆయనను నిరంతరం ప్రోత్సహించేవారు. తెలుగు సాహిత్యంలో ఒక గొప్ప కావ్యం పురుడు పోసుకోవడానికి కారణమైన వ్యక్తిగా, ఒక ఉత్తమ సంస్కారవంతుడైన సాహిత్య అభిమానిగా వేనాడు రామచంద్రారెడ్డి పేరు సాహితీ చరిత్రలో నిలిచిపోయింది. దువ్వూరి రామిరెడ్డి తన 'పానశాల' పీఠికలో లేదా సందర్భానుసారంగా రామచంద్రారెడ్డి తోటలో ఆ కావ్యం రూపుదిద్దుకున్న తీరును, వారి ఆతిథ్యాన్ని స్మరించుకోవడం విశేషం. పారశీక 'రుబాయీ'లకు సమానమైన భావాన్ని పండించడానికి తెలుగులో 'మత్తకోకిల' వృత్తాన్ని ఎంచుకున్నారు రామిరెడ్డి. ఆ నడకలో ఒక రకమైన తూగు, మత్తు ఉంటుంది. 'మధువు', 'పానశాల' వంటి పదాలను కేవలం మద్యంగా కాకుండా, వేదాంతపరమైన అర్థంతో అన్వయించడానికి ఆయన ఎంతో మేధామథనం చేశారు. నెల్లూరులో తన తోటలో కూర్చుని, ప్రకృతిని గమనిస్తూ ఒక్కో పద్యాన్ని ఆణిముత్యంలా చెక్కారు.


పానశాల కేవలం తాగుబోతుల కోసం రాసింది కాదు. అది జీవితం అశాశ్వతత్వాన్ని, వర్తమాన క్షణాన్ని అనుభవించాలనే సందేశాన్ని ఇస్తుంది. "గడచినది గడచినది; రానున్నదెయ్యదో.. ఉన్నదీ క్షణమొక్కటే!" – అనే లోతైన తాత్వికతను రామిరెడ్డి అత్యంత సరళంగా, సుమధురంగా అందించారు. పారశీక పరిమళాలను తెలుగు తోటలోకి తెచ్చి, మన సంస్కృతికి అద్దేలా రామిరెడ్డి చేసిన కృషి తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. అందుకే ఆయన్ని 'కవికోకిల' అని పిలుచుకోవడం సార్థకమైంది.

సరిగ్గా ఈ ఏడాదితో వందేళ్లు పూర్తి చేసుకున్న పానశాల ఇప్పటికి 21 సార్లు ముద్రణ జరిగి తెలుగు సాహిత్యంలో మకుటం లేని కావ్యంగా స్థిర నివాసం ఏర్పరచుకుంది. పానశాల గేయాలను ఘంటసాల కూడా ఆలపించడం, రికార్డుల రూపంలో రావడంతో మరింత ప్రజాదరణ పొంది, సామాన్య ప్రజలకు చేరువై చిరస్థాయిగా నిలిచిపోయిందనటం ఏ మాత్రం అతిశయోక్తి కాదు

★★★

# చూడాల్సిన సినిమాలు ఆణిముత్యాలు






**ఈదర శ్రీవిద్య**

Wife is not a servant maid . You are marrying a wife not a maid . మూడు రోజుల కిందటే సుప్రీంకోర్టు ఈ హితవు పలికింది . మా తరం వాళ్ళకన్నా ఇప్పటి తరం మగవారు బెటర్ . మాతరంలో మగవారు ఇంటి పనులు చేయడం ఏంటి ? అది ఆడవారి బాధ్యతే అని అప్పటి పెద్దోళ్ళు కూడా మగవారిని , ఆడపిల్లల్ని అలాగే పెంచారు .

గత పాతిక ముప్పై సంవత్సరాల నుండి సమాజంలో కొంత మార్పు వచ్చింది . ముఖ్యంగా పట్టణాల్లో , నగరాల్లో ఆడవారు కూడా మగవారితో సమానంగా ఉద్యోగ వ్యాపారాలు చేయడం మొదలుపెట్టాక ఇంటి పనుల్ని భర్తలు కూడా పంచుకుంటున్నారు . గొప్ప పరిణామమే .

ఉమ్మడి కుటుంబాలు , బాధ్యత లేని కొడుకులు , కోడళ్ళు కథాంశాలతో ఎన్ని సినిమాలు వచ్చాయో లెక్కలేదు . యన్టీఆర్ , సావిత్రి , కన్నాంబలు నటించిన కుటుంబ గౌరవం నుండి ఉమ్మడి కుటుంబం , పండంటి కాపురం , సంసారం ఒక చదరంగం దాకా ఎన్ని వచ్చాయో ! ఆల్మోస్ట్ అన్నీ హిట్టయ్యాయి .

కొంత అలాంటి కథాంశమే అయినా ఈ అమ్మకు రాజీనామా సినిమాలో ఫోకస్ ఇంటి ఇల్లాలి మీద . చాలామంది అమ్మల్లాగానే ఈ సినిమాలో అమ్మ పాత్రలో శారద కొడుకులకు , కోడళ్ళకు , మనమరాళ్ళకు ఎలాంటి లోటు రానీయకుండా అన్నీ అమరుస్తూ ఉంటుంది . రిటైరయిన భర్త కూడా రిటైర్మెంట్ లైఫ్ ఎంజాయ్ చేయకపోతే ఎలా అనే బేచ్ కావటంతో ఇంటి ఇల్లాలికి భర్త కూడా బాధ్యత లేని బిడ్డే అవుతాడడు .

వీళ్ళందరితో విసుగెత్తిపోయిన అమ్మ హఠాత్తుగా రాజీనామా ప్రకటించేస్తుంది . అందరూ ఎవరికి వారి పెత్తనాలతో తమ జీవితాలను

ఇబ్బందుల్లో పడేసుకుంటారు . అందరినీ గట్టెక్కిస్తానికి అప్పటికే ఆరోగ్యం పోగొట్టుకున్న అమ్మ కిడ్నీ అమ్మి ఆదుకుంటుంది .

అందరినీ వదిలి ఒక్కతే వెళ్ళిపోవటానికి రైలెక్కిన ఆమెకు భర్త తన పొరపాటు గ్రహించుకుని తోడు ఉండేందుకు భోగీ ఎక్కుతాడు . కానీ , అతను ఎక్కవలసిన రైలు జీవిత కాలం లేటయిపోతుంది . భర్త చేతిలో చనిపోతుంది .

ఈ సినిమా శారదది . సినిమా అంతా ఆమె చుట్టే . ఆమే షీరో . అద్భుతంగా నటించింది . ఇలాంటి భారీ విషాద పాత్రలను వేయటంలో ఆమెకు ఆమే సాటి . అలాగే నటించింది . సత్యనారాయణ పాత్రతో సహా అన్ని పాత్రలూ ఆమె చుట్టూ తిరిగేవే .

సాయికుమార్ , ప్రసాద్ బాబు , కవిత , రజిత , తులసి , బేబీ మానస , బ్రహ్మానందం , బాబూమోహన్ , పాకీజా , అన్నపూర్ణమ్మ , చలపతిరావు , తదితరులు నటించారు . చిరంజీవి పోలికలో ఉండే రాజ్ కుమార్ ఈ సినిమా ద్వారానే పరిచయం అయ్యాడు . శ్రీ శాంతి అనే నూతన నటి కూడా పరిచయం అయింది . తర్వాత ఏ సినిమాల్లో నటించిందో తెలియదు .

మూలకధ అశోక్ పటేల్ కు క్రెడిట్ ఇచ్చినా రచన క్రెడిట్ మరలా గణేష్ పాత్రోకి కూడా ఇవ్వబడింది . మరలా టైటిల్సులో కధ , మాటలు , స్క్రీన్ ప్లే , దర్శకత్వం క్రెడిట్ దాసరి గారికి ఇవ్వబడింది . ఈ సినిమా లోని అమ్మ పాట చాలా పాపులర్ . మదర్స్ డే నాడు ఈ పాటను వేయని చానల్ ఉండదు . ఏదో చానల్లో ఈ సినిమా కూడా రావలసిందే ఆరోజున .

చక్రవర్తి సంగీత దర్శకత్వంలో పాటలన్నీ బాగా హిట్టయ్యాయి . దాసరి , సిరివెన్నెల పాటల్ని వ్రాయగా బాలసుబ్రమణ్యం , జేసుదాస్ (టైటిల్సులో అలాగే వేసారు ) , మనో , చిత్ర , మిన్ మినీలు శ్రావ్యంగా పాడారు . ముఖ్యంగా సృష్టికర్త ఒక బ్రహ్మ అతనిని సృష్టించినది ఒక అమ్మ అనే పాట దాసరి మీదే చిత్రీకరించబడింది . కళ్ళు లేని బిచ్చగాడుగా ఈ పాటను పాడుకుంటూ కనిపిస్తాడు .

మరో అమ్మ పాట ఎవరు రాయగలరు అమ్మ అను మాట కన్న కమ్మని కావ్యం . చాలా బాగుంటుంది . నేపధ్యంలో వచ్చే చనుబాలు తాగితేనే బ్రతుకు తీపి తెలిసింది , ఇది ఎవ్వరికీ ఇవ్వని వీడుకోలు పాటలు చాలా బాగుంటాయి . రాజ్ కుమార్ , శ్రీ శాంతిల మీద చీకటిలో ఆడపిల్ల అంటూ ఓ డ్యూయెట్ ఉంటుంది .

ఈ సినిమాకు విశేషం ఏమిటంటే ముగ్గురు హేమాహేమీలు నిర్మాతలు . ఇంత తక్కువ బడ్జెట్ సినిమాను ముగ్గురు హేమాహేమీలు నిర్మించటం . కె దేవీ వరప్రసాద్ , టి త్రివిక్రమరావు , చలసాని అశ్వనీదత్ . షూటింగ్ ఎక్కువ భాగం విజయవాడలో జరిగింది . అప్సర థియేటర్ కూడా కనిపిస్తుంది

తెలుగులో విజయం సాధించిన ఈ సినిమా కన్నడంలో అమ్మ టైటిలుతో రీమేక్ చేయబడింది . లక్ష్మి , అనంత నాగ్ , పవిత్ర , తదితరులు నటించారు . 1991 డిసెంబర్ చివర్లో వచ్చిన ఈ సినిమా యూట్యూబులో ఉంది . సంసారపక్ష శాకాహార సినిమా . ఇంతకుముందు చూడనట్లయితే తప్పక చూడవచ్చు . ముఖ్యంగా ఇంట్లో ఇక్కడ చీపురు పుల్లని అక్కడ పెట్టని మగ మహారాజులు తప్పక చూడాలి .

ఈ ప్రపంచంలో భార్యలు అందరి కన్నా భర్తలకే ఎక్కువ అవసరం . అదీ వృద్ధాప్యంలో . కంట్లో eye drops కూడా వేసుకోవడం చేతకాని నాలాంటి భర్తలకు భార్యలు సకలం . అలాంటి అమ్మలకు , భార్యలకు నా ఈ రైటప్ అంకితం . సినిమా ఆఖర్లో అన్నట్లు స్త్రీకి విశ్రాంతి కాకూడదు మరణం . ఆమె జీవించి ఉండగానే కావలసినంత , ఇవ్వకలిగినంత విశ్రాంతిని , ఆదరణని , ప్రేమని ఇవ్వాలి .

సామాజిక కథ

# కార్యేషు.. కరణేషు.
# . భోంచేషు.. శయనేషు..



**వై వెంకట రమణారెడ్డి**

"తెలుగువారి మాట, పాట, ఆతిథ్యం, అనుబంధం.. 'తీపి'. అందుకేనేమో, మధుమేహబాధితుల్లో తెలుగువారి సంఖ్య పెద్దది. 'తేనెలో మాగిన తియ్యని మామిడి మందార మాకంద మకరంద పాకమై స్తన్యమాయె మహేంద్ర సంతతికి' అని ఓ కవివర్యులే అన్నారు. 'స్తుత మతియైన కవుల పలుకులకు అతులిత మాధురీ మహిమ ఎలా వచ్చిందంటే.. మదవతుల పెదవుల తీపిని ఎడతెరిపి లేకుండా జుర్రుకోవడం వల్లనే' అని మరో సాహితీవేత్త పలికారు. పనసతొనలకన్నా, పంచదారలకన్నా జుంటితేనెకన్నా జున్నుకన్నా చెరకురసముకన్నా చెలియపెదవే తీపి. ఆమాటకొస్తే, ఆఊహకే నోరూరుతుంది. కన్న యింపు పుట్టు కామిని అధరంబు. నవరసాల్లో శృంగారం ఎలాంటిదో షడ్రుచుల్లో తీపి అలాంటిదే. నిద్రలోవచ్చిన కలలు మంచివైతే తీపికలలు, చెవినపడిన వార్త మంచిదైతే తీపికబురు. విజయసూచికగా పంచేవి తీపితినుబండారాలే..!

~~~~~~

మోస్తరువర్షమంటే మరేంటోకాదు.. అదో సన్నటి నీటి ధార, లెక్కెట్టగలిగే ఓ చిరుజల్లు. చిన్నప్పుడు సన్నగా జల్లు కురుస్తోందని ఎవరైనా అంటే, ఇంటిగుమ్మంవద్ద నిల్చొని వీధిదీపం వైపు చూసేటోళ్లం. ఆ వీధిదీపం వెలుగులో వాననీటిధార ఎంతనేది బాగా కనిపించేది.

హైదరాబాద్'లో సాయంత్రపు వర్షమంటే ఓ గగుర్పాటే..! వర్షం కాస్తా ఎక్కువైతే.. గుంతలమయమైన తడి రోడ్లు, ట్రాఫిక్–జాములు, ఉద్యోగి ఇంటికి చేరే సమయం మరికొన్ని గంటల ఆలస్యం..!

మేఘన.. పేరుకు తగ్గట్టు నిండుమేఘంలా గుంభనంగా ఉంటుంది. ఐదేళ్లక్రితం దంపతులైన గౌతమ్, మేఘన వారివారి వృత్తుల్లో బిజీగా ఉంటుంటారు. గౌతమ్ సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా ఓ ప్రముఖ కంపెనీలో పనిచేస్తుండగా, కౌన్సిలర్ గా ఆన్లైన్ లో కావాల్సిన వారికి కౌన్సిలింగ్ ఇస్తుంటుంది మేఘన. ఆమె మాట తీయదనం, సమస్యల పరిష్కార దిశలో ఓ అమ్మలా లాలించడం, స్వాంతన చేకూర్చడంతో మానసిక తత్వ వికాస నిపుణురాలిగా
~~~~~~



కథ

మంచిపేరు తెచ్చుకుని, ఎందరికో నూతన జీవితాలను అందించింది మేఘన.

వర్షంవల్ల, టెక్–పార్కులో టీంలీడర్'గా పనిచేస్తున్న 'గౌతమ్' రాక ఎలాగూ లేటేనని, గేటెడ్ సొసైటీలోని సొంత ఫ్లాట్ హాల్–బాల్కనీలో నిల్చొని, వర్షాన్ని ఆస్వాదిస్తూ.. 'ఈపూటకి రోజూమాదిరి పుల్కాలుగాకుండా, ఆనియన్–పకోడీలైతే ఎలాగుంటుంది..?' అని 'మేఘన' అలా అనుకుందో లేదో.., 'ఏంటోయ్.. వర్షంతో సరసాలా..!' అంటూ ఉన్నట్టుండి వెనకనుంచి గౌతమ్ బిగి కౌగిలింత.

"సాయంకాలపు చిరుజల్లుల చలి, రెచ్చగొట్టే ఇష్టసఖి హొయలూ ఒక్కటే..!"

'నీతో.. నిండాప్రేమలో మునిగిన నాకు, అంత తీరికకూడానా మహానుభావా..?' అంటూ పొగలుగక్కే కాఫీలాంటి వేడిముద్దుతో చుంబించింది.. మేఘన. ఊహించని పరిణామానికి.. గౌతమ్ కాస్త ఖంగుతింటాడేమో అనుకుందిగానీ, పగలంతా వర్షవాతావరణంలో పనిచేసి, తడుస్తూ ఇల్లుచేరడంతో గౌతమ్ కూడా మాంచి ఊపుమీదున్నాడు. పసిపిల్లను ఎత్తుకెళ్లినట్టు ఎత్తుకెళ్లి [రాబోయే కామసునామీని ముందే ఊహించి మేఘన అలంకరించుకున్న] పాన్పుపై తన బలిష్టబాహువులతో బంధించి, విడిపించుకోలేనంతగా ఆక్రమించేశాడు.

"శృంగారం చదరంగం లాంటిది. ముందు.. రాణిని ఏ పొజిషన్ లో ఉంచాలో ఆటగాడికి బాగా తెలిసుండాలి".

ఏమాత్రం సహకరించనని మేఘన తనువూ మొండికేయడంతో, విదిలించుకునే ప్రయత్నంమాని, తనంతట తనే స్వచ్ఛందంగా లొంగేసరికి, మేఘన తనువంతా ముద్దులతో అభిషేకించాడు గౌతమ్. అతడి వెచ్చటి ఊపిరి మేఘనను ఎంతో ఉత్తేజపరుస్తోంది. తన ప్రమేయం లేకుండానే చేతులు అతడి వీపు వెనుక బిగుసుకుంటున్నాయి. కళ్ళు అరమోడ్పులయ్యాయి. అమృతం తాగడమంటే ఏంటో అర్థమవుతోంది.

అమ్మాయిలు మైనపుముద్దలాంటివారు. కొంచెం కరిగిస్తే, ఇక ఆ తర్వాత వారిని ఎటు కావాలంటే అటు ఒంపవచ్చు. ఎలా కావాలంటే అలా తిప్పి అనుభవించవచ్చు. ఆడదాని మనసు కరిగితే, పురుషుడికి పూర్తిగా దాసోహమై అతడి అడుగులకు మడుగులు వత్తడం అనేది లైంగికపరంగా కూడా వర్తిస్తుంది. ఈ లైంగిక రహస్యం తెలుసుకోవడం పురుషులకు అవసరం.

"ఇష్టసఖుడైన వర్షచుక్కకోసం చకోరపక్షిలా.. విరహవేదనతో ఎదురుచూస్తూ మొలకెత్తాలనే తహతహ గింజది. పొలమంతా నాగలి సమ్మగా దున్నుతుంటే.. ఒళ్లు విరుచుకుని సహకరిస్తోంది మట్టిపెళ్ల. కాలువ ఎంతగా పారినా, పంటపొలాన్ని తడిపితేనే దాని ఉనికికొక సార్థకత. కులుకుల నడకతో వయ్యారం ఒలకబోస్తేనే, పైరమ్మ కాస్తా మెడలో పచ్చలహారమయ్యేది. తొలకరిలో నాలుగుపాదాల కష్టమే ఏడడుగులుగా వేయించి పదనిసల పరువాలతో సంసారనావ సాగేది..!"

ఎగువనేమో గాలినాడనివ్వని అధరామృత చుంబనం. దిగువనేమో ఆపుకోలేనంత వేడిసెగ. బాగా చదునైననేల అవడంవల్లనేమో ఇష్టారీతిన దున్నేస్తున్నాడు భూస్వామి. సుఖమైన తీపిబాధల రుచికి దాసోహమవని జంటేదైనా ఉంటుందా..? అసలైన బ్రతుకురుచి అంటే అదేమరి.

"జీవితంలో ఏ స్ఖలనమూ ఇవ్వలేని భావప్రాప్తిని పొందుతున్న క్షణమది..!" బయటపడలేని జీవనచక్రమని తెలిసీ, ప్రతి జంట సంసారంలో ఇరుక్కునేది అందుకే..!

ఇష్టమైన ఒత్తిడీ ఇంపుగానే



ఉంటదని, బాధ అనిపించని నొప్పి మత్తుగా మారి, మేఘన పంటికింది పెదవి తెలియకనే నవ్వింది. పుష్కరకాలంలో మేఘన గుండె అంతగట్టిగా కొట్టుకుంది లేదు, ఊపిరి సెగలు వడగాల్పులయిందీ లేదు. 'నిమిషానికి డెబ్భైరెండుసార్లు కొట్టుకునే గుండె రెండింతలు కొట్టుకున్నా గుండెపోటురాని క్షణాలవి..!' గౌతమ్ సర్వం, తనలో ఐక్యమయ్యాడని కాసేపటికి అసలు విషయం అర్థమైంది మేఘనకు. తన ఎదసంపదనే దిండుగా చేసుకున్న.. గౌతమ్ తలనుఎత్తి 'నచ్చిందా..!' అని అడిగింది. సమాధానంగా.. తాను ఇష్టపడే మూలుగు గౌతమ్ నుంచి వినిపించిందంతే..!

బైకో–కారో–రైలో–విమానమో ఎక్కేటపుడు, దిగేటపుడు.. సైన్సుకు, దైవానికీ తప్పక కృతజ్ఞతలు చెబుతుంటారు చాలామంది. (నాస్తికుడా / ఆస్తికుడా.. అనేదానితో ఏమాత్రం సంబంధంలేని చర్యలివి).

చెప్పుకోవడానికి సిగ్గెందుకు..? ఎన్నాళ్ళో తెలీని, ఇంకొన్నాళ్ళు బ్రతకాలన్న స్వార్థమే ఏ మనిషిదైనా..! స్త్రీ–పురుషులు కలిసి, పడక పంచుకునే సమయాన.. అదో చీకటి పనని తెలిసీ, లైటుంటే నిదుర సరిగారాదనే నెపంతో లైటుని ఆపేసి మరీ కానిస్తారు 'ఆ' పనిని..! సుఖించాలన్న మృగతత్వమది. కొన్నిపనుల్లో.. సైన్సుని–దైవాన్ని మరిస్తేనే, నిద్ర నెపకార్యం కలిసొస్తుంది.

"కోరమీసమున్నోడంటే రాయలసీమ పౌరుషమున్న మావోడే. వీడికి ప్రత్యేక చురకత్తులు అక్కర్లేదు. వీడి చూపొక్కటి చాలు. వీడు సీమవీధిలోకి వెళ్తే.. లేచి నిలబడేది కూర్చొన్నోళ్లేకాదు.. పరచుకున్న వీధి కూడా లేచి ఓ చిరునవ్వు విసురుతాది" అనేవాడు గౌతమ్ వాళ్ళ నాన్న.

"హలో మామగారూ.. హైదరాబాద్ ఇంట్లో మీవాడి మీసంమెలేసేది.. మీ అబ్బాయి మనసుపడి మనువాడిన నా కాలి బ్రొటనవేలు..!" అని ఏదోనాడు ఆ పెద్దాయనకు చెప్పితీరాలబ్బా అని మనసులోనే అనుకుంది మేఘన.

~~~~~~

"రాత్రంతా సతి బిగి కౌగిలిలో ముసుగుతన్ని పడుకున్నా, ఉదయపు సూర్యరశ్మి తాకిడికి శరీరం పులకరించే తీరు అమోఘం..! మాట్లాడితే, పెదాలకు అద్దిన లిప్–స్టిక్ పాడవుతుందేమోనని మగువ పడేపాట్లు.. రాత్రి కురిసిన మంచుబిందువులను ఆకులపై అలకరించుకుని, కదిలితే ఎక్కడ రాలిపోతాయోనని నిశ్చేతనావస్థలోని చెట్టు పడేపాట్లూ.. రెండూ ఒక్కటే..! ఉదయాన వేడి వేడి కాఫీ ఒంట్లో దిగితే.. కలం, కాగితం ఎదురుగా ఉంటే.. ఎవరాపినా ఆగకుండా తూర్పున ఉదయించడానికి రథంలో బయలుదేరే సూర్యునిలా సామాన్యునికీ కవితలు ఒంట్లోంచి తన్నుకొస్తాయి..!"

ఉదయం పడకమీదనుంచి లేస్తూ అరవిరసిన కలువపూవుల్లాంటి మేఘన నగుమోముని.. తనంతటతాను లేచేదాకా, తనివితీరేదాకా, అలా చూస్తుండిపోయాడు గౌతమ్. పున్నమిరాత్రి వెలుగులేదేమని నిదరోతున్న పసిపిల్లలాంటి తన ముఖార విందాన్ని గమనించాడు. కనురెప్పలమాటున చందమామ, కురులమధ్య నక్షత్రాలూ, కుదురుగా దాక్కొంటే.. ఇక పున్నమైనా అమావాస్యే మరి..!

మేఘన లేచేలోగా మార్నింగ్ వాక్ వెళ్దామని, గౌతమ్ పడకమీదనుంచి లేవబోతుండగా.. కదలిన ఇతడి భుజంమీద తుఫాన్'కి ఊగే చెట్టును బంధించే చెట్టువేళ్ళలాగా మేఘన చేతివేళ్ళు బిగుసుకున్నాయి. మేఘన తలలోని మల్లెపూలు.. పోవద్దని పరిమళాలతో
~~~~~~



కథ

ప్రాధేయపడ్డాయి. గౌతమ్ తనమీదకు ఒరగబోతున్నానని.. నిద్రిస్తున్న మేఘన మనసు చిన్నగా తన పెదాలపైనే చిరునవ్వుతో పులకరించింది. మేఘన శారీరక కదలికలకు తదనుగుణంగా అనుసరించమని.. పురుషప్రయత్నంగా గౌతమ్ తన శారీరక భాగాలను ఆదేశించి, తప్పుకున్నాడు. తనదికాని చర్యకు 'పురుషసింహం' అనే బిరుదును మేఘన ఇస్తుంటే.. లోలోనే మురిసిపోయాడు గౌతమ్.

పగలంతా అలసి, తన శరీరాన్నే పాన్పుగా నిద్రించిన నాకు ఏది ప్రపంచం..? ఏది మిథ్య..? చీకట్లో.. తనకళ్ళలోకి చూసే నాదృష్టికి దూరమై, మూతలుపడుతున్న తనకళ్ళలో ఉన్నది నేనేనా..? 'ఓయ్' అనే తన మృదువైన పిలుపుతో మేల్కొనే నామనస్సు రాత్రంతా ఒక్క అలోకవార్తనైనా చెప్పదే..? నా మనసుకు ఏమైంది అంతసేపూ..?

సిగ్గువిడిచి చెప్పాలంటే.. అక్కడ పుస్తకమే కవిని రాస్తుంది. స్వర్గద్వారాలను తెరిచే అదే తాళంచెవి నరకద్వారాలనూ తెరుస్తుందని ఎరుకగలిగీ, కాసేపైనా ఏకత్వంలో విశ్రమించేది ఆక్షణమేగా..? 'ఏకమేవ అద్వితీయం బ్రహ్మ' ఆధ్యాత్మికతలోనే కాదు.. అక్కడ కూడా..!

ఉదయపు నడక ఏరోజుకారోజు వాయిదా పడుతోంది గత కొన్ని నెలలుగా..! ఎందుకంటే.. ఏం చెబుతారు..?

"కష్టసుఖాలను, ఆనందదుఃఖాలను ఒకేలా ఆస్వాదిస్తూ, రాగద్వేషాలకు అతీతంగా జీవించేవాడే స్థితప్రజ్ఞుడని వేదం చెబుతుంది. లక్షల్లో ఒక్కడికే సాధ్యమయ్యే స్థితప్రజ్ఞతను.. ఎండా, వానా, చలి వేటికీ వెరవక.. గుడ్డ, గూడూ లేకుండానే దివారాత్రులను జీవులన్నీ గడిపేస్తున్నాయే..!" అని, ఉదయాన బాల్కనీలో కూర్చొని కాఫీ త్రాగుతున్న గౌతమ్ ఆశ్చర్యపోయాడు.

~~~~~~

ముందురోజు రాత్రి తప్పక పూర్తీ చేయాల్సిన ప్రాజెక్ట్ పని.. మేఘన మైకంలో పడి అటకెక్కించేసాడు గౌతమ్. ఇవ్వాళయినా తప్పక పూర్తీచేద్దామనుకుని, హాల్లోనే కూర్చొని లాప్–టాప్'తో కుస్తీపడుతున్నా.. రాత్రి నుంచీ ఏమాత్రం తగ్గని వర్షం, గౌతమ్'ను పనిచేసుకో నివ్వట్లేదు. ఓపెన్ కిచెన్'లో వంటపనిలో వున్న మేఘన వైపుకి ఓరగా చూశాడు గౌతమ్..!

తన కదలికల్ని గమనిస్తేగానీ అర్థంకాలేదు.. అవి, 'ప్రకృతి ప్రసాదించినవా లేక, తన దేహనిర్మాణాన్నే అలా మలుచుకుందా..?' అని. తనకు కావాల్సినవి అందుకోవడానికి తను కదుల్తోందా లేక, అరలే స్పందిస్తున్నాయా..? అనే సందిగ్ధంలో గౌతమ్ ఉండగానే.. కన్నెగరేస్తూ ఓ సైగ చేసింది మేఘన. కొంటెచూపుతో కదిలించే కనురెప్పలే దివారాత్రులకు మూలమేమోననే చిరుసందేహమొచ్చింది గౌతమ్'కి.

సునిశితంగా పరిశీలించాలేగానీ ఆత్మానాత్మ (ఆత్మ, శరీరం) అవగాహనకు మరోదేహాన్ని ఆశ్రయించాల్సిన అవసరంలేదు. వెన్నెముక నిటారుగానే ఉంటుంది అనేది పచ్చిఅబద్ధం. ఇంద్రధనుస్సూ విస్తుపోయేలా ఉంది.. మేఘన తన వెన్నెముకను కావాల్సినరీతిలో తను వంచుకుంటుంటే..!

తన చిరు అభినయంతో ఎంతటి మగాడిగుండెల్లోనైనా గుబులుపుట్టించగల అభినేత్రి మేఘన. 'అంతటి అందం నాకే సొంతం' అని లోలోనే గర్వపడ్డాడు గౌతమ్. కామికాలేనివాడివి మోక్షగామివి ఎలా ఔతావని..? ఎక్కడో చదివిన వాక్యం మేఘన మోములో ప్రస్ఫుటమయ్యేసరికి, నిగ్రహించుకోలేని గౌతమ్ తనువు మేఘన సొగసుకు దాసోహమంది.
~~~~~~



# కథ

ఒక పువ్వు ఎంత సహజంగా, ఎలాంటి ఆర్భాటం లేకుండా విరిసి, కేవలం తన ఉనికితోనే చూపరులకు ఆహ్లాదం కలిగిస్తుందో.. ఆ సమయాన మేఘన కూడా అంతే సహజంగా, నిరాడంబరంగా ఆరంభమై, ఆద్యంతమూ అదే అనుభూతిని పంచింది గౌతమ్'కి. విరిసిన పుష్పంలోని తేనెబిందువుల్లా, ఆ క్షణాన మేఘన నుంచీ వినిపించే మత్తయిన మాటలూ అంతే సహజంగా ఇమిడిపోతాయి. గెలుపే ధ్యేయంగా సాగేయుద్ధంలో.. అలసిసొలసిన గౌతమ్ దేహానికి అవే తేనెబిందువులు మాధుర్యమై సేదతీరుస్తాయి. గౌతమ్'ని గెలిపించి, గౌతమ్ గెలుపునే తన గెలుపుగా ఆస్వాదిస్తుంది మేఘన.

రోజూ ఓ గ్లాసుడు నీళ్ళుపోస్తే.. దోసెడు మల్లెల్ని ఇస్తుంది 'మల్లెతీగ'. చిన్న ఆధారం చూపితే.. గాఢంగా అల్లుకుపోతుంది 'మనీప్లాంటు'. తను ఎండిపోయినా.. గదినంతా పరిమళం నింపుతుంది 'సంపెంగ'. కానీ.. 'స్త్రీ'తో పోల్చుకుంటే ఇవన్నీ ఏపాటి..? రవ్వంత ఆప్యాయత, కాసింత భద్రతాభావం, 'నీకు నేనున్నాను' అనే భావన కలిగిస్తే.. మల్లెకన్నా ఎక్కువ పరిమళాన్నిస్తూ తీగకన్నా గాఢంగా జీవితాన్ని అల్లుకుపోతుంది.

"మరిగే వయసున ఉరికే మనసుల రేగే వాంఛలకు మూలం 'శృంగారభావనే'. ప్రతి జంటా మదన కుతూహలానికి మంగళహారతులు పట్టేది శృంగార తన్మయావస్థలోనే.

కవుల విభావాలన్నింటికీ శృంగార భావనే ఇంధనం. రసజ్ఞత కొద్దీ కవిత్వం.. రసికత కొద్దీ స్త్రీత్వం.. పురుషుడికి లోబడతాయి మరి..!" "సాహితీవేత్త వ్రాసే ఓ పది వరుసల కవిత.. మగువ ఓ అభినయం ముందు దిగదుడుపేనని ఒప్పుకోవడానికి ఏ కవికైనా మనసొప్పదేమో..? మడికట్టుతో పూజించి.. 'జగన్నాథుని' అనుగ్రహం పొందాలన్నా, జారుకట్టుతో పడకటింట చేరి.. 'ప్రాణనాథుని' గుండెజారేలా అభినయించాలన్నా ఒక్క మగువకే సాధ్యమేమో..!" ఆ సమయాన గౌతమ్'లోని 'కవి' నిద్రలేచి పలికిన మాటలకు మురిసిపోయిన మేఘన మరోసారి మేఘమైంది వర్షించడానికి.

~~~~~~

ఆడ, మగ ఇద్దరూ సమానమేనని, అబ్బాయిలకన్నా తాము ఎందులోనూ తీసిపోమని అమ్మాయిలూ అడ్డంగా వాదిస్తారుగానీ, నిజానికి అట్లా ఎప్పటికీ సమానం కాలేరు, అసలలా అవ్వడం వాళ్లకి ఇష్టం ఉండదు. అందుకే.. పెళ్లి విషయం వచ్చేటప్పటికి తమకి కాబోయే భర్త 'వయస్సు, చదువు, ఎత్తు, ఉద్యోగం, జీతం..' ఇట్లా అన్నింట్లోనూ తమకన్నా అధికుడిగానే ఉండాలని అమ్మాయిలూ కోరుకుంటారు. అందులో ఏ ఒక్కటి తక్కువగా ఉన్నా వాడిని కనీసం కన్నెత్తయినా చూడరు, సచ్చినా చేసుకోరు. ఇది తరతరాలుగా రక్తంలో జీర్ణించుకుపోయిన అంశం. అబ్బాయిలకు మాత్రం ఇట్లాంటి షరతులు ఉండవు మరి. శ్లోకం 'కార్యేషు.. కరణేషు.. భోంచేషు.. శయనేషు..!' అయినా, భార్యాభర్తల మధ్య శారీరక బాంధవ్యం గడిచాకనే నిజమైన మానసిక బాంధవ్యం ప్రారంభమయ్యేది. వివాహం ఒక బాధ్యత. దాన్ని ఆనందంగా స్వీకరించకపోతే ఇంగ్లీషులో గిల్ట్ అవుతుంది. స్వీకరిస్తే ఫ్రెంచ్ కిస్ అవుతుంది.

మగడిని మగాడిగా ప్రేమించుటకు, మగడి కోసమే కన్నీరు కార్చుటకు.. నేనున్నానని నిండుగా పలికే మగువ తోడుగా ఉండటం మగవాడికి మహాభాగ్యం. భార్య అలసటని గుర్తించడం, అభినందన పూర్వకంగా భుజం
~~~~~~



తట్టడం స్త్రీకి ఎంతో స్ఫూర్తినిస్తుంది. అదేవిధంగా అలసిపోయిన భర్తకి చిరునవ్వుతో ఎదురవ్వడం పైసా ఖర్చులేకుండా అతనికి స్త్రీ ఇవ్వగలిగే అత్యుత్తమమైన బహుమతి.

ఫలహారంనుంచి పెన్నువరకూ అన్నీ చిటికెలో సమకూరుస్తుంది, మగాడినీ బతుకుపరీక్షలో గట్టెక్కిస్తుంది. తప్పదనిపిస్తే, పుట్టింటివారిచ్చిన తన బంగారం కొదువ పెట్టయినాసరే మగడి అప్పులుతీర్చి భర్తను సమాజంలో రారాజుగా నిలబెడుతుంది. సలహాలూ–సూచనలతో, సాయాలూ–సహకారాలతో, ధైర్యవచనాలూ–హితోక్తులతో బంధుమిత్ర, పుట్టింటి, అత్తింటివారి విషమ పరీక్షలకూ ఓ దారి చూపిస్తుంది. అందుకే, తను 'కార్యేషు దాసి'. ప్రాపంచికవిషయాలతో పగలంతా సతమతమైన మగడికి.. తన సతి నులివెచ్చటి కౌగిలే నిర్భయక్షేత్రం. ఈతికబాధలతో ఏ దేవుడిముందు గోడు వెళ్లగక్కుకున్నా, ఆ బాధలు తీరగల్గునో లేదోగానీ, సతి దరిచేరితే మాత్రం, కనీసం ఆ రాత్రి వాటిని ఉట్టినెక్కించవచ్చు. అందుకే, తను 'కరణేషు మంత్రి'.

'తిండికలిగితే కండగలదోయ్, కండగలవాడే మగడోయ్..!' తిన్న తిండి జీర్ణమవడంలో నెయ్యి–పెరుగు పాత్ర ఎక్కువ. కాకపోతే, ఈ రెండూ జీర్ణమవడం కాస్త కష్టం. అదే విధంగా.. మగడి పాత్ర రక్తికట్టాలంటే, మగువ పాత్ర తోడవ్వాల్సిందే. కాకపోతే, జీవించే విధానం తెల్సుండాలి. అంతే..! అందుకే, తను 'భోంచేషు మాత'.

ఇంట్లోవారందరి రాత్రిభోజనాలూ పూర్తయ్యాక, ఎవరిగదుల్లోకి వాళ్ళువెళ్లి ఇల్లంతా సద్దుమనిగాక, వంటగది మొత్తం సర్దేసి, ఏ అపరాత్రో పడకగదిని చేరుతుంది ఆ ఇంటి అర్ధాంగి. ఎంతగా అలసిన దేహమైనా, ప్రాకృతిక ఆశలను ఆపుకోలేని స్త్రీత్వ దేహం.. కొంటెకోర్కెలు అల్లరిపెడుతుంటే మగడిదేహాన్ని అల్లుకుంటుంది.

పగలు ద్వైతం, రాత్రి అద్వైతం. 'లైటు' ఉంచనా.. తీయనా..? సమాధానం ఇవ్వనక్కర్లేని ప్రశ్న. సూర్యుడు చూస్తాడేమోననే పగలు ఒంటిపై బట్ట. రాతిరిసూరీడుకి నచ్చదనే అదికాస్తా తొలగింత. అంగాంగ అన్వేషణలో, చూషణలో ఆరితేరిన పసిపిల్లలకి సిగ్గేంటి..? చోద్యం కాకపోతేనూ..?

కేవలం అందుకోసమే ఎదురుచూస్తోన్న పురుష లక్షణం ఊరుకోదుగా..?

మిక్సీలో పచ్చడిలా వంటగదిలో హూనమైన పడతిదేహం మగడితో హాయైన యుద్ధానికి సై అని, నిమిషమాత్ర యుద్ధంలో విజయం సంగతి పక్కనపెట్టి, మగాడ్ని సుఖపెట్టి, సుఖపడి మరింత అలసిపోతుంది. గెలుపెవరిదో తెలీని ఆయుద్ధంతర్వాత, ఓ స్మశాన ప్రశాంతత. బరువెక్కి ఉక్కబోసిన మంచంసైతం ఓ నిట్టూర్పువిడిచి, తనపై ఓలలాడినపిల్లలు నిదరోగానే, తానూ మెల్లగా నిద్రలోకి జారుకుంటుంది.

వందేళ్లతోడు కోరుకున్న వర శాపమేమో..? ఉదయం షరా మామూలే..! రాళ్లతో గాయపరచినా, ఫలాలనే ఇచ్చే చెట్టులా.. 'నువ్ మగాడివిరా బుజ్జీ..!' అంటూ కొండంత ధైర్యాన్నిచ్చి, ఇంటి మగాడ్ని దినకూలీకి సాగనంపి, రోజువారీ ఇంటిపనిలో తనూ నిమగ్నమవుతుంది.

తనంతటతాను కరిగి, తనువును మరిగించి వెలుగులు వెదజల్లే క్రొవ్వొత్తిని త్యాగమయి అని పొగిడేవాడు 'సంసారి'. ఆ వెలుగులకు కారణమవడానికి తనంతటతను ఆత్మార్పణం చేసుకుని అరక్షణంలో బుగ్గిపాలయ్యే అగ్గిపుల్ల త్యాగాన్ని గుర్తించేవాడు 'జ్ఞాని'. సామాజిక కోణంలో ఆలోచిస్తే క్రొవ్వొత్తి.. 'గృహిణి', అగ్గిపుల్ల.. 'మగడు'

ఆచరించడంలో అమ్మంత గొప్పదని, భార్యను..



‘భోజ్యేషు మాతా’ అన్నారు
పెద్దలు. వయసుకు సంబంధించిన
మరో ‘ఆకలి’ తీర్చడానికి..
సోయగంతో అపురూపంగా
తనే విందుభోజనంగా మారే
భార్యని.. ‘భోజ్యేషు రంభా మాతా’
అనాలి. ‘ఆత్మార్పణ’ కావించిన
అతివతో.. ‘అహం’ నశించిన
పురుషుడు గడిపితే.. ఆ కాపురం
‘భూతలస్వర్గం’ అవుతుంది

.★★★★★★

# జీవన చిత్రాలు



## "ఆఖరి మజిలీ అమ్మలు "

చావులకు వెళ్లాలంటే చాలా మంది ఆలోచిస్తుంటారు. కొందరైతే చావుకు వెళ్లినా అంత దూరాన ఉండి అంత్యక్రియలు ఎప్పుడు పూర్తవుతాయోనని ఎదురు చూస్తుంటారు. అలాంటిది కొందరు మహిళలు వారసత్వంగా వచ్చిన పాడె కట్టడం, చితి పేర్చడం, బొంద తవ్వడం వంటి వృత్తులు నిర్వహిస్తూ, ఉపాధి పొందుతున్నారు. సాధారణంగా అలాంటి పనులు మగవారే చేస్తుంటారు. కానీ కామా రెడ్డి జిల్లా కేంద్రంలో మహిళలే అన్నీ తామై పాడె కట్టడం నుంచి చితిని పేర్చి శవం కాలి బూడిదయ్యేదాకా అన్నీ తామై వారసత్వంగా వస్తున్న ఆ వృత్తిలో ఆఖరి మజిలీ వరకు చేయూతనిస్తున్నారు.

కామారెడ్డి పట్టణంలో ఎవరైనా చనిపో యినట్లు సమాచారం అందగానే అంత్యక్రియ లకు అవసరమైన కుండతో పాటు పాడె కట్ట డానికి అవసరమైన కట్టెలు తీసుకుని వెళతారు.

చనిపోయిన వ్యక్తి ఇంటికి వెళ్లి డప్పుల చప్పుడు మధ్యన పాడె కడతారు. శవాన్ని పాడె మీద పడుకోబెట్టగానే బట్ట కప్పేసి శవం పడిపోకుండా తాడుతో కట్టేస్తారు. మరో బృందం చితికి అవసరమైన కట్టెలు తీసుకు వచ్చి శ్మశానవాటికలో పేర్చి, శవాన్ని చితిపై పడుకో బెట్టగానే కట్టెలతో నింపేస్తారు. కుటుంబ సభ్యులు చితికి నిప్పంటించగానే, దహనమయేదాకా అక్కడే ఉంటారు.

కొన్ని కుటుంబాల వాళ్లు శవాలను ఖననం చేస్తుంటారు. అలాంటి పనుల్లో శవాన్ని ఖననం చేయడానికి గుంత తవ్విన తరువాత శవాన్ని అందులో పూడ్చేసే కార్యక్రమం పూర్తయ్యేదాకా ఉంటారు.

కామారెడ్డి పట్టణానికి చెందిన వారంతా పట్ట ణంతో పాటు దేవునిపల్లి, క్యాసంపల్లి, సరంపల్లి గ్రామాల్లో చనిపోయిన వారి ఆఖరి మజిలీలో తమ పాత్ర పోషిస్తున్నారు.

★★★





# ఏజెంట్ 007 ఏకలింగం

"ఏజెంట్ ఏకలింగం" అనే బోర్డు ఆ ఇంటి ముందు వేలాడుతూ వుండటం చూసి, అక్కడ జీపు ఆపమని డ్రైవరకు సైగ చేసాడు సిఐ మహాలింగం.

నిజానికి ఏకలింగం మహాలింగం ఇద్దరూ వారసకు అన్నదమ్ములే – దాయాదుల బిడ్డలు. ఇద్దరు ఎస్.ఐ పరీక్షలు రాసి పాసైనా, మహిలింగం వాళ్ళ నాన్న పెద్ద మొత్తంలో లంచాలు ముట్ట చెప్పడంతో మహాలింగా నికి ఉద్యోగం వచ్చింది.

ఏకలింగం తండ్రి లంచాలు ఇవ్వక పోవటం తో నిరుద్యోగిగా మిగిలిపోయాడు ఏకలింగం . ఉద్యోగం రానందుకు ఏమి దిగులుపడ లేదుఏకలింగా. అలా అని ఎల్ ఐ సి పాలసీలు కట్టించు కుంటూ ఏదో ఒక ఉద్యోగం లే అని సరి పెట్టుకోలేదు.

మీరుకూడా ఏజెంటి ఏకలింగం అంటే ఎల్ ఐసి ఏజెంట్ అనుకున్నారు కదా? కాదండి మనవాడు డిటెక్టివ్ ఏజెంట్. మీరనుకున్నట్టు ఎల్ ఐసి పాలసీలను కట్టించినా బాగుండేది.ఈ పాటకి ఓ ఇల్లు కట్టుకుని ఓ ఇంటి వాడు అయ్యేవాడు .

కాని మనవాడు పెద్ద డిటెక్టివ్ అవ్వలని నిర్ణయించు కోవటంతో ముడ్డి మీదకు ముప్పై

ఏళ్ళు వచ్చినా పెళ్ళి పెటాకులు లేకుండా ముదిరి పోయిన బెండ కాయలా తయారయ్యాడు

జీపు దిగిన మహాలింగం పొట్ట మీద నుంచి జారిపోతున్న ప్యాంటును పైకి లాక్కుంటూ ఇంట్లోకి అడు గు పెట్టాడు . ఎస్ ఐ గా సెలెక్ట్ అయినప్పుడు సన్నగా రివటలా ఉండే వాడు . కాని సి ఐ అయ్యే పాటికి హోదా తో పాటు , డబ్బు ... డబ్బు తో పాటు అహంకారం , అనారోగ్యం , పొట్ట అన్నీ పెరిగాయి.

నిదానంగా రెండు అడుగులు వేసి గేటు మీద చెయ్యి వేశాడు తలుపు తియ్యటానికి,

గేట మీద చెయ వేశాడో లేదో అంతే ఒక్క సారిగా పెద్దగా గలగల మంటూ సైరన్ లాంటి మోతతో గేటుకు అమర్చిన లైట్లు రకరకాల రంగుల్లో వెలగ సాగాయి.

ఆ పరిణామాన్ని ఊహించని మహాలింగా భయపడి వెనక్కి అడుగుడు వేసాడు.

ఆ సైరన్ మోతకు ఏమయి వుంటుందా అన్ని వీధిలోని జనం మొత్తం అక్కడ పోగయ్యారు. వాళ్ళందరిని చూసిన మహేలింగానికి సిగ్గేసి , ఏదో తప్పు చేసిన వాడిలా తల వంచుకునీ జీపులో ఎక్కి కూర్చు న్నాడు

ఎందుకు జీపు లో ఎక్కి కూర్చున్నాడో తెలియని డ్రైవర్

'సార్ పోనీయ మంటారా' అంటూ అడిగాడు

మహాలింగం ఏమి మాట్లాడక పోయే సరికి మౌనం అర్ధాంగీకారం అనుకునీ డ్రైవర్ జీపుని ముందుకు ఉరికించాడు.

★★★

"బాస్ , సి.ఐ ఇ మహాలింగం వచ్చాడు. కాని సెక్యూరిటీ సిస్టమ్ అలారం మోగించటం తో పారి పారిపోయాడు. "అంటు చెప్పుకుపోతున్నాడు ఏకలింగం అసిస్టెంట్ బోడి లింగం "

భోడిలింగం అ సలు పేరు ఎవరికీ తెలియదు, కాకపోతే ప్రాస బాగుంటుందని ఏకలింగం, మీద ఉన్న కోపంతో అందరూ అలా పిలవసాగారు.

దానికి తగ్గట్టు ఎప్పుడూ గుండుతో కనపడటంతో..ఆ పేరు అతికినట్టు సరిపోయింది

తాతల కాలం నాటి పాత బర్మా టేకు తో చేసిన కుర్చీ లో సాగిల పడి, కాళ్ళు రెండూ టేబల్ మీద పట్టి, మొఖం మీద టోపీ

పెట్టుకుని నిద్ర పోతున్న ఏకలింగం, బోడి లింగం మాటులు విని

" నాకు తెలియదనుకున్నావా, నేను విన లేదనుకున్నవా " అన్నాడు సినిమాటిక్ గా

"సారి బాస్ స్ ఎదో వుండ బట్టలేక చెప్పాను.." అంటూ సంజాయిషి ఇచ్చాదు బోడి లింగం

ఓకే అంటూ కాళ్ళు బల్ల మీద నుంచి తీసి కుర్చిలో నిటారుగా కుర్చుని , ఎదురుగా వున్న కంప్యూటర అని చేసాడు.

కంప్యూటర్లో మెయిన్ గేటు దగ్గరవున్న కెమేరా తాలుకు చిత్రాలు కననపడుతున్నాయి.

ఇంతలో ఏకలింగం సెల్ఫోన్ అదే పనిగా మోగటం మొదలు పెట్టింది .

ఎవరా అని చూస్తే, మాహాలింగం కాల్చేస్తున్నాడు

బోడిలింగం వంక మాసూ, సెల్ తీసుకుని మాట్లాడు అన్నట్టు సైగచేసాడు

బోడి లింగం, ఫోన్ ఎత్తగానే, " ఏరాఎంటి ఆ గోల ఇంటిముందు.." అంటు అరవసాగాడు మహాలింగం

"గోల కాదు సార్ సెక్యూరిటి , మా మీద ఎప్పుడైనా ఏ నిమిషానైనా శతృవులు దాడి చెయ్యచ్చు అంతు 'జవాబి చ్చాదు బోడి లింగం

' ఒరేయ్ బోడి నువ్వా, అబడుద్దాయి లేడా అయినా మీకెవరున్నారురా శతృవులు. అసలు మీరొకళ్ళు వున్నారని ప్రపంచానికి తెలిస్తే కదా శత్రువులు ఉండటానికి "అంటూ అరిచాడు

" అలా అనకండి సార్ మ బాస్ చాలా ఫేమస్. ఆయనంటే ఆడ పిల్లలు పడి చస్తారు. ఆయన కాలు బయటపెడితే చాలు ఆటోగ్రాఫుల కోసం. ..." చేప్పుకు పోతున్నాడు బోడి లింగం

"ఓరేయ్ ఆపరా నీ సోధి వాడికి వ్వ ముందు ఫోను . "అంటూ గదిమాడు.

ఫోనకి చెయ్యి అడ్డం పెట్టుకుని "సార ఫోన్ ఇవ్వమంటున్నాడు" అంటూ సైగచేసాడు.

బిజీగా ఉన్నానని చెప్పు అంటూ తిరిగి సైగ చేశాడు ఏక లింగం .

అర్థమయ్యింది అన్నట్టు తల ఊపుతూ " బిజీ గా ఉన్నారని చెప్పమన్నారండి" అంటూ మహా లింగానికి జవాబిచ్చాడు.

'అరేయ్" ఇద్దరూ కలసి నాటకాలాడు తున్నారా . నేను ఓ పదినిమిషాల్లో

అక్కడుంటా, ఈ సారి ఆ వెధవ బెల్లు మోగిందో మీ ఇద్దరిని షూట్ చేస్తా " అంటూ ఫోన్ పెట్టేసి

జీపు డ్రైవర్ని వెనక్కి పోమ్మన్నట్టు సైగ చేసాడు.

★★★

."ఏమిటో ది గ్రేటి మహా లింగంగారు. ఇలా దయచేశారు అన్నాడు" ఏకలింగం మహాలింగాన్ని చూస్తూ వెక్కిరింతగా

" ఏం చేస్తాము, వసుదేవుడంతటి వాడికే తప్పలేదు" అంటూ జవాబిచ్చాడు మహాలింగం.

" అంత గాడిద కాళ్ళు పట్టుకోవాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందో.. "అంటూ గొణిగాడు బోడిలింగం.

"ఒరేయ్, నీకు కూడా నేను లోకువై పోయాను. 'అంటా బోడిలింగం మీద అరచినంత పని చేసాడు. మహాలింగం.

ఇంకా ఎక్కువ రెచ్చగొట్టటం బాగోదని అంటూ కాస్త కూల్ చెయ్యటానికి ప్రయత్నించాడు ఏకలింగం

" విషయానికి రండి సి.ఐ సార్ "

"విషయం ఏ ముంది కిడ్నాప్ కేసు.."

ఏకలింగం ఎదురుగా వున్న కుర్చిలో కూర్చుంటూ చెప్పాడు

'ఎవరు ఎవర్ని కిడ్నాప్ చేసారు.."ఆశ్చర్యపోతు అడిగాడు బోడిలింగం

"అది తెలిస్తే మీదగ్గర కెందుకు కొస్తాను..' అంటూ టోపీ తీసి బల్ల మీద పెట్టి నెత్తి మీద ఉన్న వెంట్రుకల్ని సవరించు కోసాగాడు మహా లింగం

" అక్కడ ఏమి లెవ్వు సార్ " అన్నాడు నవ్వుతు బోడి లింగం

" నో ..సీరియస్ .."అన్నాడు ఏకలింగం

దానితో బోడిలింగం నోరు మూసుకున్నాడు

"కిడ్నాప్ కేసులకు కూడా మా దగ్గరకు వస్తే ఎలా?' అంటు వుడికించాడు ఏకలింగం

"ఈ కేసు చాలా కాన్ఫిడెన్సియల్ గా డీల్ చెయ్యమని పై నుంచి ఐ జి గారి ఆర్డర్స్" అందుకనే నీదగ్గరకు రావల్సి వచ్చింది " అంటూ ఆగాడు మహాలింగం.

(ఇంకా ఉంది )

# వ్యక్తి నుంచి ..వ్యవస్థగా



జీవితంలో అన్నింటా ఓడిపోయిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకుందామని ఓ బహుళ అంతస్తుల భవనం ఎక్కాడు. 26వ అంతస్తు నుండి దూకడానికి సిద్ధమైన అతనికి ఎదురుగా మరో భవనంపై వేలాడుతూ ఓ వ్యక్తి భవనానికి రంగులు వేయడం కనిపించింది. అతనికి జీవితం ప్రతి రోజు రిస్కే. రిస్కునే జీవితంగా గడుపుతున్నప్పుడు నేను ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం పిరికితనమే, జీవితం జీవించడానికే అని గ్రహించి, తన ఎదుగుదలకు కృషి చేశాడు. స్టార్ హోటల్స్ నిర్మించాడు. అంతర్జాతీయ అవార్డులు సాధించాడు. ఇది సినిమా కథ కాదు.. విజయం సాధించిన ఒక వ్యక్తి జీవితం.

#కామత్ #హోటల్ పేరు విన్నదే కదా? ఆ హోటల్‌లో పదార్థాలు నాలుకపై కలిగించే ప్రభావం కన్నా ఆ హోటల్ యజమాని జీవిత కథ మనసుపై చూపించే ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆత్మహత్య చేసుకుందామనుకున్న స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి హోటల్ నిర్మించే స్థాయికి ఎదిగిన వ్యక్తి #విఠల్ #వెంకటేష్ #కామత్.

భారతీయ మధ్యతరగతి కుటుంబంలోంచి వచ్చిన కామత్ ఇపుడు ప్రపంచంలోనే గర్వించదగిన హోటల్స్ యజమానిగా చిరస్మరణీయమైన విజయాన్ని స్వంతం చేసుకున్నారు. ఇదో ప్రపంచ రికార్డు. ఒకప్పుడు డబ్బుల కోసం నానా ఇబ్బందులు పడిన కామత్ కుటుంబం ఇపుడు వేలాది మందికి ప్రత్యక్షంగా..పరోక్షంగా ఉపాధి చూపిస్తోంది. కోట్లాది రూపాయలు రోజూ హోటల్స్ ద్వారా సమకూరుతున్నాయి. కొన్నేళ్లు గడిచినా ఎలాంటి మార్పులు లేవు. కష్టమర్ల అభిరుచులకు అనుగుణంగా హోటల్స్‌ను ఏర్పాటు చేసుకుంటూ పోయారే తప్పా ..నాణ్యత విషయంలో..సేవలు అందించడంలో కించిత్ తేడా కనిపించకుండా కాపాడుకుంటూ వస్తోంది కామత్ హోటల్స్ యాజమాన్యం. ఒకప్పుడు చిన్న వీధి సందులో ఏర్పాటైన కామత్ హోటల్ ఇపుడు ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. తన బ్రాండ్‌ను కాపాడుకుంటూ వస్తోంది. డబ్బున్న వాళ్లు గొప్ప వాళ్లు అనుకునే స్థాయికి దిగజారిన మనకు విఠల్ కామత్ కళ్లు తెరిపించారు.

భారతీయుల మనోభావాలు దెబ్బతినకుండా.. సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షిస్తూ కామత్ హోటల్స్ నడుస్తున్నాయి. ఇది ఒక రకంగా పాఠంగా నేర్చుకోవాల్సిన అవసరం వున్నది. కాలే కడుపులతో ..పస్తులు ఉంటూ ఇడ్లి తయారీతో ప్రారంభమైన కామత్ ప్రతి నగరానికి విస్తరించింది. కామత్‌లో టిఫిన్లతో పాటు రుచికరమైన భోజనాలను వడ్డిస్తారు. ఇండియన్స్ తో పాటు ఇతర దేశాలకు చెందిన వారంతా కామత్ హోటల్స్ కు రావడం

# వ్యక్తి నుంచి ..వ్యవస్థగా

పరిపాటిగా మారింది. ఇప్పటికీ ఇడ్లి, సాంబారు, చెట్నీ ఈ మూడు కామత్ కు పెట్టింది పేరు. ఏ దేశానికి వెళ్లినా కామత్ హోటల్ వుందా అని అడగటం మామూలే. అంతలా పాపులర్ అయ్యిందీ ఈ హోటల్.

కామత్ కుటుంబం ప్రతి రోజు తప్పకుండా వారి హోటల్స్ లలో తయారయ్యే ప్రతి వంటకాన్ని రుచి చూస్తారు. ఏ మాత్రం రుచిలో.. నాణ్యతలో తేడా వచ్చినా వారు సహించరు. డబ్బుల కంటే రుచికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఆయా హోటళ్లలో పనిచేసే ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా డ్రెస్ కోడ్ ఉంటుంది. ఇందులో పనిచేసిన వారిని తమ ఇంటి వారికంటే ఎక్కువగా చూసుకుంటారు. ప్రభుత్వ సర్వీసులలో పనిచేసే వారికి ఎలాంటి సౌలభ్యాలు వున్నాయో ఇక్కడ పనిచేసే వారి పట్ల అంతే రకంగా చూస్తారు. జీతాలతో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తారు. దీంతో కామత్ లో పనిచేయడం అంటే ప్రతి ఒక్కరు గౌరవంగా భావిస్తారు. ఒకప్పుడు హోటల్స్ అంటే పూటకూళ్లుగా భావించే వారు. ఇపుడు సీన్ మారింది. ఫ్లయిట్ ఎక్కినా..కోట్లు సంపాదించినా.. ఎవ్వరైనా సరే ..ఎక్కడ వున్నా..ఎంత దూరంలో వున్నా ..సరే తినేందుకు అక్కడికి పరుగులు తీస్తున్నారు. డబ్బులు ఎంతైనా చెల్లించేందుకు వెనుకాడటం లేదు.

డాక్టర్ విఠల్ కామత్ కు 67 ఏళ్లు. ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ గా..మేనేజింగ్ డైరెక్టర్‌గా కామత్ హోటల్స్ గ్రూపునకు వ్యవహరిస్తున్నారు. ఇండియాలో ఎన్నో హోటల్స్ తమకు పోటీగా ఉన్నా ..కామత్ మాత్రం తన స్థానాన్ని కోల్పోలేదు. ముంబై కేంద్రంగా నడుస్తున్న ఈ సంస్థను ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేలా చేశారు కామత్. 169 కోట్ల ఆదాయం కేవలం ఈ హోటల్స్ ద్వారా సమకూరుతోంది. చిల్లి గవ్వ లేకుండానే ..కేవలం భార్య పుస్తెలతాడును అమ్మి ప్రారంభించిన కామత్ ఇవాళ వరల్డ్‌లోనే టాప్ టెన్ హోటల్స్‌లో ఒకటిగా పేరు తెచ్చుకుంది. ఎలాంటి పైరవీలు..ఇంకెలాంటి సిఫారసులు లేకుండానే కామత్ అగ్ర స్థానానికి ఎగబాకింది. కామత్ జీవితమే ఓ సందేశంగా భావించడంతో కేంద్ర ప్రభుత్వం ఏకంగా 22 రాష్ట్రాలలో పిల్లలకు స్పూర్తిదాయకంగా ఉంటుందనే ఉద్దేశంతో నాన్ డిటైల్డ్ పుస్తకంగా పంపిణీ చేశారు. ఇది కూడా ఓ చరిత్రే. ఒక సామాన్యమైన వ్యక్తి కోట్లాది రూపాయల హోటల్స్ కు అధిపతి కావడం విశేషమే.

ఎందరో భారతీయులు ..ఎన్నో విజయాలు స్వంతం చేసుకున్నారు. కానీ విఠల్ కామత్ ది మాత్రం ప్రత్యేకమైన కన్నీటి కథ. మనకళ్ల ముందే జరిగిన గాథ. విఠల్ కామత్ హోటల్స్ యజమానే కాకుండా మెంటార్‌గా, ఆంత్ర ప్రెన్యూర్‌గా, ట్రైనర్ గా , సక్సెస్ ఫుల్ వ్యాపారవేత్తగా పేరు పొందారు. ఒకే ఒక్క గదిలో ఉన్న కామత్ ఇపుడు కోట్లాది రూపాయలు కలిగిన భవంతులు సంపాదించారు. అయినా తన మూలాలు మరిచి పోలేదు. ఏ గదిలో నుండి కామత్ హోటల్ ను ప్రారంభించారో అదే గదిని అలాగే పెట్టుకున్నారు. అపురూపంగా చూసుకుంటున్నారు కామత్. మొత్తం కామత్ కుటుంబంలో ఎనిమిది మంది. ముగ్గురు అన్నదమ్ములు, ముగ్గురు చెల్లెల్లు ..తల్లిదండ్రులు. ఇంత మందితోనే ఆ ఒక్క గదిలో నివసించారు. ఆ జ్ఞాపకాలు ఇప్పటికీ తనను హెచ్చరిస్తూనే వుంటాయంటారు కామత్.

నేను పుట్టినప్పుడు మాకంటూ ఇల్లు వుండేది. మా నాయిన వెంకటేశ్ రెస్టారెంట్ నడిపించేవారు. ఎనిమిదేళ్ల వయసులోనే మా తండ్రి పనికి కుదిరాడు. క్రమశిక్షణ, నిబద్ధత, స్వయంశక్తి ఇవ్వన్నీ నాకు స్పూర్తి. మా అమ్మ ఆ రోజుల్లో ఇంతమందిని మ్యానేజ్ చేసేది. ప్రతి ఒక్కరికి తానే వండి పెట్టేది. 1950లో మా నాయిన రెస్టారెంట్‌ను స్టార్ట్ చేశారు. వెంకటేశ్ కామత్ ఈ పేరు కామత్ హోటల్స్ కు ప్రేరణ. ఆయన అందించిన ప్రోత్సాహమే.. కష్టపడటమే ఇవాళ ఈ స్థాయికి చేరేందుకు దోహదపడిందంటారు విఠల్ కామత్. తనకు పోటీగా ఉన్న #ఒబెరాయ్ #హోటల్స్

యజమాని ఒబేరాయ్ ను కలిసేందుకని వెళ్లారు. సెక్యూరిటీ అడ్డు చెప్పారు. చివరకు ఒబేరాయ్‌తో కలిసాక ..ఎట్టి పరిస్థితుల్లోను ఒబేరాయ్ కు పోటీగా ఉండాలని నిర్ణయించుకున్నారు కామత్.

ఏదో ఒకరోజు మీకంటే గొప్పగా.. మీతో పోటీ పడేలా నా కామత్ హోటల్స్‌ను తీర్చిదిద్దుతానని ఆ దిశగా ప్రయత్నాలు చేశారు. మోసానికి గురైనా..చేతిలో చిల్లి గవ్వలేక పోయినా.. కామత్‌ను నిలబెట్టారు. తండ్రిని పోగొట్టుకున్నా..కుటుంబాన్ని కోల్పోలేదు విఠల్ కామత్. ఒబేరాయ్ అప్పటికే ఇండియాలో ఫేమస్ హోటల్స్ కు అధినేత. ముంబయిలో ప్రధాన స్థలంలో పూర్తిగా పచ్చదనంతో.. పర్యావరణం ఉట్టి పడేలా కామత్ భారీ ఎత్తున ఆర్చిడ్ హోటల్‌ను నిర్మించారు. ఈ హోటల్ ప్రారంభోత్సవానికి మొదటి ఆహ్వాన పత్రికను ఒబేరాయ్‌కు అందజేశారు డాక్టర్ విఠల్ కామత్. ఒకప్పుడు తనకు సాయం చేయండి అంటూ వచ్చిన ఈ కుర్రాడు..ఇపుడు ప్రపంచంలోనే అత్యున్నతమైన హోటల్‌కు అధిపతి అంటే నమ్మలేక పోయారు ఒబేరాయ్.

నా జీవితంలో ఎంతో మందిని చూశాను.. కలిశాను.. కానీ విఠల్ నీలాంటి వ్యక్తి నాకు ఇంతవరకు తారస పడలేదు. నీ విజయం కంటే నీకు నీమీదున్న నమ్మకం గొప్పది. నేను మిమ్మల్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నానంటూ ఓ సుదీర్ఘమైన లేఖ రాశారు ఒబేరాయ్. హోటల్ పరిశ్రమల్లో దిగ్గజాల సరసన కామత్ నిలిచింది. కామత్ హోటల్స్ ప్రపంచ వ్యాప్తంగా 18 మిలియన్ల ఆదాయాన్ని పొందాయి. ఈ విషయాన్ని కామత్ బోర్డ్ ఆఫ్ మీటింగ్స్ లో ప్రకటించారు.

ఇదే కాకుండా ఆయన 60 లక్షలకు పైగా చెట్లను నాటారు. అటవీ సంరక్షణ కోసం 100 ఎకరాల కొండను ఔషధ మొక్కలుగా, చెట్లుగా మార్చారు. ముంబైలో మొట్టమొదటి సీతాకోకచిలుక ఉద్యానవనం మరియు ముంబై మరియు నావీ ముంబై అంతటా తోటలను నిర్మించిన ఘనత కూడా ఆయనది.

ఎంతో ఎత్తుకు ఎదిగిన విఠల్ కామత్ సాధించిన ఈ విజయం కోట్లాది భారతీయులకే కాదు ప్రపంచానికి కూడా ఒక పాఠంగా మిగిలారు.

★★★

## వ్యక్తిత వికాసం

# యువత తెలుసుకో
# నిన్ను నువ్వు మలుచుకో



## నిజమయిన మార్పు ..

నిజమైన "మార్పు మాటల్లో కాదు, మనసులో మరియు ప్రవర్తనలో కనిపించాలి"

నిజమైన మార్పు అంటే ఏమిటి?

మనిషి జీవితంలో "నేను మారిపోయాను" అనే మాట చాలా సార్లు వినిపిస్తుంది.

కానీ నిజంగా ఒక మనిషి మారిపోయాడని ఎలా తెలుసుకోవాలి?

మాటలతో చెప్పడం వల్ల మార్పు రాదు.
నిజమైన మార్పు అనేది మనసులో ఆలోచన మారినప్పుడు మరియు ప్రవర్తన మారినప్పుడు మాత్రమే కనిపిస్తుంది.

ఒక దొంగను ఉదాహరణగా తీసుకుందాం.
ఒక దొంగ "నేను మారిపోయాను" అని చెబితే అది నిజం కావచ్చు లేదా అబద్ధం కావచ్చు.
కానీ అతను నిజంగా మారిపోయాడో లేదో తెలుసుకోవడానికి ఒక పరీక్ష ఉంది.

డబ్బు, బంగారం, నగలు అతని ముందు పెట్టినా
అతని మనసులో
"ఇవి తీసుకుందాం" అనే ఆలోచన కూడా రాకూడదు.
ఎవరూ చూడకుండా ఉన్నా కూడా
"ఇవి తీసుకుంటే బాగుంటుంది" అనే కోరిక కూడా లేకపోతే
అప్పుడు మాత్రమే అతను నిజంగా మారిపోయాడని చెప్పవచ్చు.

అంటే అవకాశం లేకపోవడం వల్ల తప్పు చేయకపోవడం మార్పు కాదు.
అవకాశం ఉన్నా కూడా తప్పు చేయకపోవడం నిజమైన మార్పు.

అదే విధంగా ఒక వ్యభిచారి కూడా "నేను మారిపోయాను" అని చెప్పవచ్చు.
కానీ అది మాటలతో చెప్పడం వల్ల నిజం కాదు.
ఎవ్వరూ చూడని పరిస్థితి వచ్చినప్పుడు కూడా
చెడు ఆలోచన మనసులోకి రాకపోతే
అప్పుడు మాత్రమే అతను నిజంగా మారిపోయాడు అని చెప్పవచ్చు.
ఇది జీవితంలోని ప్రతి విషయంలో వర్తిస్తుంది.

మద్యం తాగేవారు

"నేను ఇక మద్యం తాగను" అని చెప్పవచ్చు.
కానీ మద్యం అతని ముందు పెట్టినా
అతను తాగకుండా ఉండగలిగితే
అప్పుడు మాత్రమే నిజమైన మార్పు వచ్చినట్లు.
అలాగే మాంసం తినే వాడు
అబద్ధాలు చెప్పే వాడు
లేదా ఇతర తప్పులు చేసే వాడు

చాలామంది అయ్యప్ప హనుమాన్ ఇతర దీక్షలు తీసుకుంటారు
41 రోజులు 21 రోజులు 11

రోజులు
ఎందుకు దీక్షలు తీసుకుంటారు అంటే
వారిలో చెడు అలవాట్లు మారిపోవడానికి కానీ కొందరు ఏం చేస్తారు
ఎప్పుడు 41 రోజు అయిపోతాయా
ఎప్పుడు 21 రోజులు అయిపోతాయా
ఎప్పుడు పదకొండు రోజులు అయిపోతాయా అని ఎదురు చూస్తారు
41 దీక్ష తీసుకున్న వారు
ఈరోజు గడిస్తే ఇక 40 రోజులు
ఈరోజు గడిస్తే ఇక 39 రోజులు
ఇలా లెక్క పెట్టుకుంటూ
దీక్షలు కొనసాగిస్తారు ఇలా కొనసాగించడం వల్ల మనుసులో మనిషిలో మార్పు రాదు
దీక్ష విరమించిన తర్వాత మళ్లీ యధావిధిగా కోరికల్లో సుఖాల్లో మునిగిపోతారు తప్పులు చేస్తారు చేస్తారు
అందుకే 18 సంవత్సరాలు దీక్ష తీసుకున్న గురుస్వాములైన కానీ వ్యసనాలు మానడం లేదు అంటే కారణం ఇదే

ఎవ్వరైనా సరే ఇదే నియమం వర్తిస్తుంది.
తప్పు చేయడానికి అవకాశం వచ్చినప్పుడు
అది చేయకుండా ఉండడం మాత్రమే కాదు
మనసులో కూడా ఆ ఆలోచన రాకుండా ఉండడం ముఖ్యం.


ఎందుకంటే అన్ని పనులకు మూలం మనసే.
ముందుగా ఆలోచన వస్తుంది.
తర్వాత ఆ ఆలోచన చర్యగా మారుతుంది.
అందుకే నిజమైన మార్పు అంటే కేవలం బయట ప్రవర్తన మారడం కాదు
మనసులోని ఆలోచనలు కూడా మారాలి.
మనసు శుద్ధి అయినప్పుడు
మనిషి ప్రవర్తన కూడా స్వయంగా శుద్ధి అవుతుంది.
మాటలతో "నేను మారిపోయాను" అని చెప్పడం చాలా సులభం.
కానీ మనసును మార్చుకోవడం చాలా కష్టం.
అయితే ప్రయత్నం చేస్తే అది అసాధ్యం కాదు.
మనిషి తన తప్పులను గుర్తించాలి.
అవి ఎందుకు చేస్తున్నానో తెలుసుకోవాలి.
తర్వాత వాటిని వదిలేయడానికి క్రమంగా ప్రయత్నం చేయాలి.
అలా చేస్తూ చేస్తూ ఒక రోజు
ఆ చెడు అలవాట్లు మనసులో నుంచే పోతాయి.
అప్పుడు మాత్రమే నిజమైన మార్పు వస్తుంది.
అందుకే నిజమైన మార్పు అంటే మాటల్లో కాదు
అవకాశం వచ్చినప్పుడు కూడా తప్పు చేయకపోవడం.
మనసులో చెడు ఆలోచన కూడా రాకపోవడం.
అలాంటి మార్పు వచ్చినప్పుడు మాత్రమే
మనిషి నిజంగా మారిపోయాడు అని చెప్పవచ్చు.

★★★



## కార్టూన్ పేజి

# నవ్వండి ప్లీజ్



నవ్వటం ఒక యోగం ,

నవ్వలేక పోవటం ఒక రోగం ,

తరువాత మీ ఇష్టం




శ్రీనివాస్ కార్టూన్లు











## వార్తల్లో వ్యక్తి





# ఆశా భోంస్లే

'ప్రముఖ గాయని ఆశా భోస్లే కన్నుమూశారు. ఆశా భోస్లే శనివారం కార్డియాక్ అరెస్ట్‌కు గురవడంతో ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు.

భారతీయ సంగీత ప్రపంచంలో ఒక గొప్ప గాయనిగా ఆమె పేరు పొందారు. ప్లే బ్యాక్ సింగర్‌గా ఆమె ఎన్నో మరపురాని పాటలను పాడారు.'నయా దౌర్' నుంచి 'తీస్రీ మంచిల్' వరకు, 'హరే రామా హరే కృష్ణా' నుంచి 'ఉమ్రావ్ జాన్' వరకు 'ఇజాజత్' నుంచి 'రంగీలా' వరకు... కాలం మారింది, తరాలు మారాయి, వెండితెరపై హీరోయిన్లు మారారు.కానీ, ఆశా భోస్లే గొంతు మాత్రం ఎప్పటికీ నవ యవ్వనంగానే నిలిచిపోయింది.

తెలుగులో 'జీవితం సప్తసాగర గీతం' అంటూ ఆమె పాడిన పాట చాలామందికి గుర్తుండే ఉంటుంది. పలు తెలుగు సినిమాలకు కూడా ఆమె పాటలు పాడారు.

ఆమె స్వరంలోని చమత్కారం, సరదా పాటల గురించి చెప్పుకునే క్రమంలో ఆమె సుదీర్ఘ, కఠిన పోరాటం గురించి చర్చ తక్కువగా జరుగుతుంది.

నిజానికి అద్భుతమైన ప్రతిభ ఉన్నప్పటికీ, ఆశా భోస్లే 'నంబర్ టూ' స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఎందుకంటే హిందీ ఫిల్మ్ ఇండస్ట్రీలో 'నంబర్ వన్' స్థానంలో ఆమె సోదరి, దిగ్గజ గాయని లతా మంగేష్కర్ ఉండేవారు.

హిందీ నేపథ్య గాన రంగంలోకి అడుగుపెడుతున్న తరుణంలో, లతా అనే ప్రకాశవంతమైన సూర్యుని ముందు తనకంటూ ఒక జ్యోతిని వెలిగించుకోవాలని ఆశా నిశ్చయించుకున్నారు. ఆ సమయంలో ఇది దాదాపు అసాధ్యం. కానీ, తన పట్టుదల, అసమానమైన ప్రతిభతో సంగీత ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారామె.

ఆశాకు చిన్నతనంలోనే సంగీతంతో అనుబంధం ఏర్పడింది. ఆమె తండ్రి దీనానాథ్ మంగేష్కర్ శాస్త్రీయ సంగీత విద్వాంసులు, మరాఠీ రంగస్థల ప్రముఖులు. ఆయన ఐదుగురు పిల్లలు లత, మీనా, ఆశ, ఉషా, కుమారుడు హృదయనాథ్ మధ్య చిన్నప్పటి నుంచే స్వరాల సరిగమలు వినిపించేవి. బాల్యంలో లత, చిన్నారి ఆశాల జోడీ విడదీయలేనిది. ఆశా తన అక్క వెంటే నీడలా నడిచేవారు. కానీ, ఆశాకు తొమ్మిదేళ్ల వయసున్నప్పుడే తండ్రి చనిపోయారు.

తండ్రి మరణంతో మంగేష్కర్ కుటుంబం ఆర్థిక సంక్షోభంలో పడింది. జీవనోపాధి కోసం ఆ కుటుంబం పుణే, కొల్హాపూర్ మీదుగా 1945లో బొంబాయి (ముంబయి) చేరుకుంది. ఇక్కడ 14 ఏళ్ల లత కుటుంబ బాధ్యతను

# వార్తల్లో వ్యక్తి

తన భుజాలపై వేసుకుని సినీ ప్రపంచపు కష్టతరమైన బాటల్లో తన పోరాటం మొదలుపెట్టారు. త్వరలోనే ఆశా కూడా ఆ పోరాటంలో తోడయ్యారు. 1948లో 'చునరియా' సినిమాతో ఆశా నేపథ్య గాన ప్రపంచంలోకి అడుగుపెట్టారు.

గీతా దత్, షంషాద్ బేగమ్‌లతో కలిసి ఆమె తన మొదటి పాట 'సావన్ ఆయా రే' పాడారు. దీనికి సరిగ్గా ఏడాది తర్వాత, 1949లో 'రాత్ కీ రాణి' సినిమాతో ఆమెకు మొదటి సోలో పాట అవకాశం దక్కింది.

అదే ఏడాది సోదరి లతా మంగేష్కర్‌కు 'టర్నింగ్ పాయింట్'గా నిలిచింది. 'మహల్' సినిమాలోని 'ఆయేగా ఆనేవాలా' పాట లతను రాత్రికి రాత్రే విజయ శిఖరాలకు చేర్చింది.

1950వ దశకంలో లత వేగంగా ఎదిగారు. నౌషాద్, సి.రామచంద్ర, శంకర్–జైకిషన్, ఎస్.డి. బర్మన్ వంటి దిగ్గజ సంగీత దర్శకుల మొదటి చాయిస్‌గా ఆమె మారారు. హిందీ నేపథ్య గానంపై లత ఏకఛత్రాధిపత్యం చలాయిస్తుంటే, ఆశా ఎంత కష్టపడినా ఆ గుర్తింపు దక్కలేదు. ఆ రోజుల్లో ఆశాకు ఎక్కువగా బి–గ్రేడ్ లేదా తక్కువ బడ్జెట్ సినిమాల్లోనే అవకాశాలు వచ్చేవి. ఎ.ఆర్. ఖురేషీ, సజ్జాద్ హుస్సేన్, సర్దార్ మాలిక్ వంటి సంగీత దర్శకులతో పని చేస్తున్నా, పెద్ద సంగీత దర్శకులు, అగ్ర నిర్మాణ సంస్థలు ఆమెకు దూరంగా ఉన్నాయి. ఆశా కెరీర్‌కు బిమల్ రాయ్ 'పరిణీత' (1953), రాజ్ కపూర్ 'బూట్ పాలిష్' (1954) పాటలు తొలి బలాన్ని ఇచ్చాయి. అయితే సంగీత దర్శకుడు ఓపీ నయ్యర్‌ను కలవడంతో ఆమె జీవితం మలుపు తిరిగింది. లత లేకపోయినా సూపర్ హిట్ సంగీతాన్ని అందించగలనని నయ్యర్ నమ్మేవారు. లత కూడా ఆయనతో పని చేసేవారు కాదు. నయ్యర్ మొదటి ఎంపిక గీతా దత్ అయినా, 'సి.ఐ.డి.' సినిమా తర్వాత ఆయన సంగీతంలో ఆశా భోస్లే స్థానం సంపాదించారు. ఆమె గొంతులోని లోతైన స్వరాలను ఆయన గుర్తించి అవకాశమివ్వడంతో వారు 'నయా దౌర్' (1957)తో చరిత్ర సృష్టించారు. 'ఉడే జబ్ జబ్ జుల్ఫే తేరీ', 'మాంగ్ కే సాత్ తుమ్హారా' వంటి పాటలు ఆశాను మొదటిసారి కథానాయిక గొంతుగా మార్చాయి. దీనివల్ల బి.ఆర్. చోప్రా వంటి పెద్ద క్యాంపులలో ఆమెకు చోటు దక్కిందిఅదే ఏడాది (1957) ఎస్.డి. బర్మన్, లతా మంగేష్కర్ మధ్య వచ్చిన విభేదాలు ఆశాకు కొత్త తలుపులు తెరిచాయి. తదుపరి ఐదేళ్లు బర్మన్ లతతో పని చేయలేదు. అప్పుడు ఆశా ఆయన ప్రధాన గాయనిగా ఎదిగారు. ఈ విషయంలో లతా తన సోదరిపై కోపంగా ఉన్నారని ఆ రోజుల్లో వార్తలు వచ్చాయి. కానీ ఆ ఐదేళ్లలో ఆశా తన ప్రతిభను నిరూపించుకున్నారు.

ఎస్.డి. బర్మన్, కిశోర్ కుమార్, ఆశా భోస్లే, మజ్రూహ్ సుల్తాన్‌పురి బృందం శృంగారభరిత, సరదా పాటల కొత్త ఒరవడిని మొదలుపెట్టింది. 'హాల్ కైసా హై జనాబ్ కా' (చల్తీ కా నామ్ గాడీ), 'ఆంఖో మే క్యా జీ', 'ఛోడ్ దో ఆంచల్' (పేయింగ్ గెస్ట్), 'దీవానా మస్తానా హువా దిల్' (బంబాయి కా బాబు) వంటి పాటలను ప్రజలు నేటికీ గుర్తుంచుకుంటారు. ఆశాను బర్మన్ కేవలం సరదా పాటలకే పరిమితం చేయకుండా, ఆమె గొంతులోని గాంభీర్యాన్ని మెరుగుపరిచారు.

'కాలా పానీ' సినిమాలో 'అచ్ఛా జీ మై హారీ' వంటి రొమాంటిక్ పాటతో పాటు 'నజర్ లగీ రాజా తోరే బంగ్లే పర్' వంటి తుమ్రీ శైలి పాటను పాడించారు. అలాగే 'సుజాత', 'లాజ్వంతి' వంటి సినిమాల్లో ఎంతో గంభీరమైన పాటలను పాడించి, ఆశా అన్ని రకాల పాటలలో దిట్ట అని నిరూపించారు.

★★★

## కొత్త సీరియల్

చారిత్రాత్మిక సీరియల్



# గడప దీపం



అవధానుల విజయ

కందుకూరి చెరువుల దగ్గర ఉదయం మబ్బులు ఇంకా పూర్తిగా చెదరలేదు.

బురద వాసన, తడి నేల, పొలాల్లో మాడిపోతున్న కొమ్మలపై తడి చుక్కలు వజ్రాల్లా మెరిశాయి.

గ్రామం చివరగా ఒక పాత ఇల్లు. కంచెకు కట్టిన ఎద్దులు గంగిరెద్దుల వాద్యానికి కదులుతున్నట్లు తలాడించాయి.

“రాజన్నా, నిద్రలేచావా?” అని లోపల నుండి మల్లమ్మ గళం.

“లేవక తప్పదు కదా మల్లీ. నేల పంట కోసం వెంటబడుతుంది, కానీ రాజకుమారులు మాత్రం పన్నుల కోసం వెంటనడతారు,” అన్నాడు రాజన్న.ఆవులిస్తూ.

# చారిత్రాత్మక సీరియల్

ఆ మాట విన్న మల్లమ్మ కాసేపు నిశ్శబ్దమైంది. గోడ మీద వేలాడుతున్న తాటిచీపురుతో చెలరేగిన దుమ్ము, స్త్రీల మనసుల వేదనలా గాలిలో తేలింది.

నిన్ననే ఊరికి గాలి వార్తలు వచ్చాయి, రాజ్యంపై పక్క రాజ్యం దండయాత్ర!! అది నిజమో కాదో ఎవరికీ తెలియదు... కానీ ప్రతీ వారి గుండెల నిండా ఉబుకుతున్న ఆందోళన..

“రుద్రమ రాణి పోరాడుతుందట... మనకెందుకమ్మా ఆ సంగతి?” అని వృద్ధుడు సుబ్బయ్య గొణిగాడు.

“మనకూ ఉంది బాబోయ్! యుద్ధం అంటే పన్నులు, పంటలు, ఎడ్ల బలగం అన్నీ మనకే భారం కదా,” అన్నాడు మరొకడు.

రాజన్న మాత్రం ఆ మాటలు విని ఆగిపోయాడు.

తనకది కేవలం భారమే కాదు, ఒక గర్వం కూడా. “మన రాణి యుద్ధానికి దిగితే... మన రక్తంలోనూ ఒక అగ్ని దహిస్తుంది” అని అతని గుండె లోతుల్లో అనిపించింది.

కానీ మల్లమ్మ భయపడింది.

“మామా... మనకేం రక్షణ ఉంటుంది? రాజ్యానికి మనం చిన్న చీమల్లాంటి వారంకదా,” అని మెల్లగా అడిగింది.

రాజన్న తన భార్య తల మీద చేయి పెట్టి, “చీమలా అనిపించినా, మన గుట్టలు మట్టిలో ఉండవు మల్లీ! ఏదో ఒకటి మనకు కూడా దక్కుతుంది,” అన్నాడు.

★★★★★★★★

గ్రామ మధ్యలో ఉన్న బండరాయిపై కూర్చున్న పెద్దమనిషి గౌడ తన చేతిలో పసుపు రంగు కాగితం పట్టుకున్నాడు.

ఆ కాగితం మీద కాకతీయ సైన్యానికి కావలసిన పన్నుల లెక్క రాసి ఉంది.

“ప్రతి ఇంటి నుంచి ఐదు కుంచాల బియ్యం... రెఒక మేక... మరియు ఒక యువకుని యుద్ధానికి పంపాలి” అని గౌడ వివరించాడు...

ఆ మాట విన్న వెంటనే ఆ ఆవరణలో నిశ్శబ్దం అలుముకుంది....

స్వంత ఇంటి సతీమణిని, చిన్నారిని కాపాడుకునే శక్తి లేని రైతు, ఇప్పుడు రాజ్యాన్ని కాపాడాలని ఆజ్ఞ.

రాజన్న మనసు కలత చెందింది.

“పంటను విత్తేందుకు కూడా గింజలు దొరకడం లేదు. తాను యుద్ధానికి పోతే మల్లికి పూట గడవడానికి ఎద్దులను అమ్ముకోవడం తప్ప గత్యంతరం లేదు...

రాజ్యంలో యుద్ధం వస్తే స్త్రీలకు పనులు కూడా దొరకవు...

మరి రాజ్యం కోసం ఇంత బలి... నిజంగా రాణి రుద్రమ దేవి మనల్ని గుర్తిస్తుందా?” అని లోలోపల అనుకున్నాడు.

కానీ ఆ ఆలోచన బయటికి చెప్పలేదు.

గ్రామస్థుల కళ్లన్నీ గౌడపై సూటిగా పడ్డాయి.

“ఎవరు వెళ్ళాలి? ఎవరు మిగలాలి?” అనే గణన మొదలైంది.

ఆ సమయానికే అంబాది నాయుడు గుర్రంపై ఊరికి వచ్చాడు. తన నల్లటి కవచం మెరుస్తూ, కత్తి వాయువును కోసినట్లు శబ్దం చేస్తూ.

“ఏమయ్యా రాజన్నా! వయసు బలంగా ఉంది. నువ్వు వెళ్ళాలి సైన్యంలోకి” అని గంభీర స్వరంతో అన్నాడు.

గ్రామస్థులు ఒక్కసారిగా నిశ్శబ్దమయ్యారు.

రాజన్న కళ్లలో మల్లమ్మ రూపం మెరిపించింది.

ఇంటి భారాలు, విత్తనాల ఆశలు, తల్లి రూపమూ, అన్నీ ఒక క్షణం మనసులో మెరిసిమాయమయ్యాయి....

“నాయుడుగారూ... నేను వెళ్ళుతాను. కానీ నా భార్యను, నా

## చారిత్రాత్మిక సీరియల్

కొడుకును ఎవరూ కాపాడాలి?" అని మృదువుగా అడిగాడు.

అంబాది నాయుడు కాసేపు గంభీరంగా రాజన్న ముఖాన్ని చూశాడు.

"రాణి రుద్రమా మనందరినీ కాపాడుతుంది. రాజ్యం కోసం ఎవరు రక్తం చిందిస్తారో, వాళ్ల ఇంటి దీపం ఆరిపోదు" అని అన్నాడు.

ఆ మాటలో ఏదో విశ్వాసం ఉంది. కానీ ఆ విశ్వాసం వెనుక భయం కూడా దాగి ఉంది.

మల్లమ్మ ఆ మాటలు విని లోపల వణికింది.

తన భర్తకు నిప్పులాంటి గుండె ఉన్నా, తాను మాత్రం ఒక సాధారణ స్త్రీ. యుద్ధం తన ఇంటి గడపకు వచ్చేస్తుందన్న భయం ఆమె శరీరమంతా వ్యాపించింది.

ఆ రాత్రి...

చెరువు పక్కన కూర్చున్న రాజన్నకు చంద్రుడి కాంతి కాసేపు ఆశ కలిగించింది.

గాలి లో తేలిన మాటలు....
"రాజ్యం కోసం రక్తం... రాజ్యం కోసం జీవితం..."

అతని మనసు ఒకేసారి రెండు వైపులా లాగబడింది.

ఒక వైపు తన భార్య ముఖం...

మరో వైపు రాణి రుద్రమాదేవి యుద్ధ పిలుపు.

★★★★★★★★

ఉషోదయం చీకట్లను తొలగించేలోపే కందుకూరి ఊరి మధ్యలో ఒక పెద్ద గుంపు చేరింది.

అంబాది నాయుడు గుర్రం మీద కూర్చొని, చుట్టూ పరికించి చూస్తున్నాడు

"ఎవరు రాజ్యం కోసం వెళ్ళబోతున్నారో ముందుకు రండి!" అని అతడు గట్టిగా అన్నాడు.

ఒక్క క్షణం నిశ్శబ్దం.

తర్వాత ముందుకు అడుగు వేసింది రాజన్న.

అతని గుండెలో భయం ఉన్నా, ఆ చూపులో ఒక వెలుగుంది.

"నేను వెళ్తాను" అన్నాడు.

గ్రామస్థులు మౌనంగా నిలబడ్డారు.

కొంతమంది స్త్రీల కళ్లల్లో కన్నీళ్లు పొంగాయి.

మల్లమ్మ మాత్రం తన బలమైన భర్తను ఆపలేక, గుండెలోనే మౌనంగా కన్నీరు కార్చింది...

"మామా... నువ్వు వెళ్ళిపోతే ఈ ఇల్లు ఎవరు కాపాడతారు?" అని మెల్లగా అడిగింది.

రాజన్న కాసేపు మల్లమ్మ చేతిని పట్టుకున్నాడు.

"మల్లీ... నేనొక చీమలా అనిపించినా, ఈ రాజ్యం కోసం పోరాడతాను. మన రాణి మనలను మరిచిపోదు. నువ్వు ధైర్యంగా ఉండి రోజూ గడప ముందు దీపం వెలిగించు. నేను తిరిగి వస్తాను" అని అన్నాడు.

ఆ మాటలు చెప్పినప్పటికీ, అతని గుండెలోనూ సందేహం. తాను వెళ్ళి రాగలడా? లేక యుద్ధం అతని పేరును శిలాఫలకంపై మాత్రమే ఉంచుతుందా?

అలా రాజన్న, మరికొంతమంది యువకులతో కలిసి ఊరిని వదిలి వెళ్ళిపోయాడు...

మెల్లగా వారి అడుగుల శబ్దం మసకబారగా, ఊరి మీద ఒక ఖాళీ వాతావరణం కమ్ముకుంది.

ఆ రాత్రి...

మల్లమ్మ ఇంటి గడప వద్ద కూర్చొని, గాలిలో రెపరెపలాడుతున్న దీపాన్ని చూస్తోంది.

తన భర్త అడుగులు నడిచిన దారిని గమనిస్తూ, కన్నీళ్లలో ఓ గాఢమైన

# చారిత్రాత్మక సీరియల్

ప్రశ్న.

"రాణి రుద్రమా నిజంగా మనలాంటి వారిని గుర్తు పట్టుతుందా? లేదా మనం కేవలం పన్నుల కోసం పుడితే, యుద్ధాల కోసం చనిపోతామా?"

ఆ ప్రశ్న గాలిలో తేలింది...

ఊరి ప్రతి గడప మీదా అదే ప్రశ్న ప్రతిధ్వనించింది.

★★★★★★★★

మరో వైపు...

రాజన్న మొదటిసారి కాకతీయ సైన్యపు శిబిరాన్ని చూసాడు. కొండల మీద ఎర్రటి జెండాలు ఎగురుతున్నాయి.అనేక మంది యువకులు కత్తులు, విల్లు సాధన చేస్తున్నారు. ఆ గర్జన, ఆ ఉత్సాహం అతని గుండెలో అగ్ని రాజేసింది.

"ఇది రాణి రుద్రమ కోసం. ఇది మన తెలుగు నేల కోసం" అని అతనికి గర్వం కలిగింది.

రాజన్న మొదటిసారి కాకతీయ శిబిరంలో కత్తి పట్టాడు. చల్లని ఇనుము అతని అరచేతిని తాకగానే ఒక కొత్త శక్తి రక్తంలో ఉరకలు వేసింది.

"ఇది కేవలం ఒక ఆయుధం కాదు, ఇది రాజ్య గౌరవం" అని శిక్షకుడు గట్టిగా అన్నాడు.

పక్కన మరో పదిమంది యువకులు, ఒకే శబ్దంతో విల్లు లాగి బాణాలు విడిచారు. బాణాలు గాలిలో ఒక గర్జన లాంటి శబ్దం చేస్తూ ముందుకు దూసుకెళ్ళాయి.

కొంతమంది తడబడ్డారు, బాణం పక్కకు పోయింది.

రాజన్న చెయ్యి కూడా మొదట వణికింది.

కానీ అతను తన మనసులో మల్లమ్మ ముఖం తలచుకున్నాడు...

"మామా, నువ్వు తప్పక తిరిగి రావాలి" అన్న స్వరం అతని చెవుల్లో మార్మోగింది.

అతను బాణం వదిలాడు...నేరుగా బొమ్మను చీల్చింది... శిక్షకుడి కళ్లలో క్షణకాలం ఒక సంతోషం మెరిపించింది.

"నీకు రక్తంలో శౌర్యం ఉంది. దాన్ని మరువకు" అని శిక్షకుడు అన్నాడు.

ఆ రాత్రి శిబిరంలో మంటల చుట్టూ యువకులు కూర్చున్నారు. కొంతమంది పాటలు పాడారు. కొంతమంది యుద్ధం భయం గురించి నిశ్శబ్దంగా గుసగుసలాడారు.

రాజన్న మాత్రం మంటలలో తన భార్య గడప ముందు వెలిగించిన దీపాన్ని చూసుకున్నాడు.

ఇక్కడ అతనికి మంటల వేడి లభిస్తున్నా, అక్కడ ఆమెకు ఒంటరితనపు చలి.

★★★★★★★★

కాకతీయుల రణరంగం గర్జనలతో మార్మోగుతోంది.

గుర్రాల డెక్కల చప్పుళ్ళు... కత్తుల ఢీకొనడం, బాణాల గాలిపటం ...

భూమి అంతా వణుకుతోంది!

రుద్రమాదేవి గుర్రం మీద ముందు వరుసలో నిలబడి,

"ఈ నేల మీద అడుగుపెడితే రక్తం తప్ప ఇంకేం కనిపించదు!" అని గర్జించింది.

ఆ స్వరం యోధుల గుండెల్లో అగ్ని వెలిగించింది.

కానీ రుద్రమాదేవికి తెలియనిది ఏమిటంటే –

శత్రువుల శిబిరంలో ఒక వృద్ధ సేనాని కొత్త వ్యూహాన్ని ఆలోచిస్తున్నాడు.

అతని కళ్ళలో చతురత మెరిసింది.

"రాణి సైన్యం ముందు బలంగా ఉంది. ఇక్కడ గెలవడం కష్టం. కానీ వారి వెన్ను బలహీనంగా ఉంది. అక్కడే దాడి చేయాలి."

అతను తన అనుచరులను పిలిచాడు.

# చారిత్రాత్మిక సీరియల్

“మన పెద్ద దళం యుద్ధరంగంలో రాణి దృష్టిని ఆకర్షిస్తుంది. అంతలో మన చిన్న దళం వెనకనుంచి ఊర్ల మీద పడుతుంది. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు – వీరిని బంధిస్తే సైనికుల గుండెల్లో భయం పెరుగుతుంది. వాళ్ళ మనోధైర్యం కూలిపోతుంది. మనకు ఆహారం కూడా దొరుకుతుంది.”

అతని మాటలు వినగానే కొందరు యోధులు తల ఊపారు.

“పోరాటం కత్తులతో మాత్రమే కాదు, ఆకలితో కూడ గెలుస్తుంది” అని వారు గుసగుసలాడారు.

ఆ రాత్రి శత్రు శిబిరంలో గాలి గుసగుసలాడింది.

గోడల వెనుక దాచిన సైనిక దళం కదలిక మొదలుపెట్టింది. వారి గుర్రాల కాళ్లు నేలలో నిశబ్దంగా పడుతున్నాయి.

చంద్రుడు మబ్బుల వెనక దాగి ఉన్నాడు ...

ఆ చీకటి వారికి ముసుగై మారి

సేనాని మెల్లగా అన్నాడు:

“మన దారిలో ఖాళీ ఊర్లు ఉన్నాయి. రాణి సైన్యం మొత్తం ముందువరుసలో ఉంది. ఇది మనకు అవకాశమే.”


వారు రణరంగం నుంచి దూర

చెరువుల మార్గంలో ఊర్ల వైపు కదిలారు.

గాలిలో తుపాకి పొగ వాసన, రక్తం వాసనలతో పాటు కొత్త వాసన...

వెన్నుపోటు వాసన!

(ఇంకాఉంది )





కథ



# "వినరా భారత వీర కుమారా!"

**ఉప్పలూరి మధుపాత్ర శైలజ**

కీ.శే. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఇండోర్ స్టేడియం విద్యార్థినీ విద్యార్థులతో కళకళలాడుతోంది. ఆ రోజు విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం వేడుకలు నిర్వహించటానికి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి.

తమ నిరంతర శ్రమ, అకుంఠిత దీక్షలతో పి.హెచ్.డి సాధించిన విద్యార్థులకు విశ్వవిద్యాలయ ఛాన్స్‌లర్‌గారు 'డాక్టరేట్' ప్రధానంచేసి సన్మానం చేస్తారు ఆ రోజు.

ఒక అంశంలో పి.హెచ్.డి సాధించాలంటే ఎంతో సాధన, పరిశోధన, నిశిత పరిశీలనలకు నిరంతర పఠనం తోడు కావటం ద్వారా మాత్రమే విద్యార్థులు తమ ఆశయాలను నెరవేర్చుకోగలుగుతారు. తాము ఎంచుకున్న అంశాలపై వాళ్ళకెంతో తపన, ఆసక్తి, తృష్ణ ఉంటేగానీ, తాము అనుకున్న విజయ తీరాలకు జేరుకోలేరు.

మంచి గైడ్ ద్వారా ఆ పి.హెచ్.డి సాధించటానికి సాధకులకు ఎంతో సహనం కావాలి. అందుకే ఎన్నో వేలమంది మాష్టర్ డిగ్రీని సాధించినా, ఏ కొద్ది మందో ఈ పి.హెచ్.డి పట్టాను పొందగలుగుతారు.

5 సంవత్సరాల క్రితం జానపద వాఙ్మయం లో తన మాస్టర్ డిగ్రీను పూర్తిచేసిన వెన్నెల, తన తెలుగు శాఖాధిపతి శ్రీధనంజయ్‌గారిని కలిసి "సార్! నేను తెలుగులో పి.హెచ్.డి చేయాలనుకుంటున్నాను. నేను ఎంచుకున్న అంశానికి సంబంధించి నాకు ఎవరినైనా గైడ్‌గా సూచించండి" అని అడిగింది.

"అమ్మా వెన్నెల! నువ్వు మాస్టర్ డిగ్రీలో మంచి మార్కులతో విశ్వవిద్యాలయంలోనే బంగారుపతకం సాధించావు. నీ పట్టుదల, శ్రమ నాకు తెలుసు. నీవు తప్పక పి.హెచ్.డిని కూడా విజయవంతంగా పూర్తి చేయగలవు. ఇంతకీ

కథ

నీవు ఏ అంశంపై నీ పరిశోధన చేయాలనుకుంటున్నావు" అంటూ అడిగారాయన.

"సార్! నాకు మన జానపద కళలలో ప్రాముఖ్యం వహించిన 'బుర్రకథ' అనే అంశంపై పరిశోధన చేయాలని ఉందండి. నేను పుట్టి, పెరిగింది పల్లెటూరిలోనే కదా. పండుగలలో మా ఊరి ఆలయంలో జరిగే జాతరలో ఈ బుర్రకథ కార్యక్రమం తప్పక ఉండేది. అలా నా చిన్నతనం నుండి ఈ బుర్రకథలపై నాకు మక్కువ ఏర్పడింది. అందుకే అదే అంశంపై నా పరిశోధన చేయాలని అనుకుంటున్నాను" అంది వెన్నెల.

ధనంజయ్‌గారు చాలా ఆశ్చర్యంగా "ఏమిటి? 'బుర్రకథ' పై పరిశోధన చేయటమా? డిజిటల్, సోషల్ మీడియా టెక్నాలజీ ఒకవైపు, టి.వీ. ఛానల్స్ మరొకవైపు విస్తృతంగా రాజ్యమేలుతున్న ఈ కాలంలో, ఎప్పుడో కాలంచెల్లిన, ఒకరకంగా అంతరించిపోతున్న జానపద కళను పరిశోధనాంశంగా తీసుకుని పి.హెచ్.డి చేస్తానంటున్నావు. ఇది నీకు చాలా కష్టమైన పని అవుతుంది సుమా" అంటూ హెచ్చరించారు.

"ఔనుసార్! ఈ మధ్యన ఓ టివీ ఛానల్‌వారు "రేలారే" అనే కార్యక్రమం పెట్టారు. మీరు చెప్పినట్లుగానే ఆ కార్యక్రమంలో అణగారిపోతున్న ఈ జానపద కళాకారులను, వారి ప్రస్తుత జీవన స్థితిగతులను చూపిస్తూ వాళ్ళతో బుర్రకథలను చెప్పిస్తూ, జానపద గీతాలను పాడిస్తూ ఎంతో ఉత్తేజపూరితంగా నిర్వహిస్తున్నారు. పల్లెటూరిలోనే పుట్టిపెరిగిన నాకు వాటి గురించి తెలుసు కాబట్టి సెలవలకు ఇంటికి పోయినప్పుడు ఆ టివీ కార్యక్రమాన్ని స్నేహితులతో కలసి చూస్తున్నాను.

ఆ కళాకారుల బాధలను వింటూంటే, 'నాకు వాళ్ళ జీవితాలను దగ్గరగా పరిశీలించి నా చదువు ద్వారా వాళ్ళకు ఏమైనా ప్రయోజనం చేకూర్చగలనా?' అన్న ఆలోచన కలిగింది. అందుకే ముందుగా బుర్రకథకుల జీవితాలపై అధ్యయనం చేసి పేపర్ ప్రజెంటేషన్ పూర్తిచేసి యూనివర్సిటీకి సమర్పిస్తే మంచిదనే నిర్ణయానికి వచ్చానండి" అంది.

"మంచిదమ్మా! నీకు "సంకుల విఠల్" అనే ప్రొఫెసర్‌గారిని పరిచయం చేస్తాను. ఆయనే నీకు గైడ్‌గా ఉండి నీ పరిశోధనలో సహాయం చేస్తారు. ఆయన కూడా 'జానపద గీతాలు' అనే అంశంపై పరిశోధన చేసి, ఇప్పుడు ఇదే యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. నీకు వారి ఫోను నంబర్ ఇస్తాను. వారితో మాట్లాడి తరువాత వెళ్ళి కలుసుకుని నీ తరువాత కార్యక్రమాని గురించి వారితో చర్చించు" అంటూ చెప్పారు ధనంజయ్‌గారు.

అలా విఠల్‌సార్ మార్గదర్శకత్వంలో వెన్నెల తన ఊరు చుట్టుప్రక్కలనున్న కళాకారులనే కాదు, యావత్తు భారత దేశంలోని 'బుర్రకథ' కళాకారులను కలుసుకుని వారి జీవితలను తరచి చూసి, వారి జీవితపు ఎత్తుపల్లాలను అవగాహన చేసుకుని, తన పరిశోధనాపత్రాలను డిపార్ట్‌మెంట్‌కి సమర్పించింది.

తెలుగులో పి.హెచ్.డి చేసే స్కాలర్స్ అంతా సాధారణంగా కవిత్రయంచే విరచితమైన, 'మహా భారతం'లోనో, పోతనచే పద్యగ్రస్తమైన 'భాగవతం'లోనో, తమతమ పరిశోధనాంశాలను ఎంచుకుంటారు. కానీ ఈ వెన్నెల 'బుర్రకథ' అనే అంశంపై పరిశోధన చేసింది. ఆమె ఏఏ విషయాలను తన పరిశోధనలో ప్రస్తావించిందో తెలుసుకోవాలనే ఆతృతతో, ఆమె పరిశోధనా పత్రాలను ఆసక్తిగా చదవసాగారు ధనంజయగారు. వెన్నెల 'బుర్రకథ' పరిశోధనా సరళికి, చదువుతున్న

ధనంజయగారి కళ్ళవెంట అశ్రువులు అప్రయత్నంగా జాలువారుతున్నాయి.

"జానపదులు చెమటోడ్చి పని చేసే కష్టజీవులు. సాయంత్రంకాగానే తమ శ్రమను మరచిపోవడానికి వినోదాన్ని కోరుకుంటారు. పూర్వం ఈ జానపదకళలకు ఎంతో ఆదరణ ఉండేది. హరికథలు, బుర్రకథలు, తోలుబొమ్మలాటలు మొదలైన కళారూపాలు ఎంతగానో పేరుగాంచాయి. ఆలయాలలోని మంటపాలు, నాలుగుకూడళ్ళ మధ్యనుండే రచ్చబండలు ఈ కళారూపాల ప్రదర్శనకు అనువైన ప్రదేశాలుగా ఎంచుకునే వారు.

'బుర్రకథ'లు చెప్పటానికి ముగ్గురు వ్యక్తుల అవసరం ఉంటుంది. ప్రధాన కథకుడు తలకు తురాయి టోపీ పెట్టుకుని నిండైన ఆహార్యంతో, కుడి భుజంపై 'తంబూర' పెట్టుకుని, ఎడమచేతి వేళ్ళకు 'చిరుచిడతలతో కూడిన పెద్ద రుమాల్' ధరించి, లయబద్ధంగా వాటిని మోగిస్తూ తన శ్రావ్యమైన కంఠంతో కథను ముందుకు నడుపుతూంటే, అతనికి ఇరుప్రక్కల 'వంతలు' చెరొక డోలు ధరించి, ప్రధాన కథకుడు చెప్పే ప్రతివిషయానికి 'తందాన, తాన తందానా' అంటూ వంత పాడతారు. వంతలలో ఒకరు 'వచనం', మరొకరు 'హాస్యం'లతో జనాలను నవ్విస్తూ ఆహ్లాదపరుస్తున్నా, వారి సంభాషణలలో చమత్కారం పాలు ఎక్కువగా ఉంటుంది. "వినరా భారత వీరకుమారా వందనం వందనం" అంటూ బుర్రకథను ఆరంభిస్తారు. రాత్రి మొదలయిన ఈ బుర్రకథలు వేకువ ఝూమువరకూ సాగుతూంటాయి.

'సీతారామ జననం', 'బాలనాగమ్మ', 'సారంగధర', 'బొబ్బిలి యుధం', మొదలైన కథాంశాలను ఎన్నుకుని బుర్రకథకులు ప్రజలను రంజింపచేసేవారు.

ప్రేక్షకులంతా వారికి బియ్యం, బట్టలతో పాటు ధనం కూడా ఇస్తూండటంతో ఆ కాలాన ఈ 'బుర్రకథ' కళాకారులకు తిండికి, జీవన భృతికి లోటుండేది కాదు. కానీ నేడు టి.వీ., సినిమా, కంప్యూటర్లు, సెల్‌ఫోన్ల వంటి సాంకేతిక విప్లవంతో వారికి దినసరి దొరకటమే కష్టమైపోతోంది.

ఆదరించేవారులేక, ఆదరణకోల్పోయిన ఈ కళాకారులు బ్రతుకుతెరువు కోసం ఈత చాపలల్లుతూ, సంతల్లో అమ్ముకుంటూ, ఊరూరాతిరుగుతూ, దొరికిన కూలిపనులను చేసుకుంటూ జీవిస్తున్నారు.

ఏదైనా తీర్థాలు, జాతరలు జరిగినప్పుడు, దేవుడి ఉత్సవాలప్పుడు వీరి కార్యక్రమాలను ఏర్పాటుచేస్తూ వీరిని ప్రోత్సహించే నిర్వాహకులు, నేటికాలంలో సినిమాల ప్రభావంతో రికార్డింగ్‌డాన్స్ వంటి అసభ్యనృత్యాలను నిర్వహించి ఈ కళాకారులను విస్మరిస్తున్నారు.

వారి పిల్లలు ఉన్నత చదువులు చదవాలన్నా, ఉద్యోగాలు సాధించాలన్నా వారి ఆర్థిక స్థితి తోడ్పడదు. కొందరు దాతల సాయంతో కొంతమంది పైచదువులకు వెడుతున్నారు. మిగిలిన వాళ్ళంతా ఇదే కళను నమ్ముకుని జీవన పోరాటం చేస్తున్నారు.

ఈ కళకు పూర్వ వైభవం తేవాలంటే ప్రభుత్వాలు, ప్రజలు, కళాశాలలలో, విశ్వవిద్యాలయాల్లో, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో ఈ కళారూపాలను ప్రదర్శించి ప్రోత్సహించాలి. పురాణ కథలతో పాటు, సామాజిక సమస్యలు, విద్య, ఆరోగ్యం రక్తదానం, ప్రకృతి పరిరక్షణ మొదలయిన విషయాలపై ప్రజలలో అవగాహనకు ఈ ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగ పడతాయి.

ప్రభుత్వాలు ఈ కళాకారులకు పింఛను, నిరుద్యోగ భృతి, వృత్తి విద్యలో శిక్షణలనందిస్తే ఈ కళ అంతరించిపోకుండా పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుంది.

# కథ

ఇలా ఎన్నో బుర్ర కథ కళాకారుల సమస్యలను, అభివృద్ధి అంశాలను తన పరిశోధనలో తెలియపరిచింది వెన్నెల.

ఇదంతా చదువుతున్న ధనంజయగారికి బుర్రకథ కళాకారుల యదార్ధ స్థితిగతులను ఆవిష్కరించటానికి వెన్నెల పడిన తపన అర్ధమయ్యింది. ఆయన ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ వేదికపై సందడి మొదలయ్యింది. పి.హెచ్. డి పూర్తిచేసిన స్కాలర్స్ అంతా ముందువరసలో కూర్చొన్నారు, గానీ వెన్నెల ఇంకా సభాప్రాంగణంలో కనిపించలేదు.

యూనివర్సిటీ ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్‌గారు విచ్చేసి భద్రతా సిబ్బంది నడుమ వేదిక ముందు ఆశీనులయ్యారు. వైస్–ఛాన్సలర్‌గారు గవర్నర్‌గారి ప్రక్కనే కూర్చుని, వారితో ఏదో విషయం మాట్లాడుతున్నారు. "వేడుకలు ప్రారంభించటానికి ఆలస్యం ఏమైనా ఉందా?" అంటూ అడిగారు ఛాన్సలర్‌గారు.

"ఏమీలేదండి. ఇంకాసేపట్లో మా తెలుగు విభాగం వారి సాంస్కృతిక కార్యక్రమంతో వేడుకలు ఆరంభమవుతాయి" అని బదులు చెప్పారు వైస్ ఛాన్సలర్‌గారు.

"ఏదైనా నృత్యసంగీత కార్యక్రమమా? లేక నాటికేమయినా వేస్తున్నారా?" అని అడిగారు ఛాన్సలర్‌గారు.

"కాదుసార్! మన పురాతన సంస్కృతికి ఆనవాలుగా మిగిలిన జానపదకళలలోని 'బుర్రకథ'ను కళాకారులు ఇప్పుడు ప్రదర్శిస్తున్నారు. మీరు కూడా మన జానపద కళలను బాగా ఇష్టపడతారని తెలిసింది. మీకు ఈ ప్రదర్శన ఆనందాన్ని ఇస్తుందనే భావిస్తున్నాను" అని చెప్పారు ధనంజయగారు.

"పెద్దలకు నమస్కారం. దయచేసి విద్యార్థులందరూ నిశ్శబ్దంగా ఉండాలి. ఈ మెట్రోపాలిటన్ సిటీలో మీరెప్పుడూ చూడని ఓ జానపద కళతో మన తెలుగు విభాగం విద్యార్థులు మీ ముందుకు వస్తున్నారు. ఆ కార్యక్రమాన్ని తిలకించి ఆస్వాదించండి" అని చెప్పారు స్టేజిమీదకు వచ్చిన ధనంజయగారు.

'బుర్రకథ' కళాకారులు స్టేజిమీదకు వచ్చారు. ప్రధాన కథకుడు చిన్నస్వామిగారు ఎర్రని వస్త్రాలు ధరించి ఉదయించే సూర్యునిలా వెలిగిపోతున్నారు. మిగిలిన కళాకారులు తగిన ఆహార్యంతో రంగస్థలాన్ని శోభాయమానం చేస్తున్నారు.

"మేం బనగానపల్లి నుండి వచ్చి మొట్టమొదటిసారిగా ఈ జంటనగరాలలో ఈ రోజున మా మొదటి ప్రదర్శన ఇస్తున్నాం. చదువు విలువ తెలుసుకుని కష్టపడి తన చదువుసాగించి, తన కన్నవారికి తద్వారా తన తరం వారికి కళల విలువను తెలియజేసే ఓ అమ్మాయి కథను మేము ఈ రోజు మీకు వినిపిస్తాం అంటూ "వినరా భారత వీర కుమారా.." అని కంఠమెత్తి పాడటం మొదలుపెట్టారు.

"నువ్వేదో రామాయణ, భారత కథను చెపుతావనుకుంటే, కళలు, విలువలంటున్నావేమిటి గురువా? అయితే నువ్వు చెప్పే కథ సినిమా కథనా? లేక టివీ సీరియల్ కథనా?" అంటూ ప్రధాన కథకునికి ఇరువైపులా వున్న వంతలు అడుగుతున్నారు.

"తినబోతూ రుచడుగుతారెందుకు? మరి వినండి" అంటూ "అనగనగా ఓ చిన్న ఊరిలో చక్కని చిన్న పిల్ల వుంది. అందంలో లక్ష్మీ దేవిని తలపిస్తూ, చదువులో సరస్వతికి ప్రతిరూపంగా నిలచింది" అంటున్న ప్రధాన కథకునికి అడ్డువస్తూ 'వంత', "ఆ మన సినిమాలోని హీరోయిన్ లెక్క ఉంటుందా?" అని అడిగాడు నవ్వుతూ.

"ఊరుకోరా! నీకు ఎప్పుడూ సినిమాల ధ్యాసేనా? పొట్టకోస్తే అక్షరం ముక్క రాదుగానీ నీకు సినిమాలు కావాలి" అంటూ కథను ముందుకు నడిపాడు ప్రధాన కథకుడు.

ఆ చక్కనిపిల్ల పల్లెటూళ్ళో

చదువు సంధ్యలెరుగని ఇంటిలో తప్పపుట్టింది. 'నే చదువుకుంటా'నంటూ పేచీపెట్టి ఊరిలోని స్కూలులో పదవతరగతి వరకు చదివింది. 'నేను కాలేజీలో జేరతానయ్యా' అంటూ వాళ్ళ నాన్నను వేధించటం మొదలుపెట్టింది.

"డబ్బులు లేనోడు దుబ్బుకు కొరకాడు" అంటారు. "నిన్ను పట్నంలో కాలేజీలో జేర్పించి చదువు సాగించే ఆర్థిక స్థోమత నాకు లేదు. అందులోను చదువుతో పూర్తవుతుందా? ఆడపిల్ల బాధ్యత. నీకు పెళ్ళి చేయాలంటే అది నాకు శక్తికిమించిన పనవుతుంది. అర్థం చేసుకో అమ్మా" అంటున్న నాన్న మాటలకు ఏం చేయాలో తెలియని పరిస్థితిలో ఉండిపోయింది.

ఇప్పటివరకు నీవు చదివిన పుస్తకాలలో వున్న పురాణ కథలు నీకు బాగానే వచ్చు కదా. నాకు తోడుగా నువ్వు కూడా బుర్రకథ చెప్పటానికి వస్తే కాస్త నాకు ఆర్థికంగా వేణ్ణీలకు చన్నీళ్ళుగా వెసులుబాటు దొరుకుతుంది. తొందరలో నీకు పెళ్ళి చేసి ఒక అయ్యచేతిలో నిన్ను పెడితే నా బాధ్యత కూడా తీరుతుంది" అన్నాడు తండ్రి.

ఆ మాటలకు 'ససేమిరా' అన్న ఆ పిల్ల కూలిపనులకు వెళ్ళి, ఇంటి దగ్గర ట్యూషన్లు చెప్పి ఓ సంవత్సరంలో కాలేజీలో జేరటానికి అవసరమైన డబ్బులు సంపాదించుకుని కాలేజీలో జేరిందా చదువుల సరస్వతి. పట్టుదలతో చదువు కొనసాగించిన ఆ తల్లికి అన్ని సబ్జెక్టులలో ఫస్ట్ మార్కులే వచ్చాయి. కొడుకుకు చదువుపై శ్రద్ధలేకపోవటంతో స్కూలు విద్య దగ్గరే ఆగిపోయాడు. కూతురుమాత్రం చదువుల్లో దీటుగా వుంది స్కూలులో, కాలేజీలో మంచి పేరు తెచ్చుకుంటోంది.

చదువంటే కూతురు చూపిస్తున్న శ్రద్ధకు మురిసిపోతున్న ఆ తండ్రి ఓ రోజేం చేశాడంటే, ఊరిలోని ఓ పెద్దింటి ముసలాయన కాలం చేశాడు. ఆ ఇంటి ఆసామి తండ్రి అంత్యక్రియలు పూర్తిచేసి చివరి రోజు తండ్రి స్మృత్యర్థం బుర్రకథ కార్యక్రమం పెట్టించాడు. మన చదువులతల్లి తండ్రి తమ్ముడు, తల్లితో కలిసి రాములవారి కథను చెప్పాడు. తన తండ్రికి ఇష్టమైన రాముని కథను చెప్పినందుకు సంతోషపడిన ఆ ఆసామి కథకులకు బట్టలు పెట్టి పదివేల రూపాయిలు ఇచ్చాడు. అప్పుడా బుర్రకథ చెప్పిన తండ్రి ఏమన్నాడో తెలుసా?" అంటూ ఆగాడు చిన్నస్వామి.

"ఇంకా డబ్బులు కావాలని అడిగుంటాడు" అన్నాడు వంత. "కాదు అన్నా తినడానికి బియ్యం కావాలని అడిగుంటాడు" అంది పక్కనే ఉన్న వనిత.

"మీరు అంతకు మించి ఆలోచించలేరా? ఎప్పుడూ తిండి గొడవ లేకపోతే సినిమాల విషయమేనా? ఆ తండ్రి ఏమడిగాడంటే నా కూతురు చదువులో బాగా రాణిస్తోంది. ఆమె కోరిన చదువును చెప్పించండయ్యా. మీరెప్పుడడిగినా బుర్రకథను మీకు ఉచితంగా చెపుతాను. అంతేకాదు మీకే పనులు కావాలన్నా నేను చేసిపెడతాను" అని వేడుకున్నాడు.

మీ ఇంట ఆడపిల్ల చదువుకుంటోందా? నేను తప్పక ఆమె చదువుకి సహాయం చేస్తాను" అంటూ ఆయన 'అభయహస్తం' ఇచ్చాడు.

ఆవిధంగా ఆ పేదింటిపిల్ల చక్కగా కాలేజీలో జేరి తనను కోరుకున్న ఉన్నత చదువును పూర్తిచేసింది. ఆ వనిత తన గతాన్ని, పేదరికాన్ని మరచిపోలేదు. తనవారికి, తన తోటి కళాకారులకు ఏదైనా మంచి చేయాలని తహతహలాడుతోంది. ఆ తల్లి కష్టానికి వందనం. వింటున్న మీ అందరికి వందనం" అంటూ ముగించారు చినస్వామిగారు. ప్రధానకథను రంజింపచేయటానికి వారు ఉదాహరించిన పిట్టకథలు ఎంతో ఆసక్తికరంగా సాగి కార్యక్రమంలో పాల్గొన్న శ్రోతలను మంత్రముగ్ధులను చేసాయి. చప్పట్లతో ఆడిటోరియం మారుమ్రోగింది.

"ప్రధాన కథకుడు చినస్వామిగారు. అతనికి వంతలుగా ఒకవైపు కొడుకు

చంద్రస్వామి నిలబడితే మరోవైపు కూతురు వెన్నెల నిలుచుంది. తన గాత్రంతో చినస్వామి భార్య చంద్రమ్మ సహకారం అందించింది" అంటూ కళాకారులను సభకు పరిచయం చేశారు ధనంజయగారు.

ఈ వెన్నెలమ్మ మన వెన్నెలేనా అంటూ వైస్ ఛాన్సలర్‌గారు ఆశ్చర్యపోతూ వెన్నెల ముఖంలోకి పరీక్షగా చూశారు. "గమనించారా తేజోవంతమైన ఆ కళ్ళలోని వెలుగును" అంటూ గవర్నర్‌గారికి వెన్నెల గురించి చెప్పారు వైస్ ఛాన్సలర్‌గారు.

అప్పటివరకు క్రిందకూర్చున్న పెద్దలు వేదికను అలంకరించారు. కళాకారులు తమతమ స్థానాలలో కూర్చున్నారు.

ఒక్కొక్క విభాగంలో పేర్లను చదువుతూ గవర్నర్‌గారి చేతులమీదుగా 'డాక్టరేట్' పట్టాను అందిస్తున్నారు. తెలుగు శాఖకు సంబంధించి "కుమారి వెన్నెల 'బుర్రకథ' అనే అంశంలో తన పరిశోధనాపత్రం అందించారు" అంటూ మైక్‌లో చెపుతున్నారు.

గవర్నర్‌గారు వెన్నెలకు డాక్టరేట్ పట్టాను అందిస్తూ "నాకు చాలా గర్వంగా ఉందమ్మా. నీలాంటి విద్యార్థినికి ఇలా 'డాక్టరేట్' నందిస్తున్నందుకు. ముఖ్యంగా నేను నిన్ను ఒకందుకు అభినందిస్తున్నాను. నీ చదువు ఒక్క నీ కుటుంబానికే పరిమితం చేయకుండా, 'బుర్రకథ' కళాకారులందరికీ మేలుచేసే విధంగా కొనసాగించావు. నీవు చేసిన శ్రమ గురించి మీ ధనంజయసార్ నాకు చెప్పారు. నీ ఆశయం అంతరించి పోతున్న ఒక జానపద కళకు పునరుజ్జీవం కలిగించేదిశలో సాగింది. కీప్ ఇట్ అప్. నేను కూడా నీ పరిశోధనా వ్యాసాన్ని పూర్తిగా చదివి ప్రభుత్వానికి ఈ బుర్రకథా కళాకారుల సమస్యల గురించి తెలియజేసి, వాటి పరిష్కారానికి నీవు సూచించిన సలహాలను పరిగణలోనికి తీసుకుని కార్యాచరణ తీసుకోవాలని నా వంతు సూచనలను చేస్తాను. విద్యార్థులందరూ మీ చదువును ఈ వెన్నెలలా సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దుకోవాలి అంటూ సందేశమిచ్చారు.

వెన్నెలను స్టేజ్ మీద చూసిన ప్రేక్షకులంతా "ఈమె బుర్రకథ కళాకారిణా? ఎంత చక్కగా ప్రదర్శన ఇచ్చింది. తనకథనే బుర్రకథగా చెప్పించి ఆ రంగంలో కష్టపడేవారి సమస్యలను ఎంతో సున్నితంగా వివరించింది" అని విస్మయంగా అనుకుంటూ, అభినందనలను చప్పట్లరూపంలో అందించారు.

వేదిక ముందు కూర్చున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వెన్నెల తమ కళ్ళముందు ఇంతగొప్పగా ఎదిగిన తీరుకు ఓరకమైన భావోద్వేగానికి లోనైనారు.

ఈ 'వెన్నెల' చదువుల సౌరభం, చల్లని ఆడిటోరియం నిండా పౌర్ణమినాటి చంద్రుని వెన్నెలకి సాటిగా పరచుకుంది.

★★★★★

కథ

# నాన్న మనసు



ఎం వి రత్న శర్మ

ఎప్పటిలానే స్కూలు ఇంటర్వెల్ టైంలో ప్రసాదు, గోపీలతో కలిసి టీ త్రాగుదామని స్కూలు గేటుప్రక్కనే ఉన్న కాకా హోటల్‌కి వెళ్ళాను. గత పాతిక సంవత్సరాలుగా ఎక్కడ పనిచేసినా ఇంటర్వెల్ టైంలో టీత్రాగటం అలవాటయ్యింది. మొదటి రెండు పిరియడ్లు వాగిన తర్వాత అలసట అనిపించేది. ఆ మాత్రంరిఫ్రెష్‌మెంట్ అవసరమయ్యేది. అదృష్టవశాత్తు టీ త్రాగే అవకాశం ప్రతిచోట దొరికింది.

సికింద్రాబాద్ అల్పా హోటల్‌లో ఇరానీ చాయ్‌లాగా కాకా హోటల్‌లో టీ బాగుంటుంది. ఈ ఊరికిఇదొక్కటే కాకా హోటల్. అక్కడున్న ఆ పిల్లవాడు మమ్మల్ని చూడగానే స్పెషల్ టీ పెట్టి మరీ ఇచ్చేవాడు. చదువు అబ్బకపోయినా టీచర్లంటే వాడి అభిమానం అట్లాంటిది. వాడి పేరు బంటి.

వాళ్ళ నాన్న పేరు నారాయణ. ఎప్పుడన్నా వాళ్ళ నాన్న ఉంటాడు. అప్పుడు మాత్రం స్పెషల్‌గాపెట్టి ఇవ్వటం ఉండదు. అయినా టీ పరవాలేదన్నట్టుంటుంది.

ఆ రోజు వాళ్ళ నాన్న ఉన్నాడు. హోటల్ పెద్ద రద్దీగా కూడా లేదు. కొంచెం దిగాలుగాఉన్నాడనిపించింది చూడగానే.

"ఏం నారాయణ జనం లేనట్టున్నారు ఇవ్వాళ" అంటూ మాట కలిపాను.

"ఏముంది మాస్టారు ఒక్కొక్కరోజు అంతే ఉంటుంది." అన్నాడు నిర్లిప్తంగా.

"మాకు మూడు చాయ్ ఇవ్వు" అన్నాను డబ్బులిస్తూ.

వెంటనే పేపర్ కప్పులో పోసి మూడు టీలు అందించాడు. ఎప్పుడో గాజు గ్లాసులో టీపోసివ్వదన్నాను. అది గుర్తు పెట్టుకుని ఇప్పటికీ పేపరు కప్పులోనే టీ ఇస్తారు తండ్రీకొడుకులు.

"ఏడీ ఇవ్వాళ అబ్బాయి లేడు?" అని అడిగాను మళ్ళీ.

"వాడిదా అదో పెద్ద భారతం చెబితే!" అన్నాడు వెంటనే నారాయణ.

"ఏమయ్యింది?" అన్నాను ఆరాగా.

"ఏం చెప్పను మాస్టారూ! ఒకటే

# కథ

సావాసాలు పొద్దున, సాయంత్రం హోటల్‌లో ఏముంటాడో అంతే ! ఆ

తర్వాత అంతా బయటే తిరుగుతూంటాడు ఫ్రెండ్స్‌తో'' అన్నాడు నారాయణ.

''తిరగనీ, పిల్లలన్నాక ఇప్పుడు తిరగకపోతే ఎప్పుడు తిరుగుతారు నారాయణ'' అన్నాను వాడి

చిన్నతనాన్ని దృష్టిలో పెట్టుకుని.

ఈ లోగా టీ త్రాగటం పూర్తి చేసి ప్రసాద్, గోపీలు పైకిలేచారు. ఇంటర్వెల్ టైం పది నిమిషాలే ఉంటుంది

కాబట్టి ఎక్కువ సేపు ఇక్కడ ఉండటానికి కుదరదు. ముగ్గురం స్కూల్లోకి నడిచాం.

మూడో పిరియడ్ ప్రసాద్, గోపీలు క్లాసుకి వెళ్ళారు స్టాఫ్‌రూమ్‌లో ఒక్కడినే ఉండటంతో ఆలోచన

కొంచెం సేపు టీ దుకాణం వైపుకి మళ్ళింది. నారాయణ ఆ హోటల్‌తోనే ఆస్తి సంపాదించి ఇల్లు కట్టుకున్నాడు.

ఒక్కగానొక్క కొడుకు కావటంతో వాణ్ణి చదివిద్దామనుకున్నా చదువు అబ్బక పోవటంతో తనతో పాటే

హోటల్‌లో ఉంచి పనులు నేర్పాడు. ఆ హోటల్‌కి తన

వారసుడ్ని చేశాడు. రేపో మాపో పెళ్ళి

చేయ్యాలనుకుంటున్నాడు. ఆ హోటల్‌కి రెగ్యులర్‌గా వెళ్తుండటంతో తమకు అప్పుడు కొంచెం అప్పుడు

కొంచెంగా తెలిసిన సమాచారమిది.

బలవంతంగా ఆ ఆలోచనలోనించి బయటపడి నెక్ట్స్ పిరియడ్ కోసం ప్రిపేర్ కాసాగాను.

ఆ మర్నాడు మళ్ళీ ఇంటర్వెల్‌కి టీ త్రాగడానికి వెళ్ళాం ముగ్గురం. కాని హోటల్ మూసి ఉంది. దాంతో

వెనక్కి తిరిగి వచ్చాం. వరుసగా అలా నాలుగు రోజులు తెరవలేదు. ఏమయ్యిందో చెప్పేవాళ్ళెవరు లేరు.

మొత్తానికి ఒక వారానికి మళ్ళీ హోటల్ తెరుచుకుంది. ఆరోజు ప్రసాద్‌తో కలిసి టీ కోసం వెళ్ళాను.

''ఏం నారాయణ ! వారం రోజుల నుంచి మాకు టీ లేకుండా చేశావ్'' అన్నాను చొరవగా.

''ఏం చేస్తాం!'' అన్నాడు నిరాసక్తంగా.

''ఏమయ్యింది ఊరెళ్ళావా!'' అన్నాను.

''ఊరా! పాడా! ఏదో ఇబ్బంది'' అని నసిగాడు నారాయణ.

''ఒంట్లో బాగాలేదా!'' అడిగాను మళ్ళీ.

''అదేం కాదండి మాస్టారు. మీకు చెప్పక పోవటమేం గాని, ఇబ్బందొకటి వచ్చింది'' అన్నాడు

చెప్పొచ్చా, చెప్పకూడదా! అని సంశయిస్తూ.

''పరవాలేదులే ! ఏమయ్యిందో చెప్పు'' అన్నాను సానునయంగా.

''బంటి ఊరు నిండా అప్పులు చేసి ఎటోపోయాడు. వాణ్ణి వెతుక్కుంటూ నాలుగు రోజులు

తిరిగొచ్చాను. చుట్టాలిళ్ళలో కూడా లేడు. ఎక్కడికి పోయాడో తెలియటం లేదు'' అన్నాడు నారాయణ.

పోలీసు కంప్లైంట్ ఇచ్చావా!'' అడిగాను.

''లేదు'' అన్నాడు నారాయణ

''కనపడితే కొట్టేటట్లున్నారు వాడికి అప్పులిచ్చిన వాళ్ళు'' అన్నాడు మళ్ళీ తనే.

''మరేం చేద్దామనుకుంటున్నావ్'' అడిగాను.

''అదే తోచటం లేదు'' అన్నాడు నారాయణ.

''మనిషి ఎక్కడున్నాడో తెలిస్తే

కనీసం. తర్వాత ఇక్కడికి రావటమా! లేదా! అన్నది

ఆలోచించవచ్చు'' అన్నాను సాలోచనగా

''అదే ! వెదుకుతున్నాం'' అన్నాడు నారాయణ.

''అప్పు ఎంతుంటుందేంటి'' అడిగాను ఆరాగా.

''నాలుగు లక్షల దాకా తేలింది'' అన్నాడు నారాయణ

''ఏం చూసి ఇచ్చారంట'' అన్నాను

''వాళ్ళకవన్నీ అనవసరం. వీడడిగాడు వాళ్ళిచ్చారు. తేడా వస్తే ఎగబడతారు'' అన్నాడు.

ఆ సంభాషణ అక్కడితో ముగిస్తూ మళ్ళీ మేము స్కూలు బాటపట్టాం

:: :: ::

సరిగ్గా ఇది జరిగిన నెల రోజులకి నారాయణే చెప్పాడు. మావాడు హైదరాబాదులో ఉన్నాడండి

దొరికాడు'' అని.

''ఏం చేస్తున్నాడక్కడ?'' అడిగాను.

''తెలిసిన విద్య ఒక్కటే! ఏదో హోటల్‌లో చేరాడు. పొట్ట పోసుకోడానికి. కాకపోతే అందరికి తెలిస్తే అక్కడ

కూడా వాణ్ణి బ్రతకనివ్వరని

మేమే దాచి ఉంచాం చెప్పకుండా! ఎవరితోనైనా అనేరు మాస్టారు'' అన్నాడు

భయంగా నారాయణ.

''ఛ! ఛ! అలా ఎందుకంటాం నారాయణ'' అన్నాను భరోసా ఇస్తూ.

''కొంచెంసేపాగి మళ్ళీ నేనే ''ఎక్కడో అక్కడ ఉన్నాడు కదా! ఉండనివ్వండి'' అన్నాను సలహా ఇస్తూ.

''అది సరే ! ఇక్కడ అప్పుల వాళ్ళ పరిస్థితి ఏంటి'' అడిగాను మళ్ళీ

''ఇంటి చుట్టూ తిరిగిపోతున్నారు. నన్నడిగి ఇచ్చారా! అని అంటున్నాను'' అన్నాడు.

''అసలన్ని అప్పులెందుకు చేసాడో ఏమన్నా చెప్పాడా!'' అని అడిగాను.

''అదేదో క్రికెట్టు ఆటలో బెట్టింగులు కాసాడు. అందులో డబ్బులు పోగొట్టుకున్నాడట. మంచో చెడో

తెలుసుకోకుండా తెలిసీతెలియని దాంటో వేలు పెడితే ఏమౌతుంది'' అన్నాడు నారాయణ నిష్ఠూరంగా

అప్పటికాటాపిక్ ముగించి స్కూలుకి చేరాం.

స్కూలుకి వెళ్ళానుగాని, మనసు మనసులో లేదు. ఆ నెక్స్ట్ పిరియడ్ ఖాళీ కావటంతో

స్టాఫ్‌రూమ్‌లో ఉండిపోయాను.

ఎంత వద్దనుకున్నా మనసు బంటి చుట్టూ తిరుగుతోంది. చక్కగా

కష్టపడుతున్నారు ఇంటిల్లిపాది. నాలుగు వేళ్ళు లోపలికి పోతున్నాయ్. ఊళ్ళో మంచిపేరూ ఉంది. ఒకరికి

ఆశపడకుండా ఉన్నంతలో హాయిగా జీవించవచ్చు. ఇల్లు వాకిలీ ఏర్పరుచుకున్నారు. ఈ గొడవతో పచ్చని

సంసారంలో చిచ్చురేగినట్లయ్యింది. ప్రశాంత సరోవరంలో కల్లోలం ఏర్పడినట్లయ్యింది. దానంతట అది

ఏర్పడటం కాదు. చేతులారా చేసుకోవటం తప్పుదోవపడుతున్న యువత అత్యాశతో అంతులేని

కలలుకంటూ జీవితాన్ని నాశనం చేసుకుంటున్న వైనం కలిచివేసింది.

క్రికెట్ బెట్టింగులు పట్నాలుదాటి పల్లెల్ని తాకిన వైనం తలచుకుంటే బాధగా అనిపించింది. ఈజీ

మనీ కోసం అడ్డదారులు తొక్కుతున్న యువతని తలచుకుంటే మనసు మరింత మూగగా

రోదించినట్లయ్యింది. ఎంత వద్దనుకున్నా ఆలోచన తనని వదలట్లేదు. ఒక్క క్రికెట్టు బెట్టింగులే

కథ

కాదు

ఆన్‌లైన్ యాప్‌లు, పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి అప్పులిచ్చిమరీ నాశనం చేస్తున్నాయ్. వాటి వలలో

చిక్కితే ఇక అంతే సంగతులు. వారంలో తీర్చాలి, నెలలో తీర్చాలి అంటూ మొదలుపెట్టి అంతులేకుండా

అప్పులు పెంచి సూసైడ్‌లు చేసుకునేవరకు దారితీస్తున్న వైనం రోజు పేపర్లో చూస్తూనే ఉన్నాం.

అవసరాలకు అప్పులు చేయనివాళ్ళుండరు. వాళ్ళ అవసరాలను ఆసరాగా తీసుకుని అప్పుల

ఊబిలోదించి, మానమర్యాదలు పోగొట్టటం, ప్రాణాలు తీసుకునేటట్లు చేయటం జరుగుతోంది. ప్రభుత్వాలు

వీటిని అరికట్టలేక పోతుండటం దురదృష్టం.

"రవి మాస్టారు!" అని పిలుస్తున్న అటెండరు పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాను.

"హెడ్ మాస్టారుగారు పిలుస్తున్నారు మిమ్మల్ని" అని చెప్పి అటెండరు వెళ్ళాడు. ఎక్కువగా ఈ

విషయంలో ఇన్‌వాల్వ్ అవుతున్నాననిపించింది.

ఇక నుండి ఈ విషయం గురించి ఆలోచించొద్దని

మనసులోనే గట్టిగా నిర్ణయించుకుని హెడ్ మాస్టారు గదివైపు సాగిపోయాను.

:: :: ::

ఒక సంవత్సర కాలం కాలగర్భంలో కలిసిపోయింది. నాకు వేరే ఊరికి ట్రాన్స్‌ఫర్ అయ్యింది. స్కూల్లో

అందరికి చిన్నపార్టీ ఇచ్చాను. ఆ రోజు సాయంత్రం నాలుగు గంటల వేళ టీ పట్టుకుని వచ్చాడు నారాయణ.

అందరికి టీ సర్వ్ చేసిన తర్వాత డబ్బులు లెక్కచూసి ఇచ్చాను.

అప్పుడడిగాను "బంటి సంగతులు ఏంటి?" అని

"ఫరవాలేదులేండి. కుదురుకున్నాడు. హోటల్‌లో పని చేసుకుంటున్నాడు. ఎలాంటి పిచ్చి

వేషాలు వేయకుండా. బాగా బుద్ధి వచ్చినట్లుంది. ఇప్పటికైతే బాగానే ఉన్నాడు. అందుకే ఒకమ్మాయిని

చూసి వీలైనంత తొందరగా పెళ్ళి చేయ్యాలనుకుంటున్నాను. అక్కడే కాపురం పెట్టి కొన్నాళ్ళు ఉంటాడు"

అన్నాడు నారాయణ.

"సరేలే! వాడెక్కడ ఉంటే బాగుంటాడని అనిపిస్తే అక్కడే ఉంచు పెళ్ళి చెయ్యి. వాడి బాధలేవో వాడు

పడతాడు" అని ఒక ఉచిత సలహా ఇచ్చాను, కన్న పిల్లలు ఎన్ని తప్పులు చేసినా కడుపులో దాచుకొని,

వారి ఉన్నతికి పాటుపడే ఆ తండ్రి హృదయాన్ని మనసులోనే మెచ్చుకుంటూ.

"మరి అప్పులాళ్ళనేం చేశావు!" అడిగాను ఆతృతనాపుకోలేక మళ్ళీ.

"కొంతకొంతగా తీరుస్తున్నాను.

"ఒక్కడే కొడుకు కదా, వెనకాల ఇల్లు వాకిలి ఉంది ఎక్కడిపోతాడు ఇస్తాడులే అని ఇచ్చేవాళ్ళు

అప్పులిచ్చారు. ఇప్పుడెంట పడ్తున్నారు"

పిల్లలు చేసిన తప్పుల్ని తండ్రిగా నెత్తికెత్తుకుని సరిదిద్దక తప్పదు కదా! అన్నాడు నారాయణ

:: :: ::

★★★★★★★

## కబుర్లు... ఉత్తినే






# " ఇదే ఇప్పుడు ఫాషన్ "

నా చిన్నతనం లో మా అమ్మ పండగలకి , పబ్బాలకి కొత్త బట్టలు కొనిపెట్టేది . నాకు ఒక పట్టాన బట్టలు నచ్చేవి కావు . ఆడపిల్లలే నయం నీకంటే అని వెక్కిరించేది మా చెల్లి .నా చిన్న తనం లో అందరూ టైట్ పాంట్లు పొట్టి చొక్కాలు వేసుకునే వాళ్ళు .ఆడవాళ్ళ బట్టలు అయితే వంటికి అతుక్కు పోయి వళ్ళంతా కనపడేది.అంత బిగుతైన బట్టలు ఒక ఏడాది తరువాత అవి ఎందుకు పనికొచ్చేవి కావు .

ఎప్పటికప్పుడు ఫాషన్ మారిపోతు ఉంటుంది .సరి కొత్త ఫాషన్ బట్టలు కట్టుకోవాలనే కోరిక కాలేజి రోజుల్లో బలంగా ఉండేది .నా చిన్నతనం లో ఎన్ టీ ఆర్ వేసే బెల్ బాటమ్ పాంట్లు బాగా ఫేమస్ .ఓ అర్ధ శతాబ్దం పాటు బెల్ బాటం పాంట్లు రాజ్యం ఎలాయి . కాళ్ళకు జెండాలు కట్టినట్టు ఉండేవి ఆ పాంట్లు.అవి వేసుకుని నడుస్తూ ఉంటె రోడ్డు మొత్తం ఉడుస్తున్న ఫీలింగ్ ఉండేది . వాటి పుణ్యమా అని రోడ్లు బాగా సుభ్ర పడేవి .

ఆ తరువాత జీన్స్ పాంట్లు వచ్చాయి . వాస్తవానికి ఈ ప్యాంటులను గనులలో పనిచేసే కార్మికుల వంటి శారీరక శ్రమ చేసే వారి దుస్తులుగా రూపొందించారు. యునైటెడ్ స్టేట్స్‌లో, జేబుల కుట్లు బలంగా ఉండటానికి వారి కోసం రివెట్లను జోడించేవారు. ఈ ఆధునిక రివెట్లతో కూడిన బ్లూ జీన్స్‌ను ఒక ఫ్యాషన్ వస్తువుగా మార్లన్ బ్రాండో మరియు జేమ్స్ డీన్ తమ 1950ల నాటి చిత్రాలలో, ముఖ్యంగా 'ది వైల్డ్...' వంటి చిత్రాలలో సాధారణ దుస్తులుగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. అడ్రియానో గోల్డ్‌ష్మీడ్ (జననం 1944, ట్రియెస్టే, ఇటలీ) డెనిమ్ జీన్స్‌పై దృష్టి సారించే ఒక ఇటాలియన్ ఫ్యాషన్ డిజైనర్. ఆయనను "డెనిమ్ గాడ్‌ఫాదర్" అని పిలుస్తారు .

వీటిలో ఉన్న సౌలభ్యం ఏమిటంటే వీటిని రోజు ఉతకాల్సిన పనిలేదో ఏ వారానికి పది రోజులకో ఉతుకుతారు . పదిరోజుల పాటు ఉతక్కుండా వేసుకోవటం వల్ల దుర్వాసన వెదజల్లవా అని మీకు అనుమానం రావటం సహజమే .రాకుండా ఎలా ఉంటాయి , కాని ఏమి చేస్తాం ఎవడి వాసన వాడికి ఇంపు కదండీ, కాకపోతే పక్కనోళ్ళు మాత్రం ఆ వాసనకు వాంతులు చేసుకునే వాళ్ళు .ఇంకాచెప్పాలంటే వెలిసిపోయిన జీన్సు పాంట్లకు

# కబుర్లు... ఉత్తినే

, చిరిగిపోయిన జీన్స్ పాంట్లకు ఈరోజుల్లో బాగా గిరాకి . బట్టలు కొనే శక్తీ లేని పేదవాళ్లు అరువుతెచ్చుకున్న పాత బట్టలు , వెలిసిపోయినవి, చిరిగిపోయినవి వేసుకుంటూ ఉంటారు. కాని అదేమీ ఖర్మమో వేలకు వేలు పోసి ఇప్పుడు యువత వెలిసి పోయినవి , చిరిగిపోయినవి కొంటున్నారు .

జీన్స్ కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత లేని పేదవాళ్లను చులకనగా చూస్తున్న సమాజం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసేవాళ్లు. అందుకే, సమాజంపై కోపం, నిరసనకు ప్రతీకగా పంక్ రాక్ బ్యాండ్ సభ్యులు జీన్స్ ప్యాంట్లను కొనుగోలు చేసి వాటిని చింపి ధరించేవాళ్లు. బీటిల్స్, రామొనోస్ వంటి రాక్స్టార్స్ చిరిగిన జీన్స్ ధరించడంతో ఇదో ఫ్యాషన్గా తయారైంది. దీంతో కంపెనీలు చిరిగిన జీన్స్ను మార్కెట్లోకి తీసుకొచ్చాయి. ఆ తర్వాత వాటితోపాటు అనేక రకాల జీన్స్లు అందుబాటులోకి వచ్చాయి. నెమ్మదిగా చిరిగిన జీన్స్ ఫ్యాషన్ కనుమరుగైంది. 2010 తర్వాత మళ్లీ ఫ్యాషన్ ప్రపంచంలోకి ఈ చిరిగిన జీన్స్ అడుగుపెట్టాయి. డీజిల్, బాల్మెయిన్ తదితర కంపెనీలు చిరిగిన(రిప్) జీన్స్ను 'డిస్ట్రెస్' జీన్స్ పేరుతో ఫ్యాషన్ షోల్లో ఉపయోగించాయి. ఆ తర్వాత ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. చిరిగిన జీన్స్...

యమహా బైకులు కాలేజీ ఫ్యాషన్లనీ, టీనేజీ ట్రెడిషన్లనీ చెప్పుకొంటూ వాటిని తెగ ఫేమస్ చేశారు యూత్. అయ్యో దేనికో గీరుకుని చిల్లు పడ్డట్టుందే అనిపించేలా ఓ మోస్తరు చిరుగులతో ఉన్న ప్యాంట్లని మనం చాన్నాళ్ల నుంచీ చూస్తూనే ఉన్నాం. కానీ ఇప్పుడు అందులోనే మరో కొత్త రకం వచ్చింది. రోబో 2.0 లాగా ఇది మరీ అడ్వాన్సు. జీన్సు మొత్తం దారాలు వేలాడుతూ



ఉండేలా, చినుగుల కంతలాగా కనిపించేలా తయారవుతున్న వీటిని డిస్ట్రెస్డ్ జీన్స్గా పిలుస్తున్నారు. ప్యాంటు దారాలు ఊడిపోయినట్టు, చిరిగినట్టు, మరకలు పడినట్టు, ముక్కలేసి కుట్టినట్టు... అంటే బాగా వాడినట్టు కనిపించడమే వీటి ప్రత్యేకత. దీన్ని వింటేజ్ లుక్ అని కూడా పిలుస్తున్నారు.


వీటిని చూశాక ఎవరైనా, ఆ... మనకు సంబంధం లేని ఏ విదేశాల్లోనో వీటిని వాడుతున్నారు, అమ్ముతున్నారు అనుకోవడానికి లేదు. మామూలుగా మనం వాడే అమెజాన్, మింత్రలాంటి వెబ్సైట్లూ అమ్ముతున్నాయి కూడా. ఏది ఏమైనా డిస్ట్రెస్డ్ జీన్సు సంగతేమో కానీ వాటిని చూస్తే ఎదుటివాళ్లు డిప్రెస్ అయ్యేలా ఉన్నాయని మాత్రం అనిపిస్తుంది.చిరిగిన జీన్స్ ఫ్యాషన్.. కానీ ఇప్పుడు అన్నీ చించేసుకుంటున్నారు. ఏది ఎంత చిరిగితే అంత ఫ్యాషన్ అయిపోయింది. నిన్నటికినిన్న చిరిగిన బూట్లతో సల్మాన్ ఖాన్ కనిపించగా..
ఈరోజు చిరిగిన కోటుతో అక్షయ్ కుమార్ ఏకంగా మీడియా ముందుకొచ్చాడు. బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ వేసుకున్న బూట్లపై సోషల్ మీడియాలో జోరుగా చర్చ సాగుతోంది. ఖరీదైన కారు నుంచి హుందాగా దిగిన సల్మాన్, చిరిగిన బూటుతో దర్శనమిచ్చాడు. చాలామంది పాపం, సల్మాన్ చూసుకోలేదని అనుకున్నారు. కానీ ఆ తర్వాత అది ఫ్యాషన్ అని తెలుసుకొని అవాక్కయ్యారు.

బాలెన్సియా కంపెనీకి చెందిన మోడల్ షూ ఇది. ఈ లెదర్ కౌబాయ్ షూ ఖరీదు అక్షరాలా లక్షా 50వేల రూపాయలు. చిరిగిన బూటుకు ఇంత రేటా అనుకోవద్దు..

ఇప్పుడిదే ఫ్యాషన్ మరి. ఇటు అక్షయ్ కుమార్ కూడా చిరిగిన దుస్తులతో ప్రత్యక్షమయ్యాడు. అతడు ధరించిన కోటు చీలికలు పేలికలైంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఎలుకలు కొరికేసిన కోటులా ఉంది. తన కొత్త సినిమా ప్రచారం కోసం ఇలా చిరిగిన కోటుతో ప్రత్యక్షమయ్యాడు అక్షయ్ కుమార్. ఈ కోటును తయారుచేయడానికి డిజైనర్ల బృందమే పనిచేసింది. 36 గంటలు కష్టపడి ఈ కోటును ఇలా చించారంట.అలా.. ఒకప్పుడుసర్వ సాధారణంగా 10 వేల రూపాయల జీన్స్‌ను కొంటేనే చాలా ఎక్కువ ధరకు జీన్స్ ప్యాంట్ కొన్నామని భావిస్తారు.. అయితే ఇప్పుడు ఒక జీన్స్ ను లక్షా రెండు లక్షలకు కాదు.. దాదాపు కోటి రూపాయలకు చెరువులో డబ్బులు చెల్లించి సొంతం చేసుకున్నారు. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన తెల్లటి రంగులో ఉన్న జీన్స్ USAలోని నార్త్ కరోలినాలోని ఓడ శిథిలాల్లో దొరికింది. నివేదికల ప్రకారం, 1857లో ఓడ మునిగిపోయింది. ఈ జీన్స్ ను అదే ఓడకి చెందిన శిథిలాల నుండి కనుగొన్నారు. అంటే ఇప్పుడు ఈ జీన్స్‌కు సుమారు 165 ఏళ్లు. అలాంటి పరిస్థితిలో వేలం వేయగా వేలంలో దాదాపు 94 లక్షల రూపాయలు (US$114,000) వచ్చాయి. ఈ జీన్స్‌లు లెవీ స్ట్రాస్ & కో కంపెనీ తయారు చేసింది కావచ్చని కొందరు అంటున్నారు

★★★★





# ఉదంకోపాఖ్యానం



**ఆచార్య ఇరపని మాధవి**

. ఉదంకుడు గౌతముడి శిష్యుడు. చాలాకాలం నియమబద్ధంగా తన గురువైన గౌతముడికి సేవ చేశాడు. గౌతముడు మిగిలిన శిష్యులందరికీ తగిన వరాలిచ్చి పంపివేశాడు. కాని ఉదంకుడి మాట తలపనే తలపలేదు. అయినా ఉదంకుడు మహానిష్ఠతో గురుశుశ్రూష చేస్తూనే ఉన్నాడు. ఒకరోజు అతడు మెడ దిగబడిపోయేంత బరువు కలిగిన వంటకట్టెల మోపు తీసుకొచ్చాడు. ఆవిధంగా తెచ్చిన వంటకట్టెల మోపును వేగంగా క్రింద పడవేయగా ఆ మోపులో చిక్కుకొని అతడి జడ ఒకటి తెగి కింద పడింది. ముసలితనం రావటం వలన ఆ జడలోని వెంట్రుకలు తెల్లబడిపోయి ఉన్నాయి. ఉదంకుడు తెల్లబడిన ఆ జడను చూసి వయస్సు గడిచిపోయిందని శోకించాడు. అప్పుడు గౌతముడు అతడి కన్నీటిని దోసిట్లో పట్టుకొనటానికి తన కూతురిని పంపాడు. ఆమె దోసిట్లో పట్టిన కన్నీళ్ల వేడికి తన చేతులు కాలగా వాటిని భూమి మీద వదిలింది. కన్నీళ్ల వేడికి భూమి కూడా క్షోభించింది. అప్పుడు గౌతముడు ఉదంకుడిని దగ్గరకు పిలిచి ఎందుకు ఏడుస్తున్నావని అడిగాడు. దానికి ఉదంకుడు " మహర్షీ! ఎంతో కాలం గడచినప్పటికీ మీకు శిష్యులందరిమీద ఉన్న దయ నాపట్ల కలగలేదు. దీనికి ఎలా దుఃఖించకుండా ఉండేది" అన్నాడు. గౌతముడికి అతడిపై దయ కలిగి "మహాత్మా! నీకు యౌవనాన్ని ప్రసాదించాను. నా కూతురిని కూడా ఇస్తాను, ఆమెను సంతోషంగా పెళ్లాడు. ఈమె తప్ప ఎవరూ నీ తేజస్సును సహించలేరు. మీ ఇద్దరికీ సమానధర్మం కలిగేవిధంగా నూతన శరీరం వచ్చేటట్లు చేస్తాను. ఆ శరీరప్రాప్తి పునర్జన్మ వంటిదే. ఎలాంటి అనుమానం లేకుండా యౌవనవంతుడివై నా కుమార్తెను వివాహం చేసుకో. ఇది అధర్మం కాకుండేటట్లు వరమిచ్చాను" అని అన్నాడు. గౌతముడు దయతో ఆ కన్యకు కూడా అందమైన శరీరాన్ని ఇచ్చాడు. ఉదంకుడు యౌవనం పొంది గురుపుత్రిని వివాహం చేసుకున్నాడు.

ఆ తరువాత ఉదంకుడు గౌతముడితో " మీరు నన్ను ఆజ్ఞాపించండి, గురుదక్షిణగా మీరు కోరిన దానిని తీసుకొని వస్తాను. ఈ పని చేయటానికి అవసరమైన శక్తి మీ దయవల్లే లభిస్తుంది" అని అభ్యర్థించాడు. అప్పుడు గౌతముడు " నీ సత్ప్రవర్తన వలనే నాకు దక్షిణ వలన కలిగే సంతోషం లభిస్తుంది" అన్నాడు. గురువు మాటలు విన్న తర్వాత కూడా ఉదంకుడు ఊరుకోలేదు. గురుపత్ని అయిన అహల్యకు నమస్కరించి భక్తితో " అమ్మా! మీరైనా సెలవియ్యండి. మీకు కావలసిన దానిని నేను తప్పకుండా తీసుకొని వస్తాను" అన్నాడు. అప్పుడు అహల్య " నాయనా! ఈ పని వద్దు. నీవు మాకు పరాయివాడివి కాదు, నీ సద్గుణాలకు సంతోషించిన గౌతముల వారి మాటలు మనసులో పెట్టుకో" అన్నది. అయినా ఉదంకుడు పట్టు వదలకపోవటంతో " తమ్ముడా! మిత్రసహుడి పట్టపురాణి చెవిపోగులు నాకు తెచ్చి ఇచ్చి

# మన పురాణాలు

లోకంలో ప్రసిద్ధి చెందు" అన్నది. ఉదంకుడు సంతోషించి ఆ పని మీద వెళ్లాడు.

ఆ తర్వాత గౌతముడు అహల్యను " ఉదంకుడు ఎక్కడా కనిపించటం లేదు, ఎక్కడకు వెళ్లాడు?" అని అడుగగా ఆమె ఉదంకుడు వెళ్లిన పనిని గురించి వివరించింది. అప్పుడు గౌతముడు " ఆ సౌదాసుడు రాక్షస ప్రవృత్తి కలవాడు. ఒక శాపం కారణంగా అతడు అలా అయ్యాడు. అతడికి మనుష్యమాంసం చాలా ఇష్టమనే సంగతి ఉదంకుడికి తెలియదు. అయ్యో! ఇంకేమి జరుగుతుందో " అన్నాడు. ఆ మాటలు విని భయపడుతూ అహల్య " ఇలా జరుగుతుందని నాకు తెలీదు. నా పట్ల దయుంచి ఉదంకుడికి ఏ హాని జరుగకుండా రక్షించండి" అన్నది. గౌతముడు "ఎందుకంత భయం, అతడికి ఏ ఆపదా రానివ్వను" అన్నాడు.

ఉదంకుడు వెళ్లి వెళ్లి జన సంచారం లేని అడవిలో ఒళ్లంతా మనుష్యుల రక్తంతో తడిసి భయంకరాకారంతో ఉన్న సౌదాసుడిని ధైర్యంగా చూశాడు. ఉదంకుడి నిర్భయత్వాన్ని గమనించి సౌదాసుడు " ఆకలితో బాధపడుతూ ఈ వేళ తిండి ఎక్కడ దొరుకుతుందో అనుకుంటున్నాను. సమయానికి నీవు వచ్చావు" అని అన్నాడు. దానికి ఉదంకుడు " రాజా! గురువుగారి పని మీద నిన్ను చూడటానికి వచ్చాను. గురువుల కోసం పని చేసేవారు చంపదగినవారు కానేకారు. నీవు ఆలోచించక అధర్మం మాట్లాడావు "అన్నాడు. దానికి సౌదాసుడు "దేవతలుమూడోజాములోని రెండో భాగంలో నేనుతినటానికి తగిన సమయంగానిర్ణయించారు. కాబట్టి నిన్ను తినటంమానను, నిన్ను తిని నా కలితీర్చుకుంటాను" అన్నాడు. దానికిఉదంకుడు " అలా అయితే నా గురువు పనిచేసి నేను తప్పకుండా తిరిగి వస్తాను. నామాట అబద్ధం కాదు. నీవు యాచకులకుఇష్టమైన పదార్థాలు దానం చేస్తావు. నేనుయోగ్యుడినే. గురువుగారికి మేలుకలిగేటట్లు నేను కోరే కోరిక నీవే తీరుస్తావనివచ్చాను" అన్నాడు. దానికి సౌదాసుడు"సరే అలాగే అవుతుందిలే, నీవు ఏమి కోరివచ్చావు" అని అడుగగా ఉదంకుడు " నీభార్య ఇష్టంగా ధరించే కుండలాలు కోరి వచ్చాను " అన్నాడు. దానికి సౌదాసుడు" పరాయివారి సొమ్ము దానం చేసేవారుఎక్కడైనా ఉన్నారా? కుండలాలు తప్పఏమైనా కోరుకో " అన్నాడు. దానికి ఉదంకుడు " నీవు ఏదో వంకపెట్టి నా కోరికను త్రోసిపుచ్చేవాడవు కావు. నేను ఇతర వస్తువులను ఇష్టపడను" అన్నాడు. సౌదాసుడు " అయితే నీవు నా భార్య ఉన్నచోటికి వెళ్లి నేను పంపానని చెప్పి నీ కోరిక ఆమెకు తెలియజేయి" అన్నాడు. ఆ దేవి ఎక్కడ ఉన్నదని ఉదంకుడు ప్రశ్నించగా ఆమె నివసించే చోటు అదే అంటూ చూపాడు. ఉదంకుడు సౌదాసుడు చూపిన చోటికి వెళ్లాడు.

ఉదంకుడు సౌదాసుడి రాణి అయిన మదయంతిని కలిసి సౌదాసుడు చెప్పినట్లే చెప్పాడు. అప్పుడామె రాజు దగ్గర నుంచి గుర్తు తీసుకొని రమ్మనగా ఉదంకుడు తిరిగి వచ్చి గుర్తు అడిగాడు. అప్పుడు రాజు " ఈ విధంగానే క్షేమం కలుగుతుందని నిశ్చయించలేము. దీనిని వదలితే వేరే గతీ లేదు. ఈ మాటలే నేను స్పష్టంగా తెలియజేసే గుర్తు అని ఆమెతో చెప్పు " అన్నాడు. ఉదంకుడు తిరిగి వచ్చి అతడు

చెప్పిన మాటలే ఆమెకు చెప్పాడు. అప్పుడు మదయంతి "ఓ గురుహితాభిలాషి! నీకు నా భర్త ఆజ్ఞ వలన కుండలాలు ఇస్తాను. కానీ ఈ కుండలాల కోసం దేవతలు, గంధర్వులు, నాగులు ఎన్నో ఉపాయాలు పన్నుతూ ఎదురుచూస్తూ తిరుగుతుంటారు. ఎంగిలి అంటుకున్నా, నీవు ఆదమరచి నిద్రపోయినా, నేల మీద పెట్టినా వారు దొంగిలిస్తారు. వీటిని భక్తితో పూజించి ధరించితే ఆకలి, దప్పిక, అగ్ని భయం, విషం వల్ల వ్యాధి, భూత పీడలు కలుగవు. పిల్లలు పెట్టుకున్నా, పెద్దలు పెట్టుకున్నా వారి వారి కొలతల ప్రకారం



# మన పురాణాలు

అతికించినట్లు సరిపోతాయి. పైగా ఇవి బంగారాన్ని కురిపిస్తాయి. గురువులు నిన్ను మెచ్చుకునేటట్లుగా పరాకు లేకుండా వీటిని తీసుకొనివెళ్లు" అని చెప్పి ఆమె వినయపూర్వకంగా కుండలాలిచ్చింది. ఉదంకుడు పరమానందంతో వాటిని తీసుకొని ఆమెను దీవించాడు.

ఉదంకుడు తిరిగి సౌదాసుడి దగ్గరకు వచ్చి " రాజా! నీ వలన నా కోరిక తీరింది. కుండలాలు లభించాయి. అయితే నీవు నాకు గుర్తుగా చెప్పిన వాక్యభావం గూఢంగా ఉంది. ఆ భావం తెలుసుకోవాలని కోరుకుంటున్నాను, అది చెప్పదగినదైతే చెప్పండి" అన్నాడు. దానికి సౌదాసుడు " రాజులు బ్రాహ్మణులను పూజిస్తారు. అందుచేత నేనూ బ్రాహ్మణ పూజ చేస్తుండేవాడిని. ఒక చిన్న తప్పు వలన బ్రాహ్మణుడి వలన ఇలా అయ్యాను. నా పాపం పోగొట్టుకోవటానికి వేరే ఉపాయం లేదు. కనుక బ్రాహ్మణ పూజ చాలా కష్టం. దీనివల్ల మేలు కలుగుతుందని చెప్పటానికి వీలు లేదు. అలా అని మేలు కలిగించే వేరే దారీ లేదు. ఇదే గుర్తుగా మదయంతికి చెప్పాను. రత్నఖచిత కుండలాలను నీకిచ్చి నీ వలన నాకు కలిగిన కీడును తొలగించుకోవచ్చని నేను భావించాను" అని చెప్పాడు. మిత్రసహుడికిసౌదాసుడు,కల్మషపాదుడు అనేపేర్లున్నాయి. ఇతడు ధర్మపరుడైన రాజు. ఒకసారి అతడు ఒక రాక్షసుడిని చంపగాకోపించిన రాక్షసుడి సోదరుడు ప్రతీకారంతీర్చకోవాలని వంటవాడిగారాజప్రాసాదంలో చేరి ఒకరోజు శిష్యడికిఇచ్చే ఆహారంలో మానవమాంసంకలిపాడు. అది తెలిసిన వశిష్ఠుడుసౌదాసుడికి శాపం ఇచ్చాడు. తన ప్పేమీలేకున్నా మిత్రసహుడు శాపాన్నిఅనుభవించవలసి వచ్చింది.భృగువంశంలోనే గొప్పవాడైన ఆ ఉదంకుడిసాన్నిధ్యం కారణంగా సౌదాసుడికి శాంతి,దాని వలన తెలివి కలిగాయి. ఆ జ్ఞానంవలన ఏం చెయ్యాలో తెలిసి కుండలాలుదానం చెయ్యాలనే శ్రద్ధ, నెమ్మదిగామాట్లాడటం పుట్టుకొచ్చాయి. అతడిమాటలు విన్న ఉదంకుడు "మాట్లాడటంతోనే స్నేహం కలుగుతుందని జ్ఞాన వృద్ధులు చెబుతారు. నీ వలన నాకోరిక తీరింది. నీకిచ్చిన మాట ప్రకారం నేనుతిరిగి వస్తాను" అన్నాడు. ఆ మాటలు విన్నసౌదాసుడి మనసు దయతో నిండి " ప్రాణాలు తీసే నా దగ్గరకు ఎవరైనా తిరిగివస్తారా? నీ గొప్పతనం, సత్యం నాకుతెలిశాయి, సంతోషించాను. నీ తపస్సుచేత నా దుఃఖాన్ని తొలగించు" అనిఅర్థించాడు. ఆ మాటలకు ఉదంకుడిహృదయం ఆర్ద్రమైంది. అతడుసౌదాసుడితో " ఏ కారణం వల్లనైనా మంచిమనస్సు కలవారికి ఆపద కలిగినప్పటికీఅది వెంటనే తొలగిపోతుంది. నీమంచిగుణమే నిన్ను పుణ్యాత్ముడినిచేసింది. మహా కీర్తిమంతుడైన గౌతమమహర్షి ఇప్పుడు నిన్ను చల్లని మనసుతోచూశాడు కాబోలు, నీవు నీపూర్వౌన్నత్యాన్ని పొందు" అని సౌదాసుడినిదీవెనలతో ముంచెత్తాడు. ప్రేమపూర్వకంగా తన చేతులతో అతడి శరీరాన్ని నిమిరి ఆనందం కలిగించాడు. ఆ సౌదాసుడు భక్తి వినయాలతో నమస్కరించి ఉదంకుడిని పొగిడి సాగనంపాడు.

ఉదంకుడు కుండలాలను జాగ్రత్తగా లేడితోలులో మూట కట్టుకొని గౌతమాశ్రమానికి బయలుదేరాడు. దారిలో పండ్లతో నిండిన మారేడు చెట్టు చూసి ఆకలి ఎక్కువ కావటంతో కుండలాలున్న లేడితోలును చెట్టుకు తగిలించి చెట్టెక్కి పండ్లు కోసుకుంటుండగా గాలికి ఆ చెట్టు ఊగి లేడితోలు నేల మీద పడింది. అది చూచి ఒక పాము తొందరగా వచ్చి కుండలాలు తీసుకొని వేగంగా పారిపోయింది. ఇది చూచిన ఉదంకుడు వెంటనే క్రిందకు దూకి దానిని వెంబడించాడు. అది ఒక పెద్ద పుట్టలో దూరింది.

# మన పురాణాలు

అప్పుడు అతడు పదునైన మొన ఉన్న కర్రతో పుట్టను త్రవ్వటం మొదలుపెట్టాడు. త్రవ్వటం సహించలేక భూమి కంపించింది. ఆ సమయంలోఇంద్రుడు బ్రాహ్మణ రూపంతో వచ్చి 'మునీశ్వరా! ములుగర్రతో తవ్వినంతమాత్రాన పాతాళలోకానికి ప్రయాణంచెయ్యటం సాధ్యమవుతుందా?

పాతాళలోకం ఇక్కడికి వెయ్యి ఆమడలదూరంలో ఉంది. కుండలాలు దొంగిలించినపాము ఐరావతుడి కొడుకు " అనిచెప్పాడు. "కుండలాలూ పాతాళలోకంలోఉన్నప్పటికీ నేను వాటిని తీసుకొస్తాను,తీసుకురాలేకపోతే పంచప్రాణాలువిడుస్తాను, ఇది నా నిశ్చయం" అనిఉదంకుడన్నాడు. ఉదంకుడి పట్టుదలతెలుసుకున్న ఇంద్రుడు ఉదంకుడి చేతిలోనికర్రకు వజ్రాయుధానికుండే వాడినీ,

గట్టితనాన్ని కలిగించి వెళ్లిపోయాడు.

భయం వల్ల భూమి కూడా దారిచ్చింది.ఉదంకుడు నాగలోకంలో ప్రవేశించాడు. ఆ లోకాన్ని రక్షిస్తున్న దుర్భేద్యమైన గోడలను, ఎంతో పెద్దదైన ద్వారాన్ని చూచి లోపలకు ప్రవేశించి కుండలాలు తీసుకొని రావటం అసాధ్యమని అధైర్యపడ్డాడు. ఇంతలో అతనికి ఎర్రటి ముఖం, నల్లటి శరీరం, తెల్లటి తోక ఉన్న గుర్రం కనిపించింది. అది అతనితో " తపోధనా! ఎలాంటి అసహ్యం లేకుండా వెడల్పుగా ఉన్న నా గుదస్థానాన్ని ఊదు. గౌతముడి ఆశ్రమంలో నన్ను సేవించి సంతోషింపజేశావు. అందుచేత నీకు కనపడి ఐరావతుడి కుమారుడు దొంగిలించిన కుండలాలు నీకు తిరిగి చేరే ఉపాయం ఉపదేశించాను" అనగా దానికి ఉదంకుడు "నిన్ను నేను ఎరుగను,నిన్నెలా సేవించాను" అన్నాడు. దానికా గుర్రం" నేను నీ గురువుకి గురువుని, అగ్నిని. నీవు పరిశుద్ధుడవై భక్తితో నిత్యం నన్ను పూజించావు. ఆ విషయం నీకు గుర్తులేదా" అన్నది. ఆ ఉదంకుడు గుర్రం చెప్పినట్లే చేశాడు. ఆ గుర్రం చర్మరంధ్రాలన్నిటి నుంచి ఒక్కసారిగా పొగ పుట్టి పాతాళలోకమంతా క్రమ్ముకుంది. వాసుకి మొదలైనవారి మందిరాలు పీడించబడ్డాయి. ఐరావతుడి ఇల్లు ఆక్రందనలతో కలతచెందింది. భయంకరమైన ఆ పొగకు భయపడి నాగరాజులన్నీ ఉదంకుడి దగ్గరకు వచ్చి భక్తితో పూజించి వినయంగా వచ్చిన పని తెలుసుకొని వెంటనే కుండలాలు తెచ్చిచ్చారు. ఉదంకుడు నాగులను పంపి, భక్తితో అగ్నికి నమస్కరిస్తూ ప్రదక్షిణ చేశాడు.

మహదానందంతో ఉదంకుడు పాతాళలోకం నుంచి బయలుదేరి, త్వరత్వరగా గౌతమాశ్రమానికి వచ్చాడు. గురుపత్ని అయిన అహల్యను దర్శించి తెచ్చిన కుండలాలను ఆమె చేతిలో పెట్టి ఆమెకు సాష్టాంగ నమస్కారం చేశాడు. అహల్య, గౌతముడు ఉదంకుడిని కౌగిలించుకొని దీవించారు. ఉదంకుడు కూడా వారికి అనేకసార్లు నమస్కరిస్తూ "ఎన్ని కష్టాలు కలిగినా ఈ కుండలాలను సాధించటం మీ దయవల్ల జరిగింది కానీ నా శక్తిసామర్థ్యాల వల్ల మాత్రం జరిగింది కాదు" అని వినయంగా అన్నాడు. ఉదంకుడు ఈవిధంగా మాట్లాడగా ఆ గురుదంపతులు ఎంతగానో సంతృప్తి పొందారు. అప్పుడు గౌతముడు " నీ స్వభావం ఆశ్చర్యం కలిగించేది, గొప్పది. మిత్రసహుడి నీచస్థితిని తొలగించటానికి కానీ, పాము దొంగిలించిన కుండలాలను నేర్పుగా పట్టుదలతో తిరిగి తీసికొని రావటానికి కానీ ఇంకొకడు సమర్థుడు కానేకాడు" అన్నాడు.

ఉదంకుడు తన తపోమహిమ, గురుభక్తి కారణంగా గొప్పవాడయ్యాడు. అతడు అంత సమర్థత కలిగినవాడు కనుకనే తెలిసి తెలిసీ నష్టకారకమైన యుద్ధాన్ని శ్రీకృష్ణుడు ఆపలేదని కృష్ణుడినే శపించబోయాడు. తర్వాత కృష్ణుడి వలన యథార్థాన్ని గ్రహించి శ్రీకృష్ణుడి విశ్వరూప దర్శనానికి నోచుకున్నాడు.



## కొత్త సినిమా –కథా కమీషు




# “బైకర్ ”

వికాశ్ నారాయణ్ (శర్వానంద్)కి ఫ్యామిలీయే లోకం. తన భార్య అనన్య (మాళవిక నాయర్), కొడుకు ఇషాన్‌లతో కలిసి హాయిగా లైఫ్‌ని లీడ్ చేస్తుంటాడు. ముఖ్యంగా తన కొడుకు చదివినా చదవకపోయినా నవ్వుతూ నవ్విస్తూ ఆడిస్తూ గడిపేస్తుంటాడు. అయితే ఒకరోజు స్కూల్‌లో తన నాన్న గురించి ఫ్రెండ్ తప్పుగా మాట్లాడాడని వాడ్ని రక్తం కారేలా కొడతాడు ఇషాన్. ఈ విషయం తెలుసుకున్న వికాశ్ ఒక్కసారిగా తన తండ్రిని గుర్తుకుచేసుకొని బాధపడతాడు. ‘

వికాశ్ తండ్రి సునీల్ నారాయణ్ (రాజశేఖర్).. ఒక మోటోక్రాస్ రేసింగ్ కోచ్. ఒకప్పుడు ఎన్నో రేసుల్లో ఛాంపియన్ అయిన సునీల్ సరైన ప్రోత్సాహం, ఇండియాలో మోటోక్రాస్ రేసింగ్‌కి అంతగా ఆదరణ లేకపోవడంతో మరోస్థాయికి వెళ్లలేకపోతాడు. దీంతో తన కొడుకు వికాస్‌ని ఒక ఛాంపియన్‌గా తీర్చిదిద్దాలని కోచింగ్ ఇస్తూ ఉంటాడు. తండ్రిని ఎవరైనా ఒక్కమాట అన్నా విక్కీకి ఎక్కడ లేని కోపం వస్తుంటుంది. తన కొడుకుని ఎప్పటికైనా మోటోక్రాస్ వరల్డ్ ఛాంపియన్‌గా చూడాలని సునీల్ అనుకుంటాడు. అందుకోసం ఒక బడా స్పాన్సరింగ్ కంపెనీని కలుస్తాడు.

దాని ఓనర్ ఇంద్రనీల్ (అతుల్

# వాల్ పోస్టర్

కులకర్ణి).. విక్కీలో టాలెంట్ చూసి తమ కంపెనీతో సునీల్–విక్కీ ఇద్దరూ ఆరేళ్లు వర్క్ చేసేలా బాండ్ రాయించుకుంటాడు. అయితే ఒక్క ఛాంపియన్ షిప్ రేసులో మాత్రమే పాల్గొని తండ్రికి కనీసం చెప్పకుండా ఒక్క లెటర్ మాత్రం రాసి విక్కీ వెళ్లిపోతాడు. అసలు విక్కీ ఎందుకు వెళ్లిపోవాల్సి వచ్చింది.. తనకి ప్రాణమైన రేసింగ్‌ని ఎందుకు విడిచిపెట్టాల్సి వచ్చింది.. మళ్లీ తిరిగి విక్కీ రేసింగ్ చేశాడా? తన తండ్రి కలని నెరవేర్చాడా? అనేది మిగిలిన కథ.

అయితే బైక్ రేసింగ్‌తో ఒక కథని తెరకెక్కించడం అంత సులభమైన విషయం కాదు.ఎందుకంటే మన ఇండియన్ ఆడియన్స్ క్రికెట్‌కి కనెక్ట్ అయినంతగా ఈ రేసింగ్‌కి కనెక్ట్ కాలేరు. అయినా కూడా డేరింగ్‌గా ఈ సబ్జెక్ట్‌ని తీసుకొని తమ పెర్ఫామెన్సులు, కథ, కథనం, ఎమోషన్‌తో సినిమాని మరోస్థాయిలో ప్రేక్షకుల ముందు ఉంచాడు డైరెక్టర్ అభిలాష్ రెడ్డి. ఉదాహరణకి జెర్సీ సినిమాలో కథ, కథనం, ప్యాషన్, డ్రామా, ఎమోషన్ అన్నీ ఏ స్థాయిలో అయితే పండాయో.. బైకర్ కూడా అదే స్థాయిలో ప్రేక్షకులకి ఫీల్ ఇచ్చేలా డైరెక్టర్ చాలా కష్టపడ్డాడు. అక్కడ క్రికెట్ కాబట్టి మన ఆడియన్స్ ఇంకా ఎక్కువ కనెక్ట్ అయ్యే ఛాన్స్ ఉండొచ్చు.. కానీ స్పోర్ట్ మారింది కానీ ఎమోషన్ మాత్రం అదే లెవల్లో ఉంది.



# వెబ్ పోస్టర్




సీనియర్ నటి రాధికా శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించిన తమిళ చిత్రం 'తాయి కిళవి' బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. కేవలం రూ. 9 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా, విడుదలైన 10 రోజుల్లోనే రూ. 51 కోట్ల వసూళ్లు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచింది. 63 ఏళ్ల వయసులో రాధిక గంటల తరబడి ప్రోస్టటిక్ మేకప్ వేసుకుని, వడ్డీ వ్యాపారి 'పసుపు తాయి' పాత్రలో అద్భుతంగా నటించారు. ఈ బ్లాక్‌బస్టర్ చిత్రం ఏప్రిల్ 10 నుంచి 'జియో హాట్‌స్టార్' ఓటీటీలో తెలుగులోనూ స్ట్రీమింగ్ కానుంది. సౌత్ సినీ ఇండస్ట్రీలో తనకంటూ ఒక చెరగని ముద్ర వేసుకున్న సీనియర్ నటి రాధికా శరత్‌కుమార్ 63 ఏళ్ల వయసులో మళ్ళీ తన నట విశ్వరూపాన్ని ప్రదర్శించారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన తాజా తమిళ చిత్రం 'తాయి కిళవి' (Thaai Kizhavi) ఇటీవలే థియేటర్లలో విడుదలై సంచలన విజయాన్ని అందుకుంది. కోలీవుడ్ స్టార్ హీరో శివకార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం చిన్న సినిమాగా విడుదలై బాక్సాఫీస్ వద్ద పెద్ద సినిమాల రికార్డులను సైతం సవాలే కలెక్షన్లు రాబట్టింది. థియేటర్లలో భారీ విజయాన్ని అందుకున్న 'తాయ్ కిళవి' ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'జియో హాట్‌స్టార్' లో ఏప్రిల్ 10 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. తమిళంతో పాటు తెలుగు ఈ సినిమాలో రాధిక 'పసుపు తాయి' అనే పవర్‌ఫుల్ వృద్ధురాలి పాత్రలో నటించారు. ఈ రోల్ కోసం ఆమె పడిన శ్రమ వెండితెరపై స్పష్టంగా కనిపించింది. ప్రోస్థటిక్ మేకప్ కోసం ప్రతిరోజూ షూటింగ్‌కు ముందు 5 గంటల సమయం కేటాయించేవారని, షూటింగ్ ముగిశాక ఆ మేకప్ తొలగించడానికి మరో 2 గంటలు పట్టేదని సమాచారం. గంటల తరబడి ఓపికతో మేకప్ వేయించుకుని, ఆమె చూపిన హావభావాలు, డైలాగ్ డెలివరీ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఒక వడ్డీ వ్యాపారిగా, కఠిన స్వభావం ఉన్న మహిళగా రాధిక చూపిన మాస్ టచ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కేవలం రూ. 9 కోట్ల పరిమిత బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఫిబ్రవరి 27న విడుదలై ట్రేడ్ వర్గాలను విస్మయానికి గురిచేసింది. ఫస్ట్ వీకెండ్‌లోనూ రూ. 25 కోట్ల కలెక్షన్లు సాధించిన ఈ సినిమా కేవలం 10 రోజుల్లోనే రూ. 51 కోట్ల మార్కును అందుకుంది. దర్శకుడు శివకుమార్ మురుగేశన్ తెరకెక్కించిన ఈ చిత్రంలో అరుళ్ దాస్, బాల శరవణన్, మునిష్కాంత్ వంటి నటులు తమ వంతు సహకారాన్ని అందించారు.

సీరియల్

# పడిలేచిన కెరటం



యశోదా కైలాష్

“అవునే తపస్వీ, ఇప్పటినుండి మనం ప్రయత్నించాలి. దానికి సంబంధం కుదిరితే, వినయ్ హరిణిల పెళ్లికి కూడా ముహూర్తాలు పెట్టించేయొచ్చు.

తప్పకుండా. వచ్చే నెలలో అది వచ్చేస్తుంది ట్రైనింగ్ పూర్తి చేసుకుని. అప్పుడు మాట్లాడతాను.

“అది ‘ఊ అనాలేగానీ, దానికి పెళ్లి సంబంధాలు రాకపోవడమేమిటి?”

“అదికాదు కదా ప్రశ్న ఇక్కడ?” దానితో సమానంగా ఉండాలని అది అనుకుంటే మనం సంబంధాలు చూడడంలో కాస్త సమయం పట్టచ్చు. దాని మనసులో ఏ ఆలోచనలున్నాయో తెలుసుకుని చూడడం బెటర్ అని.”

“అవును, ఈ సారి వచ్చినపుడు దానికి పర్మెనెంట్ పోస్టింగ్ వచ్చేవరకు కొన్ని రోజులైనా ఫ్రీ గా ఉంటుందని నీవే అన్నావుకదా. దానితో మాట్లాడు వివరంగా.”

“అలాగే అక్కా, ఉంటానంటూ ఫోన్ పెట్టేసింది.”

అనుకున్నట్లుగానే మహీకి అదనపు ట్రైనింగ్ పిరియడ్ కూడా విజయవంతంగా పూర్తిచేసి హైద్రాబాద్ వచ్చింది. వస్తూనే తల్లి గుండెల్లో దూరిపోయింది. తపస్వికి ఎంతో ఉద్వేగభరితంగా ఉంది. కళ్లమ్మట తెలియకుండా ఆనంద భాష్పాలు రాలిపడ్డాయి. మరో రెండు వారాల్లో తన కూతురు కలెక్టర్ హోదాలో తన ముందు తిరుగుతుంది. ఎంత కలెక్టర్ అయినా అది తన చిన్నారి కూతురే. చిన్నప్పుడు నాకు అది కావాలి, ఇదికావాలంటూ పేచీ పెట్టి తన పట్టుదలను సాధించుకున్న అల్లరిపిల్ల. ఆ అల్లరి పిల్లే ఇప్పుడు కూడా తను అనుకున్న లక్ష్యాన్ని సాధించింది. తనే పదిమందిని శాసింగలిగే స్థితికి చేరుకుంది. భగవంతుని లీలలు విచిత్రంగా ఉంటాయి. మహీని తనకు ఇచ్చి

# పడిలేచిన కెరటం

భగవంతుడు తనకు న్యాయం చేసాడు. తను విడాకులు తీసుకున్న సమయంలో కోర్టు కూడా మహీ తన దగ్గర ఉండడమే క్షేమకరం అంటూ తీర్పునిచ్చింది. అప్పుడప్పుడు కూతురిని చూసుకోడానికి దాని కన్నతండ్రికి కోర్టు అనుమతి ఉన్నా ఏనాడూ చూడడానికి రాకపోవడం కూడా ఒక విధంగా తన నెత్తిన పాలుపోసినట్లు గా భావించింది.

మహీ ఇంట్లో తల్లితో ఎంతో సరదాగా గడుపుతోంది. వినయ్, హరిణిల ప్రేమ విషయం తెలిసినప్పటినుండి వారిద్దరిని ఆటపట్టిస్తూనే ఉంది. “వినయ్ కూడా, ఉండు, నీకూ ఆ సమయం వస్తుంది, అప్పుడు చెపుతాను నీపని అంటాడు.”

మహీ హైద్రాబాద్ వచ్చిందని తెలిసి వినయ్ ఫోన్ చేసాడు. “ఏయ్ అల్లరిపిల్లా, కలెక్టర్ వి అయ్యావులేగానీ, పెళ్లి మాటేమిటీ? నీ పెళ్లి ఎప్పుడెప్పుడా అనుకుంటూ నేనూ, హరిణీ ఎదురుచూస్తున్నాం.” మా లైన్ క్లియర్ అవాలంటే మాకు సహకరించవే తల్లీ” అంటూ ప్రాధేయపడేసరికి తనకు నవ్వు వచ్చింది. ఎందుకో తన కొలీగ్ ఆకాష్ గుర్తుకొచ్చేసరికి తన పెదవులమీద చిరుదరహాసం మెరిసింది.

తను ఐ.ఏ.ఎస్ కోచింగ్ తీసుకునేటప్పుడు ఆకాష్ కూడా కోచింగ్ కు వచ్చేవాడు. ఐ.ఐ.టి మద్రాస్ లో ఎమ్ టెక్ చదివి, మూడు సంవత్సరాలు ఒక మంచి కార్పొరేట్ ఆఫీస్ లో పనిచేసిన ఆకాష్ కి సివిల్ సర్వీస్ ప్రిపేర్ అవ్వాలనుకున్నాడుట. అదీ సడన్ గా ఆలోచన వచ్చిందిట. ముందు నుండీ ఆ ఆలోచన లేదుట. కార్పొరేట్ జాబ్ లు అందరూ చేస్తారు, ఇలా సివిల్ సర్వీస్ చేసి గవర్న్ మెంట్ సర్వీస్ చేయాలనుకున్నాడు. ఇంట్లో చెపితే ముందు వద్దన్నారుట. తరువాత నీ ఇష్టం అన్నారుట. పోనీలే వస్తే మంచిదే, లేకపోతే బేక్ టూ పెవిలియన్ అనుకున్నాడుట. మంచి బ్రిలియంట్ స్టూడెంట్. ప్రతీ సబ్జక్ట్ లోనూ నాలెడ్జ్ ఉంది. అటు దేశ విదేశాల పొలిటిక్స్, వరల్డ్ ఎకానమీ, సైన్స్, జాగ్రఫీ దేని గురించైనా అనర్గళంగా మాట్లాడతాడు. అటువంటి ఆకాష్ తనను తాను పరిచయం చేసుకుంటూ తన వివరాలన్నీ అడిగాడు. తను సీరియస్ గా ప్రతీ నిమిషాన్నీ ఎంతో విలువుగా కాపాడుకుంటూ ప్రిపేర్ అవుతుంటే మాటి మాటికి వచ్చి, ఇదిగో ఈరోజు న్యూస్ పేపర్ లో ఈ వార్త చదివారా, ఆ వార్త చదివారా, మన పక్క దేశమైన చైనా ఎకానమీ చాలా బేడ్ షేప్ లో ఉందిట. సో, మన దేశానికి ఈ వార్త ఒక రకంగా పాజిటివ్ న్యూసేనని, అలాగే భారత్ వైపు మిగతాదేశాలు తమ పెట్టు బడులను పెట్టేదిశగా చూస్తున్నారని, రాబోయే కొద్ది సంవత్సరాలలో మన దేశం, ఆర్థిక, సామాజిక, సాంకేతిక పరంగా చాలా పురోగవృద్ధి సాధిస్తుందని, ఏదో వసపిట్టలా మాట్లాడుతూనే ఉండేవాడు. మొదట్లో అతని మాటలు ఊకదంపుళ్లు అనుకునేది. కాని రాను రాను అతనిలో అసాధారణ తెలివితేటలను, గొప్ప నాలెడ్జ్ ఉందని గ్రహించి, అతనితో కంబైన్డ్ గా స్టడీస్ చేయడం, అనేక విషయాల గురించి చర్చించడం మొదలు పెట్టేసరికి అతనొక విజ్ఞానఖని అని అర్థమైంది. ఐ.ఏ.ఎస్ ష్యూర్ కేండిడేట్ అని అర్థం అయిపోయింది. ఒక మనిషిని అంచనా వేయాలంటే అతనితో ఎక్కువ పరిచయం అవసరంలేదు. కొంచెం పరిచయంలోనే ఆ మనిషి వ్యక్తిత్వం ఏమిటో వెంటనే తెలిసిపోతుంది. అన్నం ఉడికిందా లేదా అని చూడడానికి ఒక మెతుకుని పట్టుకుని చూస్తే చాలన్నట్లుగా.

ఇద్దరూ రోజులో ఎక్కువ భాగం ప్రిపరేషన్ మీదే ఉండేవారు. తనకు తెలుసున్న చాలా విషయాలను తనకు షేర్ చేసేవాడు. మిగతా కొలీగ్స్ అలాకాదు. తాముకు తెలుసున్న విషయాలను చెప్పకుండా దాచిపెట్టేవారు. చెపితే తమకు పోటీ అయిపోతారన్న



# పడిలేచిన కెరటం

భయం. స్వార్ధం అన్నమాట.

ఇద్దరూ సెలక్ట్ అయ్యారన్న వార్త తెలిసి ఒకరినొకరు అభినందించుకున్నారు. తెలంగాణా రాష్ట్రం నుండి ఆ సంవత్సంరం ఇద్దరు ఐ.ఏ.ఎస్ ఆఫీసర్లు సెలక్ట్ అవడం గర్వకారణమని అదీ కాకుండా మొదటి అటెమ్ట్ లో అతి పిన్న వయల్సులోనంటూ మీడియా తమని ప్రశంసిచింది. ఆకాష్ కి ఇరవై ఏడు సంవత్సరాలైతే, మహిమకు ఇరవై నాలుగు సంవత్సరాలు.

మీరు కలెక్టర్ గా ఏదైనా రూరల్ ఏరియాలో పోస్టింగ్ ఇస్తే వెడతారా అని ఆకాష్ అడిగాడు మహిమను. ఏదైనా ఫరవాలేదు గానీ, నాకు ఏదైనా గవర్న్ మెంట్ డిపార్ట్ మెంట్ లోగానీ, సెక్రటరీస్ గాగానీ చేయాలని ఉంది. కానీ, ఎక్కడకు పంపించినా చేస్తామని మనం వాగ్దానాలు చేసాంకదా. మా అమ్మకైతే హైద్రాబాద్ లోనే గవర్మెంట్ డిపార్ట్ మెంట్ లో వస్తే బాగుంటుంది కదా, కళ్ళెదురుగా ఉంటావు కదా అంటుంది.

"ఓ మీ అమ్మగారు అలా అనుకోడంలో అర్థం ఉంది. మీరొక్కరే కదా, పైగా మీరు చెప్పారు కూడా, మీ అమ్మగారు ఎంతో కష్టపడి మిమ్మలని పెంచారని."

"అవును ఆకాష్, అమ్మ నా ప్రయారిటీ, అమ్మను అడిగి గానీ ఏ పనీ చేయను."

"మా నాన్నగారు హైద్రాబాద్ లో అపోలో హాస్పటల్ లో సర్జన్ అయినా, అమ్మ హోమ్ మేకర్. మా అక్కకు పెళ్ళైపోయి యు.ఎస్. లో ఉంది. నన్నూ యూ.ఎస్ వెళ్ళమన్నారు. నాకు వెళ్ళాలని లేదు. అమ్మను విడిచి వెళ్ళలేని బలహీనత నాకు."

"ఓ నైస్, హైద్రాబాద్ లోనే ఉంటాంకాబట్టి కలుద్దాం ఆకాష్. మీరు మా ఇంటికి రండి వీలుచూసుకుని. అమ్మకు పరిచయం చేస్తాను. మళ్లీ మనకు పోస్టింగ్ వచ్చి డ్యూటీలో ఎక్కడెక్కడ ఉంటామో? పైగా బిజీ అయిపోతామేమో కూడా."

"నిజమే మహిమా, మీరు కూడా మీ అమ్మగారిని తీసుకుని మా ఇంటికి రండి."

"తప్పకుండా!"

మహిమ వచ్చి అప్పుడే నాలుగు రోజులు గడచిపోయాయి.

ఆరోజు ఆదివారం కావడంతో తపస్వి ఖాళీగా ఉంది. ఎక్కడకు వెళ్లాలన్న ఆలోచనేమీ లేదు. మహిమతో పెళ్లి విషయం మాట్లాడాలనుకుంటోంది.

ఇద్దరూ బ్రేక్ ఫాస్ట్ చేసి సోఫాలో కూర్చున్నారు. మహీ ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతోంది. తపస్వి న్యూస్ పేపర్ తిరగేస్తోంది. మహీ ఫోన్ మాట్లాడడం అసిపోయింది.

ఆ అదనుకోసమే చూస్తున్న తపస్వి, "మహీ నీతో మాట్లాడాలి కొంచెం సేపు."

"చెప్పమ్మా, ఎక్కడికైనా వెడదామా?"

'ఆ దానిగురించి కాదు. నీ చదువు అయిపోయింది నీవనుకున్నట్లుగా. ఇవాళో, రేపో పోస్టింగ్ కూడా వస్తుంది. నీవు సాధించాలనుకున్నది సాధించేసావు. మరి తల్లిగా నాకూ ఒక బాధ్యత ఉందిగా మహీ?"

"ఏమిటమ్మా ఆ బాధ్యత?"

"పిచ్చి తల్లీ, నీకు పెళ్లి చెయ్యొద్దా!"

"చేసేయ్, వద్దన్నానా, అల్లరిగా నవ్వుతూ అంది."

"సీరియస్ గా తీసుకోవే తల్లీ. నీకు ఎటువంటి వ్యక్తి కావాలి, నీ రిక్వైర్ మెంట్స్ ఏమిటో చెపితే నాకు సంబంధం చూడడం తేలికౌతుంది మహీ!"

"అమ్మా, అసలు నేను కొంతకాలం ఉద్యోగం చేయాలనుకున్నాను. పెళ్లిమీద ఇంతవరకూ ఏ ఆలోచనా లేదు. కానీ, నీ బాధ్యత నా పెళ్లి అని చెప్పేసరికి నిన్ను బాధపెట్టడం

# పడిలేచిన కెరటం

ఇష్టం లేదు నాకు. పైగా విన్నీ అన్న నా కోసమే తన పెళ్లిని వాయిదా వేసుకున్నాడు. వాడికి కుదిరిపోయినందుకు ఇంచక్కా వాడు చేసేసుకోవచ్చుకదా. నా పెళ్లి తో తన పెళ్లి ముడిపెట్టడం ఎందుకో. వికాస్ మీద కాస్త కోపం చూపిస్తూ మాట్లాడుతున్న మహీ వైపు చూస్తూ, "లేదమ్మా, వాడికి నీవంటే ఇష్టం కాబట్టి, మహీ పెళ్లి తో బాటే తన పెళ్లంటూ పంతంగా ఉన్నాడు." పెద్దమ్మా, పెదనాన్నగారు కూడా నీ గురించే అడుగుతున్నారు. నీవు ఏ విషయమూ చెపితే మా ప్రయత్నాలు మేము చేసుకుంటాం.

"లేకపోతే, నీ మనస్సులో ఎవరైనా ఉన్నా నిర్భయంగా చెప్పు మహీ!" "అమ్మా, అదేమీ లేదు. నీ ఇష్టం. సంబంధం చూడు, చేసుకుంటానంటూ అక్కడనుండి లోపలకు వెళ్లిపోయింది."

తపస్వికి చాలా సంతోషంగా ఉంది. మహీ తన పెళ్లికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినందుకు. వెంటనే మానసకు ఫోన్ చేసి చెప్పింది.

ఆ మరునాడు ఉదయాన్నే ఆకాష్ ఫోన్ చేసాడు. "ఏమి చేస్తున్నారు మహిమా అంటూ?"

"ప్రస్తుతానికి ఎంజాయ్ చేస్తున్నాను ఆకాష్ గారూ. వచ్చేవారం మనకు ఆర్డర్స్ రావచ్చని ఎక్స్ పెక్ట్ చేస్తున్నాను. మా రిలేటివ్స్ అందరూ ఒకటే ఫోన్లు చేస్తున్నారు."

"నా పరిస్తితీ అదే మహిమగారూ. ఒకసారి కలుద్దామా? రేపు సాయంత్రం అయిదుగంటలకు జూబ్లీహిల్స్, గేలరీ కేఫ్ కు వస్తారా?"

"ఓకే, అయిదున్నర కల్లా వచ్చేస్తాను. మా మమ్మీ అయిదు గంటలకు బేంక్ నుండి వస్తారు, రాగానే బయలదేరి వస్తాను."

"ఓ థాంక్యూ మహిమా, డ్యూటీలో జాయిన్ అయితే ఇలా కలవలేము కదా అని!" య్యూ, ఐ గాట్ యూ మిస్టర్ ఆకాష్!"

"ఓకే, బై, సీయూ" అంటూ ఫోన్ పెట్టేసాడు.

మర్నాడు ఉదయం తపస్వి బేంక్ కి బయలదేరుతుంటే చెప్పింది. "అమ్మా సాయంత్రం అయిదున్నరకి మా కొలిగ్ ను కలవడానికి వెళ్లాలి. నీవు వచ్చిన వెంటనే కారులో బయలదేరతాను. జూబ్లీహిల్స్. డ్రైవర్ కి చెప్పేయ్ ముందరే.

"అలాగే మహీ అంటూ" ఆవిడ వెళ్లిపోయింది.

తపస్వి సంబంధాలు చూడడంలో బిజీ అయింది. కొన్ని ప్రముఖ మేట్రిమొనీ సంస్థలలో మహిమ పేరు నమోదు చేసింది. ఏదైనా తెలుసున్న మంచి సంబంధం వస్తే బాగుండునని అనుకుంటోంది. అందరికీ చెప్పడం మొదలుపెట్టింది.

చెప్పినట్లుగానే అయిదు గంటలకు తపస్వి రాగానే మహీ బయలదేరింది.

తను వెళ్లేసరికి ఆకాష్ తన కోసమే చూస్తున్నాడు.

కేఫ్ లోకి అడుగు పెట్టగానే తనని చూసి చిరునవ్వుతో విష్ చేసాడు.

తను వెళ్లి అతనుకూర్చున్న టేబిల్ కెదురుగా నున్న ఛెయిర్ లో కూర్చుంది.

"బోర్ గా ఉంటోంది నాకు మహిమగారూ!" పోనీ ఏదైనా ప్లేస్ కి వెళ్లి రా అంటున్నారు డాడీ. కాని పోస్టింగ్ ఎక్కడో, ఏమిటో తెలిసే వరకూ టెన్షనే కదా!"

"అవును, నేనూ మా పెద్దమ్మా, పెదనాన్నగారి ఊరు వెడదామా అనుకున్నాను ముందర. కానీ నిన్న మా మమ్మీ ఒక కొత్త టాపిక్ తెచ్చారు, అది విన్నాకా ఆగిపోయాను."

"ఏమిటో ఆ కొత్త టాపిక్, తెలుసుకోవచ్చా, మీకు అభ్యంతరం లేకపోతేనే సుమా?"

"నా చదువు అయిపోయింది, జాబ్ రాబోతోంది కదా. ఇంక పెళ్లే కదా పెద్ద వాళ్లు ఆలోచించేది. మేచెస్ చూడనా అని అడిగింది. మా కజిన్, అంటే మా అన్నయ్య

# పడిలేచిన కెరటం

నా పెళ్లి కుదిరితేగానీ తను చేసుకోనని మూడేళ్లనుండి వాయిదా వేసుకుంటున్నాడు. వాడికి ఫియాన్సీ రెడీగా ఉంది. అమ్మా వాళ్లకీ అదీ బాధ.

నవ్వుతూ మాట్లాడుతున్న మహిమ ఎంత అందంగా ఉందీ అని అనుకోకుండా ఉండలేకపోయాడు. కొద్ది నెలల పరిచయంలో మహిమ వ్యక్తిత్వం ఎలాంటిదో అర్ధం చేసుకున్నాడు. తన చదువు, కెరీర్, తన తల్లి మినహా ఆమె మాటల్లో మరో మాట రాదు. ఆత్మ విశ్వాసం ఎక్కువ ఈ అమ్మాయికి. అల్లరి చిల్లరగా, మిగతా అందరి అమ్మాయిల్లాగా, సినిమాలూ, పబ్ లంటూ ఏమీ మాట్లాడదు. తన స్నేహం కూడా కొంతమందితోనే. ఆచి, తూచి, ప్రపంచాన్ని చాలా జాగ్రత్తగా గమనిస్తునినట్లుగా ఉంటాయి ఆమె కనులు. అందమైన రూపమే కాకుండా, ఇటువంటి ఆడపిల్ల ఉంటే బాగుండునని ఆమెను చూసిన ప్రతీవారూ భావిస్తారు. తండ్రి అందమైన రూపాన్ని, తల్లి తెలివితేటలు, ఆత్మధైర్యాన్ని పుణికి పుచ్చుకుంది.

"ఏమాలోచిస్తున్నారు ఆకాష్, బోర్ టాపిక్ మాట్లాడుతున్నానేమోకదూ?"

"అదేమీ లేదు. నాకూ ఇంట్లో అదే సమస్య మహిమా!"

"బై ది బై, మిమ్మల్ని నేను ఒకటి అడగవచ్చా మహిమా?"

"అయ్యో అదేమిటి ఆకాష్, అడగండి. ఎక్జామ్స్ ప్రిపరేషన్ లో మీరు నాకెంతో హెల్ప్ చేసారు. నేను ఎప్పటికీ మీ హెల్ప్ ను మరచిపోను. అటువంటిది మీరు నన్ను ఏదో అడగాలనుకుంటూ, ఇంతగా రిక్వెస్ట్ చేయడమేమిటి?"

ఈ లోగా కాఫీ, స్నాక్స్ వచ్చాయి. ఇద్దరూ తినడం మొదలు పెట్టారు.

"మీ ఇంట్లో మీకు సంబంధాలు చూస్తున్నారని చెప్పారు. మా ఇంట్లో కూడా చూస్తామంటున్నారు. మీకు నేనంటే ఇష్టం ఉందా?"

"ఇష్టం అంటే నేను మీకు సహాయం చేసానని, ఆ గౌరవంతో సమాధానం చెప్పడం కాదు."

ఏవేవో సంబంధాలు చూడడం, పెళ్లి చూపులనడం, మాట్లాడుకోడం లాంటివన్నీ మన పెద్దవాళ్లను ఆపేయమందాం. మీరు నన్ను ఇష్టపడితే మిమ్మలని నా జీవితంలోకి ఆహ్వానించాలని అనుకుంటున్నాను. మీరంటే నాకు ఇష్టం మహిమగారూ. కొద్దినెలల పరిచయంలో మీరంటే ఏమిటో పూర్తిగా అర్ధం చేసుకున్నాను. మిమ్మలని మనసారా ప్రేమిస్తున్నాను.

"మీరు కూడా మీ అభిప్రాయం చెబితే ముందుకు ప్రొసీడ్ అవుదాం. ఒకవేళ మీకు సమ్మతం కాకపోయినా మనమిద్దరమూ ఎప్పటికీ మంచి స్నేహితులమే. ఏమంటారు?"

"చూడండి ఆకాష్, మీకు మా అమ్మ గురించి మొత్తం చెప్పాను. జీవితంలో అతి దారుణంగా మోసపోయింది. నన్ను తన కంటికి రెప్పలా చూసుకుంటూ, నా జీవితం తనలా అయిపోకూడదని అతిజాగ్రత్తగా చూసుకుంటోంది. మీరంటే నాకు ఎంత ఇష్టం ఉన్నా, అమ్మ మనిరువురి పెళ్లిని మనస్పూర్తిగా ఒప్పుకుంటే నేను చాలా సంతోషిస్తాను.

"ఒప్పుకుంటారు మహిమా. మనం ముందర ఈ విషయం మాట్లాడుకుని మనిద్దరికీ సమ్మతమైన తరువాతే వాళ్లకు చెప్పడం సమంజసంగా ఉంటుంది.

"ఏమంటావు మహీ?"

"ఓ, నీ ఆలోచన బాగుంది ఆకాష్. అయితే మీ పేరెంట్స్ ఎప్పుడు వస్తారో చెప్పు?"

"అంటే..అంటే, నేనంటే ఇష్టమేనా మహిమా?"

"ఇంకా అర్ధం కాలేదా ఆకాష్?"

"మరోసారి ఈ అందాలబొమ్మ ఏమిచెపుతుందో వినాలని."

"ఆహా... మరీ ఇంత మొద్దబ్బాయివా నువ్వు?"

# పడిలేచిన కెరటం

"థాంక్స్ మహీ!"

"అమ్మకు కూడా చెపుతాను ఈ విషయం. లేకపోతే మీ పేరెంట్స్ వచ్చినపుడు అమ్మకు ఏమీ అర్థం కాకపోతే అప్పుడు ఇబ్బందే కదా!"

"అవును నిజమే!"

"నేను ఒకటి రెండురోజుల్లో ఫోన్ చేసి చెపుతాను. థాంక్యూ ఫర్ మై ప్రొపోజల్!"

ఎందుకో మహిమ కొద్దిగా సిగ్గుపడింది. అందమైన ఆ అమ్మాయి బుగ్గల్లో గులాబులు పూసాయి.

"ఇంక బయలదేరనా ఆకాష్!"

"ష్యూర్ మహీ అంటూ బై చెప్పాడు."

ఇంటికి వచ్చిన మహిమ తల్లితో మాట్లాడడానికి మొహమాటపడుతోంది. అదివరకటిలా తపస్వి వెనుకనే తిరుగుతూ, ఏవో రక రకాల జోకులు వేసి నవ్వించడం లాంటివి మాని తల్లిని తప్పించుకుని తిరుగుతోంది.

"ఏమైంది మహీ, మీ కొలిగ్ ను కలిసావా? అతను కూడా ఆర్డర్స్ కోసం చూస్తున్నాడని ఇంతక ముందు అన్నట్లు గుర్తు. ఎక్కడ ఉంటారు మీ కొలీగ్, అతని తల్లితండ్రులు?"

"అమ్మా, ఇక్కడే శ్రీనగర్ కాలనీలో ఉంటారుట. అతని తండ్రి అపోలో లో సీనియర్ సర్జన్ ట. అమ్మగారు హోమ్ మేకర్ అని చెప్పాడు. అక్క, ఫేమిలీ యూ.ఎస్ లో ఉంటారుట.

"ఓ నైస్ కదూ!"

"అవునమ్మా, అతని విషయాలు అంతక మునుపు నాకూ అంతగా తెలియవు, నాకూ ఈ రోజే తెలిసాయి. నా సివిల్ సర్వీస్ ఎగ్జామ్స్ ప్రిపరేషన్ సమయంలో అతను నాకు ఎంతో హెల్ప్ చేసాడు. నాకు తెలియని ఎన్నో విషయాలు అతను వివరించాడు. చాలా బ్రిలియంట్ అమ్మా."

"ఈరోజు ఫోన్ చేసి ఒకసారి కలుద్దాం, రమ్మనమన్నాడు. ఆర్డర్స్ ఎప్పుడు వస్తాయో, ఏమిటో లాంటి విషయాలు మాట్లాడుకున్నాం. ఆ సమయంలో అతని పేరెంట్స్ గురించి చెప్పాడు."

"ఓ అలాగా!"

"అమ్మా, మనింటికి ఆకాష్ పేరెంట్స్ వచ్చి నిన్ను కలుస్తారుట!"

"ఎప్పుడట, ముందు తెలిస్తే ఆఫీస్ నుండి ముందొచ్చేస్తాను."

"ఫోన్ చేస్తానన్నాడు. ఇంతకీ వాళ్లు ఎందుకొస్తున్నారో అడగవా, కాస్తంత కినుకగా ప్రశ్నించింది."

"బాగుందే మహీ, మీరిద్దరూ ఒకే బేచ్ కదా, సరదాగా కలుద్దామని అనుకుని ఉండచ్చుగా!"

"అంతేనా ఓసి పిచ్చి అమ్మా!" వాళ్ళ ఆకాష్ కి పెళ్లి సంబంధం మాట్లాడడానికి వస్తారుట."

"పెళ్లి సంబంధమా!" అంటే, అంటే నిన్ను చేసుకుంటామని అడగడానికా!"

"హమ్మయ్య, ట్యూబ్ లైట్ వెలిగింది అమ్మగారికి!"

"అదేమిటే మహీ, నీవింత వివరంగా చెబితేగాని అర్థం కాలేదు ఈ మట్టి బుర్రకు."

(ఇంకా ఉంది )



కథ



# పుకార్

ఈ శ్రీనివాస రెడ్డి

ఇంట్లోనేకాదు ఆ ఊళ్లోని ప్రతి ఇంట్లో కూడా సగంవెలిగే బల్బులే,సగం చీకటి, సగం వెలుగులో సాగుతున్న బతుకులే

తాన్యా సగం ఆరిన పుల్లల పొయ్యి మీద పొద్దున మిగిలిన గంజిని వేడి చేస్తోంది. బాగా ఆకలి మీద వున్నారో ఏమో? పిల్లలిద్దరూ సత్తు పళ్ళాలు ముందు పెట్టుకుని అమ్మ ఎప్పుడు గంజి పోస్తుందా అని ఎదురు చూస్తున్నారు. పక్కనే వున్న కుక్కి మంచంలో ఒత్తిగిలి దిగులుగా పడుకున్నాడు మాహి .

“రేపటికి ఈ గంజి కూడా వుండదు . పిల్లలు కూడా మనతో బాటు పస్తుండాలి .. “ మొగుడి వంక చూస్తూ గొణిగింది తాన్య

తాన్యా మాటలు విన్నాడో లేదో తెలియదు కాని మాహిలో ఏ చలనం లేదు . బహుశా వినేవుంటాడు లేకపోతే కంటి కొనల నుండి కన్నీటి బొట్లు రాలవుగా, అప్రయత్నంగా మాహి కళ్ళు చమర్చాయి.

ఇంతలో ఆకాశంలో విమావెళుతూ ఉంటె ‘బోయ్... మంటూ’ పెద్ద శబ్దం రావటంతో

“విమానం ... విమానం ... “ అంటూ పిల్లలు ఇద్దరూ గుడిసె బయటకు పరిగెత్తారు. వీధి దీపాలు వెలగటం ఎప్పుడో మర్చిపోయాయి అనుకుంటా బయట అంతా చీకటిగా వుంది.

కళ్ళు చిట్లించుకుంటూ పైకి చూశారు. ఆకాశంలో కూడా చీకటి. అక్కడక్కడ ఒకటి రెండు నక్షత్రాలు మెరుస్తున్నాయి. వాటి మధ్యన మిణుకు మిణుకు మంటూ కదులుతున్న రంగుల నక్షత్రంలా ముందుకెళుతోంది. విమానం.

బహుశా అది వాళ్ళ బడిందో ఏమో..”విమానం ...విమానం “అంటూ ఆనందంతో గెంతులు వేయటం మొదలు పెట్టారు, అంతటి ఆకలిని మర్చిపోయి .

గంజి పొంగటం మొదలయ్యే సరికి.. “ పిల్లల్ని పిలు.. “అంది చిన్నగా

“ఆళ్ళే వత్తారులే ..”అంటూ లేచి కూర్చున్నాడు మాహి , తనకు కూడా గంజి పోస్తుందేమో అని

మాహి అంతరం గ్రహించిన తాన్యా , “ వాళ్ళు ఎంగిలి పడ్డాక

## కథ

,ఏదన్నా చుక్క మిగిలైతేనే " అంది మొగుడి వంక చూస్తూ

అట్టాగే అన్నట్టు తల ఆడిస్తూ లేచి గుడిశలో నుండి బయటకొచ్చాడు.

మాహి ని చూడగానే పిల్లలిద్దరు. "అయ్య, ఇమానమే .. "అంటూ వచ్చి చెరో కాలు పెనవేసుకున్నారు.

మాహి ఇష్టం లేనట్లు, తల ఎత్తి ఎత్తనట్టు పైకి చూసాడు. ఆకాశంలో ఏకటి తప్ప తనకేమి కనపడ లేదు

"కనపడిందా...."అంటు పిల్లలు ఓ అడుగు ముందుకేసి ఆకాశం వంక చూడసాగారు ఆశగా

మాహి కూడా మళ్ళి ఓక్షణం ఆకాశం వంక చూసాడు . విమానం కనబడిందో లేదో కాని, దబుక్కున కిందకి వంగి చీకట్లో దేనికోసమో తచ్చాడాడు

చేతికి ఓ పెద్ద రాయి తగలగానే, దాన్ని తీసుకుని "నీ యమ్మ... " అంటూ పెద్దగా అరుస్తూ ఆకాశం పైకి రాయి విసిరాడు.

నాలుగు రోజులు నుంచి కూడు గూడ లేకపోటంతో రాయిని గట్టిగా విసరలేక పోయాడో ఏమో, అది కాస్త వెళ్ళి దగ్గరలోని కరెంటు స్తంభానికి కొట్టుకుని, "ఠటంగ్ ..మంటూ పెద్దగా మోగింది

మాహి అలా ఎందుకు చేస్తున్నాడో అర్థంకాక పిల్లలిద్దరూ, మాహి వంక కోపంగా చూస్తూ వుండిపోయారు.

★★★

"మన ఊరికి దగ్గర్లో ఇమానాలు దిగుతాయట, గవర్నమెంట్ మనుషులు భూములకోసం వస్తారట" చుట్టూ వున్న ఊరి జనాన్ని చూస్తూ చెప్పుకు పోతున్నా ఆ గూడెం పెద్దగా పరిగణింప బడే భూఖ్యా

"అంటే మన భూములన్నీ అళ్ళు లాక్కుంటారా? " సందేహం వెలిబుచ్చాడు గుంపులోని ఓ మధ్య వయస్కుడు ఆ "ఆళ్ళు అడిగితే ఇవ్వాల్సిందే కాకపోతే ఎంతో కొంత రేవ్వ కట్టి ఇస్తారు.. అనుభవం వున్న ఓ పెద్దాయన జవాబు

"ఆళ్ళు ఇచ్చేది భూములు వున్న వాళ్ళకే , సరైన పట్టాలుంటేనే... " గుంపులో మరో పెద్దాయన నాకూ తెలుసు అన్నట్టు చెప్పాడు

" మన భూములు మన ఇష్టం , ఆల్లకేందుకు అమ్మాలి..." ఓ కుర్ర రైతు అవేసపడ్డాడు

" మన భూములా , మనకేక్కడివిరా భూములు ,ఇవన్ని ప్రభుత్వ పట్టాలే " తేల్చేసాడు పెద్దాయన

' మనలో చాలమందివి చుక్కల భూమలే అన్నీ ప్రభుత్వానివే. మరైతే పట్టాలు ఎక్కడి నుంచి వస్తాయి. 'రెండో పెద్దాయన

'అయన్ని వాళ్ళు పట్టించుకోరు, పట్టా వుంటే ఉబ్బులిస్తారు. లేకపోతే, రూపాయి కూడా రాదు .." మళ్ళీ మొదటి పెద్దాయన

"ఆళ్ళకి మనఃభములిచ్చేస్తే, ఇకమనం బతిక పెట్టా? " మధ్య వయస్కుడి ఆవేదన

"ఇన్నాళ్ళు మనం వ్యవసాయం చేసాము , పట్టా వున్నా లేకపోయినా మనవే భూములు. ఉడలిస్తేనే భూములు అప్పగించేది.. "కుర్ర రైతు పెద్దగా అరిచాడు

" మనం అరిచి గీపెట్టినా , చచ్చినా వాళ్ళు పట్టించు కోరురా.. " మధ్యవయస్కుడు బాధగా చెప్పాడు

"అవును అంతకుముందు పోలారం డాము కట్టే టప్పుడు కూడా భూములు ఇవ్వమని రైతులు తిరగబడితే లాటిచార్జి చేసారు. ఒకరిద్దరి ప్రాణాలు కూడా పోయాయి . పోయినోళ్ళకు మాత్రం పదో పరకోఇచ్చి చేతులు దులుపుకున్నారు.."

ఆ ఉరికి విమానాశ్రయం వచ్చేది ఎంతవరకు నిజమో కాని , ఆవార్త మాత్రం దావానలం లాగా చుట్టూ పక్క ఊళ్ళకి పాకి పోయింది . రోజు కొంతమంది బడాబాబులు కార్లలో వచ్చి అక్కడి పొలాల గురించి వాకబు చెయ్యటం మొదలెట్టారు

ఆనోటా ఈనోట పడి ఆ వార్త ,పొలం లో పని చేస్తున్న విన్న మాహి చెవిన పడిన దగ్గర నుండి గుండెల్లో చిన్నగా

భయం తాలుకు ప్రకంపనలు మొదలయ్యాయి.

"తనకున్నదే ఓ భీఘా భూమి.. దాన్నే సాగు చేసుకుంటూ ఏదోరకంగా కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఇప్పుడు గవర్నమెంటోళ్ళు అది కాస్తా లాగేసుకుంటే రేపటినుండి ఎట్లా బతకాలి"అనుకుంటూ  చిన్నగా ఇంటి దారి పట్టాడు. నడుస్తున్నాడే కాని అవే ఆలోచనలు, మెదడును కొలిమిలో వేసి కాల్చేస్తున్నట్టు ఉంది . ఎలాగో ఇల్లు చేరుకుని, కుక్కి మంచంలో కూలబడ్డాడు

★★★

"ఇంకా తెల్లారను కూడా లేదు , యాడికి బయల్దేరావు... " నిద్ర కళ్ళ తో బయటకు అడుగు పెడుతున్న మొగుణ్ణి చూసి అడిగింది  తాన్యా

'పొలానికి మందుకొట్టాల ఎండెక్కితే మందు ఆరి పోద్ది... "అంటూ సమాధానమిచ్చి వెనుతిరిగి చూడ కుండా అడుగులు ముందుకేసాడు మాహి

నేరుగా భూఖ్యా ఇంటికివెళ్ళి తలుపు కొట్టాడు

ఈ వేళప్పుడు ఎవరా అని భూఖ్యా అనుకుంటూ తలుపు తెరిచాడు

ఎదురుగా నిలబడి ఉన్నా మాహి ని చూస్తూ "ఏందిరా మాహి తెల్లారకుండానే ఇట్టా వచ్చావు .." ఆవులిస్తూ అడిగాడు

"నా భీఘా ని ఎవరికన్నా అమ్మిపెట్టు .."అన్నాడు

" పట్టా ఉందా .." అన్నాడు నవ్వుతూ . ఆవులలో ఎవరెవరికి పట్టలున్నాయో భూఖ్యా కి బాగా తలుసు

లేదన్నట్టు తలూపాడు మాహి

"మరైతే ఏమి చూపించి అమ్మనురా నీ భీఘాని . అయినా చుక్కల భూమిని పెద్దసార్లు వద్దన్నారు. ఎందుకంటే వాటిని గవర్నమెంటు ఎటు లాక్కుంటుంది  "అంటూ మాహి జవాబు  కోసం ఎదురు చూడకుండా

" పొద్దున్నే ఎదవ గోలా .." అని గొణుక్కుంటూ లోపలి వెళ్లి తలుపులు వేసుకున్నాడు

ఏమి చెయ్యాలో పాలు పోలేదు మాహికి . అక్కడ నుంచి నేరుగా పొలాన్ని చేరుకున్నాడు

అప్పుడే సన్నగా వెలుతురు వెదజల్లటం మొదలు పెట్టాడు సూరీడు .

పొలం దగ్గర వున ఓ చింత చెట్టుకింద కూలబడి, తనతో తెచ్చుకున్న సంచిలోనుండి పురుగు మందుల డబ్బా బయటకు తీసాడు

"తన బీఘాను ఎవరు కొనరు , గవర్మెంటోళ్ళ నుండి కూడా ఎటూ ఒక్క రూపాయి కూడా రాదు. మరి ఇప్పుడు ఏమిటి చెయ్యటం . కుటుంబాన్ని ఎలా పోషించాలి. రైతులు ఆత్మహత్య చేసుకుంటే గవర్నమెంటోళ్ళు ఎంతో  కొంత సాయం చేస్తున్నారు అని విన్నాడు . ఇంక ఆ దారి తప్ప ఏ దారి కనపడట్లేదు  " అని అనుకుంటు పురుగు మందు సీసా పైకెత్తి గటగటా తాగేసాడు

★★★

మాహి.. శవం మీద పడి బోరున ఏడుస్తోంది తాన్యా

పిల్లలిద్దరికి తండ్రి కి ఏమి జరిగిందో, తల్లి ఎందుకు ఏడుస్తుందో అర్థం కాక, అమాయకంగా అందరినీ చూస్తూ భయంతో వణికి పోవడం మొదలుపెట్టారు.

"మాహి ... అనవవసరంగా తొందర పడ్డాడు.  మన ఊరికి ఇమానాలు రావటం అంతా ఉత్తిదేనంట. రియల్ ఎస్టేటోళ్ళు భూమలరేట్లు పెంచుకోటానికి పుకార్లు పుట్టించారట... ' చెప్పుకు పోతున్నాడు భూఖ్యా అక్కడున్న అమాయక జనాన్ని చూస్తూ.

"అవునా ...అనవసరం గా తక్కువ రేటుకి భూములు అమ్మమే " అని తమలో తము గొణుక్కోవటం మొదలు పెట్టారు అక్కడి జనం

విమానమ్ కన్నా వేగంగా పుకార్లు ప్రయాణిస్తాయి .నిజానికి కాస్త బద్ధకం ఎక్కువ. నిజం లేచి వాళ్ళు

సాధారణ

కథ

విరుచుకుణి బయట అడుగు పెట్టె లోపు,నట్టింట్లో కొచ్చిన అబద్ధాన్ని నమ్మి చాలామంది తొందర పడ్డారు , కాకపోతే మాహి కాస్త ఎక్కువ తొందరపడ్డాడు .అంతే కాని ఏ ఒక్కరు ఈ పుకార్ల వెనుక ఎవరున్నారు, అని ఆలోచన చేసిన పాపాన పోలేదు.అందరు గొర్రెలు .గొర్రెలు అలా ఆలోచించవు కాబట్టే భూఖ్య లాంటి తోడేలు వాళ్ళకు నాయకుడయ్యుడు.రియల్ ఎస్టేటు వెళ్ళ నుంచి భూఖ్యాకు ముట్టిన నజరానా ఖరీదు ఒక ప్రాణం.

సమాప్తం★★★సమాప్తం ★★★

# చిత్ర కథ

ఈ క్రింది బొమ్మకు సరసమైన కథ రాసి పంపండి. ఉత్తమ మైన కథకు నగదు బహుమతి 116/–అందించ బడును.



# చిత్ర కవిత

ఈ క్రింది బొమ్మకు కవిత రాసి పంపండి. ఉత్తమ మైన కవితకు 58/–నగదు బహుమతి అందించ బడును.



పంపవలసిన చిరునామా :

sumathi.potilu@gmail.com

ఆఖరుతేది :15-5-2026



## ఆధ్యాత్మికం

# ధర్మ సందేహాలు

తల్లితండ్రులు చేసిన పాపం పిల్లలకు వస్తుంది. దాన్నే జాతకంలో పితృశాపం అని, స్త్రీ శాపం అని అంటారు.

నన్నడిగి కన్నావా? కన్నప్పుడు భరించాలి అని అంటూ పిల్లలు అరవడం చూస్తుంటాము. నిజానికి అడిగి కనడం కాదు, వారిని నీవే ఎంచుకున్నావు. జీవుడు తను చేసిన కర్మ వల్లనే రాబోయే జన్మలో తన తల్లితండ్రులను, కుటుంబాన్ని ఎంచుకుంటాడు. ఆ కుటుంబంలో ఎవరైనా స్త్రీలకు అన్యాయం చేస్తే స్త్రీ శాపం తగులుతుంది. అది రాబోయే తరాలకు సంక్రమిస్తుంది. సర్పాలను చంపినప్పుడు సర్పశాపం పితృ దేవతలకు శ్రాద్ధం నిర్వహించనందువలన పిత్రుశాపం సంక్రమిస్తాయి. వీటి కారణంగా జీవితంలో ఎదుగుదల ఉండదు, ఉద్యోగాలు రావు, వచ్చినా అభివృద్ధి ఉండదు. సంతానం కలగదు. వ్యాపారాలలో నష్టం మొదలయినవి వస్తాయి. ఇవన్నీ పూర్వీకులు చేసిన కారణంగా తరువాతి తరం అనుభవిస్తుంది.


ఆడా, మగ అయినా సరే వయసులో దురలవాట్లకు బానిసైతే, ఆ పాపం తరువాతి తరం వ్యాధుల రూపంలో అనుభవిస్తుంది. అవిటిగా పుట్టడం, పుట్టుకతోనే భయంకరమైన వ్యాధులు సోకడం. ఒకవేళ ఆరోగ్యంగా పుట్టారని అనుకున్నా, కాల క్రమేనా అవయవాలు పాడవవడం జరుగుతుంది. దానినే "వంశపార్యపరం" అంటారు.

అందుకే మనం వయసులో "ధర్మంగా" ఉంటే, మనకు పుట్టే వారు కూడా అదే ధర్మాన్ని పంచుకుని పుడతారు. జీవితంలో వృద్ధి చెందుతారు.

భూములు లాక్కుంటారు. ముఖ్యంగా రాజకీయ నాయకులు, బడా వ్యాపారవేత్తలు తమ అక్రమసంపాదన సక్రమంగా చూపించడం కోసం పేద రైతులను మోసం చేసో, మరొక విధంగానో భూములు ఆక్రమిస్తూంటారు. వ్యవసాయం మీద పన్ను లేదు కనుక ఆ భూమిలో పండిన దానిపై వచ్చిన ఆదాయంగా తమ అక్రమసంపాదను చూపి సక్రమం చేసుకుంటారు. ఒక కుటుంబంలోని వారికి ఒక భూమి వంశపారంపర్యంగా సంక్రమించినప్పుడు, దానికి పితృదేవతల అనుగ్రహం ఉంటుంది. భూమిని బలవంతంగా లాక్కుంటే, ఆ పితృదేవతలు ఏడుస్తారు. అది శాపంగా మారి లాక్కున్న వారి కడుపు కొడుతుంది. వారి పిల్లల అకాల మరణం చెందుతారు, లేదా జీవచ్ఛవాలుగా మిగిలిపోతారు. దీనికి కారణం ఆ తల్లితండ్రులు చేసిన పాపం. అసలు మనం ఒక భూమిని కొనాలన్నా, దానికి ముందు వెనుక బాగా ఆలోచించాలి. యోగులైతే ఒక భూమిని కొనే ముందు పితృదేవతలను సంప్రదిస్తారు. మీరు ఉచితంగా ఇస్తానన్నా వారు తీసుకోరు. ఎందుకంటే తమ వారసులు అనుభవించకుండా భూములు అమ్ముకోవడం పితృదేవతలకు ఇష్టం ఉండదు. ఏ వ్యక్తి అయినా సంపాదించేది తన కోసం, తన పిల్లల కోసం. వారు బాగుండడం చూసి ఆనందించాలని అనుకుంటాడు. ఆ క్రమంలో అతడు అవినీతికి పాల్పడితే, ఇతరులకు ద్రోహం చేస్తే, వారి ఏడుపు వీరికి శాపంగా మారుతుంది. ఆ అవినీతి పరులు బాధపడేది వారి పిల్లలకు హాని కలిగినప్పుడే. అందుకే వారి పిల్లలు అకాలమరణాల పాలవుతారు.

★★★★

# పిల్లల సైన్స్ కథలు ..



## " అబ్దుల్ కలాం "

భారత 11 వ రాష్ట్రపతి, క్షిపణి శాస్త్రవేత్త. అతని పూర్తిపేరు అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలామ్. తమిళనాడు లోని రామేశ్వరంలో పుట్టి పెరిగాడు. తిరుచిరాపల్లి లోని సెయింట్ జోసెఫ్ కళాశాలలో భౌతిక శాస్త్రం అభ్యసించాడు. చెన్నైలోని మద్రాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల నుంచి ఏరోస్పేస్ ఇంజనీరింగ్ పట్టాపొందాడు.,భారత రాష్ట్రపతి అయ్యేనాటికి తన జీవితంలో నాలుగు దశలు దాటి వచ్చారు.

మొదటి దశ (1963–82)

ISRO లో వివిధ హోదాల్లో పనిచేశారు.

తుంబా ఉపగ్రహ ప్రయోగ వాహక బృందంలో చేరాడు. అక్కడే S.L.V–3 మిషన్ ప్రాజెక్టు డైరెక్టర్ అయ్యాడు.

కలాం నేతృత్వంలోని స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం (S.L.V–3) ద్వారా రోహిణి అనే శాస్త్ర పరిజ్ఞాన సంబంధ ఉపగ్రహాన్ని 1980లో విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది.

మన రాకెట్ వ్యవస్థ బలం పుంజుకుంది కలాం హయాంలోనే.

రెండో దశ (1982–92)

1992లో DRDO (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)లో చేరారు.

# పిల్లల సైన్స్ కథలు ..

DRDO డైరెక్టర్‌గా ఆయన ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిసైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు సారథ్యం వహించాడు.

కలాం ఆధ్వర్యంలో తయారైన మిసైల్స్

నాగ్ (యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైల్)

పృథ్వీ (బాటిల్ ఫీల్డ్ మిసైల్)

ఆకాశ్ (ఎయిర్ మిసైల్)

త్రిశూల్ (క్విక్ రియాక్షన్ ఎయిర్ మిసైల్)

అగ్ని (మధ్యశ్రేణి మిసైల్)

ఆయనను 'మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా' అని పిలుస్తారు.

మూడో దశ (1992-2001)

1992లో భారతదేశ రక్షణ మంత్రికి సాంకేతిక సలహా దారు అయ్యాడు.

ఈయన కృషి ఫలితంగానే 1998లో పోఖ్రాన్ -II అణు పరీక్షలు విజయవంతంగా జరిగాయి.

ఫలితంగా భారతదేశం అణ్వస్త్ర దేశాల సరసన నిలిచింది.

నాలుగో దశ: 2001 ప్రారంభం

2001లో అన్నా యూనివర్సిటీలో టెక్నాలజీ అండ్ సొసైటీ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రొఫెసర్‌గా చేరారు.

టెక్నాలజీ లక్ష్యాల సాధనలో తన కలలను సాకారం చేసుకునేందుకు యువకుల మేధస్సుకు చురుకు పుట్టించాలనుకున్నారు. 2003 ఆగస్టులోగా లక్ష మంది విద్యార్థులను కలిసి ఆయన ప్రసంగాలతో స్ఫూర్తినిచ్చారు. అప్పటికే 40 వేల మందిని కలిశాక 2002, జూలై 25న రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు.

ఈయనకు 1981లో పద్మభూషణ్, 1990లో పద్మవిభూషణ్, 1997లో భారతరత్న పురస్కారాలు లభించాయి.

30 విశ్వవిద్యాలయాల నుంచి డాక్టరేట్స్ అందుకున్న గొప్ప వ్యక్తి.

రాసిన పుస్తకాలు

ఇండియా 2020

ఇగ్నైటెడ్ మైండ్స్

ఇండియా మై డ్రీమ్

ఎన్విజియోనింగ్ యాన్ ఎంపవర్డ్ నేషన్

స్వీయజీవిత చరిత్ర — 'వింగ్స్ ఆఫ్ ఫైర్'

ఇతరులు రాసిన జీవిత చరిత్రలు

ఎటర్నల్ క్వెస్ట్- లైట్ అండ్ టైమ్స్ ఆఫ్ డాక్టర్ అవుల్ పకీర్ జైనులాబ్దీన్ అబ్దుల్ కలాం

ప్రెసిడెంట్ ఎ.పి.జె కలాం

ఎ.పి.జె అబ్దుల్ కలాం -ద విజనరీ ఆఫ్ ఇండియా

సైంటిస్ట్ టు ప్రెసిడెంట్ -ఎ.పి.జె. అబ్దుల్ కలాం

ఎ లిటిల్ డ్రీమ్ (డాక్యుమెంటరీ ఫిల్మ్)


★★★★

# తాతయ్య కథలు ..

## నీ స్నేహమే కావాలి నాకు



-బొందల నాగేశ్వరరావు



శిథిలావస్థలో వున్న ఓ ఇంటి గోడ తొర్రలో ఒక పావురము, ఆ ఇంటికి ఎదరేవున్న వేప చెట్టు కొమ్మ మీద ఓ కాకి గూళ్ళు కట్టుకొని స్నేహంగా జీవనాన్నిసాగిస్తున్నాయి.

అయితే రూపంలో నల్లగా వుండే కాకికన్నా తనే అందగత్తె అనుకొంటూ కాకిని చులకన చూస్తూ వచ్చేది పావురము. ఆ సంగతి కాకికి తెలియదు.

ఓ రోజు వున్నట్లుండి పెద్ద ఈదురు గాలితో వాన రావటంతో కాకి కాపురం వుంటు న్న చెట్టు నేలకు ఒరిగి గూడు చిన్నాభిన్నమై పోయింది. కాకి ఇక చేసేది లేక ఆ వానలోనే తడుచుకొంటూ ఆశ్రయం కొరకు స్నేహితురాలు పావురము వద్దకు వెళ్ళింది .

“మిత్రమా! ఈ గాలి వానకు నేను కాపురముంటున్నచెట్టు నేలకు ఒరిగి పోవటంతో నా గూడు చిన్నాభిన్నమై పోయింది.నన్ను ఈ రోజు రాత్రికి నీ గూటిలో తల దాచుకోనివ్వు. రేపు ఉదయం మరో చెట్టును వెతుక్కొని వెళ్ళిపోతాను” అని ప్రాధేయ పడింది.

అప్పుడు...వానకు బాగా తడిచి ముద్దయి వచ్చిన ఆ కాకి రూపం పావురానికిఅసహ్యాన్ని కలిగించింది. అలా కనబడిన కాకికి తన గూటిలో ఆశ్రయాన్ని కల్పించకూడదనుకున్న పావురము

“నా గూటిలో నీకు ఆశ్రయం కల్పించటం నాకు ఇబ్బం దికరంగా వుంటుంది. దయచేసి మరో చోటికి వెళ్ళిపో”అంటూ ముఖం చాటేసింది.

పావురమన్న ఆ మాటలకు కాకి చిన్నబుచ్చుకొని బాధ పడుతూ అక్కణ్ణుంచి వెళ్ళిపోతూవుంటే... కాస్త దూరంలో దానికి ఓ రావి చెట్టు కనబడింది.ఆ చెట్టే తనకు

అనువైనదని భావించుకున్న కాకి ఆ రాత్రికి ఆ చెట్టు కొమ్మ మీద ఆకుల నడుమ తల దాచుకొంది.

మరుసటి రోజు ఉదయం కాకి యథావిధిగా పొట్ట కూటి కోసం ఆ చుట్టుప్రక్కల ప్రాంతాలకు వెళ్ళి తనకు కావలసిన తిండిని సంపాయించుకొని తింటూనే తను వుండటానికి మంచి గూడు కట్టుకోవాలనుకొంది.అందుకు అనువైన చోటు రాత్రి తను తల దాచుకున్న ఆ రావి చెట్టే మంచిదనుకొంది.వారం రోజుల వ్యవధిలో ఆ చెట్టుమీద గూడు కట్టుకొని అక్కడే కాపురం వుండ సాగింది.

కొన్ని రోజులు గడిచాయి.....

ఓ రోజు వున్నట్లుండి దిగాలు పడ్డ ముఖంతో కాకి వద్దకు వచ్చింది పావురము.

పావురము ఏదో బాధతో తన వద్దకు వచ్చినట్టుందని గ్రహించిన ఆ కాకి ప్రేమతో సాదరంగా ఆహ్వానించి

"ఏంటి మిత్రమా! నన్ను వెతుక్కొంటూ ఇంత దూరం

వచ్చావు?" అని అడిగింది.

పావురము బోరున ఏడుస్తూ

"మిత్రమా! నాకిప్పుడు నీ సహాయం కావాలి.నీసహాయం కోసమే నేను ఇందాకా వచ్చాను"అంది.

"నా సహాయమా...ఏంటో చెప్పు? నీ కోసం నేనేం చెయ్యాలి?" అడిగింది కాకి.

"మిత్రమా!నేను నివాసముంటున్న ఇంటి యజమాని క్రొత్త ఇల్లు కట్టుకోవటానికి తన పాత ఇంటిని పడగొట్టాడు. అందులో నా గూడూ పడిపోయింది. ఇప్పుడు నేను గూడు లేని దాననై నీ ఆశ్రయం కోరి ఇందాకా వచ్చాను. నన్ను కొన్నాళ్ళ పాటు నీ గూటిలో తల దాచుకో నివ్వు.నాకు అనువైన గూటిని నేను కట్టుకొంటూనే వెళ్ళి పోతాను" ప్రాధేయపడి అడిగింది పావురము.

మరు ఆలోచనకు తావివ్వని కాకి వెంటనే

"అలాగే! నువ్వు కొత్త గూడును కట్టుకునే వరకు ఇక్కడే నాతో నా గూటిలోనే వుండుపో!"అన్నది.

"ధన్యవాదాలు మిత్రమా!;అని, మనసులో "కాకి ఎంత గొప్పదో!తను రూపంలోనల్లగా వున్నా దాని మనసు వెన్నలా తెల్లనిది. నేను అందంగా వున్నానన్నమిడిసి పాటుతో దానిని అవమానించాను. కాని తను నన్ను ఎంతో ప్రేమతో ఆహ్వానించి ఆశ్రయమిచ్చింది. ఇకపై నేనూ నా అహాన్ని వీడి కాకిలా అందరి పట్ల ప్రేమతో, స్నేహంగా వుంటాను.

నిజంగా ఇంత మంచి మనసున్న ఈ కాకి స్నేహం నాకు జీవితాంతం కావాలి అనుకొంది పావురము.


★★★

# సృజన







## దారి కనిపెట్టటానికి సహాయం



## బొమ్మకు రంగులు వెయ్యండి



| | | | |
|---|---|---|---|
| 1 | blue | 3 | yellow |
| 2 | orange | 4 | green |

# రాశి ఫలాలు ఈ నెల మీ అదృష్టం....




మేష రాశి వారికి ఒక విలక్షణమైన నెలను బహుమతిగా ఇవ్వబోతోంది. నెల ప్రారంభంలో మీ లగ్నాధిపతి అయిన కుజుడు ఏప్రిల్ 2న వ్యయ స్థానమైన (12వ ఇల్లు) మీన రాశిలోకి ప్రవేశించి అక్కడ కర్మ కారకుడైన శనితో కలుస్తాడు. లగ్నాధిపతి వ్యయంలో ఉండటం వల్ల మీలో ఒక రకమైన ఏకాంత భావన, పనుల్లో తీవ్రమైన జాప్యం, మరియు మానసిక ఒత్తిడి పెరుగుతాయి.

కానీ బాధపడకండి! ఏప్రిల్ 14న సూర్యుడు మీ జన్మ రాశిలోకి ప్రవేశించి ఉచ్ఛ స్థితిని పొందగానే పరిస్థితులు పూర్తిగా మారిపోతాయి. ఉచ్ఛ సూర్యుడు మీలో రాజసాన్ని నింపుతాడు. దీనికి తోడు ఏప్రిల్ 19న ధనాధిపతి శుక్రుడు తన సొంత ఇల్లైన వృషభంలోకి (2వ ఇంట) అడుగుపెట్టడం మీ ఆర్థిక స్థిరత్వానికి బంగారు బాటలు వేస్తుంది. ఓపికతో ఉంటే ద్వితీయార్థం అద్భుతాలను సృష్టిస్తుంది.




వృషభ రాశి వారికి లాభాలు, ఆనందాలతో కూడిన అద్భుతమైన నెలను బహుమతిగా ఇవ్వబోతోంది. ముఖ్యంగా మీ రాశికి యోగకారకుడైన శని (భాగ్య, దశమాధిపతి) లాభ స్థానమైన 11వ ఇంట బలంగా ఉండగా, ఏప్రిల్ 2న కుజుడు కూడా అక్కడికే చేరుకుంటాడు. కర్మ మరియు శక్తి యొక్క ఈ కలయిక లాభ స్థానంలో జరగడం వల్ల మీ ఆశయాలు నెరవేరుతాయి, అయితే స్నేహితులతో చిన్నపాటి విభేదాలకు ఆస్కారం ఉంది.

నెల మధ్యలో, ఏప్రిల్ 14న చతుర్థాధిపతి అయిన సూర్యుడు 12వ ఇంట ఉచ్ఛ స్థితిని పొందడం గృహ సంబంధిత లేదా విదేశీ వ్యవహారాల్లో ముఖ్యమైన మలుపును సూచిస్తుంది. ఇక అన్నిటికంటే విశేషమైన మార్పు ఏమిటంటే, ఏప్రిల్ 19న మీ లగ్నాధిపతి శుక్రుడు మీ జన్మ రాశిలోకి (వృషభం) ప్రవేశించడం. ఇది మీకు అపూర్వమైన మానసిక ప్రశాంతతను, శారీరక కాంతిని మరియు జీవితంలో సౌకర్యాలను ప్రసాదిస్తుంది.




మిథున రాశి వారికి కార్యాలయంలో తీవ్రమైన సవాళ్లను, అదే సమయంలో సమాజంలో గొప్ప కీర్తిని అందించబోతోంది. లగ్నంలో ఉన్న గురు భగవానుడు మీకు అద్భుతమైన రక్షణ కవచంలా నిలవగా, మీ కర్మ స్థానమైన 10వ ఇంట (మీన రాశి) కర్మ కారకుడైన శనితో ఏప్రిల్ 2న కుజుడు కలుస్తాడు. ఈ కలయిక మీపై విపరీతమైన పని భారాన్ని మోపుతుంది. విశ్రాంతి తీసుకుందామన్నా వీలుపడని పరిస్థితి ఏర్పడుతుంది.

అయితే మీరు పడే కష్టానికి అద్భుతమైన ప్రతిఫలం ఏప్రిల్ మధ్యలో లభిస్తుంది. ఏప్రిల్ 14న సూర్యుడు లాభ స్థానమైన 11వ ఇంట (మేష రాశి) ఉచ్ఛ స్థితిని పొందడం ఈ నెలకు హైలైట్. అప్పటివరకు మీరు ఎదుర్కొన్న వృత్తిపరమైన ఒత్తిడికి తగిన లాభాలు, బోనస్, మరియు పెద్దల సహకారం అందుతాయి. గురు బలం లగ్నంలో ఉన్నందున మీ నిర్ణయాలు ఎంతో పరిణితితో ఉంటాయి.




# రాశి ఫలాలు ఈ నెల మీ అదృష్టం....




కర్కాటక రాశి వారికి వృత్తిపరంగా మరియు ఆర్థికంగా అద్భుతమైన శిఖరాలకు చేరుకునే అవకాశాన్ని ఇస్తోంది. నెల ప్రారంభంలో, మీ రాశికి యోగకారకుడైన కుజుడు (5, 10 అధిపతి) ఏప్రిల్ 2న భాగ్య స్థానమైన 9వ ఇంట (మీనం) ప్రవేశించి అష్టమాధిపతి శనితో కలుస్తాడు. ఈ ప్రభావం వల్ల మీరు చేసే సుదూర ప్రయాణాలు లేదా తండ్రితో ఉన్న సంబంధాల్లో కొన్ని ఊహించని సవాళ్లు, మానసిక ఒత్తిళ్లు ఎదురవుతాయి.

అయితే, ద్వితీయార్థం మీ జీవితంలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గది. ఏప్రిల్ 14న ధనాధిపతి సూర్యుడు కర్మ స్థానమైన 10వ ఇంట (మేషం) ఉచ్ఛ స్థితిని పొందడం వల్ల మీ ఉద్యోగంలో అఖండమైన విజయాలు సిద్ధిస్తాయి. దీనికి తోడు ఏప్రిల్ 19న లాభాధిపతి శుక్రుడు తన స్వక్షేత్రమైన వృషభంలోకి (11వ ఇల్లు) అడుగుపెట్టడం వల్ల ఆర్థిక కష్టాలన్నీ మంచులా కరిగిపోయి, చేతినిండా డబ్బు ఆడుతుంది. ఓపికే ఈ నెలకు పెట్టుబడి.




సింహ రాశి వారికి రెండు విభిన్నమైన దశలను అనుభూతి చెందే నెల. నెల ప్రారంభంలో, అష్టమ స్థానంలో (8వ ఇల్లు – మీనం) అష్టమ శని, మరియు ఏప్రిల్ 2 నుండి అష్టమ కుజుడి సంచారం తీవ్రమైన సవాళ్లను విసురుతుంది. యోగకారకుడైన కుజుడు (4, 9 అధిపతి) 8వ ఇంట శనితో కలవడం వల్ల ఆకస్మిక ఆటంకాలు, ఆరోగ్య సమస్యలు, మరియు ఆందోళన పెరుగుతాయి. రహస్య శత్రువులు మిమ్మల్ని ఇబ్బంది పెట్టాలని చూస్తారు.

కానీ, ఏప్రిల్ 14న మీ లగ్నాధిపతి సూర్యుడు భాగ్య స్థానమైన 9వ ఇంట (మేషం) ఉచ్ఛ స్థితిని పొందగానే, కారుచీకట్లను చీల్చుకుంటూ సూర్యోదయం జరిగినట్లు మీ జీవితం అద్భుతంగా మారిపోతుంది! అదృష్టం మీ వెన్నంటి ఉంటుంది. దీనికి తోడు ఏప్రిల్ 19న కర్మాధిపతి శుక్రుడు 10వ ఇంట స్వక్షేత్రం పొందడం మీ వృత్తి జీవితంలో అత్యున్నత స్థానాన్ని, కీర్తిని ప్రసాదిస్తుంది. సహనంతో ప్రథమార్థాన్ని దాటితే, ద్వితీయార్థం రాజయోగాన్ని ఇస్తుంది.




కన్యా రాశి వారికి మానసిక దృఢత్వాన్ని పరీక్షించే నెల. ఈ నెలలో మీ దృష్టి అంతా ఇతరులతో (భాగస్వాములు, ఖాతాదారులు) ఉన్న సంబంధాల పైనే ఉంటుంది. మీ సప్తమ స్థానమైన మీన రాశిలో (7వ ఇల్లు) శని ఇప్పటికే ఉండగా, ఏప్రిల్ 2న అష్టమాధిపతి కుజుడు అక్కడికే చేరుకుంటాడు. దీనికి తోడు ఏప్రిల్ 11న మీ లగ్నాధిపతి బుధుడు అదే స్థానంలోకి వెళ్లి నీచ స్థితిని (Debilitation) పొందుతాడు. ఈ త్రిగ్రహ కూటమి వల్ల భాగస్వామ్య వ్యవహారాల్లో, వివాహ జీవితంలో విపరీతమైన గందరగోళం, నిర్ణయాలు తీసుకోలేని నిస్సహాయత ఎదురవుతాయి.

కానీ నాణేనికి మరోవైపు కూడా ఉంది! ఏప్రిల్ 14న వ్యయాధిపతి సూర్యుడు 8వ ఇంట ఉచ్ఛ స్థితిని పొందడం వల్ల ఊహించని ధనలాభాలు వస్తాయి. ఇక ఏప్రిల్ 19న ధన, భాగ్యాధిపతి అయిన శుక్రుడు 9వ ఇంట (వృషభం) స్వక్షేత్ర ప్రవేశం చేయడం వల్ల, నెల చివరలో ఒక అద్భుతమైన అదృష్టం మిమ్మల్ని ఒడ్డుకు చేరుస్తుంది. తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా ఉంటే, ఈ నెలను సురక్షితంగా దాటవచ్చు.



## రాశి ఫలాలు

## ఈ నెల మీ అదృష్టం...




తులా రాశి వారి జీవితంలో ధైర్యం, పోరాట పటిమ మరియు ప్రజా సంబంధాలను (Public Relations) అత్యున్నత స్థాయికి తీసుకువెళ్లబోతోంది. నెల ప్రారంభంలో, షష్ఠ (6వ) స్థానమైన మీన రాశిలో యోగకారకుడైన శని మరియు ద్వితీయ/సప్తమాధిపతి అయిన కుజుడు కలుస్తారు. ఆరవ ఇంట పాప గ్రహాల సంచారం శత్రు నాశనానికి, రుణాలు తీర్చడానికి అత్యంత శుభప్రదం. మీరు తీసుకునే డేరింగ్ అండ్ డాషింగ్ నిర్ణయాలు మిమ్మల్ని పది మందిలో విజేతగా నిలబెడతాయి.

మరోవైపు, ఏప్రిల్ 14న లాభాధిపతి అయిన సూర్యుడు 7వ ఇంట (మేష రాశి) ఉచ్ఛ స్థితిని పొందడం వ్యాపారస్తులకు ఒక సువర్ణావకాశం. ఇది సమాజంలో గొప్ప కీర్తిని, లాభాలను ఇస్తుంది. అయితే లగ్నాధిపతి శుక్రుడు ఏప్రిల్ 19న అష్టమ స్థానమైన వృషభ రాశిలోకి (స్వక్షేత్రం) వెళ్లడం వల్ల వ్యక్తిగత జీవితంలో కొన్ని ఆకస్మిక మార్పులు లేదా రహస్య విషయాల పట్ల ఆసక్తి పెరుగుతాయి.




వృశ్చిక రాశి వారికి మనోబలాన్ని పరీక్షించే, అదే సమయంలో అద్భుతమైన విజయాలను అందించే నెల. నెల ప్రారంభంలో, మీ లగ్నాధిపతి కుజుడు ఏప్రిల్ 2న పంచమ స్థానమైన మీన రాశిలోకి ప్రవేశించి అక్కడ ఉన్న శనితో కలుస్తాడు. ఏప్రిల్ 11న నీచ బుధుడు కూడా తోడవుతాడు. ఈ పంచమ స్థాన గ్రహ యుద్ధం వల్ల ఆలోచనల్లో గందరగోళం, పిల్లల భవిష్యత్తు గురించి విపరీతమైన ఆందోళన మరియు అనవసరమైన భయాలు మిమ్మల్ని వేధిస్తాయి.

కానీ బాధపడకండి! ఏప్రిల్ 14న కర్మాధిపతి అయిన సూర్యుడు 6వ ఇంట (మేష రాశి) ఉచ్ఛ స్థితిని పొందడం మీ వృత్తి జీవితంలో ఒక టర్నింగ్ పాయింట్. శత్రువులు మీ ముందు నిలబడలేరు. ఇక ఏప్రిల్ 19న సప్తమాధిపతి శుక్రుడు తన స్వక్షేత్రమైన వృషభ రాశిలోకి (7వ ఇల్లు) ప్రవేశించడంతో భాగస్వామ్య వ్యాపారాలు పుంజుకుంటాయి, దాంపత్య జీవితంలో వసంతం వికసిస్తుంది.




ధనుస్సు రాశి వారి సహనానికి ఒక పెద్ద పరీక్ష పెడుతూనే, మరోవైపు గొప్ప బహుమతులను సిద్ధం చేసి ఉంచింది. మీ చతుర్థ స్థానమైన 4వ ఇంట (సుఖ, గృహ, మాతృ స్థానం) ఏప్రిల్ 2 నుండి శని, కుజుల ప్రమాదకరమైన కలయిక జరుగుతోంది. దీనికి తోడు ఏప్రిల్ 11న కర్మాధిపతి బుధుడు అదే స్థానంలో నీచ స్థితిని (Debilitation) పొందుతాడు. ఈ త్రిగ్రహ కూటమి వల్ల ఇంట్లో మనశ్శాంతి కరువవుతుంది. వాహన రిపేర్లు, తల్లిగారి అనారోగ్యం, ఆస్తి వివాదాలు మిమ్మల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తాయి.

అయితే, నాణేనికి ఉన్న మరో అద్భుతమైన ముఖం ఏమిటంటే... ఏప్రిల్ 14న భాగ్యాధిపతి సూర్యుడు 5వ ఇంట (మేష రాశి – పూర్వ పుణ్య స్థానం) ఉచ్ఛ స్థితిని పొందడం! దీనివల్ల మీ పిల్లల సాధించిన విజయాలు మీ కష్టాలన్నీ మర్చిపోయేలా చేస్తాయి. లగ్నాధిపతి గురుడు సప్తమంలో బలంగా ఉండి మిమ్మల్ని ఒక గౌరవప్రదమైన మార్గంలో నడిపిస్తాడు. గృహంలో సవాళ్లను దాటితే సామాజికంగా అఖండ విజయాలు మీ సొంతం




# రాశి ఫలాలు

## ఈ నెల మీ అదృష్టం....




మకర రాశి వారి జీవితంలో ధైర్యం మరియు కార్యసాధనకు ప్రతీకగా నిలవబోతోంది. మీ రాశ్యాధిపతి శని తృతీయ స్థానమైన 3వ ఇంట (పరాక్రమ స్థానం) బలంగా ఉన్నాడు. ఏప్రిల్ 2న లాభాధిపతి కుజుడు కూడా అక్కడికి చేరడం వల్ల, ఎవరికీ సాధ్యం కాని క్లిష్టమైన పనులను సైతం మీ స్వయంకృషితో, మొండి పట్టుదలతో సాధిస్తారు. కమ్యూనికేషన్, ప్రయాణాల ద్వారా విజయం సిద్ధిస్తుంది.

అయితే మధ్యలో కొన్ని కుదుపులు ఉంటాయి. ఏప్రిల్ 14న అష్టమాధిపతి సూర్యుడు 4వ ఇంట (గృహ స్థానం) ఉచ్ఛ స్థితిని పొందడం వల్ల ఇంట్లో అశాంతి, తల్లిగారికి స్వల్ప అనారోగ్య సూచనలు ఉన్నాయి. కానీ ఏప్రిల్ 19న మీకు యోగకారకుడైన శుక్రుడు పంచమ స్థానంలో (స్వక్షేత్రం)కి ప్రవేశించగానే ఈ ఆందోళనలన్నీ తొలగిపోయి, మీ వృత్తి, కళాత్మక నైపుణ్యాలు మరియు వ్యక్తిగత జీవితం ఒక అద్భుతమైన మార్గంలోకి పయనిస్తాయి.




కుంభ రాశి వారికి ఏలినాటి శని చివరి దశలో భాగంగా కొన్ని కఠిన పాఠాలను, అదే సమయంలో అద్భుతమైన ధైర్యసాహసాలను అందిస్తోంది. మీ ద్వితీయ స్థానమైన 2వ ఇంట (కుటుంబ, వాక్ స్థానం) లగ్నాధిపతి శనితో, ఏప్రిల్ 2 నుండి కర్మాధిపతి కుజుడు, మరియు 11 నుండి నీచ బుధుడు కలుస్తారు. ఈ త్రిగ్రహ కూటమి మీ మాటతీరును అత్యంత కఠినంగా మారుస్తుంది. మీ మాటల వల్ల బంధాలు దెబ్బతినే ప్రమాదం ఉంది, ఆర్థిక లావాదేవీల్లో గందరగోళం ఏర్పడుతుంది.

కానీ బాధపడకండి! ఏప్రిల్ 14న సూర్యుడు 3వ ఇంట (పరాక్రమ స్థానం) ఉచ్ఛ స్థితిని పొందడం మీలో కొత్త రక్తాన్ని నింపుతుంది. అప్పటివరకు ఉన్న ఆటంకాలను మీ సాహసోపేతమైన నిర్ణయాలతో పటాపంచలు చేస్తారు. ఇక ఏప్రిల్ 19న యోగకారక శుక్రుడు 4వ ఇంట (సుఖ స్థానం) స్వక్షేత్రంలోకి అడుగుపెట్టగానే గృహంలో ఆనందం, వాహన ప్రాప్తి మరియు మానసిక ప్రశాంతత చేకూరుతాయి.





మీన రాశి వారి జీవితంలో ఒక తీవ్రమైన, సవాలుతో కూడిన ఘట్టాన్ని ఆవిష్కరించబోతోంది. మీ రాశిలో ప్రస్తుతం ఏలినాటి శని జన్మ శనిగా (రెండవ దశ) నడుస్తోంది. దీనికి తోడు ఏప్రిల్ 2 నుండి ధన, భాగ్యాధిపతి అయిన కుజుడు, మరియు ఏప్రిల్ 11న చతుర్థ, సప్తమాధిపతి అయిన బుధుడు (నీచ స్థితిలో) మీ లగ్నంలోకి (జన్మ రాశిలోకి) ప్రవేశిస్తారు. లగ్నంలో ఈ త్రిగ్రహ కూటమి అగ్ని, మంచు మరియు గాలి ఒకేచోట చేరినట్లుగా మీ మనస్సును తీవ్రమైన గందరగోళానికి గురిచేస్తుంది. కోపం, చికాకు, శారీరక అలసట విపరీతంగా ఉంటాయి.కానీ నిరాశ పడవద్దు! మిమ్మల్ని కాపాడే గొప్ప శక్తులు కూడా ఉన్నాయి. ఏప్రిల్ 14న షష్టమాధిపతి సూర్యుడు 2వ ఇంట (ధన స్థానం – మేషం) ఉచ్ఛ స్థితిని పొందడం వల్ల ఆర్థికపరమైన అద్భుతాలు జరుగుతాయి. శత్రువులు నాశనమవుతారు. అన్నిటికంటే ముఖ్యంగా, మీ లగ్నాధిపతి మరియు కర్మాధిపతి అయిన గురు భగవానుడు 4వ ఇంట సురక్షితంగా ఉండి, ఒక తల్లిలా మిమ్మల్ని అన్ని ఆపదల నుండి రక్షిస్తాడు. ధైర్యంగా ఈ నెలను ఎదుర్కోండి

# సుమతి

**అంతర్జాల సమగ్ర కుటుంబ మాసపత్రిక**

## సుమతి ఇప్పుడు ఆన్లైన్లో

**సుమతి** అంతర్జాల కుటుంబ మాసపత్రిక ఇప్పుడు ఆన్లైన్ లో వెలువడుతోంది . మీ మొబైల్ నుండి కాని లేదా మీ కంప్యూటర్ నుండి ఆన్లైన్ లో హాయిగా చదువుకోండి .
www.sumathimasapathrika.com




**సుమతి** మాసపత్రిక అంతర్జాల పత్రిక 2026 నుండి

ప్రతి వెల. **రూ. 50 /-** రూపాయలు


సంవత్సర చందా కి కేవలం **రూ. 500/-**

ఐదు సంవత్సరాల చందా కేవలం **రూ. 2500/-**

ఐదు సంవత్సరాలు చందా కట్టిన వారిక

రూ.200 విలువచేసే పుస్తకాలను

ఉచితంగా పంపబడును




చందా కట్టదలచిన వారు కింది

నెంబరుకు గూగుల్ పే లేదా ఫోన్ పే

చెయ్యండి

7 8 9 3 1 1 1 9 8 5

చందా కట్టిన వారికి ప్రతి నెల

flip బుక్ పాస్ వర్డ్ తో

పంపబడును

